RNI No. APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 18 Issue No. 4 Monthly April 2021 ISSN No. : 2456-4702 Rs. : 15/-



శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 18 - Issue. 4 - April 2021 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, University of Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

20వ శతాబ్దపు తెలుగు కథలలో ప్రత్యేకంగా చెప్పుకోతగ్గ రచయిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. భాష భావాలను, తెలుగు నుడికారాలు ప్రయోగించడం శ్రీపాద అందవేసిన చేయి ఒక ప్రక్క పాత సంప్రదాయాలు వెనక్కి లాగుతుంటే, మరొక ప్రక్క పాశ్చాత్య సంస్కృతికి ఆకర్షితులై పాత, కొత్త కలయికని తన రచనలలో ప్రతిభావంతంగా చిత్రీకరించారు.

పండిత కుటుంబంలో 1891 ఏప్రిల్ 23న తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరు గ్రామంలో జన్మించారు. వేదం, జ్యోతిష్యం, ధర్మశాస్త్రాలను అవపోశన చేసుకున్నారు. శ్రీపాద 75 పైగా కథలు రాశారు. వీరి కథల్లో ఎక్కువగా ప్రణయం, సంఘ సంస్కారం, ప్రబోధం, కుటుంబ జీవితం, అపరాధ పరిశోధన మొదలగు అంశాలను కథా వస్తువులుగా చేసుకుని రచనలు సాగించారు.

శ్రీపాద మొదటి కథ 'ఇరువరము ఒక్క చోటికే పోదాము' 1915 సంవత్సరంలో ప్రచురించారు. 'మిథునానురాగము' వీరి మొదటి నవల. నవలలు, నాటకాలు, అనువాదాలు, వైద్య గ్రంథాలు ఇలా ఒకటేమిటి అనేక అంశాలపై రచనలను సాగించారు.

శాస్త్రి తన ఆత్మకథను 'అనుభవాలూ - జ్ఞాపకాలు' అనే పేరుతో ఎనిమిది సంపుటాలుగా ముద్రించదలిచారు. వారి అకాల మరణంలో మూడు సంపుటాల్లో నిలిచిపోయింది. ఈయన రచనలు ఆంధ్రప్రదేశ్ పాఠశాల, కళాశాలల్లో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. శాస్త్రి ప్రబుద్ధాంధ్ర పత్రికను నడిపారు. తన పత్రికలో తెలుగు భాషా వ్యాసాలను ప్రచురించి పాఠకుల మనసులను పొందారు. శతాధిక వ్యాసాలు, అష్టావధానాలు చేసి 1956 సంవత్సరంలో కనకాభిషేకం చేయించుకున్నారు.

శ్రీపాద గాంధీ - ఖద్దరు - హిందీ ఈ మూడింటినీ వ్యతిరేకించారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక యుగసంధిలో పెరిగిన వ్యక్తి. పండిత కుటుంబంలో పుట్టి ఆచార వ్యవహారాలను ప్రక్కనపెట్టి తనదైన బాణిలో జీవనం సాగించారు.

శ్రీపాద రచనల్లో నాటకాలు 'వారకాంత' ప్రేమపాశం, నిగళ బంధం, రాజరాజు అత్తాఅల్లుడు, అభిసారిక తాత - బాలిక మొదలగు ఖండ కావ్యాలు రచించారు. మరెన్నో రేడియో ప్రసంగాలు చేశారు. స్మశాన వాటిక, రక్షాబంధనము ప్రసిద్ధ నవలలు.

"తెలుగు దేశమే దేశం, తెనుగు భాషే భాష", తెలుగు మనుష్యులే మనుష్యులు, తెలుగు వేషమే వేషం, ఏ జాతి ఎదుట ఏ సందర్భంలోను ఎందులోను నా తెలుగు జాతి తీసిపోదు అని శ్రీపాద తెలుగు భాష యొక్క ఔన్నత్యాన్ని చాటి చెప్పారు.

శ్రీపాద 'ఆత్మకథ'ను రాయాలనుకోలేదట. నవోదయ పత్రికా సంపాదకుడు నీలంరాజు వెంకట శేషయ్య శ్రీపాద చేత బలవంతంగా వ్రాయించారు. దాని మూలంగా శ్రీపాద 'ఆత్మకథ' 'అనుభవాలు - జ్ఞాపకాలు' శీర్షికలు వెలవడ్డాయి. ఆత్మకథలో వ్యక్తిగత జీవితాన్ని పొందుపరించారు. శ్రీపాద రచనలు యువతలో ఆలోచనా శక్తిని రేకెత్తించాయి.

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Contents (విషయ సూచిక)

1.	ముదిగొండ శివప్రసాద్-చారిత్రక నవలలు-జాతీయ భావనలు	- బి. క్యాథరీన	5
2.	శ్రీ పోతుల హన్మంతరెడ్డి భీమార్జున విజయాలు (నాటకం)	- డా॥. సి. నర్సింహులు	10
3.	తెలుగులో చారిత్రక నవల	- డా॥. శిరీష ఈడ్పుగంటి	13
4.	ఆధునిక తెలుగు కవిత్వం దారులు : పరిధుల పరిశీలన	- డా॥. గోనిపాటి ధర్మారావు	16
5.	ఉనికి కోల్పోతున్న ఉపకులాలు - క్షీణిస్తున్న ప్రదర్శన	- డా॥. కొత్తిరెడ్డి మల్లారెడ్డి	22
6.	కవిత్వమే కాదు.. కథనూ కొత్తకోణంలో చూపిన తిలక్	- డా॥. ఎం. హరికృష్ణ	28
7.	సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం - బంజారాలు	- డా॥. మూడే నాగేంద్ర నాయక్	32
8.	ప్రయోగాలకు వాకిలి - శ్రీశ్రీ సిప్రాలి	- డా॥. ఎన్. ఈశ్వర రెడ్డి	37
9.	తెరచిన కళ్ళు నాటికలోని పాత్రలు మనో విశ్లేషణ	- డా॥. పెరుగుపల్లి బలరామ్	43
10.	చర్లపల్లి కట్టమైసమ్మ పండుగ - వైశిష్టత	- ఏర్పుల నరసింహ	48
11.	స్త్రీవాదంలో 'ఓల్గా'	- గాండ్ల విజయకుమారి	53
12.	శ్రీరామ నవమి విశిష్టత	- కాపర్తి స్వరాజ్యం	66
13.	భీష్ముడు - యుద్ధ వ్యూహాలు	- కుమ్మరి రాజు	60
14.	కవిత్రయ మహాభారతంలో కర్ణుడు	- శ్రీ పట్ర నరసింహులు	67
15.	తెలుగు దినపత్రికలు - సాహిత్యసేవ	- దారిశెట్టి లక్ష్మినరసింహం	71
16.	ఆధునిక తెలుగు స్త్రీవాద కవిత్వం-నిషిద్ధాక్షరి ఒక పరిశీలన	- డా॥. పల్లా కృష్ణ	74
17.	అప్పల్నాయుని కథల్లో రైతు జీవితం	- ఆచార్య కె. శ్రీదేవి & చంద్రబాబు	80
18.	రవీంద్రనాథ్ టాగూర్ - ధర్మకర్త కథ - మానవీయ కోణంలో విశ్లేషణ	- కోనేటి శశికళ	85
19.	కంచికి చేరని కథ నవలలోని సామాజిక స్పృహ - పరిశీలన	- తమ్మన నాగవెంకట హరిబాబు & డా॥. కె. బలరామ్	90
20.	సినారె కవిత - తాత్వికత దృక్పథం	- సి.హెచ్.నాగలక్ష్మి	93
21.	ఎల్లి నవల : సంస్కృతి-మానవ హక్కుల మధ్య సంఘర్షణ	- డా॥. వెంకటరామయ్య గంపా	98
22.	తెలుగు కథా ప్రక్రియకు పునాది - భండారు అచ్చమాంబ	- డా॥. పడాల జగన్నాథరావు	104
23.	చైనా దేశపు 'కాల విజేత'	- డా॥. వెల్దండి శ్రీధర్	109
24.	సీతా సంసేవితం 'త్రిజట' స్వప్నం	- డా॥. వి. త్రివేణి	113
25.	స్త్రీ ఆత్మగౌరవ ప్రదర్శిక 'కన్నతల్లి'	- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి	120
26.	ఎలక్ట్రానిక్ మాధ్యమాలు - తెలుగు భాషా వైవిధ్యం	- డా॥. బాశెట్టి లత	125
27.	పాకుడురాళ్ళు నవలా ప్రాశస్త్యం	- నక్కా శ్రీనివాసరావు	130
28.	విశ్వనాథ సత్యనారాయణ - రచన వైశిష్ట్యం	- డా॥. బూసి వెంకటస్వామి	133
29.	A Study of Analysis in Girish Karnad's The Play...	- Dr. Kotaiah Veturi	137
30.	Pawan Kalyan's Political Journey	- S Swaroop Sirapangi	142
31.	A Study of Gujarati Trading Community ...	- Mary Varghese & Sebastian Joseph	150
32.	A Survey Analysis on the Impact of Social Media..	- Dr. Battu Kiritam	158

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ముదిగొండ శివప్రసాద్ – చారిత్రక నవలలు – జాతీయ భావనలు

– ఖి. క్ష్మాధరీన, అసిస్టెంట్ ప్రొఫిసర్, తెలుగుశాఖ, గవర్నమెంటు డిగ్రీ సిటీ కాలేజ్, హైదరాబాద్.

తెలుగు సాహిత్యంలో నవలా ప్రక్రియలో అనేక చారిత్రక నవలలు రాసి పేరుపొందిన వారు ముందిగొండ శివప్రసాద్. నోరి నరసింహశాస్త్రి, అడవి బాపిరాజు, విశ్వనాధ మొదలైన కవులు కూడా అనేక చారిత్రక నవలలు రాశారు. ప్రస్తుతం ముదిగొండ శివప్రసాద్ విశ్లేషించిన శాతవాహనుల కాలంలో కళ్యాణి చాళుక్యుల కాలంలో కాకతీయుల కాలంలో చారిత్రక విశేషాలను వివరించడమే ఈ వ్యాస లక్ష్యము.

నాగానీక :

"నాగానీక" నవల ఆంధ్ర శాతవాహన రాజుల తొలి యుగానికి సంబంధించిన కథ. మహారథత్రణ కయిరుని కుమార్తె నాగానీకకు, శ్రీముఖుని కుమారుడు శ్రీశాతకర్ణికి వివాహం జరగడం అనేది "నాగానీక" నవల ఇతివృత్తం. ఈ రెండు అంశాలు చరిత్రాత్మకమే. వీరిద్దరి పేర్ల మీదనే ఆ తరువాతి రాజులు శాతకర్ణి అని పేరులో చేర్చుకోవడం జరిగింది. నాగదేవత అంశవల్ల నాగానీక జన్మించింది కాబట్టి నాగసర్పాన్ని ఆరాధ్యదైవంగా కొలవడం జరిగింది. ఈ అదను చూసుకొని ఆంధ్రులు, పుళిందులూ, శబరులు, రఠికులు, పిఠనికులు, భోజకులు మొదలైన చిన్న చిన్న సామంతులు, జన పదాల వారు క్రమంగా స్వతంత్ర రాజ్యాలు స్థాపించుకోవాలని ఉవ్విళ్ళూరు తున్నారు.

ఆనాడు భారతదేశంలోని అత్యంత కళావైభవాలతో శోభిల్లే మహానగరాల్లో ఉజ్జయిని ఒకటి. ఈ నగరంలోని అధిష్ఠానదైవం "మహాకాళుడు". సిప్రా నదీతీరంలో మహా కాళుని గుడి నిర్మించబడింది. భారతదేశంలో ఉన్న పన్నెండు జ్యోతిర్లింగాలల్లో ఒకటి. ఆయన దర్శనార్థం అసేతుశీతాచలం నుండి మాత్రమే కాకుండా భారతీయ సాంస్కృతిక పుత్రికలైన ఈశ (ఈజిప్టు) దేశంలోని నీలానదీ తీరం నుండి (నైల్) అవతలి ఉపరతీశ, త్రిగిరీశనదీ తీరాల నుండి (యూఫ్రటీస్, టైగ్రిస్, ఇరాక్) కాంభోజ (కంపూ చియా), బ్రహ్మదేశ (బర్మా), మలయా, సువర్ణభూమి, చైనా దేశాల నుండి కూడ తైర్థికులు సంవత్సరం పొడు గునా వస్తూనే ఉంటారు". ఈ విధంగా మౌర్యుల రెండవ రాజధానియైన ఉజ్జయిని ప్రాముఖ్యత గురించి శివ ప్రసాద్ గారు పఠితలకు తెలియజెప్పడం జరిగింది. శాత వాహన పరిపాలనా తొలి కాలం నాటి అన్ని అంశాలు "నాగానీక"లో చోటుచేసుకున్నాయి.

శ్రావణి: శ్రావణి నవల క్రీ.శ.79 సా॥కు సంబంధించిన చారిత్రక అంశాలను తెలుపుతుంది. ఇది శాతవాహన రాజుల పరిపాలనా నేపథ్యంతో వెలువడిన నవల. శాతవాహల కాలంలో మణులు, బంగారం, వెండి, వజ్రాలు తదితర వస్తువులు దేశ విదేశాల్లో ప్రఖ్యాతి చెందినవిగా ఉన్నాయి. అలాంటి మణుల్లో "శ్రావణి" విశ్వఖ్యాతి చెందిన ఇంద్రనీల మణి, ఆ శ్రావణి కోట్ల విలువ జేస్తుంది. ఇది ఉన్న రాజ్యంలోని రాజు అపర కుబేరునిగా, భారతదేశ సామ్రాట్‌గా పిలువబడుతాడు. అంత విలువైన శ్రావణి శాతవాహనుల నుండి దొంగ లించబడింది. తిరిగి గౌతమీపుత్ర శాతకర్ణి శ్రావణిని సంపా దించడానికి వేసిన పన్నాగాలు, యువరాజు పులోమావి సాహసం, గౌతమీ బాలశ్రీ వ్యూహాలు తదితర అంశాలు ఈ నవల్లో వీర రసాన్ని ప్రదర్శిస్తూ మనోహరంగా వర్ణించ బడ్డాయి.

శ్రావణిని అన్వేషించడానికి వీరభద్రునిగా మారు వేషంలో నున్న ఆదిత్యుడు, పింగళునిగా యువరాజు పులోమావి వెళ్తారు. కాని, వీరభద్రుడు, వర్ష రుద్రదాముని మనుషులకు బందీలవుతారు. ఆవాహశక్తికి బందీగా ఉజ్జయిని వెళ్తారు వీరభద్ర వర్షలు. ఇలాంటి సమయంలో రచయిత పని చేయడం మాత్రమే కర్మయోగం కాదు.

తగిన సమయం వచ్చేంతవరకు నిరీక్షించడం కూడ కర్మలో భాగమే అని కర్మను వివరిస్తాడు. గౌతమీ బాలశ్రీ యుక్తులతో మణీని, మణి వంటి రుద్రదాముని కుమార్తెను ఆంధ్ర రాజులు పొందుతారు. ఆంధ్ర రాజులపైనున్న చెడు అభిప్రాయాన్ని తనంతట తాను మార్చుకునేట్లు చేస్తారు ఆంధ్ర రాజ్య రాణులు. జయశీల తనలో మార్పును పొందడమే కాకుండ రుద్రదామునిలో కూడా మార్పు తీసుకొని వచ్చి ఆంధ్ర రాజులతో కళ్యాణానికి ఒప్పుకుంటారు. శ్రావణి పవిత్రమైంది కాబట్టి శాతవాహనులు సుఖంగా ఉండల్గుతున్నారని శ్రావణి గొప్పతనాన్ని రచయిత వివరిస్తాడు. శ్రావణి చుట్టూ కథను నడిపి, శ్రావణిని సాధించేవరకు అన్వేషణ సాగించాడు రచయిత. ఈ విధంగా ప్రధమాంధ్ర రాజులైన శాత వాహనుల కీర్తి ప్రతిష్ఠలను "శ్రావణి" ద్వారా తెలియ జెప్పడం జరిగింది.

శ్రీలేఖ :

ఆంధ్ర శాతవాహన సామ్రాజ్య ప్రాభవ వైభవాలను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించబడిన తొలి చారిత్రక నవల -శ్రీలేఖ. క్రీ.పూ.200 సంవత్సరాల క్రితం జరిగిన మహోజ్వల చారిత్రక గాథ. తొలి తెలుగు రాజు శ్రీముఖుడు. ఆయన కుమారుడు మొదటి శాతకర్ణి. ఇతడు మగధలోని పుష్యమిత్ర శుంగునికీ, కళింగ ఖార వేలునికీ సమకాలికుడు. ఈ నవలలోని కథ ఆ కాలానికి చెందినది. అంటే బాపిరాజు గారి "హిమబిందు"కు తర్వాతి కథ ఇది. శ్రీలేఖ పీఠికలో శివప్రసాద్‌గారు ఈ నవల వల్ల రెండు ప్రయోజనాలను ఆశించారు. 1)రస దీప్తితో పాటు జాతీయ సమైక్యతా సాధన, 2)గత వైభవ ప్రదర్శన, పునరుద్ధరణ. ఈ రెండు ప్రయోజనాలు ఈ నవల ద్వారా పూర్తిస్థాయిలో ఒనగూడినవి.

క్రీ.పూ.200 సంవత్సరాల క్రితం శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించిన శ్రీముఖుని కుమారుడైన శ్రీ శాతవకర్ణి ఆంధ్రదేశాన్ని పరిపాలించాడు. అతని పాలనా కాలంలో మహాసేనాధ్యక్షుడైన విజయదత్తుడు సర్వ శక్తివంతుడు. విజయదత్తుని ద్వారానే భారతదేశ పరిపాలన ఏకం చేసి, ప్రజల్లో జాతీయ సమైక్యత సాధించాలని శ్రీ శాతకర్ణి కోరుకుంటాడు. తద్వారా నవలారంభంలోనే శ్రీ శాతకర్ణి భార్యయైన నాగవరదాయిని సామ్రాజ్య విస్తరణకు విజయదత్తుణ్ణి తగిన వాడుగా ఎంపిక చేసుకుంటుంది. విజయదత్తునిలో ఉన్న ధ్యేయం చెక్కు చెదరకుండా ఉండేందుకు, ఖారవేలుని దౌర్జన్యం తుదముట్టించే వరకు ఎట్టి కష్ట సుఖాలను లెక్కచేయనని, కామ కాంచన వాంఛలకు లోబడనని, వివాహం చేసు కోనని ప్రమాణం చేయించుకుంటుంది. జాతీయ రక్షణ కార్యక్రమంలో భాగంగా శ్రీలేఖ తన గాత్రం, ఉప న్యాసాలను ఖారవేలునికి వినిపించడం, పతంజలి మహర్షి గీతాసారం బోధించడం ద్వారా తన దివ్యదృష్టి ద్వారా ఖారవేలునిలో మార్పును ఆశిస్తారు. ఖారవేలుడు క్రమ పరిణామంలో మార్పు చెందుతాడు.

నవ కళ్యాణం :

కర్ణాటకంలోనూ, దేశమంతటను బహుళ ప్రచారం పొందిన బసవన్న జీవిత గాథను "నవకళ్యాణం" అనే నవలగా రచించారు. కర్ణాటక ప్రాంతంలో క్రీ.శ. 10,11 శతాబ్దాల్లో సుమారు 200 సంవత్సరాలు కళ్యాణి చాళు క్యులు పాలించారు. వీరినే పశ్చిమ చాళుక్యులని కూడ పిలుస్తారు. వీరి రాజధాని కళ్యాణ నగరం. నవలలో కూడ కళ్యాణ నగరంలో జరిగే సంఘటనలే చోటు చేసు కున్నాయి. నవలలోని వస్తువు కళ్యాణ నగరం చుట్టే తిరుగు తుంది.

క్రమంగా పరిస్థితులు మారినవి. కాకతీయులకు తైలపుడు, అతని కుమారుడైన సోమేశ్వరుడు బందీ అయ్యారు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న - బిజ్జలుడు బందీగా ఉన్న తైలపుని పేర తాను కేవలం రాజ ప్రతినిధిగా చాళుక్య సామ్రాజ్యానికి ఏకైక సామ్రాటు అయినాడు. ఇదంత కూడ చరిత్రలో జరిగిన సంఘ టనయే. రచయిత నవలలోనూ జరిగిన సంఘటననే స్వీకరించాడు. కారణజన్ముడైన బసవేశ్వరుడు రాజ్యంలోని

ఒక తామ్ర శాసనంలో నున్న సమాచారాన్ని బట్టి అది కనక శాసనమని చెప్పినాడు. ఆ శాసనాన్ని చదివి గుప్త నిధి గల ప్రదేశాన్ని రాజుకు చూపించాడు. తద్వారా రాజుకు బసవేశ్వరునిపై నమ్మకం కలిగి మొదట కోశాధికారి పదవిని ఇవ్వడం, ఆ తరువాత ప్రధాన మంత్రి పదవిని ఇవ్వడం జరిగింది. దాంతో రాజ్యంలో హింస లేదు. అసత్యం, అస్పృశ్యత, వ్యభిచారం లేదు. 'కాయకమే కైలాసమయ్యా' అనే మంత్రంతో శ్రామిక గౌరవాన్ని సమాజానికి నేర్పినాడు. అందుకే ఈ మతానికి అధిక ప్రచారం లభించింది. వీరశైవం ఇప్పటికీ కర్ణాటక ప్రాంతంలో ప్రధాన మతంగా నిలిచి ఉంది.

ఆవాహన: శ్రీలేఖ, శ్రావణి, శ్రీపదార్చన తదితర నవలలు చారిత్రక నవలలుగా చిత్రీకరింపబడితే "ఆవాహన" సాంఘిక, చారిత్రక కాల్పనిక నవలగా వెలువడింది. ఇది తెలుగు నవలా సాహిత్యంలోనే మొదటి సాంఘిక చారిత్రక కాల్పనిక నవల. ఆవాహన నవలలో రచనా కాలం నాటి సాంఘిక పరిస్థితులకు అనుగుణంగా పాత్రలు తీసుకోబడ్డాయి. కాకతీయుల కాలం నాటి ఇతివృత్తాన్ని ప్రధానంగా తీసుకొని ఆ కాలంలో పరిపాలించిన రాజులు, సైన్యాధ్యక్షులు, శివాచార్యులు తదితరులను ప్రధాన పాత్రలుగా చేర్చి కథను నడిపించడం జరిగింది. అందుకే "ఆవాహన" నవల సాంఘిక -చారిత్రక నవలగా వెలువడింది.

ఈ నవలలో అనేక చారిత్రక సన్నివేశాలు, సంభాషణలు కనిపిస్తాయి. రచనాకాలం నాడు జీవించిన మాధవరావు అనే పాత్రలో, కాకతీయుల కాలం నాడు జీవించిన కామసాని అనే పాత్ర ఆవాహన చేస్తుంది. గతస్మృతులు తెలియని మాధవరావుకు అతని పేరు భళ్ళాల సోమేశ్వరుడని, అతనొక శిల్పి అని గుర్తుచేస్తుంది. కామసాని ఒక ఆస్థాననర్తకిగా కాకతీయుల కాలంలో ఉంటుంది. వీరిద్దరూ ప్రేమించుకుంటారు. కాని, రుద్రమదేవి వీరిద్దరు వివాహం చేసుకోవడం వల్ల వీరిలో ఉన్న కళలు అంతరించిపోతాయని, కళలకే అంకితం అయిపోవాలని భావిస్తుంది. కామసాని ఈ దృక్పథాన్ని అర్థం చేసుకోక భళ్ళాల సోమేశ్వరుని ప్రేమ కోసం, నృత్యం చేయకుండా చివరకు మంచం పడుతుంది. మరణిస్తుంది. కాని, ఒక కళాకారిణిగా కాకతీయుల సామ్రాజ్యంలో గొప్ప కీర్తిని పొందుతుంది. ఇది "ఆవాహనలోని" సూక్ష్మ కథ.

ఆ నవలలోని కథానాయకుడైన మాధవ్‌కు అతని స్నేహితుడు రాం ఓరుగల్లు విశేషాలు వివరిస్తాడు. "కాకతీయుల నాడు మొత్తం ఏడు కోటలుండేవి. అవి కంచుకోట, ఇటుకకోట, రాతికోట, పుట్టకోట, భూమికోట, కంపకోట, గవినికోట. ఇదిగో ఈ మట్టికోట ఫిరంగులు తగిలినా పగలవు. అంత గట్టిగా కట్టారు. మట్టిని ఏనుగుల చేత తొక్కించి అందులో కోడిగుడ్ల సొన కలిపి కట్టారని అంటారు" ఈ విధంగా నవలంతా చారిత్రక వాతావరణమే కనిపిస్తుంది. ఆవాహన ఒక సాంఘిక నవలగా ఆరంభమై మధ్యలో చారిత్రక విశేషాలు వివరిస్తూ, ప్రేమకథ నడిచి, చివరికి సాంఘిక నవలగానే ముగుస్తుంది. ఈ నవలకు పెట్టిన పేరు సార్థకమవుతుంది.

చంద్రకళ :

శివప్రసాద్ గారు రాసిన "చంద్రకళ" అనే చారిత్రక నవల పదమూడవ శతాబ్దానికి చెందిన కాకతీయ సామ్రాజ్య పాలకుడైన ప్రతాపరుద్రుని కాలం నాటి వనచర వృత్తాంతం. వరంగల్ జిల్లాలోని మేడారం గ్రామంలో వెలసిన సమ్మక్క తల్లి - సారలమ్మల దివ్యచరిత్ర "చంద్రకళ". ఇంకా ఈ నవల వన్య రక్షణ- పర్యావరణ రక్షణలకు సంబంధించిన కథకూడ. స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చాలనే ప్రయత్నంతో చేసిన రచన "చంద్రకళ".

నాటి రాజుల ఆస్థానంలో ఆస్థాన నర్తకి తప్పనిసరిగా ఉండేది. ప్రతాపరుద్రుని కాలంలో మాచల్దేవి ఆస్థాన నర్తకిగా ఉంది. ఈమె కళాకౌశలాన్ని ప్రశంసిస్తూ కీర్తించిన విధానం చూద్దాం.

"దివి నుండి భువికి దిగి వచ్చినట్టి
దేవ నర్తకీ మాచలదేవీ !

పాల కడలిలో పుట్టిన మోహినీ
మహాలక్ష్మియే మాచల దేవీ"

ఈ విధంగా చంద్రకళ చారిత్రక నవలలో కాకతీయుల నాటి నాట్య కళను వివరించారు.

శ్రీ పదార్చన :

విజయనగర సామ్రాజ్యం సంగమ వంశంతో క్రీ.పూ.1336 నుండి మొదలవుతుంది. హరిహర బుక్కరాయలు విజయనగర సామ్రాజ్య స్థాపకులు. క్రీ.శ.1336 నుండి మొదలైన సుదీర్ఘపాలనలో సంగమ, సాళువ, తుళువ వంశ రాజులు చాలామంది ఉన్నారు. వీరి పరిపాలనా కాలంలోనే క్రీ.శ.1424 నుండి 1503 వరకు అన్నమాచార్యుడు జీవించి ఉన్నాడు. అంటే విజయనగర రాజులలో సంగమ, సాళువ వంశముల ఉచ్ఛ పతనాలను స్వయంగా చూసినవాడు. దాదాపు ఆరుగురు చక్రవర్తులు ఈ కాలంలో విజయనగర వజ్ర సింహాసనాన్ని అధిష్ఠించారు. వీరందరితోనూ అన్నమాచార్యునికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బలమైన సంబంధం ఉంది. కాబట్టే ప్రధానంగా "శ్రీపదార్చన" ఒక చారిత్రక నవలగా తీర్చిదిద్దబడింది.

తిరుమల కొండపై వెలసిన సాక్షాత్తూ పద్మావతీ వేంకటేశ్వరులనే నాయికా నాయకులుగా చేసుకొని శ్రీ పదార్చన రాయబడింది. పద కవితా పితామహుడు, హరి కీర్తనాచార్యుడు, ద్రవిడాగమ సార్వభౌముడు, ప్రప్రథమ ఆంధ్ర వాగ్గేయకారుడైన అన్నమయ్య అర్థయుతమైన అక్షరాలతో కూడిన పదాలతో, తిరుమలలో స్థిరనివాసం ఏర్పరచుకొని పద్మావతీ వేంకటేశ్వరులపై 32 వేల సంకీర్తనలు చేశాడు. కాని నేడు 15,600 కీర్తనలు మాత్రమే లభ్యమవుతున్నాయి.

"ఉళ్లవరు శివాలయ మమాడి హరు
నానేన మాడుగు బడవనయ్య
ఎన్న కాలేకంబ
దేహమే దేగుళ
శిరమే హొన్న కలశమయ్య".

ఈ విధంగా శ్రీపదార్చనలో భక్తి ఉద్యమం ద్వారానే ప్రజల్లో సుఖ శాంతులు, సమైక్యత, కలిగేటట్లు చేయడం జరిగింది.

"వెరతు వెరతు నిందు వేడుక పడనిట్టి
కురుచ బుద్ధులే నెట్లు కూడుదునయ్యా
దేహమిచ్చిన వాని దివిరి చంపెడివాడు
(దోహిగాక నేడు దొరయటా
ఆహికముగ నిట్టి యధమ వృత్తికి నే
సాహసమున నెట్టు చాలుదునయ్యా
తోడ బుట్టిన వాని దొడరి చంపెడివాడు
చూడ దుష్టుడు గాక సుకృతియట

ఈ విధంగా చెప్తూ, అందరికీ ఉపదేశింపదలచిన వాడు వేంకటేశ్వరుడు. వెళ్ళి ఆయన దర్శనం చేసుకుందామని వీర నరసింహరాయలతో చెప్తాడు.

రెసిడెన్సీ :

రెసిడెన్సీ నవల ఇతివృత్తం రెండు వందల సం॥ల క్రితానిది. ప్రామాణిక చారిత్రకతను రెసిడెన్సీ నవలలో చూడవచ్చు. ఈ కథ హైదరాబాదు, మద్రాసు, కలకత్తాలతో ముడిపడి ఉంది. అందుకని ఇది మూడు మహా నగరాల కథ. స్కాట్లాండ్, ఇంగ్లాండ్, నిజాం రాజ్యాలకు సంబంధించిన కథ. కాబట్టి మూడు దేశాల కథ కూడ. అంటే రెసిడెన్సీలోని వస్తువు ఒక అంతర్జాతీయ కథగా భాసిస్తుంది.

ఈ నవలలో చారిత్రక అంశాలతో పాటు సాంఘిక, రాజకీయ అంశాలు వివరించబడ్డాయి. ఔరంగజేబు గోల్కొండ మీద దండయాత్ర చేసినపుడు తానే ఆ దండయాత్రను తప్పికొట్టడం జరిగింది. 1707లో ఔరంగజేబు మరణించినప్పటికీ ఆ శత్రుత్వం అలా కొనసాగుతూ వచ్చింది. ఈ దశలో మీర్ ఖమరుద్దీన్ రాజకీయ వ్యూహాన్ని మార్చి, బ్రిటీష్ వారికి లొంగిపోయాడు. ఆ తర్వాతి నవాబైన నిజాం అలిఖాన్ పరిపాలనలో బ్రిటీష్ అధికారులైన జాన్ హాలెండ్, జేమ్ గ్రాంట్, రిచర్డ్ జాన్‌సన్,

జాన్ కెన్నడీ, ఆ తర్వాత విలియం కర్క్ పాట్రిక్‌లు నిజాం రెసిడెంట్స్ అయినారు. కాని, ఈ రెసిడెంట్స్ అందరిలో కళాతృష్ణ ఉన్న అధికారి జేమ్స్ అకిలెస్ కర్క్ పాట్రిక్ మాత్రమే. అందుకే ఇతని కాలంలోనే అనగా 1802వ సంవత్సరంలో బ్రిటీష్ రెసిడెంట్ కోసం ప్రత్యేకంగా రెసిడెన్సీ అనే అందమైన భవనం నిర్మితమైంది. ఆ భవనంలోనే అతని అంతర్జాతీయ ప్రేమ కొనసాగింది. ఇదంతా 200 సం॥ క్రితం జరిగిన సంఘటనయే. ఈ చారిత్రక సంఘటలకు తోడు ప్రేమ వృత్తాంతం చేరి పాఠకుల మనసులను దోచుకున్నదీ రెసిడెన్సీ. చారిత్రక కట్టడాలైన తాజ్‌మహల్, ఫతేపూర్ సిక్రీ, లాల్‌ఖిలా, ఆగ్రా కోటలకు ఏమాత్రం తీసిపోకుండా గోల్కొండకోట, చార్ మినార్, ఎన్నో కమాన్‌లు నిజాం కాలంలో నిర్మించ బడ్డాయి. అదే విధంగా, ఈ చారిత్రక కట్టడాలతో సమానంగా ప్రాక్ పశ్చిమ శిల్ప సంస్కృతికి సంగమంగా నిలిచే ఒక భవనం కూడ నిర్మించబడింది. అదే రెసిడెన్సీ. ప్రస్తుత కోఠి మహిళా కళాశాల. ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేయబడ్డ నూరు హెరిటేజ్ కట్టడాల్లో రెసిడెన్సీ కూడ ఒకటి కావడం విశేషం. శివప్రసాద్ గారి చారిత్రక నవలల్లో నున్న చారిక్రాంశాలను స్థూలంగా ఈ అధ్యాయంలో చర్చించాను. ఒకటి, రెండు నవలలు అసంపూర్ణంగా ఉండడం వలన చర్చించలేకపోయాను.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీ పోతుల హన్మంతరెడ్డి భీమార్జున విజయాలు (నాటకం) – సామాజికాంశాల పరిశీలన

– డా॥ సి. నర్సింహులు, అసిస్టెంట్ ప్రొఫిసర్, తెలుగుశాఖ, యం.వి.యన్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి), మహబూబ్‌నగర్, తెలంగాణ.

ఈ రోజుల్లో ప్రాచీనకథాంశముతోకూడి నూతనంగ రాయబడిన పద్యనాటకరచన భీమార్జునవిజయాలు.ఈ నాటకాన్ని నారాయణపేట జిల్లా, మద్దూరుమండలం, చింతలదిన్నె గ్రామవాసి శ్రీపోతుల హన్మంతరెడ్డి గారు రచించారు. ఈయన వ్యవసాయంచేస్తూ, సాహిత్య వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నాడు. సంగీతసాహిత్యములందు ప్రావీణ్యుడేగాక నాటక ప్రదర్శనలకు దర్శకత్వం వహించుచున్నారు. ఇతని రచనలు 1.భక్త తుకారాం 2.భక్త రామదాసు 3.భీమార్జున విజయాలు మొదలగునవి. ఇతరులు రచించిన నాటకాలకు పాటలు కూడా రచించారు.

ప్రస్తుతం నేను పరిశీలిస్తున్న పద్యనాటకము భీమార్జునవిజయాలు. ఈ కథాంశము సుప్రసిద్ధమైన మహాభారతమునుండి తీసుకోబడినది. ఇందలి కథ సభారణ్యవిరాటపర్వములసారాంశాన్ని సంక్షిప్తంగా చేసి శ్రీపోతుల హన్మంతరెడ్డిగారు నాటకంగా మలచినతీరు అద్భుతము.ఇందు నన్నయ్య సభాపర్వము, ఎఱ్ఱన అరణ్యపర్వము, తిక్కన విరాటపర్వముల కథాంశాలను కలగలిపి రచించినందువల్ల, నన్నయ్య ప్రసన్న కథా కలితార్థయుక్తి, తిక్కన నాటకీయత, ఎఱ్ఱన వర్ణనలేకాక పోతన మాధుర్యం కూడా కలగలిపినట్లుగా రచించాడు.

ఇతడు ప్రచారములో లేనికవి. పేరు కొరకు ప్రాకులాడకుండా, నన్మానాలు కోరకుండా, సాధారణ జీవితముతో వ్యవసాయం వృత్తిగావున్నాడు. ఆహార్యం చదివినమోటుమనిషి. ఒక్క మాటలో చెప్పాలంటే ఇతను అమవాస్య చంద్రుడు.

ఇతని నాటకరచనల్లోని భీమార్జునవిజయాలు నాటకములోని కొన్ని సామాజికాంశాలును నేను పరిశీలించి, నూతనపద్యనాటక కవిని పరిచయంచేస్తున్నాను.

సమాజములో ఇరుగుపొరుగువారు అభివృద్ధిలోకి వచ్చి మంచిగబతికితె సహజంగానే చాలామందికి ఓర్వలేని తనము ఉండడమేకాక కుమిలిపోతూ, కొందరైతే అట్లు ఎదుగుతున్నవారికి ఏ అపకారము చేయడానికైనా వెనుకాడరు. ఈ విషయాన్ని కవి నాటక ప్రారంభములో శ్రీ కృష్ణుని పాత్రచేత ధుర్యోధనుని మనసును ఊహించాడు. అదే ప్రస్తుతసమాజములో జరుగుతున్నది.

మయసభ పరాభవము తరువాత కృష్ణుడూహించిన దుర్యోధనుని మనస్సు, నేడు ఎదుగుతున్న అన్న దమ్ములను గాని, పరులను గాని చూచి ఓర్వలేనివారి మనస్తత్వానికి సరిగ్గా ప్రతిబింబముగా కనిపిస్తుంది.

అట్టి పద్యమొకటి..

శ్రీయున్ సౌఖ్యములబ్బె పాండవులకిస్సీయంచు దుర్యోధనుం
డేయేభంగుల గుందుచుండెనొ గదాయేకీడు లూహించునో
దాయాదుల్తనమించుసంపదల నొందంచున్కటా! శత్రుకేన్
శ్రేయక్కాములు పాండునూనులకు నశ్రేయం బెటోపన్నిలన్
దాయాదులు తమకన్నా అధికసంపదలతో ఉంటె కుమిలిపోయేవారే ఎక్కువకదా.

గతమును గూర్చి ఆలోచన చేయరాదు. వర్తమానమును చూస్తూ,భవిష్యత్తును గురించి ఆలోచన

చేయాలి. గతాన్నిగురించి ఆలోచన చేయడము స్వనాశనమే. వర్తమానాలోచన విజయానికి సంకేతం. కుందబము మంచిదికాదని కర్ణుడు ధర్యోధనునికి సూచిస్తాడు. ఇది నేటిసమాజానికి చక్కగా పనికి వస్తుంది.

హితుడా! నీవిటుసేయనేల తమబాహాప్రాణి కర్ణుండు దు
ర్హితమున్నెంచిన పాండవాధముల గర్వింతున్మ హాస్త్రాళిచే
న్గతమున్దల్చిటు కుందబోకుసుమీకాయంబు మీదే సుమా
సతతంబడ్డెద యానతిమ్ము కురువంశోద్ధార మీసేవకై.

చేసేపని ఏదైనా తొందరపడి నిర్ణయం తీసుకుంటే ఫలితముండదు. సత్ప్రాణాళిక లేకుండా పనికి పూనుకుంటే అపజయమే కాని జయముండదు అను విషయాన్ని బాధపడుతున్న దుర్యోధనునికి శకునిచెప్పిన మాటలు ప్రస్తుత సమాజానికి సరిగ్గా వర్తిస్తాయి.

శకుని మాట :

తొందరపడకుడు, సత్ప్రణాళికలేనందుననే కదా! పాండవులకు మీరెన్నియపకారములొనర్చినను ఇంత వరకు బ్రతికి బట్టకట్టిరి. ఇక ఇప్పుడుచూడుడు, నా పాచికలతో పాండవులను కట్టుపుట్టములతో కారడవుల పాలొనరించకున్న, నేను సౌబలేయుడనే కాను.

కొంతమంది సమాజంలో ఎవరిదగ్గర బతుకుతారో వారికే అపకారంచేస్తే వాళ్ళనే తిన్నింటివాసాలు లెక్క పెట్టేవారని అంటారు. అంటే మనిషిని నమ్ముకుంటే ఎప్పుడైనా ద్రోహం చేస్తాడు. అదే కుక్కను నమ్ముకుంటే విశ్వాసంగా ఉంటుంది. అది యజమానికి ద్రోహం చేయదు. ఒకవేళ ద్రోహం చేసిందంటే అది పిచ్చికుక్కే అయ్యుంటుందని మహానీతివంతుడైన విదురుని కూడా దుశ్శాసనునిచే తిట్టించాడు కవి. ఇది సరిగ్గా ప్రస్తుత కాలంలో జరుగుతున్నదే.

తండ్రితోబుట్టువని దయతలచి నిన్ను
వాటముగ మెక్కి మాయింటివాసములనె
లెక్కబెట్టెడి నీకన్న కుక్కమేలు
పెక్కువాగకు నిటవెళ్ళి కుక్కవోలె!

దుర్యోధనుడు భీష్మాదిపెద్దలుచెప్పినమాటలు వినకుండా ఎదురుచెప్పిన సందర్భములో ధృతరాష్ట్రుడు విదురునితో ఇలా చెప్పాడు.

వసుధగొట్టుబంతెగిరి పైకొచ్చినట్లు
గాలితిత్తి నీటనుముంచ దేలినట్లు
పెద్దవారు పిన్నలకిల బుద్ధిజెప్ప
వీడెదురు మంచిచెడులెంత్రు విదురయిట్లు

పెద్దలు పిల్లలకు ఏదైనా చెప్పినప్పుడు తిరస్కరిస్తారు లేక చేయరు. వారికే చెప్తారు. ఇదే కదా మూర్ఖులైన పిల్లలు ఇప్పటికి లోకంలో చేస్తున్నది. ఇది సామాజికాంశమే.

ఈ ప్రపంచంలో నిజము మాట్లాడితే ఎంత ప్రమాదమో కృపాచారికి ద్రోణుని ద్వారా కవిచెప్పిన పద్యము.

నిజమాడ నిష్ఠురము ధర
నిజమాడకయుండెనేని నింద్యముగాదే
నిజముప్రియమా యాడక
నిజమవనిది ప్రియమైనను నింద్యమెపలుకన్

లోకంలో కొందరికి వినయముంటుంది. కాని విద్య ఉండదు. విద్య వినయాన్ని తేలేదని కృపాచారి ధర్మజున్ని మెచ్చుకొను సందర్భము ఎంతో అద్భుతమైన నీతి వాక్యము.

వినయముగలిగిన విద్యలేకుండును
విద్యగలుగలేదు వినయమిలను
విద్యవినయములతో వెలసిన మూర్తివి
ధరనుశుభము గలుగు ధర్మతనయ

ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో పలికినమాటలు ప్రస్తుత సమాజానికి కూడా వర్తించుచున్నది.

భీముడు ఒక సందర్భంలో ధృతరాష్ట్రున్ని నిందించినప్పుడు ధర్మరాజు వినయంతో చెప్పిన మాటలు ఇప్పటికి పెద్దలు పిల్లలను సమర్థించి మాట్లాడడం తెలిసిందే.

భీముడాడు మాటలకు నీవు బిడియపడకు
బాల్యచేష్టితములర న్నాటిరావు

తండ్రిజనె నీవెతండ్రిపెత్తండ్రి మాకు
మేము నూటైగుదురమని మెలిగెదమిల

ధృతరాష్ట్రుని మాట :

నాయన! ధర్మనందన! నీమాటలువిన్న నాకు మరల నా తమ్ముడగు పాండురాజే జ్ఞప్తికి వచ్చుచున్నాడు. అన్నదమ్ములన్నమీదట అకారణస్పర్ధలుప్పతిల్లుట వింతకాదు. ఇయ్యది లోకసహజము.

సమాజంలో మంచిమనిషితో కొట్లాట పెట్టుకునేవాడు అతడిని రెచ్చగొట్టి పోట్లాటకు దిగుతాడు. దుర్యోధనుడు ధర్మరాజును పాచికలాడుటకు రెచ్చగొట్టిన విధానాన్ని ఈ పద్యములో గమనిద్దాము.

ఆడిగెల్చిన వారిదౌ యోడుధనము
ఓడినది మాదెయనుకొంటయాడుతనము
మరలనాడిగైకొన్నచో మగతనమగు
అట్లు నిచ్చుటకిది పిల్లలాటగాదు

బాల్యములో పిల్లల మనసుపై ప్రభావముచూపే మాటలు పెద్దలు మాట్లాడకూడదు. పిల్లలలో కొందరిని నమర్ధించడము మరికొందరిని నిందించడము, అసహ్యించుకోవడము సరైన పద్ధతి కాదు. ఈ విధంగా చేయడంవల్ల పిల్లల మనసులలో ఈర్ష్య, అసూయ, ద్వేషం, పగ పెరిగి వంశనాశనానికే దారి తీస్తుందను విషయం ఈ పద్యం ద్వారా స్పష్టంగా తెలుస్తుంది.

పాలమనసు గలుగు పసితనంబునాడె, పాండవ
కౌరవ పగలురగిలె
పాండవులన మీకు పక్షపాతము గలుగ, యదిమాల
విషబీజమయ్యి మొలిచె
ఆ విషబీజాలె కసిద్వేషముల మేసి, ప్రతికారశాఖలతొ
ప్రభలమందె
యిట్టి వృక్షపునీడనెట్టు నెగులునింక, పాండవులని
యెడి పచ్చగడ్డి
విదురకృపద్రోణభీష్మ కోవిదులు మీకు
తగదు తగదింక ఇటువల్క ధర్మబోధ
యిచ్చవచ్చిన నుండుడి రచ్చనింక
యిచ్చలేకున్న పోవచ్చు రచ్చవీడి

ఈవిధంగా ఈ భీమార్జునవిజయాలు అను నాటకంలో నేటి సమాజంలో జరుగుతున్న అనేక సామాజికాంశాలు చాలా ఉన్నాయి. సాహిత్యంలో కొత్త అంశాలు, పాత అంశాలు అనేవి నిరంతరం ఉంటాయి. ఇదే విషయము నాటక ప్రారంభంలో నటి అడిగిన ప్రశ్నకు కవి సూత్రధారి చేత చెప్పించిన మాటలు నిత్యనూతనములని నేను భావిస్తున్నాను. అవి

సూత్రధారుడు :

ఓసి! నీవెర్రికాలిపోను! నాటకంబులో కొత్తపాత్ర లేమిటి! ఆడనివారికది నాటకము కొత్తది. ఆడిన నాటకమే ఆడిన వారికి పాతది. ప్రేక్షకులు తొలుతజూచిన కొత్తదే. చూచినదే మరలమరల చూచిన అయ్యది పాతదే అంటారు.

నిజమే! తెలువని అంశాలు ఎంత పాతవైనా కొత్తవి గానే అనిపిస్తాయి. తెలిసిన అంశాలు కొత్తవైనా పాతవిగా అనిపిస్తాయి. అంశము కాలానికి సంబంధము కాదు. మనసుకు సంబంధించినది.

ప్రస్తుతము ఒక అంశము మనము విని ఇది చాలా కొత్తగా వుంది, బాగుందంటే నీకింకా తెలియదా, అయితే నీవింకా అప్‌డేట్ కాలేదన్నమాట, అనే మాట మనకు వినిపిస్తుంది. నిజమే, మనకది కొత్తది. కొన్ని అంశాలు పాతవైనా, మనకు కొత్తగా అనిపిస్తాయి, కనిపిస్తాయి. వాటినే నిత్యనూతనమంటారు కదా. అట్లే ఈ భీమార్జున విజయాలను నాటకములో ఇప్పటి కవి శ్రీ పోతుల హన్మంతరెడ్డి రచించిన ప్రాచీనకథాంశము గల నూతన పద్యనాటకము.

ఆధార గ్రంథాలు :

1. భీమార్జున విజయాలు (పద్య నాటకము) - పోతుల హనుమంతురెడ్డి
2. మహాభారతము సభాపర్వము - నన్నయ.
3. మహాభారతము విరాటపర్వము - తిక్కన.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగులో చారిత్రక నవల

– డా॥. శిరీష ఈడ్పుగంటి, సహాయ ఆచార్యులు, శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాల, ఢిల్లీ.

సాహిత్య ప్రక్రియలలో ఒకటైన నవలా ప్రక్రియ క్రీ.శ. పంతొమ్మిదవ శతాబ్ది చివరి భాగంలో ప్రారంభమైంది. నవల సమాజంలోని వ్యక్తుల జీవనానికి ప్రతిబింబం. సమకాలీన మానవ జీవితాల్ని అత్యంత దగ్గరగా చూడ గలిగేది నవల. ఈ నవలా ప్రక్రియలో కూడా పలు వర్గాలున్నాయి. వాటిని తెలుగు విజ్ఞాన సర్వస్వం లో ఏడు రకాలుగా వర్గీకరించారు. అవి '1. చారిత్రక నవలలు 2. సాంఘిక నవలలు 3. రాజకీయ నవలలు 4. హాస్య ప్రధానమైన నవలలు 5. మనోవిజ్ఞాన సంబంధమైన నవలలు 6. మనస్తత్వ శాస్త్ర సంబంధమైన నవలలు 7. అపరాధ పరిశోధక నవలలు (విజ్ఞాన సర్వస్వం- నాల్గవ విభాగం, పుట 876-882). ఈ వర్గీకరణలో మొదటి విభాగం చారిత్రక నవలలు గూర్చి ప్రస్తుత వ్యాసంలో వివరిస్తున్నాను.

చారిత్రక నవల :

నవలా ప్రక్రియలో భాగమైన చారిత్రక నవలాప్రక్రియ కూడా అతి పురాతనమైంది. ఎందుకంటే క్రీ.శ. పంతొమ్మిదవ శతాబ్ది చివరిభాగంలో చారిత్రక నవలా రూపంతోనే తెలుగు నవలా ప్రక్రియ ప్రారంభమైంది. చారిత్రాకాంశం బీజంగా కలిగిన నవలా సాహిత్యాన్ని చారిత్రక నవల అంటారు. గత చరిత్రను ఇతివృత్త రూపంలో చూపుతుంది. కథాకాలం గతంలో ఉండి ఆనాటి స్థితిగతులను ప్రతిబింబించేదిగా ఉంటుంది. చారిత్రక ఇతివృత్తానికి, సంఘటనలకు కల్పనలను జోడించి సజీవంగాను, ఆకర్షణీయంగాను రచిస్తే చారిత్రక నవల అవుతుంది. ఈ చారిత్రక నవలలో చరిత్రలోని యధార్థ సంఘటనల సమ్మేళనము కనిపిస్తుంది. అంతేగాకుండా చరిత్రతో పాటు ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను తెలుపుతుంది. ఈ సందర్భంలో చరిత్రకు, చారిత్రక నవలకు గల వ్యత్యాసాల్ని ముందుగా చెప్పుకోవాలి.

చరిత్ర - చారిత్రక నవల :

ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన చరిత్ర గల దేశం భారతదేశం. దేశ చరిత్ర పుస్తకాలలో కేవలం ఆయా కాలాల్లోని రాజుల పరిపాలన గూర్చి చరిత్రకారుడు చెబుతాడు. కాని చారిత్రక నవలాకారుడు ఆయా కాలాల్లోని చరిత్రను చెబుతూ, చరిత్రతో పాటు రసవత్తరమైన కథను నడిపిస్తాడు. ఆకాలంలోని సంస్కృతి, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, మనుషుల జీవన విధానాలు, సంప్రదాయాలు అన్నింటి గూర్చి తెలియజేస్తాడు. అంతేగాకుండా ఒక జాతి సంస్కృతీ సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను చారిత్రక నవల చెప్పినంతగా చరిత్ర చెప్పదు.

ఒక యుగానికి లేదా కాలానికి, ప్రాంతానికి సంబంధించిన సమస్త విషయాలు చరిత్రలో రాస్తాడు. చరిత్రలో జరిగిపోయిన విషయాలు, వాటి చారిత్రక విలువల్ని బట్టి వాస్తవికతకు దగ్గరగా ఉంటాయి. చరిత్రకారుడు జరిగింది జరిగినట్లు రాస్తాడు. చరిత్రలోని వ్యక్తులు, సంఘటనలు పరిమితంగా ఉంటాయి. చారిత్రక నవలాకారుడు చరిత్రలోని ఏదో ఒక సంఘటనను తీసుకుని ఈ విధంగా జరిగి ఉండవచ్చునని ఊహించి రాస్తాడు. చారిత్రక నవలాకారుడు పాఠకులు ఆలోచించడానికి అస్కారం, అవకాశం కలిగిస్తాడు. చరిత్రలోని సత్యం, చైతన్యం నవలలోని కల్పనల సమ్మేళనమే చారిత్రక నవల.

చారిత్రక నవల నిర్వచనాలు :

చారిత్రక నవల అంటే ఏమిటో మరింత స్పష్టంగా అవగతమవడానికి కొంతమంది చారిత్రక నవలాకారులు చెప్పిన నిర్వచనాలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

నోరి నరసింహశాస్త్రి :

"చరిత్రాత్మక నవల అనేది రెండు విరుద్ధ శబ్దాల సమ్మేళనమనే భ్రాంతి కలిగిస్తుంది. జరిగినదంతా వ్రాసుకుంటూ పోతే చరిత్ర కాదు. లోకానికో, దేశానికో, సంఘానికో, వ్యక్తికో, మంచికో, చెడుకో ప్రభావం కలిగించే సంఘటనలు వ్రాస్తేనే చరిత్ర. దానితో అనుగుణమైన కల్పన జోడిస్తే చరిత్రాత్మక నవల అవుతుంది. దానికి చరిత్ర బీజముంటే చాలును అంటారు." (ఈమాట/ ఆంధ్రభాషలో చరిత్రాత్మక నవల / జూలై, 2012.)

పుల్లాభొట్ల వేంకటేశ్వర్లు :

జరిగిపోయిన ఒకానొక చారిత్రక సంఘటనను గ్రహించి, దానిని ఆత్మగా చేసుకుని దాని చుట్టూ పెక్కు అద్భుత సంఘటనలతో, పవిత్ర సన్నివేశాలతో కథాకథన దక్షతతో రచించిన మహత్తర గ్రంథమే చారిత్రక నవల అన్నారు.

డా॥. బెజవాడ గోపాలరెడ్డి :

నోరి నరసింహశాస్త్రిగారి ధూర్జటి నవల భాషాంతరీకరణకు ప్రస్తావన రాస్తూ చారిత్రక నవల అంటే "చరిత్రకు సత్యము కావలె. నవలకు కల్పనతో కూడిన సౌందర్యమవనరము. చారిత్రక నవల సత్య సౌందర్యముల సమ్మేళనము" అన్నారు.

A.C Ward :

A historical Novel is an imaginative recreation of aremote period.

Ernest.E. Leisy :

A historical Novel is a novel, the action of which is laid in an earlier time.

చారిత్రక నవలాకారుడు :

చరిత్ర చారిత్రక నవలాకారునికి కేవలం సామగ్రిని మాత్రం అందిస్తుంది. అతడు ఏ కాలం నాటి సంఘటనలను, కథను గ్రహిస్తాడో ఆ కాలం నాటి సంఘటనలు, జీవితవిధానం, ఆచార వ్యవహారాలు, సామాజిక ధార్మిక పరిస్థితులు మొదలైన వాటిని చారిత్రక నవలలో చూపిస్తాడు. చరిత్ర అందించిన సామగ్రిని తన ఇష్టం వచ్చిన రీతిలో మలచుకుంటాడు. ఈ ప్రయత్నంలో కొత్త పాత్రలను, సన్నివేశాలను సృష్టిస్తాడు. అవి చరిత్రకు విరుద్ధంగా ఉండకుండా చూసుకుంటాడు. అలాగే చారిత్రక సంఘటనలకు, వాటి చుట్టూ కల్పించిన కల్పనలకు మధ్య సమన్వయం కుదుర్చుతాడు. చరిత్ర అస్పష్టంగానూ, లేదా అసంపూర్ణంగానూ లభిస్తే దానికి సమన్వయం కుదిర్చేందుకు, ప్రధాన పాత్రను ముందుకు నడిపేందుకు అప్రధాన పాత్రలను ఎంచుకుంటాడు. ఆధునిక మానవజీవితంలోని జీవిత పాత్రలను కల్పనశక్తితో ప్రాచీన పాత్రలకు అన్వయింపజేస్తాడు. ఆనాటి దేశకాల పరిస్థితులను నవలలో ప్రతిబింబింప జేస్తాడు.

సమకాలీన సమాజాన్ని సంస్కరించి ఉన్నతంగా చేయడానికి గతకాలం నాటి ఆదర్శాలను, గౌరవంగా జీవించే విధానాన్ని, చరిత్రలోని మహాపురుషుల జీవితాలు, నీతి, సదాచారం మొదలైన వాటిని మనముందుంచి మన ప్రవర్తనను చక్కదిద్దుతాడు. పాఠకుడు చరిత్రలోని విషయాలను చదివి అవగాహన చేసుకుని తన జీవితాన్ని గౌరవ ప్రదంగాను, ఆదర్శ ప్రాయంగాను తీర్చిదిద్దుకునేటట్లు చేయడానికి ప్రయత్నిస్తాడు. జాతి ఔన్నత్యం, ఆ దేశ ప్రజల దేశభక్తి జాతీయతా భావాల మీద ఆధారపడి ఉంటుంది. ప్రజలలో ధైర్య సాహసాలను, దేశభక్తిని, కార్యదీక్షను, జాతీయ భావాన్ని పురికొల్పడమే చారిత్రక నవలాకారుని ముఖ్య ఉద్దేశం.

చారిత్రక నవలల ప్రయోజనం :

చారిత్రక నవలల్లో పేర్కొనదగిన ముఖ్య విషయం గూర్చి రాచమల్లు రామచంద్రారెడ్డిగారు 'నవలల్లో చరిత్ర తన గత చరిత్రే అని పాఠకునికి అనుభూతి కావాలి అన్నారు. అటువంటి అనుభూతి కలిగినపుడే పాఠకునిలో తన పూర్వుల చరిత్రను గూర్చి గర్వపడడం, చరిత్రలోని వీరపురుషుల సాహసాన్ని అభినందించడం తన దేశాన్ని ప్రశంసించడం మొదలైన భావాలు ఉత్పన్నమవుతాయి.

అప్పుడే చారిత్రక నవలారచన ప్రయోజనం నెరవేరుతుంది' దేశంకోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శత్రు రాజులతో పోరాడి, దేశాన్ని శత్రువుల బారినుండి కాపాడడం వంటి సన్నివేశాల వల్ల ప్రజలలో ఐకమత్యాన్ని పెంచి, వారిలో దేశాభిమానాన్ని, భక్తిని పెంపొందింప చేయవచ్చు. ప్రాచీన వీరుల శౌర్యం, పరాక్రమం, రాష్ట్రీయ భావన, దేశంకోసం ఆత్మాహుతి కావడం, మొదలైన విషయాలను నవలలో చిత్రించడం వలన ప్రజలలో దేశాభిమానం పెంపొందించడానికి అవకాశం ఉంటుంది. చరిత్రలోని వ్యక్తుల ఆదర్శ భావాలను నవలలో చూపించడం ద్వారా సమాజంలోని మనుషులు వాటిని పాటించే అవకాశం ఉంటుంది. గతకాలపు మంచిని స్వీకరించి చారిత్రక నవల రాయడం ద్వారా పాఠకుల్ని మంచివైపు ప్రేరేపించవచ్చు. అలాగే దానికి భిన్నంగా ఆనాటి చెడు కార్యాలు చారిత్రక నవలలో వెల్లడించి అలాంటి కార్యాలు చేయకూడదనే నీతిని బోధించవచ్చు. ప్రజలలో మానవతా దృక్పథాన్ని , దేశభక్తిని, జాతీయ సమైక్యతను చారిత్రక నవలల ద్వారా కలిగించవచ్చు.

ముగింపు :

సమాజాన్ని ప్రగతి పథం వైపు నడిపించడమే సాహిత్యం యొక్క ప్రధాన ప్రయోజనం. ఆధునిక యుగంలో సమాజానికి ఒక సందేశాన్ని అందించి ఉన్నత మార్గాన్ని నిర్దేశించే సాహిత్య ప్రక్రియలలో చారిత్రక నవల అత్యంత ప్రధానమయ్యింది. చారిత్రక నవలల ద్వారా చారిత్రాకాంశాలు అందరికి తెలుస్తాయి. అంతేగాకుండా సమగ్ర మానవజీవితం కనిపిస్తుంది. చారిత్రక నవలాకారులంతా పూర్వచరిత్రను అన్వేషించి, చారిత్రక ప్రదేశాలు సందర్శించి, చరిత్రకు అవసరమైన మేరకు కల్పనలు జోడించి చారిత్రక నవలలు రాశారు. వీరి కృషి అమోఘనీయం.

ఉపయుక్త గ్రంథసూచి :

1. నరసింహశాస్త్రి, నోరి. 1986. ధూర్జటి. క్వాలిటీ పబ్లిషర్స్. విజయవాడ.
2. నరసింహశాస్త్రి, నోరి. జూలై, 2012. ఆంధ్రభాషలో చరిత్రాత్మక నవల./ ఈమాట.కామ్. (eemaata. com/em/issues/201207/1977. html)
3. నాగభూషణ శర్మ, మొదలి. 1971. తెలుగు నవలా వికాసం. ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్. సికిందరాబాద్.
4. వేంకటేశ్వర్లు, పుల్లాభొట్ల. తెలుగు నవలా సాహిత్య వికాసం.
5. సోమశేఖర శర్మ, మల్లంపల్లి (సంపాదక వర్గం). 1959. విజ్ఞాన సర్వస్వం (1-4 సం). తెలుగు భాషా సమితి, హైదరాబాద్.
6. Leisy, E. Ernest - American Historical Novel
7. Ward, A.C. 1972. Foundation of English Prose : E.C.D's London.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునిక తెలుగు కవిత్వం దారులు : పరిధుల పరిశీలన

– డా॥. గోనపాటి ధర్మారావు, సహాయ ప్రాంతీయ సంచాలకులు,
ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం.

ఆధునిక కవిత్వం – పరిచయం :

తెలుగు కవిత్వానికి సంబంధించినంత వరకు మొదటి వెయ్యేళ్ళ రచనలు ఒక వైపు ఉండగా, తరువాతి వందేళ్ళ లోనే అంతకుమించి కవిత్వ సృష్టి జరిగింది. ఇందుకు భాషతో పాటు సాహిత్యం ప్రజాస్వామ్యీకరించబడడం ఒక కారణం కావచ్చు. నన్నయ భారతాంధ్రీకరణ ప్రారంభించిన నాటి నుండి మలి ప్రబంధ యుగం వరకు కావ్య స్వరూపంలో చెప్పుకోదగ్గ మార్పులు కనిపించవు. వస్తువులోగానీ, స్థూలరూపంలో గాని ఏ మార్పులు కనిపించవు. అక్కడక్కడా రూపంలో ఆయా సంస్కృతీకరించబడిన రస సిద్ధాంతాలకు, వర్ణనలకు, కావ్య సంప్రదాయాలకు లోబడే కొన్ని మార్పులు, ప్రయోగాలు కనిపిస్తే కనిపించవచ్చుగానీ వస్తువు విషయానికొచ్చే సరికి వర్ణాశ్రమధర్మ / హిందూ ధర్మ ప్రచారం కాల్పనికమైన రాజుల, చక్రవర్తుల వంశ చరిత్రల రచన, రాజుల భోగవిలాసాల వర్ణనలు, స్త్రీ సాంగత్యాలు, శృంగార, కామకేళీ విలాసాల సంగతులు, వ్యాస భారతాన్ని ఆధారంగా చేసుకుని సంస్కృతంలో మునిగిపోయిన తెలుగు భాషతో ప్రయోగాలు - ఇలాంటి వస్తువులే కనిపిస్తాయి. నిజానికి ఈ రకపు సాహిత్యం మలి ప్రబంధ / క్షీణ ప్రబంధ యుగం నాటికి నిస్తేజంగా మారిపోయింది. ఆ సందర్భంలోనే ఈ దేశంలో పాశ్చాత్య పాలన మూలకంగా ఆంగ్ల భాష ఆంగ్ల విద్యా ప్రభావంతోనే అనేక ఆధునిక భావనలు సమాజంలోని అన్ని రంగాలతో ప్రవేశించి కవిత్వంతో పాటు సమస్త సామాజికాంశాలపై ప్రభావాన్ని చేసాయి.

కవి (ఇక్కడ కవి అని వాడేది కేవలం మగ కవులను గురించి కాదు. ఇక్కడ కవి పులింగం కాదు. కవిత్వం రాసే వారందరికి అంటే ఆడ, మగ, ఇంకా ఇతరులకీ ప్రాతినిథ్యం వహించే మాటగానే ఈ శబ్దాన్ని వాడుతున్నాను) తాను బ్రతికే వ్యవస్థలోని అన్ని అంశాలతో అనుసంధానమై వుంటాడు. ఆ కవి చైతన్యం, భావనలు అతను జీవిస్తున్న సమాజ నిర్మాణం, ఆ నిర్మాణంలోని అతని స్థానం, ఆ కవి దృక్పథాన్ని నిర్దేశించే ఆర్థిక, రాజకీయ అంశాలు వీటన్నింటి ప్రభావంతో ఏర్పడతాయి. కవి చైతన్యం, ఆ కవి వున్న సమాజ సూత్రాలను అనుసరిస్తూనే వుంటుంది. ఆ విధంగా పంతొమ్మిదో శతాబ్దంలోని కవులను, ఆ కాలపు సామాజిక, రాజకీయ, వైద్య, వైజ్ఞానిక విషయాలు ప్రభావితం చేసి ఒక కొత్త రకపు సాహిత్యం / కవిత్వం ఏర్పడ్డానికి దారులు వేసాయి. పంతొమ్మిదో శతాబ్దం రెండో భాగంలో ఊపందుకున్న ఈ రకపు ఆధునిక కవిత్వం ఇప్పటి వరకు సుమారుగా ఒకే అంతస్సూత్రతతో కొనసాగుతూ వస్తుంది. అయితే ఈ వంద, నూట యాభైయ్యేళ్ళలో ఎన్నో ఉద్యమాలకు, వాదాలకు, ధోరణులకు, తరాలకు, సమూహాలకు జన్మనిచ్చింది ఈ ఆధునిక కవిత్వం. ఈ రకాలన్నిటినీ సోదాహరణంగా వివరించే ప్రయత్నం జరిగిందీ వ్యాసంలో.

కవిత్వ యుగాలు లేదా శకాలు (Poetic Era) :

ముందుగానే చెప్పుకున్నట్లు నన్నయ నుండి గురజాడ ముందు వరకూ అంటే క్షీణప్రబంధ కాలం తరువాతి స్తబ్ధత వరకూ కవిత్వం అంతా ఒకే అంతస్సూత్రతతో అంటే మతం, వర్ణనలు, కాల్పనికత, కాల్పనిక కథా కావ్యాలతో ధర్మ ప్రచారం ఇలాంటి కవిత్వమే వచ్చింది. దీన్నంతటినీ ప్రాచీన యుగంగా వ్యవహరించవచ్చు. అయితే ఆధునిక కాలంలో ప్రాచీన సాహిత్యాన్ని విమర్శించిన విమర్శకులు, రచయితలు నన్నయ

యుగమనీ, తిక్కన యుగమనీ, శివకవి యుగమనీ, శ్రీనాథ యుగమనీ ఇలా ప్రసిద్ధ కవుల పేరుతో యుగ విభజన చేసారు. సుమారుగా ఈ యుగాలన్నీ ఒక శతాబ్దం, అర్ధశతాబ్ద కాలాంతరంతో కన్పిస్తాయి. కానీ ఈ రకంగా ఒకే కవి కాలాన్ని ఒక యుగంగా అభివర్ణించడం సమంజసంగా అనిపించదు. యుగం అన్న మాటకి ఆంగ్ల నిఘంటువుల్లో వున్న అర్థం గమనిస్తే చరిత్రలో ఒక దీర్ఘమైన, స్పష్టమైన కాల విభజనగా కనిపిస్తుంది. దీన్నే ఎరా-జుతీఫు అని ఆంగ్లంలో అంటారు. ఈ రకంగా ఒక్కో కవిని, అతని కాలాన్ని మాత్రమే ఒక యుగంగా, కేవలం ఆ కవి ప్రతిభా వ్యుత్పత్తులను బట్టే విభజించడం చూస్తే మొత్తం కవిత్వ కాలాన్ని కనీసం కొన్ని పదుల యుగాలుగా విభజించాల్సిన పరిస్థితి వస్తుంది. అందుకే నన్నయ నుండి క్షీణ ప్రబంధ కాలం వరకు ప్రాచీన యుగంగాను ఆ తరువాత కందుకూరి సమాజ సంస్కరణం, గిడుగు భాషా సంస్కరణం, గురజాడ కవిత్వ సంస్కరణంతో మొదలై ఇప్పటి వరకు కొనసాగుతున్న దాన్ని ఆధునిక యుగంగానూ చెప్పవచ్చు. ఇక్కడ ప్రాచీన యుగం, ఆధునిక యుగాలు కూడా పూర్తిగా ఒకే మార్గాన్ని కలిగి వున్నవి కాదు. వీటిల్లో అనే అంతర్లక్షణాలు, ధోరణులు, వాదాలు, వివాదాలు, గుంపులు, తరాలు, అంతరాలు కనిపిస్తాయి. స్థూల విభజన కోసం మాత్రమే వీటిని యుగాలుగా లేదా శకాలుగా అభివర్ణించవచ్చు.

కవిత్వోద్యమాలు (Poetic Movements):

కవిత్వంలో యుగ విభజన తరువాత స్పష్టంగా విడదీసి చూడదగ్గ మరో రకం ఉద్యమాలు సామాజికం గానూ, సంస్కరణాముఖంగానూ అభివృద్ధిపూర్వక మార్పువైపు ప్రయాణిస్తూ వుంటాయి. ఆధునిక తెలుగు కవిత్వంలో కూడా ఇలాంటి ఉద్యమాలు ఎన్నో కని పిస్తాయి. యుగాల కంటే ఈ ఉద్యమాల కాల వ్యవధి తక్కువగా వుంటుంది. ధోరణులు తరాలతో పోల్చినప్పుడు కాలవ్యవధి ఎక్కువగా వుంటుంది. అయితే ధోరణులు తరాల కంటే కాస్త ఎక్కువ పరిధి, కాల వ్యవధి కలిగి వుంటాయి. సాధారణంగా ఉద్యమాలకి ప్రత్యేక సైద్ధాంతిక నేపథ్యం వుంటుంది. ప్రత్యేక లక్షణాలు వుంటాయి. ఆ సిద్ధాంతం, లక్షణాలతో ఆ ఉద్యమంలో పాల్గొనే కవులు, రచయితలు అందరూ సంవదిస్తూ వుంటారు. అవే ఆ ఉద్యమ కవులందరికీ వస్తువు, రూపాల్ని సమకూరుస్తాయి. ఈ ఉద్యమాల లక్షణాలు కేవలం ఒక ప్రాంతానికో, దేశానికో పరిమితం కావు. కాని ఉద్యమాల బీజాలు వేరే చోట నుండి వస్తాయి. అలాగే స్థానిక లక్షణాలు కూడా అన్ని చోట్లకి ప్రయాణం చేస్తాయి. మొత్తంగా తెలుగులో ఉద్యమ స్థాయిలో వచ్చిన కవిత్వాన్ని అంతర్జాతీయ నేపథ్యాలు, లక్షణాలు కన్పిస్తాయి. ఆధునిక తెలుగు కవిత్వంలో వర్ధిల్లిన ప్రతి కవిత్వోద్యమం తనదైన ప్రత్యేక రాజకీయ, సామాజిక సిద్ధాంతాన్ని కలిగి వుంది. తెలుగు నేలపై సంస్కరణ కవిత్వోద్యమం ప్రారంభం కావడానికి ముందు వ్యావ హారిక భాషోద్యమం ఒక విస్తృతంగా వచ్చింది. నిజానికి ఆధునిక కవిత్వోద్యమాలకి ఈ వ్యవహారిక భాషోద్యమం కొంత దోహదపడిందనే చెప్పాలి. ఆ తరువాత భావ కవిత్వోద్యమం మొదటిసారి ఒక కవిత్వోద్యమంగా ముందుకు వచ్చింది. ఆంగ్ల సాహిత్యంలో వచ్చిన కాల్పనిక సాహిత్యోద్యమం (Romantic Poetry Movement) దీనికి దోహదపడింది. కానీ ఆ పాశ్చాత్య కాల్పనిక భావనలు తెలుగు నేలపై అడుగుపెట్టిన తరువాతనే ఇక్కడి స్థానిక గుణాన్ని సంతరించుకుని, భారతీయ సంప్రదాయ కావ్య లక్షణాలు, భారత జాతీయ వాదం కలగలిపి కొత్తరకపు సాహిత్యోద్యమంగా నిలిచింది.

ఆ కాలంలోనే నవ్యకవిత్వోద్యమంగా రాయప్రోలు తెచ్చిన అమలిన శృంగారం వంటి భావనలు తెలుగు కవిత్వ సీమపై కాళ్ళు పెట్టాయి. అయితే తెలుగు కవిత్వ చర్చలోమాత్రం నవ్యకవిత్వోద్యమం భావకవిత్వంలో అంతర్భాగంగానే ఉండిపోయింది. కానీ భావకవిత్వానికి బాటలు వేసింది గురజాడ సంఘ సంస్కరణ కవిత్వంతో పాటు రాయప్రోలు నవ్యకవిత్వం అన్న విషయాన్ని

విస్మరించలేము. భావ కవిత్వంగా ముందుకొచ్చిన ఉద్యమం ఎక్కువ మంది కవుల్ని సాహిత్యంలోని ఆకర్షించింది. అమలిన శృంగార, విరహ ప్రణయాలు, జాతీయ భావనలు ఇలాంటివి రాయని కవి ఆ రోజుల్లో తెలుగు నేలపై లేడనే చెప్పాలి.

ఆ తరువాత అంతగా తెలుగు నేలంతా విరాజిల్లిన మరో సాహిత్యోద్యమం అభ్యుదయ కవిత్వోద్యమం. ప్రతి కవిత్వోద్యమానికి ఒక సైద్ధాంతిక నేపథ్యం వుంటుందని ముందు చెప్పుకున్నాం. అలాగే ఈ అభ్యుదయ కవిత్వోద్యమానికి కూడా మార్క్సిస్టు సిద్ధాంతాలు భూమికగా నిలిచాయి. ఇది కూడా పాశ్చాత్య సిద్ధాంతాల ప్రభావంతోనే వచ్చినా మళ్ళీ స్థానికతను సంతరించుకుని భారతీయ / తెలుగు సమాజానికి అనుగుణంగా కొనసాగింది. దీన్ని అనుసరిస్తూ విప్లవ కవిత్వోద్యమం కూడా ఒక ఉద్యమ స్థాయిని సంతరించుకుని నడిచింది. ఈ కవిత్వోద్యమం బయటి సామాజిక ఉద్యమాలకు అనుగుణంగా నడవడం చేత దాని విస్తృతి, ప్రభావం ఆ మేరకే ఉండింది. అయితే ఆ అభ్యుదయ, విప్లవ భావనలు ఇప్పటికీ కొనసాగుతూ వుండడం ఈ కవిత్వాల ఉద్యమ లక్షణాన్ని బల పరుస్తుంది.

భావ, అభ్యుదయ కవిత్వాలు బలంగా వస్తున్న రోజుల్లోనే నవ్య సంప్రదాయ ఉద్యమం పేరిట మరో కొత్త ఉద్యమం విశ్వనాథ మార్గదర్శనంలో నడిచింది. దీన్ని ఉద్యమంగా కొందరు కవిత్వ విమర్శకులు అంటున్నప్పటికీ దీన్ని ఒక ధోరణిగానే చూడవచ్చు. "మార్క్సిస్టు అభ్యుదయోద్యమాన్ని సాహిత్యం ద్వారా ఎదుర్కొన్న చక్కని సాహిత్యోద్యమం ఇది" అని విమర్శకులు అన్నారు. అయితే ఈ నవ్యసంప్రదాయోద్యమం మళ్ళీ ప్రాచీన కావ్య లక్షణాలతో పాటూ వస్తువుల్ని కూడా స్వీకరించడం చేత సామాన్య పాఠకుడ్ని అభ్యుదయ కవిత్వోద్యమం చేరినంతగా చేరలేదు.

ఇవి కాకుండా అనుభూతి కవిత్వాన్ని కూడా ఉద్యమ స్థాయిలో దర్శించిన విమర్శకులు వున్నారు. ఇది కూడా అభ్యుదయ కవిత్వోద్యమం వర్ధిల్లిన రోజుల్లో వచ్చిన నవ్య సంప్రదాయోద్యమంలాగా అనుభూతివాదం పేరిట తిలక్, ఇస్మాయిల్, మో తదితరులు విప్లవ కవిత్వోద్యమం రోజుల్లో బలంగా నడిపారు. ఈ రకపు కవిత్వం కూడా ఏదేని సామాజిక సిద్ధాంతాల జోలికి పోకుండా ఒక ప్రత్యేక సమూహ కవిత్వంగా కొనసాగింది. ఇప్పటికీ అలా వచ్చే కవిత్వం చాలా కనిపిస్తుంది. నవ్య సంప్రదాయ కవిత్వం, అనుభూతి కవిత్వాలు ఉద్యమాలుగా కొందరు పేర్కొంటున్నప్పటికీ వాటిని కవిత్వంలో ప్రత్యేక సమూహాలు (School of Thought)గా పేర్కొనవచ్చు. వీటికి ఉద్యమం అని పిలిచే సైద్ధాంతిక స్థాయి లేదు.

కవిత్వ రూపం విషయానికొస్తే వచన కవిత్వోద్యమం కూడా ఒక ఉద్యమ స్థాయిలో బలంగా నడిచింది. ఈ ఉద్యమం ఎందరో కవుల్ని కవిత్వ ఛాయలోకి తీసుకొచ్చింది. నిజానికి కవిత్వం ప్రజాస్వామ్యీకరించబడడం (Democratized) ఈ వచన కవిత్వోద్యమంతోనే సాధ్యపడింది.

కవిత్వ ధోరణులు (Trends in Poetry) :

ట్రెండ్ (Trend) అనే మాటకి సమానంగా ధోరణి అనే మాటని ఉపయోగిస్తున్నాం మనం. ఈ మాటకి ఆంగ్ల పదకోశాల్లో ఒక మార్పు లేదా అభివృద్ధి వెళ్ళే దిశగానో, ఒక నిర్దిష్ట దిశలోకి వెళ్లే మానవ ప్రవర్తనగానో నిర్వచించారు. ఈ ధోరణి కొన్న ప్రత్యేక లక్షణాలను కలిగి వుంటుంది. కేవలం కవిత్వానికే పరిమితం కావు ధోరణులు. ఇవి మానవ జీవితంలో మరికొన్ని లౌకిక అంశాలలోనూ కన్పిస్తాయి. ఆ లక్షణాలు ఒక యుగస్థాయికి గాని ఉద్యమ స్థాయికిగాని వెళ్ళవు. ఒక తాత్కాలిక, స్వల్ప కాలవ్యవధికే ఈ ధోరణులు పరిమితమౌతాయి. అయితే కేవలం ఆ కాలంలోనే కాక అటువంటి లక్షణాలు ఇతర ఉద్యమాల కాలంలోనూ కనిపించే అవకాశం వుంది. గురజాడ, కందుకూరి సంస్కరణోద్యమం గిడుగు భాషోద్యమం అందిపుచ్చుకుని ఆధునిక సాహిత్యోద్యమాన్ని ప్రారంభించాక ముత్యాల సరాలనే ఒక కొత్త

ధోరణిని ముందుకు తెచ్చాడు. ఈ రకపు కవిత్వ రూపం అంతకుముందు కొన్ని చోట్ల రగడలుగా, దేశి ఛందస్సులుగా కన్పించినప్పటికీ అది అప్పటికీ ఒక ధోరణిగా మళ్లీ కొత్త భాషతో వచ్చింది. ఈ ధోరణి గురజాడ కాలంలో మాత్రమే కాక భావకవుల రచనల్లో ముఖ్యంగా అభ్యుదయ కవులైన శ్రీశ్రీ మొదలగువారి చేతుల్లో కూడా ఒక బలమైన ధోరణిగా మారింది. అంటే ఒక ధోరణి భిన్న ఉద్యమ సందర్భాలలో కొద్దిపాటి మార్పులతో కొనసాగడం మనకి కనిపిస్తుంది. అలాగే భావ కవిత్వం ఒక ఉద్యమంగా వచ్చినప్పటికీ అప్పటి కాల్పనిక లక్షణాలతో పాటు వైయక్తిక తత్వం, భక్తి తత్వం, ప్రణయ విరహాలు, ఎలిజీలు, యాత్రా చరిత్రలు కొంతకాలం పాటు ధోరణులుగా కొనసాగాయి. ఈ ధోరణులు కేవలం ఆ కాలాల్లో మాత్రమే కాక ఇతర ఉద్యమ కాలాల్లోనూ ఎక్కడో ఒక దగ్గర కన్పిస్తాయి. ఈ ధోరణులకి స్థిరమైన సామాజిక భూమిక ఉండదు. ఉద్యమాలకున్నట్టుగా అలాగే ఈ ధోరణులని అనుసరించే వాళ్ళు ఉద్యమాలతో పోల్చుకుంటే తక్కువగా వుంటారు. స్థూలంగా ఉద్యమాలలో భాగంగా వుంటాయి. కవిత్వ రూపంలో కూడా ఈ ధోరణులు కనిపిస్తాయి. ఉదాహరణకి వచన కవిత్వం ఉద్యమంగా మొదలై ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. అయితే ఆ రూపం అనుసరిస్తూనే మినీ కవిత్వం, నానీలు, హైకూలు లాంటివి ప్రత్యేక ధోరణులుగా ఆ వచనకవిత్వోద్యమంలోనే కనిపిస్తాయి. వీటిని కొందరు అనుసరిస్తారుగాని అవి ఒక ఉద్యమ స్థాయికి చేరుకోలేవు.

కవిత్వ వాదాలు (Poetic ISMs) :

వాదం అన్నదానికి విమర్శకులు నిఘంటుకారులు ఇచ్చిన నిర్వచనాలను క్రోఢీకరిస్తే అది ఒక నిర్ధిష్ట భావ పరంపరగా, తత్వంగా బోధపడుతుంది. తెలుగు కవిత్వంలో వాదాలుగా చాలావాటిని పిలుస్తారు. అస్తిత్వ వాదాలుగా విప్లవ కవిత్వోద్యమం తరువాత వచ్చిన స్త్రీ, దళిత కవిత్వాల్ని వాదాలుగానే చాలా మంది విమర్శకులు భావించారు. వీటితో పాటు ముస్లిం మైనారిటీ, ప్రాంతీయ, బహుజన కవిత్వాలు కూడా వాదాలుగానే ప్రసిద్ధికెక్కాయి. వీటన్నింటి కంటే ముందు పాశ్చాత్య దేశాల్లో ఆధునిక ఉద్యమాలుగా వాస్తవికవాదం, ప్రతీకవాదం, భావచిత్రవాదం, ప్యూచరిజం, క్యూబిజం, ఇంప్రెషనిజం (అనుభూతివాదం), అభివ్యక్తివాదం (ఎక్స్‌ప్రెషనిజం), డాదాయిజం, అధివాస్తవిక వాదం మొదలైనవన్నీ ఉద్యమాలుగా వచ్చాయి. అయితే తెలుగు కవిత్వ రంగానికొచ్చేసరికి ఇవన్నీ కేవలం వాదాలుగా వచ్చాయి. వీటిల్లో ప్రతీకవాదం, భావచిత్రవాదం, అధివాస్తవిక వాదం వంటివి చాలా మంది కవులు స్వీకరించి వాటిని తమ కవిత్వ అభివ్యక్తికి వాడుకున్నారు. అలాగే అధివాస్తవికత, ఇమేజిస్టు (భావచిత్ర) కవిత్వం వంటివాటిని ధోరణులుగా వర్ణించిన వారున్నారు.

స్త్రీవాదం, దళితవాదం సాహిత్యం కంటే ముందు సామాజిక సిద్ధాంతాలు. స్త్రీ వాదం సమాజంలో ఒక ఖచ్చితమైన ఉద్యమరూపు దాల్చకపోయినప్పటికీ దళితవాదం సమాజంలో ఒక బలమైన ఉద్యమంగా రూపుదిద్దుకుంది. అంబేద్కర్ ఆలోచనా ధోరణిని, అంబేద్కర్ సిద్ధాంతాల్ని భూమికగా తీసుకుని కుల నిర్మూలన, అస్తిత్వం కోసం పోరాటం ఆలంబనగా దళిత కవిత్వం వస్తూ వుంది. నిజానికి స్త్రీ వాదం, దళితవాదాల్ని కేవలం వాదాలుగా విమర్శకులు చూస్తూ ఉన్నా ఈ తాత్విక సిద్ధాంతాలు సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లో తమ పరిధిని పెంచుకుని విస్తృతమైన సాహిత్యాన్ని ఉత్పత్తి చేయడం, ఒకే మూల సిద్ధాంతం భూమికగా వుండడం, ఎక్కువ కాలం పాటు కొనసాగుతూ వుండడం ఇవన్నీ వీటిని సాహిత్యోద్యమాలుగా నిలుపుతాయి. ముస్లిం మైనారిటీ, బహుజన, ప్రాంతీయ కవిత్వాలు ప్రసిద్ధ వాదాలుగా కొనసాగుతున్నాయి.

కవిత్వంలో తరాలు (Generations) :

"ఒకే రకమైన సామాజిక వారసత్వం, సాంస్కృతికమైన గుర్తింపు, చుట్టూ జరిగే సంఘటనలకు ఒకేరీతిగా స్పందించే గుణం, ఒకే రకమైన ధ్యేయాలూ తరానికి

వుంటాయి" అని విమర్శకులు అంటారు. కొంతమంది వ్యక్తులు, కవులు, రచయితలు కలిసి ఒకేరకమైన సామాజిక దృక్పథాన్ని కలిగి దాన్ని ప్రచారం చేయడానికి ఒకే తాత్వికతతో కలసి రచనలు చేయడం కనిపిస్తుంది. వీటినే ఇంగ్లీషులో జనరేషన్స్ అని అంటారు. వీరు స్వల్ప కాల పరిధిలో వుంటారు. తరువాతి తరాల్లో వీరిని అనుసరించే వాళ్ళు తక్కువగానే వుంటారు. కాకపోతే వారు రాసినంత కాలం వారిపై అందరి దృష్టి వుంటుంది. ఉదాహరణకు అమెరికాలో 1940, 1950ల కాలంలో అప్పటి అమెరికాలోని ప్రధాన స్రవంతి జీవన విధానాన్ని వ్యతిరేకిస్తూ, ఒక తిరుగుబాటుగా వచ్చిన దీమ్ర్రాశీవెం (బీట్నిక్కులు), అలాగే బ్రిటన్లో 1950ల్లోనే మధ్యతరగతి, శ్రామిక వర్గాల నుండి బ్రిటీషు సమాజ పోకడల్ని వ్యతిరేకిస్తూ వచ్చిన 'యాంగీ యంగ్ మాన్', అలాగే అమెరికా నుండి వచ్చిన గ్రే జనరేషన్, మన దేశంలో బెంగాల్ సాహిత్య ప్రపంచంలో వచ్చిన ఆకలితరం, హిందీ సాహిత్యంలో వచ్చిన 'అకవిత' వంటి తిరుగుబాటు చేసిన కవిత్వ రకాలు - వీటిని ఉద్యమాలుగా కంటే జనరేషన్స్‌గా నిర్వచించడం సరిపోతుంది. ఇవన్నీ కూడా తత్కాల సామాజిక, సాహిత్య పరిస్థితులపై తిరుగుబాటుగా వచ్చినవి. తరువాత వీటి సైద్ధాంతిక వివేచన చేసినా ఉ ద్యమస్థాయి వీటికి ఇవ్వలేం. తెలుగునేలపై ఇలాంటి కవిత్వం దిగంబర కవిత్వంగా వచ్చింది. నిజానికి ఈ దిగంబర కవిత్వాన్ని ఒక కవిత్వోద్యమంగా విశ్లేషించిన విమర్శకులు వున్నారు. ఈ విషయంలో తీవ్రమైన చర్చ కూడా జరిగింది. కానీ స్వయంగా దిగంబర కవులు తమని తాము దిగంబరతరం అని వారే చెప్పుకోవడం జరిగింది. వరవరరావు, లోచన్, అశోక్‌లు కూడా తిరుగుబాటు కవులుగా చెప్పుకున్నారు. అదీగాక తరాలుగా విభజించదగ్గ ఈ కవిత్వాలన్నింటికీ ఉన్న ఏకసూత్రత తిరుగుబాటు అంతకు ముందున్న లేదా అప్పటికీ స్థిరంగా వున్న ఏదైనా నిస్తేజ ధోరణి తత్వానికి వ్యతిరేకంగా ఈ కవిత్వం వచ్చింది. ఈ లక్షణం అమెరికా, బ్రిటీష్ దేశాలతో పాటు భారతదేశంలో కూడా ఆయా సందర్భంలోనే కనిపిస్తుంది.

కవిత్వ సమూహాలు (School of Thought) :

తిరుగుబాటు అనే లక్షణం లేకుండా ఒక మార్పు కోసం ఒక ప్రత్యేక అభివ్యక్తి కోసం సంఘాలుగా, గ్రూపులుగా ఏర్పడి కవిత్వ రచనలు చేసినవారు మరికొందరు వున్నారు. ఇలాంటి సమూహాల్లో ఎవరి కవిత్వ అభివ్యక్తి వారికి ఉంటూనే వారందరూ కలసి ఒక రకమైన భావాల దొంతరని సామూహికంగా మోస్తూ వుంటారు. వీటికి కూడా సైద్ధాంతిక నేపథ్యం వుండదు. తమ కవిత్వం దేని గురించి అన్న విషయం వారు చెప్పుకుంటేనే తెలుస్తుంది. లేకపోతే వారిది ఇలాంటి కవిత్వం అని నిర్దిష్టంగా విడదీసి చూడలేం. ఆ సమూహ ప్రతినిధిగా వారు చెప్పుకోకపోతే వారి కవిత్వం కూడా మిగిలిన కవుల కవిత్వంలాగా ఏదో ఒక ధోరణికో, ఉద్యమానికో, వాదానికో దగ్గరగా వుంటుంది. వారి రచనలు ఏదో ఒక సందర్భంలో లేదా ప్రత్యేకించైనా అంతస్సూత్రంగా లాక్కెళుతూ వుంటాయి. ఇలాంటి సమూహాలు మన తెలుగు కవిత్వంలో కొన్ని కనిపిస్తాయి. పైన పేజీల్లో చెప్పినట్లుగా ఎలాంటి తాత్విక ప్రాతిపదిక ఇదమిద్ధగా లేని నవ్య సంప్రదాయ కవిత్వం, అనుభూతి వాద కవిత్వం కూడా ఇలాంటి సమూహాలుగానే భావిం చొచ్చు. ఇవేకాక చేతనావర్తకవులు, నయాగరా కవులు వంటివారు కూడా ఈ సమూహాలలో వుంటారు.

ఉపసంహారం :

పైన పేర్కొన్న రకరకాల కవిత్వాలన్నీ ఇలాగే పిలువ బడుతున్నాయని కచ్చితంగా చెప్పలేం. తెలుగు కవిత్వ చరిత్ర రాసినవారు, రాస్తున్నవారు ఎంతోమంది వీటిని రకరకాల పేర్లతో పిలవడం కనిపిస్తుంది. అనుభూతి వాదంగానూ, అనుభూతివాద ధోరణిగానూ, స్త్రీవాదం, దళితవాదమన్నీ, స్త్రీవాదోద్యమ కవిత్వమని, దళిత వాదోద్యమ కవిత్వం అనీ, ప్రతీకవాదం, భావచిత్రవాదం, అధివాస్తవిక వాదం, వాస్తవిక వాదం వంటివాటిని ధోరణులుగా నిర్వచించి లక్షణాలు చెప్పడం కనిపిస్తుంది.

అయితే వాదాలు, ధోరణులు, తరాలు వంటి వాటికి మధ్య బేధం చాలా చిన్నగా వుంటుంది. దీనివల్ల అతివ్యాప్తి దోషం (Overplanning) ఎక్కువగా కనిపిస్తుంది. కాని తెలుగు కవిత్వ విమర్శకులుగానీ, పరిశోధకులుగానీ దేన్ని ఉద్యమం అనాలి, దేన్ని వాదం, దోరణి, తరం, శకం, బృందం, సమూహం అని పిలవాలనేది శాస్త్రీయంగా విశ్లేషించాలి. దీని కోసం ప్రపంచ సాహిత్యాలు, సాహిత్య పరిశోధనల సహకారం తీసుకోవాలి. ఇలా వివేచించనంత కాలం కవిత్వాల విభజన, పరిధుల విశ్లేషణ రకరకాలుగా ఉండే అవకాశం వుంది.

పనికొచ్చిన పుస్తకాలు :

1. అరుణ కుమారి జి, ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాదం విభిన్న ధోరణులు, ఈస్ట్ వెస్ట్ రీసెర్చ్ సెంటర్, హైదరాబాద్, 1989
2. చంద్రశేఖరరెడ్డి రాచపాళెం, ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు - సందర్భాలు, ప్రథమ ముద్రణ, విశాలాంధ్ర, అనంతపురం, 2002
3. చంద్రశేఖరరెడ్డి రాచపాళెం - ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు - అభిరుచులు, ప్రథమ ముద్రణ,తెలుగు అకాడమి, హైదరాబాద్, 1992
4. నారాయణరావు వెల్చేరు, తెలుగులో కవితా విప్లవాల స్వరూపం, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్, 1987
5. నారాయణరెడ్డి సి. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు : ప్రయోగాలు, ఆరవ ముద్రణ, విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాద్, 2007
6. నిఖిలేశ్వర్, ప్రపంచ సాహిత్యంలో తిరుగుబాటు ఉద్యమాలు, ప్రథమ ముద్రణ, విశాలాంధ్ర, హైదరాబాద్, 1995
7. రంగనాథాచార్యులు కె.కె. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, ద్వితీయ ముద్రణ, నవోదయ, హైదరాబాద్, 2005
8. రంగనాథాచార్యులు కె.కె. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు (వ్యాసం), తెలుగు సాహిత్యం చారిత్రక భూమిక, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఉనికి కోల్పోతున్న ఉపకులాలు – క్షీణిస్తున్న ప్రదర్శనకళా సాహిత్యం

– డా॥. కొత్తిరెడ్డి మల్లారెడ్డి , అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, కరీంనగర్, తెలంగాణ.

తెలంగాణ సామాజిక వ్యవస్థలో నంన్కృతి సంప్రదాయాలు, సామాజిక విలువల పరిరక్షణకు ఉప కులాలు పాటుపడుతున్నాయి. ఉప కులాల వారు వారికి సంబంధించిన వారి కులం గొప్పదనాన్ని, వారి వాడుక భాషను, వారి జీవన శైలిని ప్రదర్శిస్తూ ఉంటారు. ఉప కులాలవారు వైవిద్యభరిత జీవితాన్ని కొనసాగిస్తూ సామాజిక విలువలను పోషిస్తున్నారు. వారు వారి ప్రదర్శన కళల ద్వారా జీవనం గడుపుతున్నారు. వీరు వీరి ఆశ్రిత కులాల జీవన విధానాన్ని, పూర్వీకుల చరిత్రను, కుల పురాణాలను కథల రూపంలో ప్రదర్శిస్తూ సంస్కృతి సంప్రదాయాల ప్రసరణకు, పరిరక్షణకు ఎంతో కృషి చేస్తున్నారు. ఈ కుల వృత్తుల కళాప్రదర్శన ద్వారా వీరికి జీవనభృతి ఏర్పడుతుంది. వీరి ప్రత్యేకతలు సమాజంలో గుర్తింపు పొందేందుకు దోహద పడుతున్నాయి. ప్రదర్శన కళలు ఉపకులాల వారికి బ్రతుకుదెరువు కోసమే కాకుండా సామాజిక రుగ్మతలు గుర్తించి, వాటి నిర్మూలనా మార్గాలను ప్రచారం చేయడంలో కూడా తోడ్పడు తున్నాయి. ఈ విధంగా ఎంతో మంది కళాకారులు తరతరాలుగా సామాజిక సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తూ, కళలు పోషిస్తూ, ప్రదర్శిస్తూ కాలక్షేపానికి మూలకారణమవుతూ సామాజిక అభివృద్ధికి తోడ్పడు తున్నారు.

వారి పురాణ గాథలను పరిరక్షించడం ద్వారా వారి వంశ చరిత్రను తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడు తుంది. కాలక్షేపంతో పాటు జ్ఞాన సముపార్జనకు కూడా ఈ కళలు తోడ్పడుతున్నాయి. ఈ కళా ప్రదర్శనలో ముఖ్యంగా యక్షగానం, చిందు, గౌడ పురాణం కథలు, పూజారి కథలు, దూలపట్టి కథలు, పెద్దపులి వేషాలు, పోతరాజు వేషాలు, బైండ్ల కథలు, రాజన్నలోళ్ళు, పిట్టల దొర, కాటిపాపలవారు, హరిదాసులు, గంగిరెద్దులవారు, చెక్కబొమ్మలాట, పగటి వేషాలు, తోలుబొమ్మలాటలు, భాగవతులు, వీధి నాటకాలు, పంబాలవారు, పెద్దమ్మ లోళ్ళు మొదలైన అనేక పేర్లతో వారికి సంబంధించిన కులాల యాచకులుగా ప్రదర్శకులుగా జీవనాన్ని సాగిస్తూ సమాజంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

ప్రధానంగా గ్రామాల్లోని ప్రజలు అలసిపోయిన సమయంలో వారి సేద తీర్చడంలో ఈ కళలు తోడ్పడు తున్నాయి. ముఖ్యంగా ఈ కళలు ప్రదర్శించేవారు హరిజనులు, గిరిజనులు, చేతివృత్తులవారు. సాంకేతికాభివృద్ధి, సామాజిక మాధ్యమాల విస్తృతి నేపద్యంలో నేటి సమాజంలో వీరి ప్రదర్శన కళలు క్రమంగా వెనకబడి పోతూన్నప్పటికీ వాటి ప్రాధాన్యత వాటిదేనని చెప్పవచ్చు. సామాజిక సమతుల్యత దెబ్బతినడం, వ్యవసాయ సంక్షోభం, ప్రపంచీకరణ లాంటి అనేక కారణాల వల్ల నేడు కళలకు ఆదరణ తగ్గిపోతోంది. వివిధ సామాజిక మాధ్యమాలు ప్రచారంలోకి రావడం వల్ల ఈ కళా రూపాల ప్రదర్శన క్రమంగా తగ్గిపోతుంది. వీటికి ఆదరణ తగ్గడం వల్ల వారిలో చాలామంది కూలీలుగా మారిపోయారు. వారి ప్రదర్శన వాయిద్యాలను మూలన పడేసారు. ఈ కళారూపాల ప్రాధాన్యం తగ్గడంతో వారు పనుల కోసం వలస వెళ్తున్నారు. ఇది తెలంగాణలోని వలసలకు ప్రధాన కారణమని చెప్పవచ్చు.

కళాకారులు జీవనాన్ని కొనసాగించడానికి గల్ఫ్ దేశాలకు కూలీలుగా వలస వెళ్ళి అక్కడ అనేక ఇబ్బం దులకు గురవుతున్నారు. వీరముష్టి కళాకారులు, సాధనాసురులు, గంగిరెద్దులవారు, బుడగజంగాలు మొదలైన కళాకారులు తమకు ఆదరణ తగ్గడంతో వారు

యాచకులుగా మారిపోయారు. ఇలా చాలా మంది కళాకారులు ప్రతిభ ఉండి కూడా వలస కూలీలుగా, యాచకులుగా మారుతున్నారు. తెలంగాణలోని ఉపకులాల ప్రదర్శన కళలు చూసినట్లయితే ప్రధానంగా ఈ క్రింది వారు కనిపిస్తారు. గంగిరెద్దులాట, గంగిరెద్దుల వారు వీరు కోడెలకు చిన్నప్పటినుంచే మెలుకువలు నేర్పించి వాటిని రంగురంగుల వస్త్రాలతో అలంకరించి గ్రామాల్లో వీధి వీధి తిరుగుతూ ప్రదర్శనలు నిర్వహిస్తారు. వీరు ముఖ్యంగా రైతులపై ఆధారపడి ప్రతియేట సంక్రాంతికి గ్రామాలు సందర్శిస్తారు. వీరు చేసే సాహస కృత్యాలు ఎదుటివారిని ఆకట్టుకుంటాయి. వీరు తమ గంగిరెద్దును కుటుంబ సభ్యులుగా గౌరవిస్తారు. ఈ విధంగా మూగ జీవులను తమ కుటుంబంలో ఒక సభ్యుడిగా చూడడం సహనం, అహింసకు, ప్రకృతి పరిరక్షణకు నిదర్శనం. ఒగ్గు కళాకారులు ప్రతి సంవత్సరం సత్తి ఏడు వారాల్లో ఈ కళను ప్రదర్శించేవారు. గొల్ల కురుమలకు మల్లన్నస్వామి కులదైవం. ఈ సమయాల్లో దేవుడికి పట్నాలు వేసి ఒగ్గుకథలు ప్రదర్శిస్తారు. అంతే కాకుండా ఏవైనా ప్రత్యేక సందర్భాల్లోనూ ఒగ్గు కళా కారులు ఒగ్గు కథలు ప్రచారం చేస్తారు. తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమైన ఒగ్గు కథ ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. అనేక జానపద కథలు వీరిద్వారా నేటికీ ప్రచారంలో ఉన్నాయి. కథలు చెపుతూ, హావభావాలతో నవరసాల్ని పండిస్తూ తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. అనేక చారిత్రక కథలు ప్రదర్శించడం వీరి ప్రత్యేకత. కాటమరాజుకథ, పెద్దిరాజు, బీరప్ప, ఐదు మల్లెపూల కథ, బల్మూరి కొండలరాయని కథ లాంటి ఎన్నో కథలు వీరు ప్రదర్శిస్తూ సాహిత్య చరిత్ర, సాహిత్యం లోని వీరపురుషుల గాథలను తరువాతి తరాలకు అందిస్తున్నారు. నేటి సమాజంలో రాజకీయ ప్రచారం కోసం కూడా ఈ ఒగ్గుకళా నైపుణ్యాన్ని వాడుకుంటున్నారు. సమాజంలోని రుగ్మతలు పోగొట్టడానికి, ప్రజల్లో అజ్ఞానాన్ని తొలగించడానికి గ్రామ గ్రామాలలో తిరిగి ఒగ్గుకథ ద్వారా ప్రదర్శనలు చేపడుతూ ఉన్నారు.

జంగములు వీరు తెలంగాణ ప్రాంతంలో దైవ సంబంధ కథలు చెప్పే ప్రధాన అర్చకులు. వీరికే బుడగ జంగములని, బేడ జంగములని పేరు. బుడిగే అనేది వీరు వాయించే వాయిద్యం పేరు. జంగములు శైవారాధ కులు. వీరు చెప్పే కథలను జంగం కథలని అంటారు. దేశింగురాజు కథ, భళ్ళాలజంగం కథ, దేవయానిజంగం కథ, అంబరీషాఖ్యానజంగం కథ, మొదలగు కథలను వీరు చెబుతారు. వీరు చెప్పే కథల్లో బాలనాగమ్మ, మైనావతి, చంద్రమతి, కావమ్మ, ఎరుకలనాంచారి, నలచక్రవర్తి, బలిచక్రవర్తి, దమయంతి, సారంగధర కథలు ప్రధానమైనవి. గొల్లసుద్దులు, గొల్ల ప్రదర్శన కళారూపం. గొల్లసుద్దులంటే గొల్లలుచెప్పే సుద్దలు, సుద్దులు అంటే సంగతులు లేదా మంచి మాటలు. గొల్లసుద్దుల రూపం రానురాను ఎన్నెన్నో మార్పులకు గురైంది. సామాజిక చైతన్యం కలిగించడం, గ్రామాల్లో విషయాలను తెలియ జేయడం, ప్రక ృతి వర్ణన, మానవ సంబంధాల ప్రాధాన్యత, విలువలు తెలిపే సుద్దులను వీరు గేయాల రూపంలో తెలియజేస్తారు.

శారదకాండ్రు, నిజానికి బుర్రకథ వాయిద్యాలకు శారద కథకుల వాయిద్యానికి వ్యత్యాసమేమి కనిపించదు. బుర్రకథలో మాదిరి వీరు డక్కీలు వాయిస్తారు. వీరు ఉపయోగించే తుంబూరనే శారద అంటారు. అందువల్ల వీరికి ''శారద కాండ్రు'' అనే పేరు వచ్చింది. వీరికి చిన్నమ్మ మొదలైన కరుణరస పూరితమైన కథలతోపాటు 18వ శతాబ్దంలో తెలంగాణ ప్రాంతాన్ని దద్దరిల్లజేసిన సర్వాయి పాపన్న కథను, కొండల్రాయుని కథను, గద్వాల సోమనాద్రి కథను, చరిత్రకమైన కతలైన బొబ్బిలి పల్నాటి యుద్ధానికి సంబంధించిన వీరరస గాథల్ని చెపుతారు. బుర్రకథ, బుర్రకథ పల్లె పదాలు, వంత హాస్యాల, బిగువైన కథనాలు, పద్యాలు, పాటలు అన్నింటిని కలుపుకుంటూ సరదా సరదాగా సాగిపోయే ఒక జానపద కళారూపం. పరిమితమైన ఆహార్యంతో, ఆడుతూ పాడుతూ హాస్యోక్తులు పలుకుతూ జనసామాన్యానికి చేరువగా వెళ్లే

కళారూపాలలో హరికథ మొదటిది కాగా, బుర్రకథ రెండవది. బుర్రకథ పూర్తిగా జానపద కళారూపం. తెలుగునాట జానపద వినోదంగాను ప్రక్రియలలో ప్రబోధానికి, ప్రచారానికి సాధనంగా ఈనాటికీ విస్తృతంగా ఉపయోగపడే కళారూపం బుర్రకథ. ఈ ప్రక్రియ ప్రచార సాధనంగా ఎంతగానో ఉపకరిస్తుంది. కుటుంబ నియంత్రణ, రాజకీయ ప్రచారము, ప్రజలను విజ్ఞానవంతులను చేయడము వంటి కార్యక్రమాలలో ఇది బాగా వాడబడింది.

బబ్బిలోల్లు, బబ్బిలోల్లు నేతకాని కులస్థులపై ఆధారపడి జీవించే ఉపకులం. వీరు నేతకాని కులం ఆరాధ్య దైవమైన పెద్దావరను కొలుస్తారు. పెద్దావరను కొలవడం, నాటకాల ప్రదర్శన వీరి ముఖ్య కళారూపం. కంజం ఉపయోగించి నీలమణి, నేలవాని, నెరజాణ సొగసు నేనేట్ల వదలు, అంటూ చక్కని గీతాలాపన చేస్తూ నాటకాలను ప్రదర్శిస్తారు. నేతకాని కులస్థులు వీరిని దైవారాధకులుగా భావించి ఎంతో గౌరవించి కట్న కానుకలను సమర్పిస్తారు. దావతులు (దావతోల్లు), పోతురాజు విన్యాసాలు, దావతులు పోచమ్మ ఉత్సవాలు జరపడంలో ముఖ్య పాత్ర వహిస్తారు. వీరు గావుపట్టడం(బలిపశువుని నోటితో కొరకడం) ఊరుబాగోగులకు ఊరంపడం, దించిపోయడం లాంటివిచేస్తారు. పోతురాజు భయానక నృత్యాలను వీరు ప్రదర్శిస్తారు. వీరికి మంత్ర విద్యలు తెలుసని, సక్రమంగా దానం ఇవ్వకపోతే కన్నెర్రజేస్తారని నేటికి కొన్ని గ్రామాల్లో వీరికి బయపడేవారు చాలా మంది ఉన్నారు. సాదనాశూరులు, సాదనాశూరులు చేనేత కులాలపై ఆధారపడి జీవనం సాగించే ఉపకులం. వీరు ఇంద్రజాల విద్యలను ప్రదర్శిస్తారు. పాములాట, చేకుముకి రాయితో నిప్పులు రాజేసుడు, దుత్తలుకొట్టడం మొదలైన విద్యలు ప్రదర్శిస్తారు. వీరిలో కొందరు మార్కండేయ పురాణంలోని కథలను చెప్తూ ఉంటారు. నేడు సాధనాశూరులు చాలా మంది తమ వృత్తి కళలకు ఆదరణ తగ్గిపోవడం, గ్రామాల్లో పారిశ్రామికీకరణ కారణాల వలన వీరు తమ జీవికను కోల్పోయారు. వీరి చాకచక్యమైన ఇంద్రజాల విద్య ఎంతోనైపుణ్యంతో కూడినది. వీరముష్టికారులు, వీరముష్టి, వీరబాట, భద్రపాద మున్నగు పేర్లన్నియు వీరికి ఉన్నాయి. ముష్టి అనగా పిడికిలి. వీరులని యోధులని వీర భిక్షకులనియు వీరముష్టికి అర్థం. వీరు కోమట్లను, జంగములను యాచించి జీవిస్తారు. వీరి వాయిద్యం జేగంట లేదా తప్పెట. దీన్ని వాయిస్తూ వీరశైవానికి సంబంధించిన గేయములను, భక్తి కథలను పాడుచు భిక్షమెత్తుతు జీవిస్తారు. కోమట్ల ఆరాధ్య దైవమైన కన్యకాపరమేశ్వరికి సహాయం చేసినందున వీరముష్టలను కోమట్లు ఆధరిస్తున్నారని తెలియుచున్నది.

మందెచ్చుకళాకారులు, మందగొల్లలు. మంద అంటే గొర్రెల గుంపు. వీటి గురించి దేవతలను ప్రార్థించే వారు కనుక "మందేచ్చు" అని పేరు వచ్చింది. వీళ్ళ దీవెనల వలన తమ మంద పెరిగిపోతుందనే నమ్మకం గొల్ల కులస్థుల్లో ఉంటుంది. వీరు యాదవ కులానికి చెందిన వారు. వీరు గొర్రెలను మేపుకొని జీవించే ఎర్రగొల్లలు, కురుమ, ముట్టి, పాకనాటి గొల్లలపై ఆదారపడి జీవించే ప్రదర్శన కళాకారులు. వీరు గొర్రెల మందలు బాగుండాలని వాటి సంరక్షణ చేయడానికి ఎంతటి ధైర్య సాహసాలైన ప్రదర్శించాలనే ప్రేరణతో కథలను బొమ్మల సహితంగా ప్రదర్శిస్తుంటారు. ముఖ్యంగా పెద్ది రాజు, కాటమరాజు కథలను చెపుతారు. వీరు గంగమ్మతల్లి, కాటమరాజు, సింహాద్రిరాజు, పెద్దిరాజు, పాలరాజు, ఈలగౌరమ్మ బొమ్మలను ప్రదర్శిస్తారు. పిచ్చుకగుంట్లు వీరు పాల్కురికి సోమనాథుని కాలంనాటికి కూడా ఈ జాతి ఉన్నట్లు పండితారాధ్య చరిత్ర వలన తెలుస్తుంది. మాకు వీవంగా చేతులు లేవయ్యా, నడిచిపోవంగా కాళ్లులేవయ్యా, అంధకులమయ్య పిచ్చుక గుంటల మయ్యా అని వీరి మాటలను బట్టి వీరు వికలాంగులని తెలియుచున్నది. వీరు ప్రధానంగా కాపులను యాచించి జీవిస్తారు. వీరు చెప్పే కథల్లో ప్రధానమైనవి శ్రీనాథుని

పల్నాటి వీరచరిత్రలో కనిపిస్తాయి. వీరి కథల్లో శృంగార, కరుణ, వీర రాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. భవనీలు, వీరికి బైండ్ల వారని పేరు కూడా ఉంది. తెలంగాణలో గ్రామదేవతల కొలువులు కొలుచుటకు, గత్తర స్పోటకము వంటి రోగములు కుదిర్చెడు మాంత్రికులుగా బవనీలు ప్రసిద్ధి. మాలవారి ఇండ్లలో కొలువులు కొలుచుట, వండుగ దినములందు, శుభకార్యములందు పూజాదికములు నెరపుట కూడా వీర పని. పటాల్లోల్లు, వీరు రజకుల లేదా చాకలి కులము పై ఆధారపడి జీవనం సాగించే ఉప కులం. వీరు చాకలి కులస్తుల ఆరాధ్యదైవమైన మడేలేశ్వరస్వామి కథలను చెబుతూ యాచనచేస్తూ జీవనంసాగిస్తారు .వీరికి పటాలోల్లు అనే నామం రావడానికి ఆ వివిధ రంగులతో వేసే ముగ్గుల పటం లేదా పట్నం కారణం. ఈ పట్నం వీరు మడేలేశ్వర స్వామి ఆలయాల ముందు వేస్తారు. రజకులు ఈ పటాలను పవిత్రంగా భావించి పటాల వారిని పూజారులుగా భావిస్తారు. రజకులు పటాల వారికి ఆర్థిక సహాయం చేస్తారు. అంతే కాకుండా రజకులు తమకు వచ్చిన ధాన్యం నుండి వీరికి కొంత ఇస్తారు. ఈ విధంగా పటాల వారు తమ జీవనం కొనసాగిస్తున్నారు.

ఇంకా బండారు కళాకారులు, పెరుకల వంది మాదిగత్వం, ఎరకల నాంచారి, ఎరకల నాంచారులు వాక్చాతుర్యం కలిగిన మాటలను పూరిస్తూ ఎదుటి వారికి ఆనందం కలిగేలా వారి జీవితాన్ని గురించి చెపుతుంటే ఎందరో సోది చెప్పించుకోడానికి ఆసక్తి చూపేవారు. మనస్సు గాబరా పడ్డదే తల్లి అయినా తెరువుందే తల్లి అంటూ, ఇతరుల మనసులలోని భావాలను అర్థం చేసుకొని భావాలకనుగుణంగా మాట్లాడే ఎరకల నాంచారుల ఛాయ గ్రామాల్లో మచ్చుకైనా కనిపించడం లేదు. కుంచెరుకల ఎరుకల వారిపై ఆధార పడి కుంచెతో అడుక్కోవడం, పందుల సంవర్ధనం వీరి ప్రధాన వృత్తి. వీరు సంచార తెగ, అడవుల్లో తిరుగుతారు. వీరు ఎరుకల కులస్తుల ఆధారంగా జీవించేవారు. కుంచెరుకల వారు చేతుల్లో కుంచెలు పట్టుకొని ఎరుకలు భాషలో సంభాషిస్తూ చిన్న చిన్న గేయాలను వల్లెవేస్తూ యాచన చేస్తారు. నేడు కుంచెరుకలు ఎక్కడ కనిపింకడం లేదు. ఫకీర్లు, వీరు ముస్లిం తెగలలో ఒకటైన సూఫీ తెగకు చెందిన వారు. వీరిని హిందువుల్లో సన్యాసితో పోల్చవచ్చు. ఫకీర్లు బాబా చిత్ర పటాన్ని పట్టుకొని చేతిలో గుగ్గిలం పొగ వేసిన కుండతో, నెమలీకల కట్ట పట్టుకొని అల్లాని, విశ్వాన్ని కీర్తిస్తూ ఊరూరా తిరిగి యాచన చేస్తారు. ఫకీర్లు ముస్లింలు అయినప్పటికి వీరు హిందువుల ఇళ్లలోనే ఎక్కువ యాచన చేస్తారు. వీరు మాట్లాడే తీరులో వేదాంత ధోరణి చూపరులను ఆకట్టుకుంటుంది. తెలంగాణలో ప్రపంచానికి తెలియని ఇటువంటి ఎన్నో కళలు మరెంతో మంది కళాకారులుఉన్నారు.

తెలంగాణలో కులాలు, ఉప కులాల మధ్య సాంస్కృతిక బదిలీకి, ఆర్థిక బదిలీకి ఈ కళలు వారధిగా పని చేస్తున్నాయి. అయితే సాంకేతిక విప్లవం, సామాజిక మాధ్యమాలు ఈ కళలు ఆదరణ కోల్పోడానికి కారణం అవుతున్నాయి. అంతేకాకుండా ఈ కళలు, కళాకారుల గురించి తెలియజేసే సరైన సాహిత్యం లేక ప్రాచీన కళలు, కళాకారుల నైపుణ్యాలు మరుగున పడుతున్నాయి. పనులు చేసి అలసిన తెలంగాణ జనులు నాడు ఎన్నో కళలను ప్రోత్సహించి కళాకారులను ఆదరించి తమ విరామ కాలాన్ని సద్వినియోగం చేసుకునేవారు. నేడు ఈ కళల, కళాకారుల స్థానాన్ని దూరదర్శన్, అంతర్జాలం, సామాజిక మాధ్యమం ఆక్రమించాయి. శారీరక శ్రమ, మానసిక ఉల్లాసంతో కూడిన కళలు, కళాకారుల నైపుణ్యాలను గుర్తించాల్సిన, ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. తెలంగాణలోని వివిధ కులాలు, ఉపకులాల వారు ప్రదర్శించే కళారూపాలు మన చరిత్రను తెలియజేసేవి. చారిత్రక ప్రాముఖ్యతను చాటిచెప్పేవి, చాలావరకు వివిధ కులాల పుట్టుపూర్వోత్తరాలు, కులాల ఆవిర్భావం, ఆరాధ్య దైవాలకు సంభందించిన కళారూపాలే ఎక్కువ. ఈ కళల్లో చారిత్రక విషాదగాథలు, జాతీయ ఐక్యతను

చాటి చెప్పేవి, చారిత్రక ప్రదేశాలను తెలిపేవి, కులాలకు గల ప్రాచీనతను తెలిపేవి.

ఈ కళారూపాలు ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులను, స్త్రీల పరిస్థితులను, మానవ సంబంధాలను భక్తి తత్వాన్ని సామాజిక రుగ్మతలను తెలియజేసేవి. ఆయకాలాల్లో వస్తున్న సమూల మార్పులను తెలుపేవి. తెలంగాణలోని కళలు ఆర్థిక ప్రాముఖ్యం కలిగినవి. ఈ కళారూపాల ప్రదర్శన ద్వారా ద్రవ్యం బదిలీతో పాటు వివిధ సామాజిక వర్గాల మధ్య ఆర్థిక సమానత్వానికి దోహదపడేవి. గ్రామాల్లో ఉన్నత కులాలవారు వారి ఆర్థికస్థితిని ఈ కళారూపాలను ప్రదర్శించే వెనుకబడిన బలహీన వర్గాల వారితో పంచుకుంటారు. ఈ విధంగా ఆర్థిక సమానత్వం సాధిచడంలో, దారిద్ర్యాన్ని తొల గించడంలో ఈ కళారూపాలు దోహదపడుతున్నాయి. ఈ కళారూపాలకు ప్రాధాన్యం తగ్గిపోవడం, కళాకారుల జీవనవిధానాన్ని వారి ఆర్థికవనరులను దెబ్బతీస్తుంది. ఈ కళలను ప్రదర్శించే కళాకారులు పనిలేక గల్ఫ్ వంటి దేశాలకు వెళ్ళి దుర్భరమైన జీవితం గడుపుతున్నారు. పనితెలిసి పనిలేని శ్రామిక శక్తిగా మారుతున్నారు.

ఈ కళారూపాలను ప్రదర్శించడానికి ఉపయోగించే వాయిద్యాలు, రంగులు, ఆహార్యాలు (వేషధారణ) మొదలైన వాటిని ఆధారం చేసుకొని ఎన్నో కుటీర పరిశ్రమలు నడుస్తున్నాయి. వీటికి ఆదరణ తగ్గిపోవడం వల్ల ఈ కళారూపాల ఆధార పరిశ్రమలు డీలాపడి పోతున్నాయి. ఈ విధంగా ఆర్థిక ప్రాధాన్యం ఉండి జిడిపి పెరుగుదలకు దోహదం చేసి దారిద్ర్యాన్ని తొలగిం చడంలో, ఆర్థిక సమతౌల్యాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఈ కళారూపాలను కాపాడుకోవలసిన అవసర ముంది. ఈ కళారూపాలలో సామాజిక అంశాలు ఇమిడి ఉంటాయి. సంస్కృతిక సంశ్లేషతకు తోడ్పడుతున్నాయి. మానవ సంబంధాల ప్రాధాన్యత తెలియజేసే అంశాలు జీవులపట్ల చూపించాల్సిన అహింసా విధానం, జంతువు పై ప్రేమ విశ్వమానవ సౌభ్రాతృత్వం, విశ్వశాంతి మొదలైన ఉన్నత ఆదర్శాలు ఈ కళారూపాల ద్వారా ప్రచారం చేయబడుతున్నాయి.

ప్రజల్లో రాజకీయ చైతన్యం ఈ కళారూపాల ద్వారానే వ్యాప్తిలోకి వచ్చింది. కళలు మానవుల మానసికోల్లాసం, విరామ కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి పనుల వలన పొందిన అలనటను తీర్చుకొనుటకు, భావవ్యక్తీకరణకు సృజనాత్మకతను మెరుగుపరుచు కోవడానికి మానవుడు చేసిన గొప్ప సృష్టి. కళలద్వారా రసాస్వాదన, భావవ్యక్తీకరణ సకారాత్మక ఆలోచనల వృద్ధి కలుగుతుంది. కళారూపాల ద్వారా మానవ సంబంధాల ప్రాధాన్యం, కుటుంబ జీవనం, సామూహిక జీవన విధానం, తెగల జీవన విధానం వ్యక్తీకరించబడతాయి.

నేటి సమాజంలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, నీతి నియమాలను వదిలిన విచ్చలవిడి ధోరణి సమాజానికి ఆందోళనకరంగా మారింది. ఇది సమాజంలో నైతిక విలువలు లోపించడం, దిగజారడానికి ముఖ్యకారణం. నైతిక విలువలు ప్రచారం చేయడానికి, మానవులు నీతిగా బ్రతకాల్సిన అవసరాన్ని గుర్తించడానికి ఈ కళారూపాలు సజీవంగా ఉండాల్సిన అవసరం ఉంది. మారుతున్న జీవన శైలితో ప్రతి గ్రామం నేడు అంతర్జాలానికి, అంతర్జాతీయతకి చేరువైంది. చేతిలోనే ప్రపంచాన్ని చూపించే స్మార్ట్ ఫోన్ల యుగంలో కళారూపాల మనుగడ, వాటి ప్రాముఖ్యాన్ని, అవసరాన్ని గుర్తించి, ఆదరించాల్సిన అవసరం ఉంది. పని సౌందర్యాన్ని చాటిచెప్పే కళా రూపాలకు ఆదరణ తగ్గిపోవడం, ప్రజల్లో సౌందర్యాను భూతి, రసానుభూతి, ప్రకృతికి పరవశించే గుణం లోపించడంతో మనుషులు కృత్రిమ యంత్రాలుగా మారుతున్నారు. కళలు ముఖ్యంగా సహానుభూతిని పెంపొందిస్తాయి. ఈ సహానుభూతి లోపించడమే నేడు సమాజంలో పెరుగుతున్న అల్లర్లు, అమానుషాలకు పునాది. కాబట్టి ప్రపంచీకరణ ప్రభావానికతీతంగా ప్రాచీన జానపద కళారూపాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు

1. తెలంగాణ ప్రభుత్వం వారి 8, 9 తరగతుల పాఠ్యపుస్తకాలు
2. నమస్తే తెలంగాణ వార్తా పత్రిక జూన్- 2016 నెలలో వచ్చిన పత్రిక
3. తెలుగు వెలుగు మాస పత్రిక
4. జాగృతి మాస పత్రిక
5. ఆచార్య బిరుదురాజు రామరాజు "తెలుగు జానపద సాహిత్యం"
6. అంతార్జాలం, తెలుగువికీపీడియా నుండి సేకరించిన అంశాలు, (బుర్ర బుడిగ జంగాలు, భవనీలు, ఒగ్గుకళాకారులు మొదలగు వారి గురించి).
7. శ్రీకాంతాచారి, "తెలంగాణా సమాజం సంస్కృతి" పుట 153-157
8. డా. ఏ విద్యా దేవి, ఉత్తర తెలంగాణ కథలు - సమగ్ర పరిశీలన

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కవిత్వమే కాదు.. కథనూ కొత్తకోణంలో చూపిన

దేవరకొండ బాలగంగాధర తిలక్

– డా॥. ఎం. కొరిక్రిష్ణ , ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వ విద్యాలయం, కుప్పం.

సాహిత్యంలో పరిచయమంటూ అక్కర్లేని పేరు "దేవర కొండ బాలగంగాధర తిలక్". తిలక్ అంటే కవిత్వం. కవిత్వం అంటే తిలక్. ఆధునిక కవిత్వానికి మరోపేరు తిలకే. కవిత్వానికి కొలమానం కూడా ఆయన రాసిన కవితలే. అంతటిపేరు సంపాదించారు తిలక్. అయితే తిలక్ కవిత్వం మాత్రమే కాదు అద్భుతమైన కథలూ రచించారు. సహజంగానే భావుకుడూ, అభ్యుదయవాదీ అయిన తిలక్ తనకథలలో మానవజీవితంలోని సంక్లిష్టతను. లోతుపాతులను అత్యద్భుతంగా స్పృశించారు. తిలక్ కథలలో ఎంతో తాత్వికత, జీవిత సత్యాలు ఇమిడి వుంటాయి. ఆయన ప్రతికథా ఒక జీవితం. అది సుఖవంతమై వుండవచ్చు. కష్టంతో కూడుకున్నదై వుండవచ్చు. లేదా కష్టాలను తెచ్చుకున్నది కూడా అయి వుండవచ్చు. ఆ కథలలో వున్న లోతును అర్థం చేసుకోవడం అంత ఆషామాషీ విషయం కాదు. అందుకే "తిలక్ కథా వస్తుసేకరణలో గోర్కీ చూపూ, కథా నిర్వహణలో మొపాసా నేర్పూ, తాత్వికతా విస్తరణలో రసెల్ కూర్పు వుంటాయంటారు" విమర్శకులు.

తిలక్ పశ్చిమగోదావరి జిల్లా తణుకు తాలూకాలోని "మండపాక" గ్రామంలో 1921 ఆగస్టు 1న జన్మించారు. ఆయన మండపాక జమీందారు వంశానికి చెందినవారు. ఆయన తండ్రి సత్యనారాయణకు లోకమాన్య బాల గంగాధర తిలక్ అంటే వల్లమాలిన అభిమానం. అందుకే ఆయన తన కొడుకుకు ఆయన పేరే పెట్టుకున్నాడు. తిలక్ ఇంటర్ వరకూ చదువుకున్నారు. అనంతరం ఆయన తెలుగు, సంస్కృత, ఆంగ్ల సాహిత్యంలో ప్రావీణ్యతను సంపాదించారు. మొదట్లో తిలక్‌పై కృష్ణ శాస్త్రి, శ్రీశ్రీల ప్రభావం కనిపించినా, అనంతరం ఆయన తనకంటూ ఓ ప్రత్యేకశైలిని సృష్టించుకుని కవిత్వానికే మరోపేరుగా నిలిచారు. ఆయన రాసిన కవితల్లో 'అమృతం కురిసిన రాత్రి', 'పోస్టుమెన్' కవితలు ఎంతో పేరుగాంచాయి. "అమృతం కురిసిన రాత్రి" కవితా సంపుటికి 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించాయి.

"నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అని స్వయంగా చెప్పుకున్నారు తిలక్.

"ఏం చెప్పాలి అన్న వస్తుస్పృహను జీవితమంతా పరిచి ఎలాచెప్పాలి అన్న శిల్పస్పృహను కావ్యజీవితమంతా నెరిపిన ఖండకావ్య ప్రక్రియే 'అమృతం కురిసిన రాత్రి' అని" అంటారు ఆచార్య జీవిఎస్.

"భావుకత్వానికి తోడు తన హృదయంలోని అనుభూతిని వ్యక్తం చేయగల శబ్దశక్తీ, అలంకారపుష్టీ, కలిసిరావడంతో తిలక్ ఉత్తమశ్రేణి కవి కాగలిగినాడు" అని ప్రముఖ మార్క్సిస్టు విమర్శకుడు రా.రా. ప్రశంసించారు.

"తన కత్తికి రెండు వైపులా పదునే అని నిరూపించుకున్నాడు తిలక్" అంటారు చీకోలు సుందరయ్య.

"ప్రతి జీవితం ప్రత్యేక జీవితం. ఒకరికీ మరొకరికీ సంబంధం లేదు" అని ఓ కథలో చెప్పారు తిలక్. ఇదే విషయాన్ని ఆయన రాసిన కథలు నిరూపిస్తాయి. ఆయన రాసిన ఏ కథా ఒకేవిధమైన జీవితాన్ని గానీ, పాత్రలను గానీ కనబరచదు. ఆయన కథల్లో కొన్నింటిని ఇక్కడ పరిశీలిద్దాం.

'లిబియా యెడారిలో' అనే కథను జర్మనీ యుద్ధం గురించి 1948లో రాశారు తిలక్. నియంతృత్వమైనా, ప్రజాస్వామ్యమైనా, సామ్యవాదమైనా, పెట్టుబడిదారీ వ్యవస్థయినా.. ఏదైనా సరే నాగరికత పేరుతో చేసే

విధ్వంసాలను సునిశితంగా విమర్శించారు. నాగరికత వికృతపార్శ్వంగా మొదలయ్యే యుద్ధకాంక్ష అన్ని వ్యవస్థలనూ నాశనం చేస్తుందని, దానికి వివక్ష వుండదనీ ఆయన అంటారు.

"నాగరికత మంచంమీద నుంచి సిగ్గులేని నగ్నత్వంతో లేచి ముందుకు చేతులు చాచింది. నలుగురూ ఆమెను నాలుగు వైపులా కౌగలించుకున్నారు." అని విమర్శిస్తారు ఈ కథలో తిలక్. నలుగురూ అన్న పదానికి అర్థం నియంతృత్వం, పెట్టుబడిదారీ వ్యవస్థ, సామ్యవాదం, ప్రజాస్వామ్యం. విధ్వంసంలో ఏ వ్యవస్థా ఒకదానికొకటి తీసిపోదని ఈ కథలో ఆయన విమర్శిస్తారు.

మరో కథ 'కదిలే నీడలు' కూడా యుద్ధకాలం నాటి ప్రజల దారుణ స్థితిగతులను వివరిస్తుంది. యుద్ధం కారణంగా విచ్ఛిన్నమైన కుటుంబాలను, అయినవాళ్లకోసం ఎదురుచూస్తూ శరణార్థి శిబిరంలో జీవచ్ఛవాల్లా జీవితాలను వెళ్లదీస్తున్న వారిని, వారికి చేరువయ్యే, విడిపోయే కొత్త బంధాలను ప్రస్తావిస్తారు తిలక్. "యుద్ధం వచ్చినపుడు స్నేహాలెంత త్వరగా చేసుకుంటామో అంత త్వరగా తెంపుకోవాలి" అంటుందొక పాత్ర. ఈ వాక్యంలో జీవితసారాన్నంతా తెలిపారు తిలక్.

పాకిస్తాన్ వేర్పాటువాద నాయకుడు, పాక్ జాతిపిత మహమ్మదాలీ జిన్నా గురించి తిలక్ 1961లో రాసిన కథ 'అద్దంలో జిన్నా'. భారత్ నుండి పాకిస్తాన్ విడిపోయిన సమయంలో ఇరు ప్రాంతాల్లో జరిగిన హింసాకాండను ఈ కథలో అంతర్లీనంగా ప్రస్తావించారు తిలక్. ఇరు ప్రాంతాల్లోనూ హిందూ ముస్లింలిద్దరూ ఊచకోతకు గురవ్వడానికి జిన్నానే కారణమని ఆయన విమర్శించారు. "తన మనస్సు తన భావాన్ని నిజానికి నమ్మలేదు. తనలో వుండే అధికార వాంఛ ఆ భావాన్ని తయారుచేసి ఇతరుల్ని నమ్మమంది" అంటారు జిన్నా గురించి. జిన్నా తాను నమ్మని సిద్ధాంతాన్ని అధికారం కోసం ప్రజలమీద రుద్దారని ఆయన అంటారు. జిన్నా గుండెలమీద పడిన ఈ రక్తం మరక చెరిగిపోయేది కాదని, అది ఆయనకు తప్ప మరెవరికీ కనిపించేది కూడా కాదని తిలక్ ఈ కథలో అంటారు.

మరో కథ 'హోటెల్లో'... ఆర్థిక ఇబ్బందులు వున్నపుడే సాయం అవసరమని, తీరా పుట్టి మునిగాక ఏమిచ్చినా జీవితాలను తిరిగి తీసుకురాలేమని సమాజానికి హితబోధ చేస్తారు. ఓమోస్తరు హోటల్లో బసచేసిన రచయిత దగ్గరికి వచ్చిన వ్యక్తి తనకు ఐదు రూపాయలు కావాలని, చాలా అవసరమని అడుగుతాడు అది కూడా అప్పుగా. అతనితో పాటు ఓ మహిళ, నలుగురు పురుషులు కూడా వున్నారు. వీరంతా గూడుపుఠాణీ చేసి డబ్బులు దండుకుంటున్నారని భావిస్తాడు రచయిత. అయితే చివరిలో ఆ వ్యక్తి ఆ మహిళను చంపి రచయిత దగ్గరికి వచ్చాడు. తాను తనతో వున్న నలుగురికి ఐదురూపాయలు బాకీ వున్నానని, అది తీర్చకలేకపోవడం వల్ల వారు తన భార్యను వాంఛించారని, తప్పని పరిస్థితుల్లో ఆమె వారికి లొంగిపోవలసి వచ్చిందని అన్నాడు.

ఆమె ఆ పరాభవాన్ని భరించలేక తనను చంపేయాల్సిందిగా ఆమె కోరిందని, చంపేశానని అన్నాడు. తాము సమయానికి డబ్బులు ఇచ్చివుంటే ఆమె బ్రతికి వుండేది కదా అని రచయిత పశ్చాత్తాపపడతాడు. "మనలో మార్పు రావాలండి. రష్యాలో వుండే రచనలూ, ప్రభుత్వం మనకు కావాలి" అంటాడు రచయిత బందరులో కని పించిన మునిమాణిక్యం వారితో.. మన రోజువారీగా సరదాగా పెట్టుకునే ఖర్చు కొందరి ప్రాణావసరం అని సూచిస్తాడాయన ఈ కథలో.. సామ్యవాదం కొంతవరకూ పేదరికపు సమస్యకు పరిష్కారం చూపగలదని తిలక్ భావించినట్లు ఈకథ చదివినవారికి అనిపిస్తుంది. ఈ కథ 1941లో రాశారు ఆయన. అయితే 1948లో 'లిబియా ఎడారిలో' కథ రాసే నాటికి సామ్యవాదం పట్ల ఆయన ఆలోచనల్లో మార్పు వచ్చిందని కూడా మనకు అని పిస్తుంది.

'ఆశాకిరణం' తిలక్ రాసిన కథల్లోకెల్లా మనసును కలచివేసే కథ. ఐదుగురు పిల్లల తండ్రి వెంకటేశ్వర్లు

టీచరు ఉద్యోగం పోగొట్టుకున్నాడు. ఇంటికెళ్లాలంటే భయం. ఆకలితో అల్లాడుతున్న భార్యాబిడ్డలు. చిన్నబిడ్డకు ప్రాణంమీదకు వచ్చింది. చేసేదేమీ లేదు. చేతుల్లో నయాపైసా లేదు. ఇంటికెళితే కష్టాలూ, కన్నీళ్లూ... అపుడపుడూ పెద్దపిల్ల వాళ్లనూ వీళ్లనూ అడిగి బియ్యం తెచ్చి బిడ్డలకు ఒండిపెడుతోంది. ఈ కష్టాలన్నింటినీ భరించలేక, బాధ్యతలనుంచి తప్పించుకోవడానికి ఇంటికెళ్లడం మానుకున్నాడు. చివరికి చచ్చిపోదామని రైలు కట్టమీదకు బయలుదేరాడు. వెనకాల సైకిలు మీద వచ్చిన సూర్యనారాయణ అతనిని ఆపాడు. వెంకటేశ్వర్లు పెద్దకూతురు వ్యభిచారం చేస్తోందని, తండ్రిగా కూతుర్ని అదుపులో పెట్టుకోలేక పోయిన నువ్వు చావడమే మేలని తిట్టిపోశాడు. వెంకటేశ్వర్లు మొహంలో ఆనందం కమ్ముకొచ్చింది. ఇక నేను చావనక్కర్లేదు అనుకున్నాడు. అతని నీరసం హరించుకుపోయి ఉత్సాహం వచ్చింది. ఇంటికి వచ్చి పెద్దకూతురికోసం వెతికాడు ఆమెకు కృతజ్ఞతలు చెప్పడానికి...

''ఇంత ఆనందానికి, సుఖానికి కారణమైన పెద్ద కూతుర్ని తాను అభినందించనేలేదు. దగ్గరగా వెళ్లి అమ్మానే సంతోషిస్తున్నాను అనొద్దూ! తాను కృతఘ్నుడుగా ఎలా వుండగలడు'' అనుకుంటాడు వెంకటేశ్వర్లు. ఇదీ కథ. పేదరికం, ఆకలి, అవసరాలు దేన్నైనా ఆమోదించేలా చేస్తాయని, సమాజం తప్పుగా భావించినా, తోటివారు దుర్భాషలాడినా ఆకలి అన్నింటినీ జయిస్తుందని చెబుతుందీ కథ.

'గడియారపు గుండెలు' కథ మరో రకమైన జీవన విధానాన్ని వివరిస్తుంది. రాఘవయ్య సిరిసంపదలు కలిగిన వాడు. చిత్రకారులను, కవులనూ ఆదరిస్తాడు. లలితను ప్రేమిస్తున్నాడు. అందుకే అతడు ఆ వూరికి అపరభోజుడు అయ్యాడు. అలాంటి రాఘవయ్య తన మిత్రబృందం సలహాతో గోడగడియారాన్ని తెచ్చి తన ఇంట్లో పెట్టుకున్నాడు. గడియారంలో సమయాన్ని అనుసరించడం మొదలెట్టాడు. అప్పుడు అర్థమైంది అతనికి తాను ఎంత సమయం వృధా చేస్తున్నాను అన్న విషయం. సమయం వృధాతో పాటు డబ్బు వృధానూ లెక్కబెట్టుకోవడం మొదలెట్టాడు. రోజురోజుకూ సమయాన్ని, డబ్బును వృధా చేయడాన్ని మానుకున్నాడు. స్నేహితులను, లలితను దూరం చేసుకున్నాడు. డబ్బున్న మ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. గర్భవతి అయిన లలిత నూతిలో పడి చచ్చిపోయింది. అయితే భావుకత్వాన్ని, జీవన చైతన్యాన్ని వదులుకున్న రాఘవయ్య డబ్బులు సంపాదించడంలోనే మునిగిపోయాడు. ఓ రోజు రాఘవయ్య ఇంట్లో పడిన దొంగలు ఏమీ దొరక్క గడియారాన్ని దొంగిలించారు. అయితే అప్పటికే గడియారంలా మారిన రాఘవయ్య జీవనశైలిని ఆ చోరీ ప్రభావితం చెయ్యలేకపోయింది. ఇపుడు దుస్తులతో సహా పూర్తిగా మరో జన్మనెత్తిన రాఘవయ్య మాత్రం మనకు కనిపిస్తాడు.

డబ్బులనూ, సమయాన్ని వృధా చేస్తున్నామన్న వ్యధతో జీవన విధానాన్ని మార్చుకోవడం సరైనదేనా? అన్న ప్రశ్నను ఈ కథ మనకు సంధిస్తుంది.

తిలక్ రాసిన మరో కథ 'ఫలిత కేశం' ప్రసాదరావు అందగాడు. ఊర్లో పేరుగాంచిన వ్యక్తి. ఓ రోజు అద్దంలో చూసుకుంటుండగా అతనికి తన తలలో ఒక తెల్ల వెంట్రుక కనిపించింది. అంతే అంతటి పెద్దమనిషీ కుదేలైపోయాడు. తాను ముసలాడినైపోతున్నాను అని కంగారుపడిపోయాడు. ఏడుపొచ్చేసిందతనికి. అంతలో వచ్చిన భార్యను చూసి అసూయపడ్డాడు. ఆమె తల వెంట్రుకలు నల్లగా నిగనిగలాడుతున్నాయి మరి. ''ఇక నేను ఎక్కువకాలం బ్రతకను నేను ముసలివాణ్ణయిపోతున్నాను'' అన్నాడు ఆమెతో..

ఆ రోజునుంచీ అతని జీవితమే మారిపోయింది. మందులు వేసుకోవడం, డాక్టర్ల చుట్టూ తిరగడం ఇదే పని. తన అసంతృప్తినంతా భార్యమీద విసుగ్గా మార్చి చూపించేవాడు. ఆమె భర్త బాగుకోసం ఉపవాసాలూ, వ్రతాలూ పెంచింది. ఫలితంగా గుండెజబ్బుకు గురైంది.

ఓ రోజు జ్వరంతో పడిపోయింది. చివరికి ప్రాణాలొదిలింది. గోరంతలను కొండతలుగా భావించి తమ జీవితాలను, తమ కుటుంబ సభ్యుల జీవితాలను ఎలా ఛిద్రం చేస్తారనడానికి ఈ కథే పెద్ద ఉదాహరణా చెప్పొచ్చు.

'తీవ్రవాద నాయకుడు' కథలో శేషయ్య నిరుపేద. ఎవరైనా పెడితే తినడం. లేకపోతే తిరగడం అంతే అతని జీవితం... దొంగతనం, మోసం, నిందించడం అతనికి అలవాటే లేదు. శేషయ్యను ఆ వూళ్లో వున్న తీవ్రవాద సంస్థ కార్యదర్శి తిరపతి తమ పార్టీలో చేరమని అడిగాడు. శేషయ్య నిరాకరించాడు. అలాంటి శేషయ్యను ఆయన చిన్ననాటి మిత్రుడు, ధనికుడు అయిన మాధవుడు సుఖపెట్టాలనుకున్నాడు. మాధవుడి తండ్రి బ్రతికున్నంత వరకూ మాధవుడి చేతిలో పైసా డబ్బులు కూడా వుండేవి కావు. అతని తండ్రి చనిపోగానే మాధవుడి చేతికి ఆస్తి మొత్తం అందింది. దీంతో శేషయ్యను పట్నంలోని అతి పెద్దహోటల్‌లో మూడురోజులు రాజభోగాలు అనుభవించేలా చేశాడు మాధవుడు. నాల్గవరోజు బయటికి రాగానే ఎదురొచ్చిన మాధవుడితో "జాగ్రత్త మాధవ్! ఇంతమంది దరిద్రుల్నీ, నిస్సహాయుల్నీ, నీచుల్నీ తయారు చేసిన నిన్నూ, నీలాంటి వాళ్లనీ క్షమించేది లేదు. నువ్వంటే నాకు వైరం. పీకదాకా ద్వేషం. అసహ్యం" అంటూ వెళ్లిపోయాడు. నేరుగా తీవ్రవాద సంస్థ కార్యాలయానికి వెళ్లి అక్కడ సభ్యత్వం తీసుకున్నాడు. తిరపతిని పక్కకు తోసేసి జిల్లాలోనే ఏకైక తీవ్రవాద నాయకుడిగా గుర్తింపు పొందాడు. ధనికుల్ని ద్వేషించడాన్ని మహావ్రతంగా కొనసాగిస్తున్నాడు అంటాడు రచయిత.

తనకు ధనం అంటే తెలియనంత వరకూ శేషయ్య మామూలుగానే ప్రవర్తించాడు. ఓసారి ధనాన్ని, దాని తాలూకూ ఆనందాల్ని అనుభవించిన తర్వాత తాను ఇన్నాళ్లూ కోల్పోయినదేదో, దానికి కారణమేంటో అర్థంఅయింది శేషయ్యకు. అదే అతన్ని సమూలంగా మార్చింది.

ఇలా అత్యద్భుతమైన, మనసును కదిలించే కథలు రాశారు తిలక్. సమాజంలో పాతుకుపోయిన రుగ్మతలన్నింటినీ ఆయన తనకథల్లో ప్రస్తావించారు. గుండె జబ్బు కారణంగా చిన్నవయస్సులోనే 1966 జూన్ 30న కన్నుమూశారాయన తన గుర్తుగా కవిత్వాన్నీ, కథలనూ ఈ సమాజానికి అప్పగించి. అందుకే "గాలి మూగదైపోయింది. పాట బూడిదైపోయింది. వయస్సు సగం తీరకముందే అంతరించిన ప్రజాకవి. వయస్సు సగం చేరకముందే అస్తమించిన ప్రభారవి తిలక్" అని శ్రీశ్రీ వ్యాఖ్యానించారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం – బంజారాలు

– డా॥. మూడే నాగేంద్ర నాయక్, అధ్యాపకులు, తెలుగు విభాగాధిపతి, శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల, కడప.

మానవజాతి పరిణామ క్రమంలో తొలిదశ ఆటవిక జీవనం. నాగరిక జీవనం ఏర్పడక ముందు అడవుల్లో, కొండల్లో సంచరిస్తూ ఉండేవారు. ప్రస్తుతం భారత రాజ్యాంగం గుర్తించిన గిరిజన తెగలలో బంజారా కూడా ఒకటి. అనేక జాతులకు నిలయమైన భారత ఉప ఖండంలో అనేక గిరిజన తెగలు నివసిస్తున్నాయి. గిరిజనులు తమదైన ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయం, సామాజిక విలువలను కలిగి ఉంటారు. గిరిజనులు నివసించే ముఖ్య రాష్ట్రాలు : ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న ఒక ముఖ్యమైన గిరిజన తెగ బంజారా. వారి సంస్కృతిని తెలుసుకోవడమే ఈ వ్యాసం.

మన భారతదేశ చరిత్రలోని ఒక ఘట్టమును నేమరు వేసుకొంటే రాజపుత్ర రాజులే. బంజారాలు, వాగరీ, మార్వాడీలు, సుగాలీలు, లంబాడాలు, ఇలా అనేక రకాలుగా పిలువబడే వీరు జాతి వంశపారవం పరములలోని మార్పులు ఎన్నో జరిగిపోయినవి. ప్రస్తుతం బంజారాలు లదిణి వ్యాపారములు ఎద్దులపై ఎగుమతి, దిగుమతి చేసేవారు. రాజస్థాన్‌కు చెందిన రాజవంశీ యులు. వెయ్యేండ్ల క్రితం మహమ్మదీయుల అరాచ కాలకు బలై దేశంలో నలుదిక్కులకు పోయి సంచార జీవులుగా జీవనం సాగిస్తున్నారు. అదే విధంగా బంజారాలు మంచి దైవభక్తులు కూడ.

నిజాం కాలం కంటే పూర్వం నుండే ఆదిమా గిరిజన లంబాడీలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్నారు. నిజాం పరిపాలన కాలంలో లంబాడీలుగా ఉన్నారు. 1857 సిపాయిల తిరుగుబాటు కంటే ముందు నుండే లంబాడీ గిరిజనులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అడవులలో జీవనం కొనసాగిస్తున్నారు. అనాటి బ్రిటిష్ ప్రభుత్వం వాళ్ళు, వారి యొక్క దేశానికీ వెళ్ళడానికి రవాణాకు రైళ్లు వేయాలని, అడవిలో రైలు పట్టాలు వేయడానికి పనులు ప్రారంభించారు. గిరిజనులలో మూఢనమ్మకాలు ఎక్కువ కాబట్టి అప్పుడు కొంతమంది గిరిజన ప్రజలు బ్రిటిష్ వారిపై తిరగబడ్డారు. మా నివాసాలను మా అడవిని నాశనం చేయడానికి ఎవరో వచ్చారు అని భావించిన లంబాడి గిరిజనులు కొంతమంది బ్రిటిష్ వారిని చంపేశారు. ఈ మూఢనమ్మకాలు ప్రస్తుతం తండాలలో కూడా కనిపిస్తుంది. లంబాడీలు శారీకంగా భారీ మనుసులు. దృఢమైన శరీరం కలిగి ఎత్తుగా ఉంటారు. వారిని చూసిన బ్రిటిష్ ప్రభుత్వం "long bodies" అని పేరు పెటింది. దీని నుండి లంబాడి అనే పేరు వచ్చింది.

భారతదేశం మొదలుకొని ప్రపంచవ్యాప్తంగా గిరి జనులు అమాయకులు. వారి పై ఎవరు దాడి చేసిన మా ప్రజలను, మా సమాజాన్ని నాశనం చేస్తారేమోనని పోరాడుతారు. ఈ సిద్ధాతం లంబాడి తెగ కూడా పాటించింది. ఆలా బ్రిటిష్ వారి నుండీ పారిపోయిన గిరిజనులు అడవులలో సంచార జీవనం కొనసాగించి, సంచార తెగగా లంబాడిలు పిలవపడుతున్నారు. ఒక లంబాడీలు మాత్రమే కాదు, ఏ తెగవారు ఐనాసరే ఆహారం, జీవన మనుగడ కోసం సంచరిస్తూనే ఉంటారు. ప్రస్తుతం తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో తండాలు, గూడాలు నిర్మించుకొని స్థిరనివాసం ఉంటూ వ్యవసాయం చేస్తున్నారు.

లంబాడీల సంస్కృతీ సంప్రదాయాలు, కట్టుబాట్లు ఎంతో గొప్పవైనవి, ప్రత్యేకమైనవి. "లంబాడీ" సుగాలీలు గిరిజనులలో 28వ తెగ. వీరినే లంబాడ, బంజారాలు

అని కూడా అంటారు. హైదరాబాదులోని బంజారా హిల్స్ వీరి పూర్వీకులదేనని ఒక వాదన. వీరి నివాస ప్రాంతాలను తండాలు అంటారు. పూర్వం వరిచేలలో కుప్ప, నూర్పిళ్ళప్పుడు, ధాన్యం కల్లాలు తొక్కించటానికి ఆవుల్ని తోలుకొచ్చేవాళ్ళు. లంబాడీ భాషకు లిపి లేదు. 'సవర భాష' దీనికి కొంచెం దగ్గరగా ఉంటుందంటారు. ప్రస్తుత గిరిజన తెగలలో వీరు ప్రతేక తెగగా కనిపిస్తారు.

లంబాడీలలో పుట్టినప్పటి నుండీ చనిపోయేవరకు సంస్కృతీ సంప్రదాయాలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, జీవనవిధానం, పెళ్లి, చావు, అన్ని ప్రత్యేక మైనవే. వీరు గిరిజనులు కాబట్టి ఇన్ని అంశాలు ఉన్నాయి. ప్రస్తుతం అభివృద్ధి పేరుతో వీరి సంస్కృతి, భాషా కనుమరుగవుతున్నాయి. వీరి సంసృతి సంప్రదాయాలను రక్షించడం అందరి బాధ్యత. తండాలో ఏ కార్యం జరిగినా పెళ్ళి, పుట్టుకలు, చావులు, పండుగలు అయినా సామూహికంగా తండా పెద్దలే జరిపించేవారు. పెళ్ళి అయితే ఆ తండాలో ఉన్న ప్రతి ఒక్కరూ కలిసి పోయేవారు. ఇంటిల్లిపాదీ భోజనం చేసేవారు. ప్రతి మనిషి తంతులో పాల్గొనాల్సిందే. పాటలతో లంబాడీలు తరతరాలుగా ఏడుగురు దేవతలను కొలుస్తారు. వారు మేరమ్మ, త్వళ్జ, సీత్ల, మంత్రల్, హింగ్ల, ధ్వాళ్ ఆంగళ్, కంకాళీ.

వర్షాలు కురవాలి, పంటలు బాగా పండాలి, పెళ్ళికాని అమ్మాయిలకు మంచి కాపురం దొరకాలి. సుఖ సంతోషాలతో అత్తగారి ఇంటికి వెళ్ళాలి, పంటలు పండేవిధంగా పచ్చగా కాపురం ఉండాలని మేరమ్మను కోరుకుంటారు. తీజ్ 9 రోజులు జరుపుకుంటారు. నవధాన్యాలు బుట్టలో వేసి మొలకతీస్తారు. ఏ మొలక బాగా వస్తుందో ఆ పంట వేసుకోవాలని తండాలో పెద్దలు నిర్ణయిస్తారు. శాస్త్రీయంగా విత్తనాలు వేసుకుంటారు. పంటలు పండిస్తారు. పండిన పంట ఇంటికి తీసుకొస్తే నవధాన్యాలు గుమ్మాలు, గాదెలు నిండే విధంగా ఉండాలని, కష్టాలు రాకుండా చూచుకోవాలని పూజిస్తారు. అల్లుళ్లు, బిడ్డలు చుట్టాలంతా రావాలని, కలుసుకోవాలని, కొడుకులకు, కోడళ్లకు పిల్లలు పుట్టాలని కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటారు.

తండాలో ఉన్న పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పశుసంపద పెరగాలని, దూళ్ళకు పాలు సరిపోను ఉండాలని, గడ్డి బాగా దొరకాలని, క్రూరమృగాల బారిన పడకుండా ఉండాలని, అటవీ సంపద తరగకూడదని మొక్కులు తీర్చుకుంటారు. ఇతర ఊర్లలో ఉండే రోగాలు, కష్టాలు, జబ్బులు, గత్తెర లాంటివి తండాల పొలిమేర వరకు రాకూడదని శుభ్రం చేసుకుంటూ పూజిస్తారు. పుట్టే ప్రతి పిల్లతో పాటు తల్లి తండా ఆరోగ్యంగా ఉండాలని పుట్టిన ప్రతి వారు అన్ని విధాల దృఢంగా ఉండాలని తిండి, అలవాట్లు మెరుగుపర్చుకొని బిడ్డను కాపాడాలని మొక్కుకుంటారు. అడవిలో ఉండే పక్షులు, జంతువులు బాగుండాలని వన సంరక్షణలో జంతువులు కాపాడబడాలని పాలపిట్ట, పక్షి రోజు తండాకు కనబడిపోవాలని ఆరాధిస్తారు.

మానవునిపై, ధాన్యాలపై, పశు సంపదలపై ఎటు వంటి శత్రువుల దాడి, కుట్రలు జరగకుండా, దరిచేర కుండా ఉండేందుకు బాధ్యతగా చూసుకోవాలని మొక్కు కుంటారు లంబాడీలు. పెళ్ళి అయిన అమ్మాయిలకు ఒక తులం బంగారం ఒక కిలో వెండి 12 రూపాయి నాణేలతో దండ, కొంకుణాలు, చేతివేళ్ళకు మేరికలు, రైకలు, లంగాల నిండా అద్దాలు, గవ్వలు, తెల్లటి గాజులు చేతినిండా ఉండేవి. పెళ్ళి అయిన అమ్మాయి ఇంట్లోకి వస్తే లక్ష్మి వచ్చింది అనేది అనాడు లంబాడీల విశ్వాసం.

కొత్త పేర్లు, కొత్త రూపాల్లో పండుగలు తండాలలోకి ప్రవేశిస్తున్నాయి. తండా సంస్కృతిని ధ్వంసం చేయడం జరుగుతోంది. ఆర్థికంగా సామాజికంగా వీరిని మరింత ఇబ్బందుల్లో పడేసే విధంగా మూఢనమ్మకాలను నమ్మిస్తున్నారు. ఇదంతా వారి జీవన విధానాన్ని సహ జీవనాన్ని ధ్వసం చేయడమే. గతంలో తండా పెద్దలు కూర్చొని ఏ కార్యం అయినా పండుగ అయినా పెళ్ళి

అయినా పంచాయితీ అయినా సామూహికంగా పరిష్కరించుకునేది. కార్యం పూర్తి చేసేది. ఇప్పుడు అది లేకుండా పోయింది. తండా కట్టుబాట్లు అభివృద్ధి వైపు ఉండేవి. ఇప్పుడు బ్రాహ్మణీయ, పాశ్చాత్య సంస్కృతులు తండా మీద పడుతున్నాయి. దీనితో వారి జీవన విధానం ఒక ప్రశ్నార్థకంగా మారింది. తండాపై ఇతర సంస్కృతులను రుద్దకుండా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

భారతదేశంలోని అనేక తెగలు, ప్రజల వస్త్రధారణలో అలంకరణలో లంబాడీ స్త్రీల వేషధారణనే ఆకర్షణీయంగా, అందంగా ఉంటుంది. ముఖ్యంగా అలంకరించుకొనే ఆభరణాలు ప్రాచీనతను ప్రతీకను సంతరించుకున్నాయి. ఇప్పటికి తెలంగాణ, నల్గొండ జిల్లాలోని అన్ని మండలాలలో లంబాడీల వేషధారణ దుస్తులు అలంకరణలు ఆచరణలో ఉన్నాయి. లంబాడీ పురుషులు వేషధారణలో ప్రత్యేకత ఏమీ లేదు. వారు ఆ కాలంలో ధరించే దుస్తులు మగవాళ్లకు దోతి, ఖాది, అంగీ, తలకు 24 మూరల పెద్ద పెద్ద రుమాలు కట్టేవారు. భుజంమీద కండువా ధరించి చేతిలో చేతి కర్ర ఉండేది. చెవులకు బంగారు పోగులు, చేతికి వెండి కడియాలు ధరించేవారు. ఈ విధంగా నల్లగొండ జిల్లాలో ఇప్పటికీ ఆచరణలోనే ఉందని చెప్పవచ్చు. లంబాడీ స్త్రీల దుస్తులు అందమైన కుట్టుపనులతో ఉంటాయి. అద్దాలు పొదిగించిన కాంచళి (రవిక), కుచ్చుల పేటియా (లంగా), అద్దాలు రూపాయి బిళ్లలతో తయారు చేసిన గుమ్‌టో (ముసుగు)ను ధరిస్తారు. లంబాడీ స్త్రీల ఆభరణాలు అందంగా ఉండటమే కాక బరువుగా కూడా వుంటాయి. వీరు ముక్కుకు భూరియా ముక్కెరను చెవులకు వివిధరకాల ములును, మెడలో హంస్‌లో గొలుసును, చేతులకు బలియ గాజులును వాంక్ డీ కడియాలును, చేతి వేళ్లకు చాస్ నగిషి కలిగినవి చల్లా నగిషిలేని మొదలైన ఉంగరాలను ధరిస్తారు. లంబాడీల్లోని సాంప్రదాయక ఆభరణాలు ఈనాడు మార్పులు ఎన్నో లోనవుతున్నాయి. ఆధునిక కాలంలోని నాగరిక ప్రభావంతో ఈ నగలన్ని అంతరించి పోతున్నాయి.

గాతే హంస్ కాంచళి గుగ్రో
గుంగ్‌టో బళియా డోరి వాంక్‌డీ

లంబాడీ ప్రజలలో ఇప్పుడు పాత ఆచారాలు పోయి కొంతవరకు దుస్తులలోను, పెళ్ళి సామ్మూలలోను మనుష్యులలోను మార్పులు వచ్చాయి. అయినా లంబాడీలు మాట్లాడే భాషలలో మార్పురాలేదు. వారి గోత్రాలలో మార్పు రాలేదు. వారి గోత్రాలలో కొన్నికోడ్ నెంబర్లు ఉంటాయి. వారు వివాహాలువారి గోత్రాలకు వ్యతిరేఖ గోత్రాల తోనే పెళ్ళి చేసుకోవాలి. ఈ పెళ్ళి ఆచారాలను తెలుగు ప్రజలు చూసి లంబాడీ మానవుడు అని అంటారు. పెళ్ళి అయినవారు అత్తవారింటికి రావడం బహు అరుదు. ఈ లంబాడీలు ఏ ప్రదేశంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా వరుసకు వీరు అన్నా చెల్లెలు అవుతారు. ఇలా ఎన్నో ఆచార కట్టుబాట్లు ఉన్న వీరికి ఆదేశాలు, పట్టుదల, పంతాలు కూడా ఎక్కువే. లంబాడీలు శిశువు జన్మించిన మూడవ రోజు లేదా ఏడవ రోజు పురుడు చేస్తుంటారు. పూర్వం తల్లికి పాపకు పసుపు, ఆవుపేడతో ఒళ్లు రుద్ది స్నానం చేయించేవారు. ఈ రోజు కూడా సబ్బులకు బదులు పశువుల పేడను ఉపయోగించడం కన్పిస్తుంది. ఆరోగ్యరీత్యా పరిశీలిస్తే పేడలో అమ్మోనియా, పసుపులో క్రిమిసంహారక శక్తి ఉందని విజ్ఞాన శాస్త్రం తెలుపుతుంది.

పురిటిరోజే జలమాత పూజ చేస్తారు. దీనిని లంబాడీలు దళయాదోకావేరో అంటారు. ఇంటికి తూర్పు దిక్కున తీసిన గుంతలో నీటిని నింపుతారు. ఈ పూజా కార్యక్రమం తెలంగాణా స్త్రీలు 21వ రోజు సంతానం లేని స్త్రీలను బావి దగ్గరకు తీసుకొనిపోయి వీపుపై నీళ్లు కుమ్మరించే ఆచారంతోపోలి వుంటుంది. మూడు ఇత్తడి చెంబులను మరికొన్ని ప్రాంతాల్లో ఒకే చెంబును సున్నం, బొగ్గు, పసుపు బొట్లతో అలంకరిస్తారు. మొదటి చెంబులో పసుపు నీళ్లు నింపుతారు. దరిచేవని విశ్వసిస్తారు. అలంకరించిన చెంబులను ఐదేండ్లు దాటని ముగ్గురు బాలురతో ఇద్దరు బాలికలతో బాలింత తలపైన పెట్టిస్తారు. సౌభాగ్యవతులు

బియ్యాన్ని లేదా మొక్కజొన్నలను అక్షింతలు చల్లుతూ, చ్వారికి, చోరా, చ్వారికి, చోరా అని పాడుతూ చెంబులను గుంత దగ్గర నింపుతారు. సన్ సుతిలిసువోలేన్ వర్ ఆయేస్ అంటూ పాటలను పాడుతారు. ఆడపిల్లలకైతే సూధి దారం తీసుకొనివెళ్లు, మగపిల్లాడికైతే జనుం, సుత్తి, డబ్బనం తీసుకొని వచ్చేయి. అని ఈ పాట అర్థం (జనపనారతో చేసిన సన్నటి తాడును సుతిలి అని, గోనో సంచిని కుట్టే సూధిని డబ్బనం అని అంటారు) ఈ పాటలో లంబాడీల జీవిత విధానం ప్రతిబింబిస్తుంది. లంబాడీ స్త్రీలు కనువిందును కలిగించే కళాత్మకమైన దుస్తులను కుట్టడంలో నేర్పరులు. కాంచలి (రవిక) గాగ్రా (పరికిణి) కుట్టడం నేర్చుకున్న తరువాతనే ఆడపిల్లలకు పెళ్ళి చేస్తారు. ఆకంచలి అంటే అద్దాలతో కుట్టిన రవిక, గాగ్రా అంటే పరికిణి, అందుకేఆడల్లిలకు ఉపకరించే కుట్టు పరికరాలను కానుకలుగా సమర్పించడం.పుట్టిన బిడ్డలకు మొదటిసారి తలవెంట్రుకలను తీయడాన్ని లంబాడీ భాషలో లట్టాకాడేర్ అని అంటారు. లంబాడీల్లో ఒక్కరికే కాకుండా జంటగా పుట్టు వెండ్రుకలు తీయడం ఆచారం, ఒక్కరికే తీయవలసి వచ్చినపుడు పక్కన ఓక్రాను పెడతారు. ఓక్రా అంటే చిన్న గోనె సంచిలో మెత్తని గడ్డి నింపి కుట్టిన దిండు లంబాడీలు సామాన్యంగా తుల్జా భవాని దేవత ఎదుట వెంట్రుకలను తీస్తుంటారు. ఒకవేళ బాలాజీ భగవానునికి గానీ, వేముల వాడ రాజన్నదేవునికి గానీ మొక్కుకున్నట్ల యితే రెండు పిలకలుంచుతారు. లంబాడీల్లో ఋతుమతి అయిన అమ్మాయిలకు ప్రత్యేక ఉత్సావాలు చేయరు. అయితే ఈ రోజుల్లో కొంతమంది లంబాడీలు తెలుగువారి సంస్కృతి ప్రభావంతో ఉత్సవాన్ని జరుపుకుంటున్నారు.

వీరి వేషధారణలో, స్త్రీలు ప్రత్యేకమైన దుస్తుల్ని ధరిస్తారు. లంబాడీలను చూచిన వారికి వారి వేషధారణ విదితమే. వీరు తెలంగాణా ప్రాంతంలో ఎక్కువగా వున్నా, ఆంధ్రప్రదేశ్లో కూడా వున్నారు. స్త్రీలు నృత్యం చేస్తారు. వీరి నృత్యంలో ముఖ్యంగా చేతులు చూపించటం, వలయా కారంగా తిరగటం చేస్తారు. ఈ నృత్యాన్ని స్త్రీ పురుషులిరువురు కలిసే చేస్తారు. ఒక పురుషుడు ప్రత్యేకంగా డప్పు కొడతాడు. డప్పు వరుసలకు అనుకూలంగా స్త్రీలు రక రకాల అడుగులు వేస్తూ గుండ్రంగా తిరుగుతారు. వీరి నృత్య బృందంలో 10 మంది వరకూ పాల్గొంటారు. వారి సంప్రదాయ దుస్తుల్ని ధరిస్తారు. కాళ్ళకు గజ్జెలు కడతారు. చప్పట్లు చరుస్తూ వలయా కారంగా శబ్దానికి అనుగుణంగా నృత్యం చేస్తారు. లయ ప్రకారం చప్పట్లు చరుస్తూ వుంటే మిగతా వారు పాటలను ఆలాపిస్తారు. వీరి పాటలన్నీ వారి గురువైన 'సేవలాల్ మీదనే పాడతారు. ప్రధమంగా అందరూ నిలబడి ముందుకు వంగి చేతులతో చప్పట్లు కొడుతూ ఈ విధంగా పాడతారు.

కోయినారియే కోచళో సోసో
కోయినారియే కూణిన చోడో
కోయినారియే శంక్రనచోడో
కోయినారియే కాయ్ ఆంకుదీచ
కోయినారితే రవియ్యదీచ

అంటూ గిర్రున తిరిగి శరీరాన్ని క్రిందికి పైకి వంచుతూ లేస్తూ చేతుల్ని పైకెత్తి చప్పట్లు కొడుతూ గుండ్రంగా తిరుగుతూ అదే సమయంలో పాడే పాటను ఒకరు పాడుతుండగా, మిగిలిన వారంతా ఈ విధంగా వంత పాడతారు.

బాలే పెంచనే వెంటాపర్ రెడి బోలిరీచ
రెడి బోలరీచక్ జినండేకరేచ
సావుకార్ భీకియ్యార్ రోరలూటోరేచ
బాయే పెంచనే వెంటాపర్ రెడి బోలిరేచ
రెడి బోలిరీచక్ జనండేకరేచ
సావుకార్ హనుమంత రెడ్డిర్ చోర లూటోరేచ

అంటూ పాటలు పాడుతూ నృత్యం చేస్తారు.

ఈవిధంగా గిరిజన సంస్కృతిలో ఒక ప్రత్యేకతను

కలిగిన బంజారాలు నేడు అభివృద్ధి పేరుతో తమ సంస్కృతి సాంప్రదాయాలకు దూరమవుతున్నారు. ఇకనైనా బంజారా సంస్కృతిని, సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడవలసిన బాధ్యత వున్నది.

ఆధార గ్రంథాలు :

1. బంజార చరిత్ర - బి. చీనియా నాయక్
2. బంజార పండుగలు సాహిత్యం - హంసావత్ నాగేంద్ర

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రయోగాలకు వాకిలి – శ్రీశ్రీ సిప్రాలి

– డా॥ ఎన్. ఈశ్వర రెడ్డి, సహ ఆచార్యులు, తెలుగు విభాగం, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

శ్రీశ్రీ ఈ రెండక్షరాలు చెవినపడగానే ఆధునికులకు తెలియని ఒక తన్మయత్వం, ఆవేశం మనసులో ముసురు కుంటాయి. అక్షరంతో అగ్ని రగిలించి, పదంతో పాట పాడించి సగటు తెలుగు పాఠకుడి నరాల్లో ప్రవహించిన కవిత్వం శ్రీశ్రీది. సుమారు అర్ధశతాబ్దం (1928-1983) పైగా తెలుగు కవిత్వాన్ని ప్రజాగతం చేసి, పాఠకుల్ని తన వైపు తిప్పుకున్న యుగకర్త శ్రీరంగం శ్రీనివాసరావు. అభ్యుదయ కవితా ప్రయోక్తగా శ్రీశ్రీ ప్రస్థానం అనన్యం. అనితరసాధ్యం. మార్క్సిజాన్ని, భౌతికవాదాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రజల బాధను తన బాధగా స్వీకరించిన మహాకవి ఈయన. చైతన్య దీప్తులు వెలిగించడానికి 'భువన భవనపు బావుటాలపైకి లేచి, ప్రపంచ మానవ పరిణామం కోసం 'వెర్రిగొంతుక విచ్చిమ్రోసి', చీనాలో రిక్షావాలా, చెక్ దేశపు గని పనిమనిషీ, ఐర్లాండున ఓడ కళాసీ, అణారిన అర్తులందరి పక్షాన నిలబడ్డ ఒక విప్లవగీతం శ్రీశ్రీ.

'ప్రభవ'తో ప్రారంభించి, మహాప్రస్థానం మీదుగా ఖడ్గ సృష్టి, మరో ప్రస్థానంగా కవిత్వాన్ని నడిపించిన శ్రీశ్రీ వివిధ ప్రక్రియల్లో సుమారు 20 గ్రంథాల దాకా రాశారు. అనువాద కథలు, నవలలు, నాటకాలు, నాటికలు, ఉపన్యాసాలు, వ్యాసాలు మొదలైనవి ఉన్నాయి.

'కాదేదీ కవితకనర్హం; అవునవును శిల్ప మనర్హం'. సాహిత్య వస్తువు ఏదైనా పరవాలేదు. దాని నిర్మాణంలోనే ఉంటుంది దాని గొప్పతనం. శ్రీశ్రీ శిల్పప్రాధాన్యంతో కవిత్వం రాస్తూ, చమత్కారంపైనే దృష్టి పెట్టిన దశలో కవిత్వంలో ప్రయోగాలకు ప్రాధాన్యత నిచ్చారు.

శ్రీశ్రీ రాసిన సిప్రాలి విభిన్న కావ్యాల మేళవింపు. సిరిసిరిమువ్వలు, ప్రాసక్రీడలు, లిమబుక్కులు ఈ మూడు రచనల ప్రారంభ అక్షరాలు కలిసి 'సిప్రాలి' అయ్యింది. అంతేగాక రుక్కుటేశ్వర శతకం, 'మేమే' గేయాలు పంచపదులు కూడా సిప్రాలి సంపుటిలోకి వచ్చి చేరాయి.

'సిప్రాలి' అనేది శ్రీశ్రీ ప్రయోగ దృష్టికి పరమోదాహరణ. 1981లో శ్రీశ్రీ అమెరికాలో ఉండగా మిమియోగ్రాఫ్ మిషన్ మీద స్వదస్తూరితో రాసిన ప్రతిని జిరాక్స్ తీయించి అందుబాటులో ఉంచాడు. పుస్తకం వెల పది డాలర్లు అయినప్పటికీ, అన్ని పుస్తకాలు అమ్ముడయ్యాయి.

'సిప్రాలి'లోని మొదటి అక్షరం 'సి'కి ప్రతినిధి అయిన 'సిరిసిరిమువ్వ' పద్య శతకం శ్రీశ్రీకి ప్రత్యేకమైంది. వ్యంగ్య, హాస్య ధోరణిలో, శబ్దచమత్కారాన్ని, అర్థవైచిత్రిని కందపద్యాలలో పొదిగిన రచన ఇది. "కందం రాసిన వాడే కవి, పందిని చంపినవాడే బంటు' అనే సూక్తిని తలకెక్కించుకున్నాడు. అందుకే

"అందంగా మధురసని
ష్యందంగా, పఠితృ హృదయ సంస్పందంగా
కందాలొక వంద రచిం
చిందికి మనసయ్యె నాకు సిరిసిరిమువ్వా" అని ప్రకటించుకున్నాడు.

ఈ శతకం 1945-50 మధ్య వచ్చిన రచన. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం నడుస్తున్న కాలం అది. అయినా ఉద్యమం తాలూకు ఛాయలు ఇందులో ఎక్కడా కనిపించవు. నిత్యజీవితంలో తనకు ఎదురైన సంఘటనలను, సందర్భాలను పద్యాలుగా మార్చినట్టు స్పష్టంగా తెలుస్తుంది.

'ఏవేనా కొత్తవి రా / శావా? చూపించు మంచు చంపేవాళ్ళం
తా వినడానికి నేనీ / జీవత్కృతి నాలపింతు' నంటాడు.

కవులకు, రచయితలకు ఇది సాధారణంగా ఎదురయ్యే ప్రశ్న. ఏమైనా కొత్తవి రాశావా? అనేది. ఏ కవీ

ప్రతిరోజూ కొత్తవి రాయడం సాధ్యం కాదు. ముఖ్యంగా సీరియస్ పోయిట్రీ రాసేవాళ్ళకు ఈ ప్రశ్న కొంత ఇబ్బందిగానే ఉంటుంది. శ్రీశ్రీ ఇలాంటి ప్రశ్నలకు కూడా కొంటెగా సమాధానం ఇచ్చినట్టు సిరిసిరిమువ్వ ద్వారా తెలుస్తుంది.

కుర్చీలు విరిగి పోయినా కూర్చోవడం మాననట్లు, గొప్ప రచనలు చేసే శక్తి నశిస్తే, ఒకింత చెత్త చేర్చి రాయవచ్చని వ్యంగీకరిస్తాడు.

'మళ్ళీ ఇన్నాళ్ళకి ఇ / న్నేళ్ళకి పద్యాలు రాయుటిది యెట్లన్నన్
పళ్ళూడిన ముసలిది కు / చ్చిళ్ళున్ సవరించినట్లు సిరిసిరిమువ్వా' అంటూ

పద్యాలు రాయడానికి సంజాయిషీ ఇచ్చినట్టు, అదొక కాలం చెల్లిన ఆడంబరమని చమత్కరించడానికి 'పళ్ళూడిన ముసలిది కుచ్చిళ్ళు సవరించుకున్నట్టు' ఉందని చెప్పడంలో శ్రీశ్రీ నిజాయితీ కనిపిస్తుంది.

ఒక గొప్ప కావ్యంగా నిలిచిన 'మహాప్రస్థానం' రాసిన శ్రీశ్రీని చదివినవారు, ఇలాంటి కాలక్షేప పద్యాలు చదువుతారా? చదివి మెచ్చుకుంటారా? అనే సంశయాలకు, తిరస్కృతులకు కూడా పద్యంతో సమాధానం చెప్పకుంటాడు.

'అవురా, శ్రీరంగం శ్రీ / నివాసరావూ, బలేమనిషివే, ఇక నీ
కవితా వాద్యం చాలిం / చి వెళ్ళి పొమ్మనకు నన్ను సిరిసిరిమువ్వా'

అంటూ ఈ కారణంగా నన్ను తిరస్కరించవద్దని కోరుకుంటాడు.

సిరిసిరిమువ్వా అనే మకుటంలో సిరి సిరి అనేవి శ్రీశ్రీకి రూపాంతరాలు. నాల్గవ పాదంలోని ఈ సిరి సిరి మువ్వా మకుటం 'సిరిసిరి మురళీ, సిరిసిరి మౌనీ, సిరిసిరిభాయీ, సిరిసిరిగారూ, సిరిసిరి నేస్తం, సిరిసిరి రామా, సిరిసిరిసుకవీ లాంటి ప్రయోగ వైవిధ్యంతో ఉండడం మరో విశేషం. ఛందో నియమం, మకుట నియమం, సంఖ్యా నియమం శతకానికి లక్షణ హేతువులు.

"నీ కొక సిగరెట్టిస్తా / నా కొక శతకమ్ము రాసి నయముగ నిమ్మా,
త్రైకాల్య స్థాయిగ నీ / శ్రీ కావ్యము వరలు నోయి సిరిసిరి భాయీ!"

"... విని పలుకులు చిత్తములర సిరిసిరి మురళీ" "....చేశావు సదా తపస్సు సిరిసిరి మౌనీ" "..... స్థిర కీర్తిని పొగుడుతారు సిరిసిరి గారూ" ఇలా చేసిన మకుట ప్రయోగాలు శ్రీశ్రీ లౌక్య చతురతకు అద్దంపడతాయి.

'నీకొక సిగరెట్టిస్తా... నాకొక శతకం రాసిపెట్టు' అనే భావన హాస్యానికి రాసినా, ఎంతోమంది కవుల ఆవేదన చుట్టూ ఈ వాక్యాలు అల్లుకుపోతాయి. ఆకలి, దారిద్ర్యం ఏ స్థాయికైనా మనిషిని దిగజారుస్తాయనడానికి ఈ పద్యం ఒక గొప్ప ఉదాహరణ.

వేమన 'తోటకూరకైన దొగ్గిలికైనను
తవిటికైన తవిటి కుడుముకైనా
పద్యమ్ముల చెప్పు గండ్యాలు గనమై
విశ్వదాభిరామ వినురవేమ' అని ఒక రకం కవులను నిరసిస్తే, భోజనం పెట్టిన పుణ్యానికి పద్యనాటకం రాసిచ్చిన కవులున్నారు, 'పేదరికము పెద్ద వింత విద్యా శాల, దానియందు లజ్జకానరాదు' అని చెప్పుకున్న జాషువా, చివరి దశలో ఈ సన్మాన శాలువా కన్నా, ఒక బియ్యం సంచి ఇప్పిస్తే నాలుగు పూటలు గడుస్తాయని భావించిన పుట్టపర్తి నారాయణాచార్యులు లాంటి వారి దుర్భర ఆర్థిక పరిస్థితులు మనసులో మెదులుతాయి. సున్నిత హాస్యం వెనుక కఠోర విషాదాలు దాగున్నాయనే సత్యాన్ని గ్రహిస్తూనే, కష్టాలను తేలికగా తీసుకొని, చిరునవ్వుతో ముందుకు కదలడానికి సిరిసిరి మువ్వలు ప్రేరణనిస్తాయి.

ఇష్టదేవతా ప్రార్థనం పేరుతో తెనాలి రామకృష్ణ, కవి చౌడప్ప, వేమన, కూచిమంచి జగ్గకవి, గురజాడ అప్పారావు, కృష్ణశాస్త్రి, జరుక్ శాస్త్రి మొదలైన కవులను తలుచుకోవడం మరో ప్రయోగం. ఉదాహరణకు -

"అల కృష్ణశాస్త్రి వేమన / మెలకువ లాధునిక ఫణితి మెరపించుటచే
సులువయ్యెను నాకుభయుల / చెలిమి యొకే పద్యమందు సిరిసిరిమువ్వా"

ఇలా కవులనే కాక రచయితలు సృష్టించిన పాత్రలను కూడా ప్రస్తుతించడాన్ని చూడవచ్చు. గురజాడ సృష్టించిన గిరీశం (కన్యాశుల్కం), పానుగంటి సృష్టించిన జంఘాల శాస్త్రి (సాక్షి వ్యాసాలు), మొక్కపాటి వారి బారిస్టరు పార్వతీశం (నవలా పాత్ర) వంటి ప్రత్యేక పాత్రలు తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయంగా ఉన్నాయి. ఆ పాత్రల స్వభావాలకు అనుగుణంగా శ్రీశ్రీ వారిని పద్యాల్లోకి తెచ్చాడు.

"నవయువకులకు నమునా / కవియైన గిరీశ మకటకట! సంఘో ప
ద్రవముల సవరణ కాశం / చి వెల్లకిల బడుట దలతు సిరిసిరిమువ్వా"

ఈనాటి యువత గిరీశం లాగా ద్వంద్వ వ్యక్తిత్వాలతో దిగజారిపోతున్నారనే సందేశాన్ని అందిస్తాడు.

కాలానికి అనుగుణంగా మారిపోతున్న జీవన విధానాలు, విలువలను గుర్తించకుండా, మూర్ఖంగా మాట్లాడే వారు 'పాతబడి కుళ్ళిపోయిన నీతులను' పట్టుకొని వేలాడడాన్ని ఎద్దేవా చేస్తాడు.

సంగ్రామ సింహం వెంటనడిచే గ్రామ సింహాన్ని నేటి నాయకులతో పోల్చి విసిరిన వ్యంగాస్త్రం కుహనా నాయకులను ఎండగడుతుంది.

"సంగ్రామ సింహమై ఒక / కాంగ్రెస్ నాయకుడు కదలగా అతని వెం
టం గ్రామ సింహమై నడ / చెం గ్రుడ్డిగా వేరొకండు సిరిసిరిమువ్వా"

అనడంలో ఆ వ్యంగ్యం రసస్ఫోరకంగా ఆకట్టు కుంటుంది.

శ్రీశ్రీ తన వ్యక్తిత్వాన్ని, జీవిత సత్యాలను నిజాయితీగా వ్యక్తపరుచుకోవడం సిరిసిరిమువ్వలో స్పష్టంగా కని పిస్తుంది. " 'రమ్మ'ని ఆహ్వానిస్తే, పొమ్మనడం పాడి కాదు పూ విల్తుని రాజ్యమ్మునకున్, మధుశాలకు..." అనడం లోనూ, సీసా మార్చేస్తే సారా బ్రాందీ అవునా? అని ప్రశ్నించడంలోనూ, మాస్కోకు వెళ్ళలేక పోయినా, విస్కీ సేవించి 'శ్రీస్కనై' బతక గలనని చెప్పిన విధానం శ్రీశ్రీలోని ధైర్యానికి అద్దంపడుతుంది.

మొదటిదశ, సంపాదక సాక్షాత్కారం, శ్రీరంగ నీతులు, వైరాగ్య పద్ధతి, మూర్ఖద్ధతి, LES GESTES SURREALISTS, ఉపాలంబనం, చాటువులు అనే శీర్షికలు సిరిసిరిమువ్వల వస్తుతత్వాన్ని విశదపరుస్తాయి. బుక్కుటేశ్వర శతకం కూడా హాస్యం పండిస్తుంది.

ద్విగుణీకృత కర్తరికా
సిగరెట్ పొగరీకృతుండు జిహ్వాగ్రనటత్
భుగభుగ భుగాయి తోజ్జ్వల
రిగసా సగరీ గరీసరిగ సారుండున్" (రుక్కుటేశ్వర శతకం) అంటాడు శ్రీశ్రీ. పొగతాగేవాడి మానసిక ఆనందానికి, భౌతిక పదచిత్రంగా ఈ పద్యం నిలుస్తుంది. 'సిగరెట్ పొగీకృతుండు' 'భుగ భుగ భుగాయిత్వోజ్జ్వలం'గా అవ్వడం బహుశా శ్రీశ్రీ స్వీయానుభవమే అయి వుంటుందని నా నమ్మకం. మద్యపాన అలవాటు ఉన్న స్నేహితులతో శ్రీశ్రీ చెప్పిన మాటలు ఎంతో చమత్కారంగా ఉంటాయి.

"రాసిందేదో రాశాం / తీసుకొనుము తోచినంత తీపో చేదో
సీసా పయినేగా మన / ధ్యాస హమేషా, గళాసు దాల్చిన ఏసూ!" (మేమే)

ఏల్చూరి సుబ్రహ్మణ్యం పేరు రెండు పదాల మొదటి అక్షరాలు తీసుకొని ఏసూ అంటూ చేసిన సంబోధన తికమక పెడుతుంది. జీవితాన్ని చాలా సులువుగా తీసుకునే తత్వమున్న శ్రీశ్రీ సాధారణంగా గుర్తించని అంశాలను అక్షరాల్లోకి తెచ్చి ఔరా అనిపిస్తుంటాడు.

మనలోని చాదస్తాలను బయటపెడుతూ -

"యుగయుగాల వేగాలం / త్రుతి మించిన రాగలం
మృత్యువు భోషాణానికి / తుప్పు పట్టిన బీగాలం
భగవంతుని ప్రశ్నలం / పట్టపగటి జ్యోతులం
వినబడని తిట్టులం / వెయ్యని ఒట్టులం" (మేమే)

ఇలా ఎక్కడి కక్కడ మనుషుల తిరోగమన ఆలోచనలను ఎండగడుతూ మారాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ సాగిన 'మేమే' గీతంలో మానవజాతి ఉన్నత స్థితికి చేరాలని కోరుకుంటాడు శ్రీశ్రీ.

"సిరిసిరి మువ్వ, బుక్కుటేశ్వర శతకాల్లోనూ, చాటువుల్లోనూ, మేమే గేయాల్లోనూ ఉన్న హాస్యం నవ్వించడానికే పనికొస్తుంది. "బూతాడక దొరకు నవ్వు పుట్టదు" అని నవ్వించడంతోనే తన పని తీరిపోయిందను కున్నాడు ఆనాటి కవి చౌడప్ప. వీటిల్లో శ్రీశ్రీ కూడా అంతే రాశాడు" (మనవి మాటలు - చలసాని ప్రసాద్ : సిప్రాలి).

ప్రాసక్రీడలంటే శ్రీశ్రీకి ఎంత ఇష్టమో ఆయన మాటల్లో

"రాసక్రీడ శృంగారానికి / రమ్యమైన ప్రాణం
ప్రాసక్రీడ హాస్యానికి / పసందైన ప్రాణం

ప్రతి నాలుగు పదాల ఖండికలో తొలి రెండు పాదాలకు ఆది ప్రాస, రెండు, నాలుగు పాదాలకు అంత్య ప్రాసలు తప్పక ఉండడం, కొన్నిట్లో నాలుగు పాదాలకూ ఆది ప్రాసలు ఉండడం గమనించవచ్చు. ఆది ప్రాసలు పాటించలేని చోట ప్రాసయతి (పాదం తొలి పదంలోని రెండో అక్షరం) పాటిస్తూ చేసిన శబ్ద ప్రయోగాలు పాఠకులను గిలిగింతలు పెడతాయి.

ప్రాసక్రీడల్లో శ్రీశ్రీ రాజకీయంపై దృష్టిపెట్టాడు. కొన్ని సందర్భాల్లో రాజకీయం చేశాడు కూడా. 'భాషాప్రయుక్త రాష్ట్ర రచన దేశానికరిష్టం' గా భావించాడు. 'తెలుగు రాష్ట్రమేర్పడితే తొలివజీవరు రెడ్డి అని, తాగేందుకు కుళ్ళు నీళ్ళు, తినేందుకు గడ్డి' అంటూ శ్రీశ్రీ రాసిన ఖండికలు ఆయన మితిమీరిన నిరసనకు నిదర్శనంగా నిలుస్తాయి. బహుశా శ్రీశ్రీ అక్షరదాడి శృతిమించిందని పిస్తుంది. కర్నూలు రాజధాని కావడం ఆయనకు ఇష్టం లేదు.

"... నా రచనల వల్ల ఆశాభంగాన్నే కాక అవమానాన్ని పొంది యాతన పడేవారూ ఆంధ్రదేశంలో ఇంకా అక్కడక్కడా వుంటున్నారని..." (సిప్రాలిలో శ్రీశ్రీ అభిప్రాయం) గ్రహించాడు. అయినా తను చెప్పదలుచుకున్న విషయాలను దాపరికం లేకుండా, కఠిన పదజాలంతో చెప్పుకుంటూనే పోయాడు.

"పత్రికలో కార్టూనులు పడడం చూళ్ళేదూ?
పద్యంలో ఆ మాదిరి
పద్ధతి వీల్లేదూ?"

అనడంలో శ్రీశ్రీ ఆలోచన అర్థమౌతుంది. రాజకీయ వ్యంగ్య కార్టూన్‌లకు ఏ మాత్రం తగ్గని విధంగా మాటల కార్టూన్‌లు ఉండాలని భావించాడు.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు (1.10.1953) తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పనిచేశాడు. నవజాత రాష్ట్రానికి వృద్ధ ముఖ్యమంత్రి ఎందుకన్నట్టు -

"ముక్కుపచ్చలారని
నవ్యాంధ్ర రాష్ట్ర శిశువు
మూలుగుతూ మూలనున్న
ముసలాడికి వధువు" అంటూ ఎద్దేవా చేస్తాడు. బహుశా వయోవృద్ధులు రాజకీయాలను త్యజించాలని శ్రీశ్రీ అభిమతమేమో?!

అయ్యదేవర కాళేశ్వరరావును 'ఆంధ్రభార శకుని అయ్యదేవర కాళుడి'గా, కాంగ్రెస్ పార్టీని 'గుద్దుకునే' పార్టీగా చిత్రించిన విధానం ఆనాటి రాజకీయ పరిస్థితులకు అద్దంపడుతుంది. 1953 ప్రాంతంలో ఉన్న నాయకులను, కవులను, రచయితలను దాదాపుగా హేళనచేసినట్టు ఆయన ప్రాసక్రీడలు చెప్తున్నాయి.

ఆంగ్లంలోని లిమరిక్స్ తెలుగులోని బుక్కులను కలిపి లిమబుక్కులుగా ప్రయోగం చేశాడు శ్రీశ్రీ. ఐదు

పాదాలతో నడిచే ఈ ఖండికలకు శీర్షికలు కూడా పెట్టడం విశేషం. లిమబుక్కులు కూడా ప్రాసక్రీడల్లాగే రాజకీయ, సామాజిక ప్రయోజనాన్ని ఆశించి రాసినవిగా కనిపిస్తాయి.

ఔను ''నిజంగాను / ప్రజల కవినేను / ఎంచే తంటాను / వాళ్ళను చదివాను / చదివిందే రాసేను'' అని స్వయంగా ఆయనే చెప్పుకున్నాడు. 'ముసలివాణ్ణి, కాదు అసలువాణ్ణి, పడగెత్తిన తాచుపాము బుసలవాణ్ణి, పీడితుల్ని వెంటేసుకు మసలువాణ్ణి, అందుకున్న ఆకాశపు కొసల వాణ్ణి, (లిమబుక్కులు) అంటూ తన స్థితిని, కవిత్వ గతిని ఘంటావథంగా వినిపించిన శ్రీశ్రీ, కమ్యూనిస్టులను కూడా వదలలేదు.

''తెల్ల కమ్యూనిస్టులు
రక్తపాతాని కనిస్టులు
విప్లవానికి బహిష్టులు
ఇందిరా రాధనలో శ్రేష్టులు

నవభారత ధార్త రాష్ట్రలీ రివిజనిస్టులు'' అనీ, 'నిన్నటి కమ్యూనిస్టులు నేటి మర్యాదస్తులు, ఉదారవాదులు, సంపన్న గృహస్థులు, వ్యాపారైక దృష్టులు'గా ఎద్దేవా చేస్తాడు.

ఆంగ్లభాషా పదాలతో చేసిన ప్రయోగాలు

''ఈనాడు నేషనల్ / అంటే ఇర్రేషనల్ / పైగా సెన్సేనల్
ఏ తత్సంబంధ ఘోషణల్ / నిరర్ధక దుర్భాషణల్''

''సింహళదేశపు వోటర్లు, సిరిమావో వెనరేటర్లు, విప్లవానికి
ధర్మామీటర్లు, విద్యుచ్ఛక్తికి జనరేటర్లు, వాళ్లే అమెరికా వాటర్లూ! అంటూ ఆంగ్లపదాలలో కూడా అంత్య ప్రాసలు సాధిస్తాడు.

(వాటర్లూ బెల్జియం దేశంలో ఒక ఊరు. వాటర్లూ యుద్ధంలో నెపోలియన్ ఓడిపోవడం (18.6.1815) ఇంగ్లీషు, డచ్చి, రష్యా సైన్యాలు గెలవడం దాని ప్రత్యేకత)

''విచిత్రమైన Veitnamization
అసహ్యమైన Syphilization
అసభ్యమైన Sexamination
అనుచితమైన Contamination
అవసరం De-americanisation (ఆరోగ్యస్నానం)

ఇలా రకరకాల ఆంగ్ల పదాలను తెలుగు వాక్యాలతో కలిపి చేసిన ప్రయోగాలు చేశాడు. అలాంటిదే మరోటి Self-portrait `

''విదూషకుడి Tempermant
ఏదోఒక Discontent
బ్రదుకుతో Experiment
పదాలు Patent
రసాలు Torrent
సదసత్సమన్వయకి Solvent
II Giant (పంచ పదులు)

భాషలోని నాదాన్ని పట్టుకొని భావాలను చిత్రించడం శ్రీశ్రీకి వెన్నతో పెట్టిన విద్య. ఆ నాదాన్ని విస్తృతపరిచే క్రమంలో భాషాభేదాలను, పరభాషా వాదాలను పక్కన బెట్టి ప్రయోగాలు, పదసృష్టి చేస్తాడు.

సిప్రాలిని మొత్తంగా పరిశీలిస్తే, 'సిరి సిరి మువ్వ శతకం, బుక్కుటేశ్వర శతకంలో శబ్ద చమత్కారం, అర్థవైచిత్రి పోటీపడుతుంటాయి. వీటిలో ప్రయోగ కౌశలం ఉంది. కానీ ప్రయోజనం మాత్రం అంతంతే. 'మేమే' గేయాల్లో హాస్యరసం పొంగిపొర్లినా, అది ఆత్మపరిశీలనకు మాత్రమే సరిపోతుంది. వీటిలక్ష్యాలు 'ఆనందం, ఆమోదం' మాత్రమే.

ప్రాసక్రీడలు, లిమబుక్కుల లక్ష్యాలు కొంత భిన్నంగా కనిపిస్తాయి. సామాజిక విమర్శ, సాహిత్య ప్రయోజనం వీటిలో ఉన్నాయి. అనాటి సమకాలీన రాజకీయాలపై ఎక్కుపెట్టిన బాణాల్లా దూసుకుపోయే ఈ కవితా ఖండికలు శ్రీశ్రీ చేసిన చిట్టిపొట్టి రచనల్లో

బాధ్యత మరిచిపోయాడు అనే అపవాదును ఇవి తొలిగిస్తాయి. అందుకే చాటువులకు, మేమే గేయాలకూ లేని ప్రయోజనం, సామాజికత్వం వీటికి వచ్చాయని చెప్పవచ్చు. 1950-54 మధ్య కాలంలో పొడసూపిన రాజకీయ పరిణామాలను సునిశితంగా పరిశీలించి, సూదితో గుచ్చినట్టు చెప్పిన ప్రాసక్రీడలు అన్ని పార్టీలపైనా, అందరు నాయకులపైనా విరుచుకుపడ్డాయి. శ్రీశ్రీ అభ్యుదయ ఉద్యమ భాగస్వామిగా ఉన్నప్పుడు ప్రాసక్రీడలు వెలువడ్డాయి. 1970లో విశాఖపట్నంలో శ్రీశ్రీ సన్మాన సభలో వచ్చిన కరపత్రం 'రచయితలారా మీరెటు?' అనే ప్రశ్న తర్వాత వచ్చిన పరిణామాలన్నీ లిమబుక్కుల్లో కనిపిస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకాకుళ ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని చూడడం, దిగంబర కవులు, తిరగబడు కవులు కొత్త పంథాను అనుసరించడం, విరసం స్థాపన, శ్రీకాకుళ ఉద్యమం, నక్సల్బరీ ఉద్యమాలపట్ల మార్క్సిస్టుల ఉదార వైఖరిని ప్రశ్నించడం వంటి అనేక రాజకీయ, సామాజిక స్థితిగతులకు లిమబుక్కులు అద్దం పట్టాయి.

"సామాజిక చైతన్యం, రాజకీయ సిద్ధాంతం, సాహిత్య సంఘాల స్థాపన శ్రీశ్రీ కవితా జీవితంలో పెనవేసుకు పోయాయి. లిమబుక్కులలో ఇవే మనకు కనిపిస్తాయి. అక్షరాల ఆయుధాలే లిమరుక్కులు. కవితా విల్లంబులు మనందరికి అందించాడు శ్రీశ్రీ" (మనవి మాటలు : చలసాని ప్రసాద్ - సిప్రాలి).

'కళకోసమే కళ' అనే వారి దంతప్రాకారంలో జీవిస్తూ అందులోంచి బయటపడి 'ప్రజల కోసమే కళ' అనే నిశ్చయానికి ప్రయత్న పూర్వకంగా వచ్చినవాడు శ్రీశ్రీ.... 'విధానం కాదు, విషయమే ముఖ్యం' అనే నిర్ణయానికి వచ్చాడు. ఎలా చెప్పడం అనేదాని కన్నా, ఏది చెప్పడం అనేదానికి ప్రాధాన్యత ఉండాలని, అప్పుడు కావ్యంలో నాజూకులకు, నగిషీలకు గాక వస్తువుకు ప్రాముఖ్యం వస్తుందని అంటాడు. 'ప్రక్రియ', వస్తువు రెండూ కలిస్తేనే కవిత్వం' అని చెప్తూ, ప్రక్రియను శరీరంతో, వస్తువును ప్రాణంతో పోల్చి ఒకటి లేకుంటే, రెండవది లేదని అంటాడు శ్రీశ్రీ (అనంతం). ఈ కోణంలో చూసినప్పుడు సిరిసిరిమువ్వలు, మేమే, పంచపదులు శిల్పప్రధాన కోవకు వస్తే, ప్రాసక్రీడలు, లిమబుక్కులు వస్తు-శిల్ప సంయుక్త ప్రాధాన్య స్థితిలో కనిపిస్తాయి. వస్తు-శిల్పాలపట్ల శ్రీశ్రీకి ప్రత్యేక అభిప్రాయాలు ఉన్నాయి. అవి కాలానుకూలంగా మార్పుచెందాయి.

ఆధారగ్రంథాలు పత్రికలు :

1. సిప్రాలి - శ్రీశ్రీ - శ్రీశ్రీ ప్రచురణలు (2008)
2. ప్రజ - (ప్రశ్నలు - జవాబులు) - శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం-19 (1990
3. ప్రజాసాహితి - మాసపత్రిక - జూన్ 2010
4. కవిత - మానవీయత - డా॥ ఎన్. ఈశ్వర రెడ్డి (2016)
5. అనంతం - శ్రీశ్రీ - విరసం ప్రచురణ (1974)

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెరచిన కళ్ళు నాటికలోని పాత్రలు మనో విశ్లేషణ

– డా॥. పెరుగుతల్లి బలరామ్, తెలుగు అధ్యాపకులు, టి.జే.పి.యస్.కళాశాల గుంటూరు.

కళ్ళు కట్టుకునే చీకటిలో చిన్న మిణుగురు పురుగు దృష్టిని ఆకర్షించినట్లు ఈ విస్తృత, విశృంఖల, విశాల, బహుముఖ ప్రాపంచిక జీవితంలో ఆయన కలం నుంచి జాలువార్చిన సిరా చుక్కలే ఒక్కో మిణుగురు పురుగై అంవే పదులు, వందలు, వేలుగా గాఢాంధకారాన్ని పారద్రోలే దినకరుని మయూఖములై దేదీప్యమానంగా వెలుగును ప్రసరించి ప్రాపంచిక జీవితంలో పేరుకు పోయిన చీకట్లను పారద్రోలి మనసుకు తోడై మనిషికి జోడై యావదాంధ్రుని తనవైపు లాక్కుని తాను ప్రతి గొంతులో శృతిగా, గుండె గుండెలో లయగా మారిన మనకవి మన'సుకవి' 'మనసున్న' మనకున్న మనసు కవిగా పేర్గాంచిన ఆత్రేయ కొన్ని సందర్భాలలో జీవిత ఎత్తుపల్లాలలో తానుకూడా బంధీనైనానని తనను తాను బూత్రేయగా పిలుచుకున్న కవి ఆత్రేయ.

సినీ సాహిత్యంలో ఆయనో స్రష్ట అలాగే రచయితగా నాటక సాహిత్యంలో ఆయనో ద్రష్ట అని ఒప్పుకోవలసిందే. ఆత్రేయ సాహిత్యాన్ని పరిశీలించిన వారెవరైనా ఈ మాటను తప్పు పట్టరు. పాటలతో ఎంత ప్రాచుర్యాన్ని పొందారో, తన నాటకాలు, నాటికలు, సినిమా సంభాషణలతోనూ అంతే వైవిధ్యాన్ని చాటి పాఠకలోకంతో తన బంధాన్ని విడదీయరానిదిగా పెనవేసుకున్నారు. అందుకే వారు రచించిన నాటికల సంపుటి నుంచి 'తెరచిన కళ్ళు' నాటికను తీసుకుని పాత్రల చిత్రణను, వాటి స్వభావాలను మనోవిశ్లేషణ సిద్ధాంతానుగుణంగా విశ్లేషణ చేశాను.మనం ఆత్రేయాగా పిలుచుకుంటున్న వీరి పూర్తిపేరు కిలాంబి వెంకట నరసింహాచార్యులు

పాత్రలు :

1) డాక్టర్ సుదర్శన్ 2) డాక్టర్ భార్య
3) సత్యం 4) భార్య - భర్తలు
5) తల్లి - పిల్లవాడు 6) నర్సు - బిచ్చగాడు

నాటికలోని ముఖ్యపాత్రల పేర్లు పరిశీలిస్తే అవి నాటికలోని కథకు తగిన విధంగా ఆ పాత్ర ప్రవర్తనకు నిదర్శకంగా చిత్రించారని ప్రతీ పాఠకునికి అర్థమవుతుంది.

నాటిక ఆరంభంలో బిచ్చగాడి పాత్ర ప్రవేశపెడుతూ ఈ క్రింది పాటను గానం చేయించారు కవి. ఆత్రేయ ఈ పాటలోని చరణాలు మొత్తం నాటికను ప్రతిఫలిస్తాయి.

పాట : చూపుంటేనే లోకం

అది లేకుంటే శోకం
అందంలో ఆనందం ఉంది
ఆ అందం కన్నెదుటుంది
చూపుంటే సృష్టే స్వర్గం
లేకుంటే నికృష్టపు నరకం
కళ్ళులేని కబోదులు కొందరు
కళ్ళుండీ కనజాలరు ఎందరో
లోపలి చూపే జ్ఞాన సమస్తం
లేకుంటే బ్రతుకంతా వ్యర్థం

ఈ పాటలోని చరణాలు నాటికకు ఆత్మ వంటివి పరిశీలిస్తే ఒక్కో పాత్రకు అందులోని చరణాలు చక్కగా నప్పుతాయి. ఆ పాత్రల చిత్రణలను విశ్లేషించేటప్పుడు అక్కడ ఈ చరణాల ఉదహరిస్తాను.

కథ :

ఒక గర్భవతి ప్రసవిస్తుంది మగ పిల్లవాడు పుడతాడు నర్సు మగపిల్లాడనగానే ఆనందంతో పొంగిపోతుంది. పిల్లవాడు పుట్టు గుడ్డి అని తెలియగానే తల్లిగా ఎంతగానో శోకిస్తుంది.

అలాగే ఏరికోరి అపురూప సౌందర్యరాసిని పెళ్ళి చేసుకున్నాననే ఆనందంలో పెళ్లి కొడుకు బాణాసంచ కాలుస్తూ కళ్ళ పోగొట్టుకుని భార్యతో తన దీనావస్థను

వివరించి రోదిస్తాడు. భార్యను మరో పెళ్ళి చేసుకోమని నాలాంటి అంధునితో ఉండి నీ జీనితమెందుకు నరకం చేసుకుంటావని చెప్పగా ఆమె అందుకు నిరాకరిస్తుంది.

అదే సమయంలో ఆ తల్లికి, ఈ నూతన దంపతులకు సుదర్సన్ అనే డాక్టర్ ఎంతటి చూపులేని వారికైనా చూపు తెప్పిస్తున్నాడని ఆయన్ని కలిసి వారి వివరాలు తెలియజేస్తారు. వారిద్దరికీ ఆపరేషన్ చేసి చూపు తెప్పిస్తాడు సుదర్శన్. ఇక వారి ఆనందానికి అవధు లుండవు. అయితే డాక్టర్ సుదర్శన్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నవత్యం ఆ వైద్య విద్యను తనకు నేర్పించమని సుదర్శన్‌ను కోరతాడు. ఏ కళైనా ఒక వ్యక్తితో అంతం కాకూడదనే నేను అడుగుతున్నాని పలువిధాలుగా ప్రాధేయ పడతాడు సత్యం. దానికి సుదర్శన్ ఒప్పుకోడు అది ఒకరు చెప్పి నేర్పిస్తే వచ్చేది కాదని దానికి నైపుణ్యం కావాలని, మనిషి పుట్టుకతోనే స్వతహాగా సృజనాత్మకత ఇండాలని అప్పుడే ా సాధనఉపయోగపడుతుందని దానిద్వారానే వ్యక్తి ఏపనిలోనైనా ప్రావీణ్యం సాదిస్తాడని మాట దాటవేస్తాడు.

ఇంటికి వెళ్ళి బార్యతో ముచ్చటించి తను తండ్రి కాబోతున్నానని తెలుసుకొని తనకు మరో కంటి డాక్టర్ పుట్టబోతున్నాడని ఆనందపడతాడు. అదే విషయాన్ని సత్యానికి చెప్పి, చూశావా రేపు నాకు పుట్టబోయేవాడు మరో కంటి డాక్టర్ అవుతాడని చెప్తాడు.

సరే పద రేపు జయపుగం రాజా వారికి కంటి ఆపరేషన్ చేయాలి వారి బంగళాలోనే పద వెళదాం అని బయలు దేరుతారు.ఆ సమయంలోకూడా సత్యం మళ్ళీ ఈ విద్య నాకు కాకున్నా మరెవరికి నేర్పి ఉన్నా ఈ సమయంలే ఉపయోగంగా ఉండేదని మరోసారి ప్రస్తావిస్తాడు అయినా సుదర్సన్ పట్టించుకోడు.

ఆప్రయాణంలో డాక్టర్ సుదర్శన్ కళ్ళు పోగొట్టు కుంటాడు. ఎంతగానో దుఃఖిస్తాడు. సత్యం నువ్వు ఎంత ప్రాధేయ పడినా నేను నేర్పలేదు ఇప్పుడు నా చూపే పోయింది.నువ్వు చెప్పినట్లే నీకు నేర్పుంటే ఇప్పుడు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని బాధపడుతుంటే, సత్యం డాక్టర్‌తో ఏం పర్వాలేదు డాక్టర్‌గారు నేను మీకు వైద్యం చేస్తాను మీకు నేను చూపు తెప్పిస్తాను అంటాడు. ఎలా? అని ప్రశ్నిస్తాడు సుదర్శన్ ఎన్నోసార్లు మీరు చేసే ఆపరేషన్స్‌లో ఆడవేషంలో మీ ప్రక్కనే ఉన్నాను, మీరు చేసే ఆపరేషన్స్‌ని దొంగచాటుగా చూశాను. మీరు ఏ కంటి వ్యాదికి ఏ మందు వాడేవారో ఆ ప్రిస్క్రిప్షన్‌ని నోట్ చేసుకునే వాడిని అని చెప్పి డాక్టర్‌కి ధైర్యం చెప్తాడు.

ఆపరేషన్ చేస్తాడు కట్ల విప్పగానే సుదర్శన్‌కి చూపొ స్తుంది అప్పుడు ఆనందపడి, ఆపరేషన్ చేసి భౌతికంగా పోయిన నా కళ్ళకు చూపు తెప్పించావు అలాగే అజ్ఞానంతో మూసుకుపోయిన నా మనో నేత్రాలను తెరిపించావు సత్యం అంటాడు ఇంతకితో నాటిక ముగుస్తుంది.

పాత్రల విశ్లేషణ :

డా॥. సుదర్శన్ :

పాత్రోచితమైన పేరునే కవి ఎంచుకున్నారు. వృత్తి రీత్యా అతను డాక్టర్ ఎంతటి చూపులేని వారికైనా కొత్త కొత్త ప్రయోగాలుచేసి చూపు తెప్పిస్తూ ప్రజలందరి మన్ననలు పొందుతుంటాడు. అందులోనూ ఆయన పేరుకూడా సుదర్శన్ మూందుచూపు కలవాడు అనే అర్థం తీసుకుని వృత్తికి, పేరుకు న్యాయంచేసే వ్యక్తిగా ఈ పాత్ర చిత్రించబడింది. ఈ పాత్రను లోతుగా విశ్లేషించేందుకు నాటిక ప్రారంభంలో అంధుని చేత పాడించిన చరణాలలో ఈ పాత్రకు సరిగ్గా తరిపోయే పాదాలు ఉన్నాయి అవి.

కళ్ళులేని కబోదులు కొందరు
కళ్ళుండీ కనజాలరు ఎందరో
లోపలి చూపేజ్ఞాన సమస్తం
లేకుంటే బ్రతుకంతా వ్యర్థం

ఈ పై వాక్యాలను గమనిస్తే సుదర్శన్ తన వృత్తిరీత్యా ఎంతోమంది చూపులేని వారికి చూపు తెప్పిస్తాడు. కానీ తన వైద్య విధానాన్ని నేర్పించమని ప్రాధేయపడిన

సత్యానికి మాత్రం నేర్పనంటాడు. అది నేర్పితో వచ్చేది కాదని డంభాలు పోతాడు. ఈ సందర్భంలో సుదర్శన్ కళ్ళుండీ చూడలేని వ్యక్తి అంటే సత్యాన్ని గమనించ లేని వ్యక్తి అనే అర్థం స్ఫురిస్తుంది. ఏ వృత్తియినా సమాజానికి ఉపయోగపడాలంటే సాధ్యమైనంత ఎక్కువ మందికి దాన్ని నేర్పించాలి కాని కుంచిత బుద్ధితో స్వార్థంగా ఆలోచిస్తే సుదర్శన్‌కు పట్టిన గతే పడుతుందని తెలియ జేసేందుకే సుదర్శన్ కళ్ళుపోయేలా కథను కవిగారు మలుపుతిప్పి సమాజంలోని ఇలాంటి వ్యక్తులవైపు ఒక ప్రశ్నను సంధించారు.

చూపు ఉండి వైద్యం చేస్తున్న సమయంలో డా॥ సుదర్శన్ అందరికీ చూపు తెప్పిస్తున్నానని నాలాంటి వైద్యుడు లేడని కళ్ళలో అజ్ఞానంలో ఉన్న వ్యక్తిగా కనిపిస్తూ, తనకూ ఆ వైద్య విధానాన్ని నేర్పితే మీ తరువాత ఈ విద్య చిరకాలం ఎందరో చూపులేనివారికి ఉప యోగపడుతుందని అని అర్థించే సత్యం అభ్యర్థనను అహంతో తోసిపుచ్చి తనకు మాత్రమే అది సాధ్యమని వేరొకరికి అసాధ్యమని తన వారసునికే ఇది అబ్బుతుందని ఇంకా పుట్టనే పుట్టని పిల్లవాడి గురించి ఆలోచిస్తాడే కానీ జీవితం క్షణ భంగురమని ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియదనే సత్యం చెప్పిన, సత్యవాక్కులను పట్టించు కోడు.

సుదర్శన్‌కు వైద్యచేసి సత్యం చూపు తెప్పించిన తరువాత అతను సత్యంతో తన అజ్ఞానానికి క్షమించమని సత్యాన్ని ప్రాధేయపడతాడు. ఈ సందర్భంలో అసలు చూపంచే వ్యక్తుల అంతర్గతమైన జ్ఞానం అదే అసలు చూపు అది లేకుంటే వ్యక్తి ఎప్పటికీ సమాజంలో వ్యక్తిగా మనలేడని అలాంటి వారి జీవితాలు వ్యర్థం అని తెలియజేస్తారు కవి.

ప్రాయిడ్ మనో విశ్లేషణ సిద్ధాంతం ప్రకారం డాక్టర్ సుదర్శన్ ఇడ్ కాంప్లక్స్‌తో ప్రవర్తించే పాత్రగా కనిపిస్తుంది. ప్రస్తుతం తన స్థితి తన వైద్య ప్రతిభ ఎవరికీ లేదు రాదు అనే ఇడ్ కాంప్లెక్స్‌తో సత్యం అభ్యర్థనని తోసిపుచ్చి, వైద్యం నేర్పితే రాదని దానికి ఎంతో ప్రతిభ కావాలని భూత, భవిష్యత్తులను వాస్తవికతను ఆలోచించకుండా ప్రస్తుతం తను ఉన్న స్థితితో తాత్కాలికంగా లభిస్తున్న ఆదరణతో తాత్కాలిక ఆనందంతోనే తృప్తి చెందే పాత్రగా మనం గుర్తించవచ్చు.

తల్లి, పుట్టుగ్రుడ్డి పిల్లవాడు :

హాస్పటల్‌లో నర్సు మగపిల్లవాడమ్మా అచ్చు నీలాగే ఉన్నాడనగానే సంభ్రమాశ్చర్యాలకు లోనవుతుంది. కానీ చూపులేదు పుట్టిగ్రుడ్డి పిల్లవాడనగానే బాధతో కుమిలి పోతుంది. ఆ సమయంలో మొదట బిచ్చగాని పాటలోని రెండు చరణాలు ఇక్కడ నప్పుతాయి.

చూపుంటేనే లోకం
అది లేకుంటే శోకం

ఈ పై మాటలను గమనిస్తే మగపిల్లవాడు పుట్టాడనం గానే ఆ తల్లి ఆనందం అంతాయిత కాదు కానీ కళ్ళు లేననేసరికి పడిపోతుంది. అట్టి జన్మ ఇచ్చిన భగవంతుడు కళ్ళు ఇయ్యమంటే ఆ జన్మ వృధా చూపే అన్నింటికీ ఆధారం చూపుండింటేని ఈ ప్రపంచ దాని తత్వం బోధపడేది అదే లేకపోతే చీకటి అంతా చీకటి అంటే శోకం. చూపులోనే ఈ సమస్త ప్రాపంచిక అనుభూతులు, అనుభవాలు ముడిపడి ఉన్నాయి. చూపే లేకపోతే ఆ జీవి పరిస్థితి అగోచరం అనే విషయాన్ని తల్లి పాత్రద్వారా ఆమెపడిన బాధ ద్వారా పాఠకులకు తెలియచేసారు కవి.

ప్రాయిడ్ మనోవిశ్లేషణ సిద్ధాంతం అనుసరించి తల్లిపాత్ర సూపర్ ఇగో కలిగినపాత్ర భూత, భవిష్యత్, వర్తమానాన్ని, వాస్తవికతను గుర్తించే పాత్ర. తను బాధకు లోనైంది ఈ సూపర్ ఇగోని అనుసరించే తలిగ్లా పిల్లవాడి స్థితిని తలుచుకొని ఇక వాడు జీవితాంతం ఒకరిపైన ఆధారపడటమేనా అనే ఒక వాస్తవిక దృష్టితో కలిగిన ఆలోచన వలననే సుదర్శన్ డాక్టర్ ఆపరేషన్ చేస్తే కళ్ళు వస్తాయని, ఆయన మంచి వైద్యుడని, తన పిల్లవాడికి ఆపరేషన్ చేయించే సంధ్భంలోనూ ఆమె తాత్కాలికమైన

ఆనందం కంటే ఆలోచనతో కూడిన దూరదృష్టి, పిల్లవాడి భవిష్యత్తు, చూపువస్తే ఆ పిల్లవాడికి తమ కుటుంబానికి కలిగే ప్రయోజనాలన్నింటిని ఆలోచిస్తుంది. ఇది సూపర్ ఇగోతోనే సాధ్యం కనుక ఈ పాత్రలో మనం సూపర్ ఇగో చూడవచ్చు.

భార్యభర్తలు :

పెళ్ళి అందులోను తను కోరుకున్న అందమైన అమ్మాయితో ఆనందం వట్టరాని ఆనందం ఆ సందర్భంలో పెళ్ళి కొడుకు మనస్థితిని అద్దంపట్టేవే ఈ క్రింది చరణాలు

అందంలో ఆనందం ఉంది
ఆ అందం కన్నెదుటుంది

అందమైన భార్యను చేసుకుంటున్నాను. ఆ అందం నాకే సొంతం అనీ ఆనదంతంతో పెళ్ళికొడుకు పొంగి పోతుంటాడు. అందం అశాశ్వతమని అది కొంత కాలమే ననే వాస్తవికతను తెలుసుకోలేని తాత్కాలికమైన ఆనందంలో ఉంటాడు. ఆ ప్రమోదంలోనే ప్రమాదం ముచ్చుకొచ్చి అతను చూపు కోల్పోతాడు.

అప్పుడు అందరూ ఇక ఆ పిల్ల జీవితం అడవికాచిన వెన్నెలేనా ఈ గుడ్డివాడితో ఆ అమ్మాయి జీవితం నాశన మేనా అయ్యో! ఇంత అందం అడవి కాచిన వెన్నెలేనా! అని అంటుంటే. పెళ్ళికొడుకు ఎంతో బాధతో కుంగి పోతాడు. ఆ సమయంలోనే ఆమెను వేరొక వివాహం చేసుకొమ్మని కోరతాడు. తనకోసం భార్య జీవితం, అందం, వయస్సు ఎందుకు వృధా కావాలనే తాత్విక దృష్టితో ఆమాటలు అంటాడు. ఆమె మాత్రం ఒప్పుకొదు ఈ సమయంలో వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఎంతో ప్రాధాన్యతను కలిగినది. జీవిత వాస్తవికతను తెలుసు కున్న రెండు పాత్రలుగా చిత్రించారు కవి.

ఫ్రాయిడ్ మనో విశ్లేషణ సిద్ధాంతం :

ఈ సిద్ధాంతం ప్రకారం మొదట పెళ్ళికొడుకు ఇగోతో ప్రవర్తించే పాత్రగా పేర్కొనవచ్చు. తాత్కాలికమైన అందం గురించే ఆలోచించినా అందులో నిజాయితీ ఉంది. వాస్తవం కూడా ఉంది తను ధర్మబద్ధంగానే ఆ అందాన్ని సొంతం చేసుకుంటున్నాడు. అతని ప్రకారం ఆమెను అందరి ఆమోదంతోనూ ముఖ్యంగా ఆ అమ్మాయి ఆమోదంతోనే వివాహం చేసుకుంటున్నాడు. ఇందులో ఎలాంటి తప్పులేదు. వాస్తవికంగానే అంతా జరిగినప్పటికీ దురదృష్టం వెంటాడి చూపుపోతుంది.

ఆ సమయంలో తనను పెళ్ళిచేసుకున్నందుకు ఆమె జీవితం ఎందుకు నాశనం కావాలని, తన భార్యను మరళా వివాహం చేసుకోమని కోరడంలో ఆ భర్త మనసు సూపర్ ఇగోతో కూడిన ఆలోచనతో అన్న మాటలే, అది అక్కడ తాత్కాలికమైనదో లేక తను అనుకూలమైన నిర్ణయమో తెలుసుకోకుండా అక్కడ ఇడ్ ఇగోలను పక్కకు తోసి ఉదాత్తమైన నిర్ణయాన్ని తీసుకోవటం అంటే అదే ఇడ్ ఇగోలను సమన్వయం చేసే సూపర్ ఇగోతోనే సాధ్యం మొదట ఇగోలో ఉన్న ఆ పాత్ర చివరకు సందర్భంసారంగా సూపర్ ఇగోతో ప్రవర్తించేలా రచయిత పాత్రలను రూపొందించారు.

సత్యం :

ఈ నాటిక మొత్తానికి రెండు పాత్రలు ప్రధానం. ఒకటి సుదర్శన్ రెండు సత్యం. సత్యం, డాక్టర్ సుదర్శన్ దగ్గర అసిస్టెంటుగా పనిచేస్తుంటాడు. పూర్తి పరిపక్వత వాస్తవికతను తెలియజేసిన వ్యక్తిగా అంత గొప్పవిద్య డాక్టర్‌తోనే అంతం కాకూడదనే ఉద్దేశ్యంతో ఆ విద్యను తనకు నేర్పమని తద్వారా విపత్కాలంలో గానీ తనంతరం తనద్వారా గానీ ప్రజలకు ఉపయోగపడుతుందని ఎంతో ఉదాత్తంగా ఆలోచించిన పాత్ర సత్యం పాత్ర. ఈ సందర్భంలో మనకు నాటిక ప్రారంభంలోని పాటలో చరణాలు ఈ పాత్రను ఉద్దేశించినవిగా తోస్తాయి.

లోపలి చూపే జ్ఞాన సమస్తం
లేకుంటే బ్రతుకంతా వ్యర్థం

ఈ పై చరణాలలోని ప్రతీపదం సత్యం పాత్రలో రచయిత పొందు పరచాడు. ఆ దూరదృష్టి ఉన్నందునే

నత్యం, డాక్టర్ వైద్యం నేర్పించపోయినా దొంగచాటుగానూ మారువేషంనూ సర్జరీలలో పాల్గొని ఏ ఏ దృష్టి దోషాలకు ఏ ఏ మందు రాస్తున్నారో ఆ మందులు చీటీలను గమనించి తనంతట తాను ఏకలవ్యుడిగా స్వయం కృషితో వైద్యాన్ని నేర్చుకున్నా ఏనాడు సుదర్శనకు ఈ విషయాలు చెప్పడు. చివరకు సుదర్శన్ దృష్టిని కోల్పోయినప్పుడు అతనికి వైద్యంచేసి చూపు తెప్పించి అసలు విషయాన్ని బహిర్గతం చేస్తాడు. వాన్తవికతను ఆలంబనగా చేసుకొని నడిచిన గొప్పవ్యక్తిత్వం ఉన్న పాత్ర సత్యం పాత్ర.

ప్రాయిడ్ మనోవిశ్లేషణ ఆధారంగా సత్యంపాత్ర ఆసాంతం సూపర్ ఇగోతో నడిచిన పాత్ర, స్వార్థం, అహం లేకుండా ఒక గొప్ప విద్య. అందరికీ ఉపయోగపడవలసిన విద్య, ఎందరికో అవసరమైన విద్య ఇలా వృధా కాకూడదనే సామాజిక ప్రయోజనం పరోపకార చింతన కలిగిన పాత్ర ఇవి సూపర్ ఇగో లక్షణాలు అతని మనస్సులో ఈ లక్షణాలుండటం చేతనే డాక్టర్ ఇష్టపడనప్పటికీ మారువేషంలోనూ, చాటునుంచీ చూసి వైద్యవిధానాన్ని మందులను అవపోసన పడతాడు. కానీ ప్రతిసారీ డాక్టర్‌ని తనకు వైద్య విధానాన్ని నేర్పింపమనే అడుగుతుంటాడు. ఎందుకంటే తను నేర్చుకున్న ఈ కొద్దిపాటి విద్య ఇంకా పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగపడాలంటే పూర్తి స్థాయిలో ఒక డాక్టర్ పర్యవేక్షణలో నేర్చుకుంటేనే అందులే నేర్పు సాధ్యపడుతుందని అతని ఆశ అంతలోనే డాక్టర్‌కే చూపు పోతుంది. గత్యంతరం లేని స్థితిలో డాక్టర్‌కి వైద్యం చేయాల్సి వస్తుంది. ఆ సమయంలో డాక్టర్ సత్యాన్ని ఎలా చేస్తావు సత్యం, నీవు ఎంత ప్రాధేయపడినా నేను నీకు నేర్పలేదని అంటే, సత్యం తను ఎలా ఈ విద్యను నేర్చుకున్నాడో వివరిస్తాడు.

డాక్టర్‌కు చూపు వస్తుంది అప్పుడు పూర్తిగా అహాన్ని వదిలి, సత్యాన్ని ఎంతగానో మెచ్చుకుంటాడు. ఆ సందర్భంలోనే నా కళ్ళు తెరిపించావు సత్యం ఇవాళ నీవు లేకపోతే నీవన్నట్లే నాతోనే ఈ విద్య అంతరించి పోయేది. నీవు నిస్వార్థంగా నేర్చుకున్న విద్య వలననే నేను ఇవాళ చూడగలుగుతున్నానని తన తప్పుకు చింతిస్తాడు.

ఈ సందర్భంలో సత్యంపాత్ర ఏ లాభాపేక్షను గానీ, ఎటువంటి స్వార్థాన్ని గానీ కనబరచలేదు. కేవలం పరోపకారం కోసం మాత్రమే పాకులాడిన పాత్ర సత్యానిది. ఎంతో దీక్ష సంకల్పం ఉంది కనుకనే వైద్యాన్ని దూరం నుంచి చూసి డాక్టర్ నేర్పకపోయినా నేర్చుకోగలిగాడు. కనుకనే ఈ పాత్ర నాటిక ఆసాంతం ప్రతి సందర్భంలోనూ సూపర్ ఇగో అనే మనస్తత్వ లక్షణాన్ని కనబరచిన ఏకైక పాత్రగా చెప్పాలి.

ముగింపు :

ఈ విధంగా ఆత్రేయ గారి నాటిక సంపుటిలోని తెరచిన కళ్ళు నాటికను మనోవిశ్లేషం సిద్ధాంతం ఆధారంగా విశ్లేషించాను. ప్రతీపాత్రను రచయిత ఎంతో ఆలోచనాత్మకంగా రూపొందించారు. ఆ పాత్రల వృత్తి, చేతలు, మనస్థత్వం ఆధారంగానే పేర్లను చూచించి కథలోకి వెళ్ళేముందే బిచ్చగాడి పాత్రద్వారా నాటిక సారాంశాన్ని ముందే ప్రేక్షకులకు వివరించాడు ఆత్రేయ. ఈవిధంగానే లోకంలో ఎందలో అజ్ఞానంతో విలువైన కళలను ఎవరికీ నేర్పకుండా వాటిని ముందు తరాలకు అందనీ కుండా వారి గోతిలో వారే పడుతున్నారు ఇలాంటివి సమాజీనికి అంత శ్రేయస్కరంకాదునే విషయాన్ని ఈ నాటిక ఆధారంగా నైనా తెలుసుకుని మెల్కొంటే సమాజానికి ఎంతో మేలు చేకూరుతుంది.

ఆధార గ్రంథాలు :

1. ఆత్రేయ నాటికల సంపుటి (ఆత్రేయ)
2. సైకో ఎనాలసిస్ (ఫ్రాయిడ్)
3. తెలుగు నవలో సాహిత్యంలో మనోవిశ్లేషణ(కోడూరి శ్రీరామమూర్తి)

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చర్లపల్లి కట్టమైసమ్మ పండుగ – వైశిష్టత

- ఏర్పుల నరసింహ, పరిశోధక విద్యార్థి, జానపద కళలశాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి , హైదరాబాదు.

గ్రామదేవత :

వ్యవసాయ ప్రధానమైన పల్లెలన్ని దుష్ట - శిష్ట శక్తుల చేత ఆవరించబడి వున్నాయని, దేవతలకు అనుగ్రహం కల్గితే గ్రామం ఆరోగ్యంతో , పాడిపంటలతో తులతూగు తుంది. అంటురోగాలు, పశురోగాలు, భూతప్రేతలు, పిశాచాల పీడ. ఆకస్మిక మరణాల నుండి రక్షిస్తు పొలిమెరలో సదా కాపు కాస్తుండే దేవతలనే "గ్రామ దేవతలు " అంటారు. మన దేశంలో నాగరికుల కన్నా జానపదులే ఎక్కువ. పల్లెల్లో నివసించే జానపదుల స్త్రీ దేవతల పైన భక్తి అధికం. కాబట్టి అనుగ్రహం కోసం బలుల్ని, నైవేద్యాన్ని అర్పించి ఆనందోత్సహాలలో పండుగ జరుపుకుంటారు. ఈ గ్రామదేవతల ఆవిర్భావం, వారిని పూజించకపోవడం వల్ల కలిగే అరిష్టాలు వేసుకోవడానిక ఆసక్తిగా ఉంటాయి. వైదిక మతస్తులు దైవారాధనకు, గ్రామదేవతల ఆరాధనకు మధ్య హస్తమశకాలకున్నంత అంతరం ఉంటుంది. గ్రామ దేవతలను పూజించటానిక మాల, మాదిగ, బైండ్ల, కుమ్మరి, మంగలి, సాకలి మొదలైన నిమ్నజాతి వారిని నియమిస్తారు. గ్రామదేవతల పూజాకార్యక్రమాల్లో మద్యం, మాంసాల డప్పు చప్పుడ్లు వాయించడం వంటి వాటికే ప్రాముఖ్య స్థానం. గ్రామదేవతల పండుగలకు నిర్ణిత దినం లేదు.

చారిత్రక నేపథ్యం :

వ్యవసాయక ప్రధానమైన దేశంలో సఫలస్థితి గ్రామదేవతరాధనగా మారి ఉండడంలో ఆశ్చర్యం లేదు. దీన్నే 'హెన్రీ వైట్ హెడ్ గారు" తన మార్గదర్శక రచన "Village gods of south India" అనే పుస్తకంలో probably these. Village deities came into being at the period when the people began to settle down in Agricultture communities. ఇవన్ని ప్రాయికంగా శక్తి రూపాలని అతి ప్రాచీన కాలంలోనే శివ, విష్ణువులతో సమానంగా దైవత్రయితో శక్తి స్థానాన్ని పొందిందనీ, సింధు నార్తి నుండే శక్తి ఆరాధన భారత దేశంలో ఉందనడానికి త్రవ్వకాల్లో బయల్పడ్డ స్త్రీ మూర్తి విగ్రహాలే ఆధారమని డా॥ పుష్పేంద్రకుమార్" గారు Sakti Cult in Ancient India అనే గ్రంథంలో వివరిస్తాడు.

అదే విధముగా మా ఊరి గ్రామదేవత అయినటు వంటి కట్టమైసమ్మ, గ్రామం చర్లపల్లి మండలం, నల్లగొండ జిల్లా, తెలంగాణలో కూడా చాలా సంవత్సరాల నుండి మా తాత మూత్తాతలు కటమైసమ్మ పండుగని జరుపు కొంటున్నారు. ఈ యొక్క గుడి కాకతీయ రాజుల కాలంలో త్రవ్వ బడిన చెరువు కట్ట మీద వెలసినది. కావున ఈ మైసమ్మను మా ఊరి ప్రజలు కట్ట మైసమ్మ అని పిలుచుకొంటారు.

పండుగ జరిపే విధానం :

ఊరి చెరువు నిండి, చెరువు కింది భూములో పంటలు పండి కోతకి వచ్చే సమయంలో ఊరి ఆసాములు (భ్యూములు), రైతులు, మాదిగ కుల పెద్దలను పిలిచి పంట కోతకి వచ్చింది. కనుక కట్టమైసమ్మ పండుగ జరిపిద్దాం అని చెప్పి అందరు కలిసి పండుగ చేసే రోజును నిర్ణయిస్తారు. పండుగ నిర్ణయించిన రోజును ప్రజలకు తెలియజేయుటకు ఊరిలో డప్పు చాటింపు వేయిస్తారు. కట్టమైసమ్మ పండుగను శనివారం సాయంత్రం ప్రారంభించి, ఆదివారం తెల్లవారుఝామున ముగిస్తారు. అదేవిధంగా మాదిగల వాడలో డప్పు చప్పుడ్లతో కనీసం ఐదు ఇండ్లల్లో 'జోగు' అడుగుతారు ఇది. అనావాయితిగా వస్తున్న సంప్రదాయం.

పండుగకి కావాల్సిన డబ్బులను ఊరిలోని ఆసాములు, రైతులు, చందాలుగా వేసుకొంటారు. మిగత కులాల వారు తమకి తోచినంత డబ్బును,

చందాలుగా ఇస్తారు. ఇలా మొత్తంగా వచ్చిన డబ్బును మాదిగ కుల పెద్దకు ఇస్తారు. ఈ పండుగను మాదిగ కులస్థులు ముందుండి జరిపిస్తారు. ఇది అనాదిగా వస్తున్న సాంప్రదాయం. అదే విధంగా కుమ్మరి వారు - కుండలు, గురిగీలు, కంచుడ్లు ఇస్తారు. గౌండ్లవారు- కుండ కల్లుని ఇస్తారు. పద్మశాలి- తెల్లటిదోతులని ఇస్తారు. రైతులు- కోడిని ఇస్తారు. వసూలు అయిన చందానుంచి కొంత డబ్బుతో దున్నపోతు, గొర్రె పిల్లని మరియు పండుగకు కావాల్సిన వస్తువులను తెస్తారు.

పండుగ రోజు ఉదయం సాకలి వారు గుడి చుట్టు శభ్రం చేస్తారు. మాదిగ కులస్థులలో ఒక భాగమైన ఇసరం వారు కత్తి, గండ్ర గొడ్డలిని తీసుకొని వాటిని ఒక పెద్ద గుడ్డ చుట్టి కమ్మరి దగ్గరికి సర్సమని (పదును పెట్టమని) ఇస్తాడు. తరువాత సాయంత్రానికి ముందే తెచ్చి ఇంట్లో పెడతాడు. అదేరోజు దున్నపోతుని మాదిగ వాడిలో ఇసరం వారి ఇంటి దగ్గర కట్టేస్తారు. గొర్రెపిల్లను సాకలి వారి దగ్గర ఉంచుతారు.

పండుగని సాయంత్రం ప్రారంభించి దున్నపోతుని కడిగి పసుపు, కుంకుమ, పూలు, వేపమండలతో అలం కరించి బండారు వేసి డప్పుచప్పుల్లతో మాదిగ వాడ నుండి గుడికి బయలుదేరుతారు. దీనితో పాటు కత్తి, గండ్రగొడ్డలి, మరియు చాట, గంప తీసుకొని డప్పు చప్పుడ్ల ఊరేగింపుగా వస్తారు. దున్నపోతు బలిష్ఠంగా పొగరుతో ఉంటుంది. దీనిని అదుపుచేయడం మనుషులకు చాలా కష్టం కాబట్టి దున్నపోతును ఎడ్లబండి వెనకాల కట్టి తీసుకొస్తారు. మాదిగల ఇంటి ముందుకి దున్నపోతు రాగానే నిండు నీళ్ళు బిందతో దున్నపోతు పైన మరియు కాళ్ళకి ఆరబోసి, పసుపు, కుంకుమ, పూలు, కొబ్బరికాయ కొట్టి మొక్కుతారు. ఈ దున్నపోతుని సాక్షాత్తు అమ్మవారి ప్రతిరూపంగా జానపదులు భావించి పూజలు చేస్తారు. ఇలా డప్పు చప్పుడ్లతో వెళ్ళుతుంటే కొంత మంది స్త్రీలు జుట్టు విరబోసుకొని, చేతుల్లో వేపరిల్లల్లు పట్టుకొని సిగాలు ఊగుతూ, చిందులు వేస్తారు. వీరి చిందులకు అనుగుణంగా డప్పులను వాయిస్తారు. ఇలా వెళ్తూ ఊరి బొడ్రాయి దగ్గర ఆగుతారు. బొడ్రాయి దగ్గరకి కుమ్మరివారు ఐదుకుండలు, నాలుగు గురిగీలు. ఐదు కంచుడ్లను ఒక బస్తలో కట్టుకొని వస్తాడు. సాకలి వారు గొర్రెపిల్లతో, మంగలి వారు దీవిటిలు (కాగడ)ను తీసుకొని బొడ్రాయి దగ్గరికి వస్తారు. ఇక్కడ అందరు గుంపుగా చేరాక బస్తలోని గురిగీలు, తీసి గంపలో పెట్టి పండగ సామానును తట్టలో పెట్టి బొడ్రాయి ముందు ఉంచి పసుపు, కుంకుమ, పెట్టి నిమ్మకాయ కొసి, కొబ్బరికాయ కొడుతాడు. అన్ని దేవుళ్ళని కొలిచి (మొక్కి) మూతికి గుడ్డ కట్టుకొని గంప ఎత్తుకొని వెళ్తూ మార్గ మధ్యలో ఏదైనా గుడి ఎదురైనా అక్కడ నిమ్మకాయ కోసి కొబ్బరి కాయను కొడుతారు. ఇలా డప్పుల చప్పుడ్లతో సిగాలతో చిందులు వేస్తూ గుడిని చేరుకుంటారు.

బైండ్లవారు :

మాదిగ కులస్థులకు పెండ్లీలు, తద్దినం, పండుగలు చేయు పూజారి, పూరోహిత్యం చేస్తాడు.

కట్ట మైసమ్మ గుడిని చేరుకోగానే నెత్తిన గంప, చాటలను గుడి పక్కన పెడుతారు. దున్నపోతు, గొర్రెపిల్లని వేరువేరుగా పక్కకు కట్టేస్తారు. డప్పు చప్పుడ్లలో గుడికి తోర్నపాకు కడతారు. బైండ్లవారు గుడి ముందు వడ్లతో పోలు రాసి, నాలుగు వైపుల నాలుగు గురిగీలు పెట్టి వాటి చుట్టూ మూడు వరసలు దారం చుట్టుతారు.

వేపరిల్లలు, కోడిని రెండింటిని పట్టుకొని పాట పాడుతూ పోలు చుట్టు తిరుగుతూ చుట్టు ప్రధాన కథకుడు కల్లు ఆరబోస్తుంటారు. వంతకులు జమిడిక వాయిస్తూ, వంత పాడుతారు. పాటలు పాడి కోడిని పోలు మధ్యలో పెట్టి వేపరిల్లలను కప్పి కోడిని మత్తుగొల్పు తాడు. దీనినే దేవతకి 'మైలలు' తీయడం అని అంటారు. తర్వాత సాకలి వారు గుడికి సున్నం వేస్తారు.

బైండ్లవారు వడ్లపోలును ఎత్తుకొని పక్కకు పెట్టి కలిసి గజ్జలు కట్టి, మైసమ్మ కథను చెప్తాడు. వంతకులు వంతపాడతు, జమిడిక, తాళం వాయిస్తారు.

అల్లోనేరడల్లో... అల్లోనేరడల్ల
అల్లల్ల నేరడి.. అల్లనేరడి
అల్లోనేరడల్లా...

అంటు మైనమ్మ కథను పూర్తిగా చెబుతూ, ప్రజలు మెచ్చుకొనేలా కథను రక్తి కట్టించి, ఆసక్తికరంగా కథను చెప్తుతాడు. కథ పూర్తి అయ్యే సమయానికి తెల్లారుతుంది. అప్పుడు మాదిగ కుల పెద్ద, మరియు యువకులు కొంత మంది చెరువు కింది పంట పొలములోంచి ఐదు దొసిళ్ళు కొత్త వడ్లని దుస్సి ఒక తువలతో కట్టి గుడి దగ్గరికి వచ్చి మరొక తువలా కుందెనల చుట్టి మధ్యలో వడ్ల వున్న తువాలను పెట్టి ఐదుగురు మాదిగ వాళ్ళు ఐదు కర్రలతో దింపుడు గొట్టాలు చేస్తారు. ఇవి బియ్యంగా తయారువుతాయి. బైండ్లవాళ్ళు బియ్యంతో పాలు రాసి నాలుగు వైపుల గురీగిలు పెట్టి వాటి చుట్టు మూడు వరసలు దారం చుట్టుతాడు. దీనిని కొంత సేపు గుడి ముందు ఉంచిన తరువాత ఎత్తి పక్కన పెడతారు. తరువాత ఇదే స్థానంలో పటం వేస్తారు.

పటం :

ఒక ప్రత్యేకమైన చెక్కకు, కుంకుమ, పసుపు, సున్నంలతో పూసి గుడి ముందు నేల మీద అచ్చు వేసే దానిని 'పటం' అంటారు. ఈ పటాన్ని ఎక్కువగా పండుగలకు వేస్తారు

కుమ్మరివారు తెచ్చిన ఐదు కుండలలో ఒక కుండలో దంపుడు గొట్టాటు చేసిన బియ్యంని వండి నైవేద్యంగా వండుతారు.

రెండవ కుండలో జొన్నలు ఉడికిస్తారు, మూడవ కుండలో కల్లును పోస్తారు. నైవేద్యం వండేటప్పుడు, దేవతలకి వడ్డించేటప్పుడు కుమ్మరి అతను మూతికి గుడ్డ కట్టుకొని వడ్డిస్తాడు. నాలుగు భాగాలకు చెందిన మాదిగలు మరియు చాకలి కులస్థుడు తెల్లదోతులు కట్టుకొని అందులో 101రూ॥ మంతరించిన నిమ్మకాయను నడుము దగ్గర చెక్కుతారు. మరొక నిమ్మకాయ నొట్లో పెట్టుకొని సిద్ధముగా ఉంటారు. బైండాయిన కూడా ఇలానే రెడిఅయ్యి సిద్ధంగా ఉంటాడు. విరికి మంత్రించిన నిమ్మకాయలతో పాటు 'జంజము' కూడా వేస్తాడు.

మాదిగ కులస్థులలో ఒకరు ఒక కుండను తీసుకొని చెరువులో దిగి నీటిని తీసుకొచ్చి గొర్రెపిల్లపై నీళ్ళు పోసి బండారు వేనడప్పు చప్పుడ్లు చేస్తారు. గొర్రెపిల్లలు జెల్త్/ జల్తా ఇస్తుంది. ఆ వెంటనే కింద పడేసి పిల్లని, గొర్రెని చాకలి వ్యక్తి బలి ఇస్తాడు.

పిల్లను కోసి పక్కనపెట్టి, గొర్రె తలకాయను వేరు చేసి దాని నోట్లో కాలు విరిసి పెట్టి గుడి ముందు ఉంచి కుంకుమ, పసుపు చల్లుతాడు. ఆ వెంటనే బలమైన మాదిగ యువకులు కొంత మంది పగ్గాలతో దున్నపోతు నాలుగు కాళ్ళకు, కొమ్ములకు పగ్గాలు కట్టి నాలుగు వైపుల గుంజి తల గుడి ముందు ఉండేటట్లు ఉంచుతారు. అప్పుడు బీపంగి అతను కత్తి పట్టుకొని దున్నపోతు మెడని రక్తం వచ్చేటట్లు కోస్తాడు. దీనినే 'కత్తిమోపడం' అని అంటారు. తరువాత ఇరసం అతను పెట్టి గండ్ర గొడ్డలితో మూడు లేదా ఐదు వేట్లతో తలని నరుకుతాడు. తెగిపడిన తలని ఒక చాటలో కాలు విరిచి నోట్లో పెట్టి తలకాయ పై దున్నపోతు పర్ర/పలుచటి కొవ్వు పొరని కప్పి నుదిటిపై రూపాయి బిళ్ళని పెట్టి పసుపుని కుంకుమ చల్లి గుడి ముందు ఉంచుతారు. దీనినే తలపండు అంటారు..

కొంతసేపు ఉంచిన తర్వాత ఇసరం అతను ఆ కలపండు పేట్టిన చాట ను ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో మూడు సార్లు గుడి చూట్టు తిరుగుతాడు. తురవాత సాట తీసి తలపండు గుడి ముందు ఉంచుతారు.

రక్తంలో ఉన్న చాటలో నైవేద్యం, ఉడికించిన జొన్నలు అదేవిధంగా గొర్రె కసరు, దున్నపోతు కసరుని మిశ్రమంగా కలుపుతారు దినినే 'బలిచాట' అంటారు. చాకలి వ్యక్తి ఇలా తలపై పెట్టుకొంటాడు.

కసరు గంప :

దున్నపోతు పొట్టలోని కసరును కొంత గంపలో

ఎత్తుతారు. దీనినే కసరుగంప అంటారు. దీనిని'బొజ్జవారు' ఎత్తుకొంటాడు.

గటంకుండ :

ఒక కుండలో కల్లు మరియు నీళ్ళని నింపి కుండ వెనుక వైపు రంధ్రం చేస్తారు. ఈ రంధ్రం గుండా కల్లు కారుతుంది. ఈ కుండనే 'గటంకుండ' అంటారు. దీని ద్వారా కారే కల్లు భూదేవికి ఆరబోసినట్లు భూమాతకి దాహం తీర్చువాడు అని భావిస్తారు. వీటన్నింటిని కెల్లా పుణ్యకార్యంగా దీనిని చెప్పుకుంటారు. ఈ గటంకుండని 'ఏర్పులవారు' ఎత్తుకుంటాడు

ఈ కులస్థులతో పాటు బైండ్లాయన గొర్రె కాలయాన్ని, దొబ్బని నోటితో గాలి ఊది నోటకరచి మెడలో పేగులు వేసుకొని గొర్రె వేనక కాలు సప్పను కోసి కుడి చేతిలో పట్టుకొని, కుండ ఎత్తుకొని గుడి చుట్టూ డప్పు చప్పుడ్లతో మూడు సార్లు తిరిగి సాకలి అతను బలిసాటలోని బలిని చెరువులో చల్లుతారు. ఆ తర్వాత కట్ట కిందికి దిగి పొలిమెర దగ్గరికి వెలుతుంటారు. ఈ సమయంలో పండుగ రోజు తెల్లువారుఝాము నుండి పక్క ఊరి వారిని ఊరి పొలిమేర దాటి లోపలికి రానివ్వరు. ఈ విషయాన్ని ఒక రోజు ముందే చుట్టూ పక్కల ఊరి వాళ్ళకు చెప్పతారు. వారిని ఊరి పొలిమేర దాటి లోపలికి రానివ్వరు. అలా పొలిమేర దగ్గరికి (మొసలబాయి) వెళ్ళి అక్కడ వీరుని గండికి నిమ్మకాయ కోసి, కొబ్బరి కాయను బైండ్లాయన కొట్టి తిరిగి డప్పు చప్పుడ్లతో కట్ట మైసమ్మ గుడి చేరుకొని సాట, గంప, కుండలు అన్ని చెరువులో కడిగి గుడిలో పేడతారు. బైండ్లాయన కుండ చుట్టు ఉన్న అంచును తీసేసి దానిలో యాపరిల్లలు, చిల్లర పైసలు వేసి గల్లు గల్లుమని ధ్వనులు చేస్తూ కొపెంపర తలమిద పెట్టుకొని

అమ్మావారి కొప్పెర
మైసమ్మవారి కొప్పెర అని

అంటు పాట పాడుతు పండుగ చూడాడానికి వచ్చిన ప్రజల దగ్గర డబ్బులను యాచిస్తుంటాడు. వీరు డబ్బులను కొప్పెరలో వేస్తారు. ఇలా అందరు చదివింపుల డబ్బులు తీసుకొని, పాలు రాసిన వడ్లు, బియ్యం, మత్తుకొలిపిన కొడి, ధరించిన కాలెయం, పేగులు, తీసుకొని ఇంటి వేళ్తాడు.

ఆ తరువాత గుడి ముందు సరదాగా మాదిగ కులస్థులు పాటలు పాడుతారు.

తాల్లెల్ లై లెల్ లై లో
శివ తాల్లెల్లై లెల్ లై లో ॥2॥
ఓరోరి మాదిగ వయ్యారి మాదిగ
రాజుగారు నిన్ను రమ్మనేయ ॥తాల్లెల్ లై ॥
రాజుగారు రమ్మన్నా విషయం
రాతిరే నాకు తెలిసిందయ్యా ॥తాల్లెల్ లై॥
రాజు గారి కాడికి పొదామనుకుంటే
కల్లు కుండ నన్ను ఆపిందయ్యా ॥తాల్లెల్లై ॥

ముగింపు :

ఒకప్పుడు చుట్టురా పల్లెల్లో ఉన్న జన సందోహం, వారి పండుగల సంబరాలు , జాతర వేడుకలు సమిష్టి జీవనం పూర్తిగా తగ్గిపొతుందని చెప్పవచ్చు. కొన్ని ప్రాంతాలలో వర్షాలులేక పంటలు సాగు లేక త్రాగుననీరు కూడా లేక గ్రామాలను విడిచి పట్టణాలకు వెళ్ళి పొతున్నారు. సహజ వృత్తులను వదిలి ఇతర పనులకు వెళ్ళుతున్నారు. నిమ్నజాతివారు విద్యాధికులు కావడంతో పాటు రేడియోలు, టెలివిజన్లు, వార్తపత్రికలు, సినిమాలు మొదలైన వైజ్ఞానికి ప్రచార సాధానాల ప్రభావానికి బాగా లోనుకావడం వల్ల వారి విశ్వాసాల్లో అపరిమితంగా మార్పు వచ్చింది. జానపదులకు శాంతి సౌఖ్యాలను చేకూర్చేవారు ఎవరో కాదు, వారు నమ్మిన గ్రామదేవతలే. అలాంటి వారి చరిత్ర సంస్కృతి నాగరికతలో ఎంతో నిగూడర్థం దాగి ఉన్నది.

విషయదాతలు :

1. ఏర్పుల మారయ్య

2. ఏర్పుల సంజీవ - గటం కుండ (మోసేవాడు)
3. బొజ్జ మత్తయ్య - కసరు గంప(మోసేవాడు)
4. కందుకూరి రామచంద్రుడు - కథ చెప్పేవాడు
5. ఇసరం భిక్షమయ్య . తలపండు (మోసేవాడు)

ఉపయుక్త - గ్రంథాలు :

1. తెలుగు వారి జానపద కళరూపాలు- మిక్కిలినేని రాధాకృష్ణ
2. గ్రామదేవతల జాతర - పొన్నా లీలావతమ్మ
3. జానపద సాహిత్యంలో గ్రామదేవతలు - డా॥ బుక్కా గంగిరెడ్డి

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

స్త్రీవాదంలో 'ఓల్గా'

- గొండ్ల విజయకుమారి, పరిశోధక విద్యార్థిని, తెలుగు మరియు తులనాత్మక సాహిత్యశాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

ఫెమినిజం 17వ శతాబ్దంలో ఇంగ్లాండులో మొదలై తర్వాత 19వ శతాబ్దం నాటికి ఫ్రాన్స్ అమెరికా మొదలైన దేశాలలో విస్తరించినట్లు చరిత్ర చెబుతుంది. అన్ని రకాల ఉదారవాద ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు పుట్టుకకు కారణమయిన పెట్టుబడిదారి వ్యవస్థే స్త్రీవాదానికి కూడా కారణమయింది. ఈ సమాజంలో పారిశ్రామికీకరణ, సంఘసంస్కరణ ఉద్యమాల ఫలితంగా స్త్రీలు విద్య, ఉద్యోగాల్లో ప్రవేశించడం వల్ల ఒక మధ్యతరగతి వర్గం ఆవిర్భవించింది. ఈ విధంగా స్త్రీవాదానికి కావలసిన పునాధి ఏర్పడింది.

మనదేశంలో స్వాతంత్ర్యానంతరం దేశ ఆర్థికవ్యవస్థలో చోటు చేసుకున్న అనేక విపరిణామాల మూలంగా కుటుంబవ్యవస్థలోకి వరకట్న దురాచారం ప్రవేశించింది. ఆ దురాచారం వేళ్ళూనుకుంటున్న దశలో స్త్రీ విద్యా, ఉద్యోగ ప్రాధాన్యతను సమాజం గుర్తించడం జరిగింది. క్రమంగా అంతర్జాతీయ మహిళా సంవత్సరం 1975 నుండి స్త్రీలు ఉద్యోగాలు చేయడంతో సామాజిక, కుటుంబ ఆర్థిక అవసరంగా తయారయింది. ఈ క్రమంలో స్త్రీలలో వ్యక్తిత్వ వికాస కాంక్ష, ఆర్థిక స్వాతంత్ర్య కాంక్షలు మొగ్గలు తొడిగాయి.

"స్త్రీల అనుభవాలను, అనుభూతులను స్త్రీల కోణము నుంచి స్త్రీలే వర్ణించాలన్న ఆలోచనా విధానంతో దూసుకు వచ్చిన సాహిత్యధోరణి స్త్రీవాద సాహిత్యం" అని చేకూరి రామారావుగారు అన్నారు. స్త్రీవాదం ఓ వెల్లువ, ఓ ప్రపంచదృక్పథం, ఓ సామాజిక సిద్ధాంతం. స్త్రీల తరుపున ఆలోచించగలిగేవారంతా స్త్రీవాదులే. స్త్రీవాదం అనేది పురుషాధిక్యతపై నిరసన అంతేగాని పురుషులపై గాదు.

ఈ క్రమంలో కట్టమంచి మునలమ్మమరణం, గురజాడ పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, రాయప్రోలు స్నేహలత, శివసాగర్ నాచెల్లిచంద్రమ్మ తదితర రచనలు అప్పటికే సామాజిక పరిణామానికి సాక్ష్యాలుగా వెలువడ్డాయి. 1975 నుండి నేటి వరకు వెలువడిన, వెలువడుతున్న స్త్రీవాదరచనల్లో స్త్రీల ఉద్యోగం, వివాహం, సంతానం, కుటుంబ హింస లాంటి కథలు కన్పిస్తాయి. ఆయా రచయిత్రులు తమ పాత్రలు ద్వారా ఓ చైతన్యాన్ని సమస్యా పరిష్కారయత్నాన్ని చూపించారు. దీనిద్వారా సమాజంలో స్త్రీల పట్ల మార్పులకు తమదైన పాత్రను నిర్వహించారు.

"ఎవరూ మరొకరి అనుభవాన్ని అనుభ వించాల్సిన పనిలేదు. ఎవరూ నామవాచకాన్ని సర్వనామం చేయనక్కరలేదు" - త్రిపురనేని శ్రీనివాస్.

1970లో స్త్రీల హక్కుల కోసం అంతర్జాతీయ మహిళా దశాబ్దాన్ని ప్రకటించిన తర్వాతనే స్వతంత్ర మహిళల ఉద్యమం పేరుతో విదేశీనిధులపై ఆధారపడి నిర్వహించే మహిళాసంఘ నివేదికలు విస్తరించడం జరిగింది. 1970 నాటికి నక్సలైట్ విద్యార్థి ఉద్యమంలో పనిచేసే అగ్రకుల మహిళాకార్యకర్తలు కొందరు అత్యవసర పరిస్థితి నుండి వైదొలగి స్వతంత్ర మహిళా సంఘాలను నెలకొల్పుకొని స్త్రీవాద అధ్యయనానికి నాంది పలికారు. ఈ పరిస్థితులన్నీ కలిసి 1980లో తెలుగు సాహిత్య విమర్శలో స్త్రీవాద దృక్పథాన్ని ప్రవేశపెట్టాయి.

1980లో దూసుకువచ్చిన స్త్రీ, దళిత, మైనారిటి ప్రాంతీయ వాదాలకు "ఎవరి రక్త చలనంతో వారు ఖడ్గ చలనం చేయాలి" అంటూ ఊతమిచ్చారు. 1980 తర్వాత సాహిత్యం స్పష్టమైన మలుపు తిరిగింది. పాతివ్రత్యం, సిగ్గు, బిడియం, అపనిందలు, అవమానాలు మొదలగు నవి స్త్రీ ఒక వ్యక్తిత్వంగల మనిషిగా పెరగనివ్వకుండా

అడ్డుకున్న నిరోదులు వీటికి ప్రక్కకు తోసి స్త్రీలు తమ అనుభవంలోకి వచ్చిన ఏ విషయాన్నైనా సరే నిర్భయంగా స్వేచ్ఛగా రాయడం ప్రారంభించారు. జీవితసత్యాన్ని తెలుసుకోవడం కోసం ఎవరి అనుభవం వారికి ఆదారం కావాల్సిందే అన్న విషయాలన్నీ స్త్రీవాదాలు వెలుగులోకి తెచ్చారు. అలాంటివారిలో ఓల్గా, వాడ్రేవు వరలక్ష్మిదేవి, పి.సత్యవతి, పి.హేమలత, విమల మొదలగువారు. ఈ సమయంలోనే స్త్రీల కథా పరిణామంలో అనేక మార్పులు వచ్చాయి. ఎవరి అనుభవాలను వారు ప్రకటించడానికి కావాలసిన బలాన్ని అందుకు కావలసిన శిల్ప చాతుర్యమును అందివుచ్చుకున్నారు. 1990లో తెలుగుకథ ఒక విస్పోటనానికి గురి అయింది. ఒకవైపు స్థానిక ప్రేరణలు, ఒకవైపు విశ్వభావాలు చుట్టుముట్టి కథను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఈ క్రమంలో అక్షరాస్యత వల్ల స్త్రీ జీవితంలో పెను మార్పులు జరగుతాయని, ప్రపంచజ్ఞానం విస్తృతం అవుతాయని ప్రపంచజ్ఞానం వికసిస్తుందని స్త్రీవాదులు విశ్వసించారు.

1990 దశకం తర్వాత ప్రపంచీకరణ ప్రభావం స్త్రీల జీవితాలలో అనేకమార్పులు చోటు చేసుకున్నాయి. స్త్రీల జీవితాలలో సగభాగం వంటింటికే అంకితం కావడం ఒక సామాజిక వాస్తవం. గడియతీరికలేని, గవ్వ సంపాదన లేని బతుకంటూ విసుక్కునే అమ్మ, అమ్మమ్మలను చూడనివారు ఉండరు. ఆడపిల్లల జీవితాలలో ముడి పడియున్న వంటిల్లునే స్త్రీవాదకవిత్వం ఒక కొత్త అవగాహనలతో విశ్లేషించింది.

మానవసంబంధాలన్ని ఆర్థిక సంబంధాలుగా మారి పోతున్నాయి. ప్రత్యేకించి వివాహవ్యవస్థ పునాధులను పెకిలించి వేసేలా సుఖలాలస భావనలకు భీజం పడింది. ప్రపంచీకరణ ఫలితంగానే అడుగంటుతున్న మానవ సంబంధాలను గురించి అనేకమంది రచయితలు రచనలు చేశారు.

వివాహవ్యవస్థలో విడాకులు ఎంత సహజమో స్త్రీ పునర్వివాహం అంతసహజమని 'వివాహబంధం'లో డా॥ విజయ పాత్రద్వారా పి. కామేశ్వరి సమర్థవంతంగా చెప్ప గలిగారు. పునర్వివాహాలను చేసుకోవడంలో స్త్రీ, పురుషుల మధ్య లింగవివక్షత తగదంటూ 'ఇంద్రగంటి జానికి', 'మాతృబంధం'లో చాటారు. మానవ సంబంధాల మధ్య నలుగుతున్న మహిళా జీవితాలకు అద్దం పడుతూ గీతాంజలి - 'ఊరికిపోదాం భూదేవి', పి.సత్యవతి - 'ఇరుకు', ఓల్గా - 'కోకాకోలా' తదితర రచనలు పితృ స్వామ్య సాంస్కృతివల్ల ఇప్పటికే బాధితులైన మహిళలు ప్రపంచీకరణ వల్ల ఏర్పడిన కొత్త సాంస్కృతిక దాడికి మరింత బాదితులమవుతున్న విషయాన్ని తెలియ జేస్తాయి.

వర్ధమాన సమాజంలో స్త్రీ శరీరం డబ్బును ఆర్జించే వస్తువుగా మారుతున్న క్రమంలో అనేకమంది స్త్రీవాద రచయితలు స్త్రీల సమస్యలపట్ల బహిరంగంగానే తమ రచనల ద్వారా సమాజానికి తెలియజేశారు. వారిలో ఓల్గా ఒకరు. అసలు పేరు పోపూరి లలితకుమారి.

అర్ధ శతాబ్దంగా నిరంతర క్రియాశీలత, సృజనాత్మకత ప్రభావిత శక్తిగా నిలబడిన రచయిత్రి, ఉద్యమకారిణి 'ఓల్గా'.

రచనలు చేయడంతో పాటు, ఉద్యమంలో అగ్ర భాగాన నిలబడటం ఆమె ప్రత్యేకత. మహిళా అస్తిత్వం, ఆత్మగౌరవానికి సంబంధించిన సరికొత్త ఆలోచనలతో కూడిన భావాధార తెలుగు సమాజం మీద వేసిన ముద్ర అమేయమైనది. కమ్యూనిజ భావాలను అంగీకరిస్తూనే మహిళా ఉద్యమాలకు సంబంధించిన విభిన్న రచనలను చేశారు.

బహుళ అస్తిత్వాలను గుర్తించి ఆ అస్థిత్వాల సాధి కారతను, సామాజిక గౌరవాన్ని, న్యాయాన్ని పొందడానికి జరిగే ఏ పోరాటాన్నైనా స్త్రీ వాదులు బలపరుస్తారు. ఇలా ప్రతి అస్తిత్వాన్ని గుర్తించి గౌరవించడమే స్త్రీవాదం ప్రత్యేకత. అన్ని అస్తిత్వాలు ఒకరితో ఒకరు కలిసినపుడే బలం వస్తుంది. ఎవరి ప్రత్యేకత వారిదే అందరం కలిసి

సాధించాల్సింది సామాజిక న్యాయం అంటూ స్త్రీవాదం గమ్యాన్ని ఓల్గా స్పష్టం చేశారు.

కాలేజిరోజుల్లో మార్క్సిష్టు పార్టీతో, ఎస్.ఎఫ్.ఐ విద్యార్థి సంఘంలో క్రియాశీలకంగా పనిచేశారు ఓల్గా. ఉద్యమంలో చురుగ్గా పనిచేస్తూ మార్క్సిజాన్ని అధ్యయనం చేశారు. చలం, కొడవటిగంటి వారి రచనలు ప్రభావంతో కవితలు, పద్యాలు రాయడం మొదలుపెట్టిన ఆమె తర్వాత వచన రచనలు, అనువాదాలు చేయట ప్రారంభించారు. స్త్రీవాదానికి సంబంధించిన ఆలోచనల పుట్టిల్లు తెలంగాణా అంటారు ఓల్గా.

'మనకు తెలియని మన చరిత్ర' గ్రంథం ద్వారా తెలంగాణా సాయుధ పోరాటంలో మహిళల శక్తిని తెలిపారు. అయితే సాహిత్యం ద్వారా స్త్రీల జీవితంలోని సమస్త కోణాలను చర్చకుపెట్టి రచనలు చేయడం ఆమె విశిష్టత. ఆడవాళ్ళుగా పుట్టినందుకు నలిగిపోతూ ఆత్మన్యూనత చెందే భావాలను పెంచి పోషించిన పురుషాధిక్యతను, పితృస్వామ్యవ్యవస్థనూ తన రచనల ద్వారా బలంగా ఎదుర్కొన్నారు. స్త్రీల చదువు, ఉద్యోగం, సంపాదన, కుటుంబంలో ఆమెస్థానం కనిపించని నియంత్రణ, వాటి మధ్య నలిగే స్త్రీ బ్రతుకులోని సకల అంశాలను ఓల్గా రచనలు చూపించాయి. ప్రేమ, అనురాగం మహిళల ఆలోచనలను, బ్రతుకు తీరు తెన్నల్ని కట్టడిచేసే కుటుంబ సంబంధాలలోని అధికార స్వరూపస్వభావాలను ఓల్గా కథలు, నవలలు తెటతెల్లం చేశాయి.

స్త్రీ ముక్కు, చెవులు, జుట్టు, నడుము, చేతులు, కాళ్ళు ఎలా ఉండాలో, ఎలా ఉంటే అందంగా ఉంటారో మగవాళ్ళు చెప్పడంలోని దౌష్ట్యాన్ని, దుర్మార్గాన్ని చర్చకుపెట్టారు. ఈవిధంగా చేసిన తొలి మహిళ 'ఓల్గా'నని చెప్పవచ్చు.

స్త్రీల సమస్యలపై ఎందరో రచనలు చేసినప్పటికి సూక్ష్మమైన అంశాలను, మగపెత్తనం మహిళల జీవితంలోని విషాదానికి ఎలా కారణమవుతాయో తన రచనల ద్వారా చూపించారు ఓల్గా. ఆమె రచనల ప్రభావ ఫలితంగా స్త్రీవాద ఆలోచనా ధోరణిలలో అనేకమంది కవయిత్రులు, రచయిత్రులు ఆడవాళ్ళు జీవితంలోని బహుముఖ కోణాలన్నీ తమరచనలలో ఆవిష్కరించారు. అంతేగాక తమరచనల ద్వారా మగవారి దృక్పథంలోనూ మార్పులు వచ్చి స్త్రీల సమస్యలపై రచనలు కొనసాగించారు. స్త్రీల పక్షాన నిలబడి మాట్లాడే కంఠస్వరం తెలుగు సాహిత్యంలో ఓల్గా మరియు ఓల్గా సాహిత్యం.

వర్తమాన సమస్యలనేగాదు ప్రాచీనకాలం నుండే మహిళల జీవితంలోని బాధని వారు ఎదుర్కొన్న వివక్షితను చిత్రించడం ద్వారా సీత, కుంతి, ద్రౌపది, శూర్పనఖ వంటి వారి పట్ల కొత్త చూపుని సంచరింపజేశారు. ఓల్గా - 'విముక్త'కథలు పురాణ పాత్రలుగా స్థిరపడిన మహిళల అంతరంగ కల్లోలాన్ని చిత్రించారు. అనాదిగా మహిళలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎదుర్కొన్న హింసను గుర్తుచేశాయి. దీని ద్వారా పితృస్వామ్య వ్యవస్థక్రింద తమ జీవితాలు అణగారి పోకుండా తమ బ్రతుకులు తమకు ఇష్టం వచ్చినట్లు బ్రతికేస్వేచ్ఛను, ఆత్మగౌరవస్ఫూర్తిని ఓల్గా రచనలు సాధించాయి.

ఓల్గా రచనలు కొన్ని వివాదాస్పదమయ్యాయి. అవి 'స్వేచ్ఛ, ప్రయోగం'. వీటి ద్వారా చర్చకన్నా రచ్చలు ఎక్కువయ్యాయి. ఆమె వ్యక్తిగత దూషణను కూడా ఎదుర్కొన్నాయి. కాని తనస్థైర్యాన్ని కోల్పోకుండా రచనలు చేయడమే కాదు దాదాపు దశాబ్ధపు కాలం తెలుగు సాహిత్యాన్ని మొత్తం స్త్రీ ఆలోచనా ధోరణివైపు మలుపు తిప్పగలగడం ఓల్గాకే సాధ్యం.

అస్మితద్వారా ఓల్గా సంపాదకత్వంలో వెలువడిన 'నీలిమేఘాలు' సంకలనం తెలుగు కవిత్వానికి కొత్త వస్తువుని, సరికొత్త ఎజెండాని అందించింది. 'మాకుగోడలు లేవు' సంకలనం స్త్రీవాద ఆలోచనా వైశాల్యాన్ని తెలియజేస్తుంది. తను రాయడమే గాక తన రచనల ప్రభావంతో తెలుగు సాహిత్యకారుల కంఠంలో, ఆలోచనలలో మార్పులకు ఆమె రచనలు శ్రీకారం చుట్టాయి. ఇది ఓల్గా సాధించిన విజయంగా అభివర్ణించవచ్చు.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీరామ నవమి విశిష్టత

- కాలర్ల స్వరాజ్యం, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కరీంనగర్.

శ్రీరామరామేతి రమే రామే మనోరమే
సహస్ర నామ తత్తుల్యం రామ నామ వరాననే నమః ఇతిః

అనే శ్లోకాన్ని మూడు సార్లు స్మరిస్తే విష్ణు సహస్రనామ పారాయణ,శివసహస్రనామ ఫలితం కూడా లభిస్తుంది. దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కోసం చైత్ర శుద్ధ నవమి నాడు ఐదుగ్రహాలు ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు పునర్వసు నక్షత్రంలో కూడిన కర్కాటక లగ్నంలో పగటి సమయాన సాక్షాత్తు శ్రీమహావిష్ణువే కౌసల్యాదేవి పుత్రుడిగా ఈ భూమిపై జన్మించిన పర్వదినాన్ని శ్రీరామనవమిగా జరుపుకుంటాం. త్రేతాయుగంలో వసంతరుతువు చైత్ర శుద్ధ నవమి గురువారం రోజున అభిజిత్ ముహూర్తంలో అంటే మధ్యాహ్నం 12 గంటల సమయంలో జన్మించాడు. 14 ఏళ్లు అరణ్యవాసం తరువాత అయోధ్య చేరుకున్న రాముడికి పట్టాభిషేకం సీతారాముల కళ్యాణం చైత్ర శుద్ధ నవమి రోజున జరిగిందని హిందువుల ప్రగాఢ విశ్వాసం. పూసల దేశానికి రాజైనా దశరథునికి కౌసల్య సుమిత్ర కైకేయి అని ముగ్గురు భార్యలు. వారికి సంతాన భాగ్యం లేకపోవడంతో వశిష్ట మహర్షి సలహా తో పుత్రకామేష్టి యాగాన్ని నిర్వహించిన దశరథునికి అగ్ని దేవుడు ప్రసన్నమై పాయస పాత్ర అందజేస్తాడు.

దశరథుడు తన ముద్దుల భార్యలకు ఈ పాయసాన్ని ఇచ్చిన కొద్ది కాలానికి గర్భం దాల్చారు చైత్ర మాసం తొమ్మిదవ రోజైన నవమి నాడు మధ్యాహ్నం కౌసల్యకు రాముడు జన్మించాడు. తర్వాత భరతుడు కైకేయికి, లక్ష్మణుడు, శత్రుఘ్నులు సుమిత్రుడు జన్మించారు. ధర్మసంస్థాపనార్థాయ అవతరించిన శ్రీ మహా విష్ణువు దశావతారాలలో ఏడవది రామావతారం. లంకాధిపతి రావుల సంహారం కోసం సాధారణ మానవ రూపంలో శ్రీహరి అవతరించాడు. ఎవరైతే కాశీలో జీవిస్తూ ఆ పుణ్య క్షేత్రమందు మరణిస్తారో వారు మరణించే కాలంలో సాక్షాత్తు పరమేశ్వరుడే రామనామతారక మంత్రాన్ని వారి కుడి చెవిలో చెప్పినదగ్గతి కలిగిస్తాడనేది ఇతిహాసాలు ఘోషిస్తున్నాయి. రంగ నామాన్ని ఉచ్ఛరించె టప్పుడు 'ర'అనగానే మన నోరు తెరచుకుని మనలోపల పాపాలన్ని బయటకు వచ్చి ఆ నామం యొక్క అగ్నిజ్వాలలో పడి దహించుకు పోతాయి. 'మ' అనే అక్షరం ఉచ్చరిస్తే మన పెదవులు మూసుకుంటాయి కాబట్టి

బయట మనకు కనిపించే ఆ పాపాలు లోనికి ప్రవేశించిన లేవు .అందువల్లే మానవులకి రామనామ స్మరణ మిక్కిలి జ్ఞానాన్ని ,జన్మరాహిత్యాన్ని కలిగిస్తుంది.

'ర' అక్షరం ప్రాముఖ్యత :

చారిత్రకంగా చూస్తే రామాయణం కథ ప్రాచుర్యం పొందడానికి పూర్వమే రామ నవమి అనే రోజుకు ఒక ప్రాముఖ్యత ఉండేదని ఐతిహ్యం.ముఖ్యంగా రామాయణం, రామ నవమిలో సూర్యుని ఆరాధనకు చాలా ప్రాముఖ్యత ఉంది. "రవి" "అంటే సూర్యుడు ప్రాచీన ఈజిప్టు నాగరికతలో సూర్యుని ాూఎశీఅ =ఘ" లేదా "=ఘ"అనే వారు. లాటిన్ భాషలో కూడా "=ఘ" ప్రత్యయం వెలుగును సూచిస్తుంది. (ఉదా : =వనఱుఅఎవ,=వనఱబఎ). "రామ"యనగా రమించుట అని అర్థం కాన మనం ఎల్లప్పుడూ మన హృదయకమలము నందు వెలు గొందుతున్న ఆ శ్రీరాముని కనుగొని ఉండవలెను. ఒకసారి పార్వతీదేవి పరమశివుని "కేనోపాయేన లఘునా విష్ణోర్నామ సహస్రం" అని విష్ణు సహస్రనామ స్తోత్రంనకు కాస్త సూక్ష్మమైన మార్గం చెప్పమని కోరుతుంది.దానికి పరమేశ్వరుడు ఓ పార్వతీ నేను నిరంతరము ఆ ఫలితము కొరకు జపించేది ఇదే నుమా అని రామ నామ తారక మంత్రం

తెలుపుతాడు.. దేశంలోని ప్రజలంతా సిరి సంపదలతో సుఖసౌఖ్యాలతో ఉంటే అది రామ రాజ్యం అని హిందువుల విశ్వాసం. మహాత్మా గాంధీ కూడా స్వాతంత్ర్యానంతరం భారతదేశం రామరాజ్యంగా విల సిల్లాలని భావించాడు.శ్రీరాముడు జన్మించిన ది మధ్యాహ్నం కావున ఈ సమయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ప్రత్యేకించి ఉత్తర భారతదేశంలో భక్తులను విశేషంగా ఆకర్షించేది ఊరేగింపు. ఈ విశ్వంలో ప్రధాన ఆకర్షణ అందంగా అలంకరించిన రథం.అందులో రాముడు లక్ష్మణుడు సీత హనుమంతుల వేషాలు ధరించిన నలుగురు వ్యక్తులు.

శ్రీరామనవమి :

శ్రీరామనవమి రోజున వీధులలో పెద్ద పెద్దపందిళ్ళు వేసి సీతారామ కళ్యాణం చేస్తారు ఇళ్ళల్లో కూడా యధా శక్తిగా రాముని పూజించి వడపప్పు పానకం నైవేద్యం చేసి అందరకీ పంచుతారు.సీతారామ కళ్యాణం లోక జీవన హేతు కం ,సకల దోష నివారణం, సంపదకు నిలయం ,సకల జన సంరక్షణ శ్రీ రామ నవమి పండుగ పరమార్థం. శ్రీరామచంద్రుని క్షేత్రాలు అత్యంత విశిష్ట ప్రాధాన్యత ప్రాశస్త్యం గల క్షేత్రం భద్రాచలం దివ్యక్షేత్రం. భద్రుడు అనగా రాముడు అని అచలుడు అంటే కొండ అని అందుకే రాముడు కొండపై నిలయమైన దివ్యధామం కనుక ఈ క్షేత్రం భద్రాచలం గా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం. రామ అనే రెండక్షరాల రమ్యమైన పదం పలుకని జిహ్వ జిహ్వ నే కాదు. శ్రీరామనవమి పండుగను భారతీయు లందరూ పరమ పవిత్రమైన దినంగా భావించి శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అతి వైభవంగా పట్టణాల్లో పల్లె పల్లెల్లో రమణీయంగా జరుపుకోవడం సంప్రదాయం. శ్రీరాముడు సత్య పాలకుడు, ధర్మాచరణ తప్పనివాడు, ఏకపత్నివ్రతుడు, పితృ, మాతృ, బాత్రృ సదాచారం నిగ్రహం సర్వ సద్గుణ మూర్తియే గురించిన దయార్ద్ర హృదయుడు. శ్రీ రాముడు మర్యాద పురు షోత్తముడు సకలగుణ దేవుడు అయోధ్య పతి దశరథ పుత్రుడు ఈ పృథ్వి మండలాన్ని ఏలిన జగదభిరాముడు శ్రీరాముడు. రామా అనే శబ్దాన్ని నోరారా పలికితే చాలు సకల పాపాలు తొలుగుతాయని పురాణ ప్రసిద్ధి. అట్టి శ్రీ రాముని కళ్యాణం అందరికీ మహా పర్వదినం. ఈ రోజు శ్రీరామ నవమిగా జరుపుకోవడం ఆనవాయితీ. దేశంలో నవమి రోజున నలుమూలల విశేషంగా పూజలు నిర్వహిస్తారు మన రాష్ట్రంలో ఖమ్మం జిల్లా భద్రాచలంలో శ్రీ రామ నవమి కడు రమ్యంగా జరుపుతారు ఆ దేవ దేవుని కళ్యాణంలో మనరాష్ట్రం ప్రతినిధులు పాల్గొని శ్రీరామునికి ముత్యాలు పట్టువస్త్రాలు అందిస్తారు.

శ్రీరామ జయరామ జయజయరామ అనే విజయ మహా మంత్రాన్ని 108 సార్లు స్మరించుకోవడం మన పూర్వజన్మ పుణ్యఫలం.

ఉత్సవంలో విశేషాలు :

ఆలయ పండితులచే నిర్వహించబడే సీతారాముల కల్యాణం ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. బెల్లం మిరియాలు కలిపి తయారు చేసే పానకం చాలా మందికి ప్రీతిపాత్రం. ఉత్సవమూర్తుల ఊరేగింపు రంగు నీళ్లు చల్లుకుంటారు ఉల్లాసంగా సాగుతుంది వసం తోత్సవం ఈ సందర్భంగా హిందువులు ముస్లింలు తేడా లేకుండా ఉపవాస దీక్షలను పాటిస్తారు. దేవాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి రామాయణాన్ని పారా యణం చేసి శ్రీరాముని తోపాటు సీతాదేవిని లక్ష్మణుని ఆంజనేయుని కూడా ఆరాధించడం జరుగుతుంది. భద్రాచలం రామదాసు కట్టబడిన రామాలయంలో ప్రతి సంవత్సరం ఉత్సవాలు వైభవంగ చేస్తారు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి తన తలమీద సీతారామ కల్యాణం సందర్భంగా వాడే తలంబ్రాల ముత్యాలను తీసుకొని వస్తాడు. ఇస్కాన్ దేవాలయం వారు ఈ వేడుకల్లో నానాటికి ఎక్కువ వస్తున్న భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఇంకా ఘనంగా నిర్వహిస్తోంది కొన్ని చోట్ల స్వామినారాయణ జయంతి కూడా దీనితో కలిసి జరుపుకుంటారు. అట్టి శ్రీ రాముని కళ్యాణం అందరికీ

మహా పర్వదినం శ్రీ రాముని కళ్యాణం, శ్రీరామనవమి ఒకే రోజు జరుపుకోవడం మన ఆనవాయితీ దేశంలో నవమిరోజున నలుమూలల విశేషంగా పూజలు నిర్వ హిస్తారు.

భద్రాద్రి ఆలయంలోని రాములోరి కళ్యాణం 350 ఏళ్లలో తొలిసారి భద్రాచలం దేవస్థానం చరిత్రలోనే తొలిసారిగా రామయ్య కల్యాణాన్ని ఆలయం నిత్య కళ్యాణ మండపం వద్ద నిర్వహించనున్నారు. రామ కథ రామాయణం కేవలం శ్రీ సీతారాముల చరిత్రనే కాదు ఇది సమాజంఉండేజీవన విధానాన్ని తెలిపే మహాకావ్యం. అయితే రామాయణంలో ప్రధాన ఘట్టంలో రామ కళ్యాణం అయితే ఈ కళ్యాణ్ ఎక్కడ జరిగింది అనేది ఆ విశేషాలేమిటో ఒకసారి పరిశీలిద్దాం

జనకుని రాజ్యంలో కళ్యాణం :

రాముడి మామగారి రాజ్యమే మిథిలా. రాముడి మామగారే జనకుడు. ఆయన పాలించే రాజ్యమే మిథిలా ఒకప్పుడు బీహార్ నుంచి నేపాల్ వరకూఈమిథిలా రాజ్యము విస్తరించి ఉందని చెబుతున్నారు. సీతమ్మ తల్లి జన్మించింది ఆ మిథిలారాజ్యంలోనే.

నేటి జనక్పురి నాటి వైదేహి రాజ్యం:

ఎప్పుడు వేద కాలం నుంచే మిథిలా రాజ్యం ఉం డేదని చరిత్రకారులు ఒప్పుకుంటున్నారు.ఈ రాజ్యాన్ని విదేహ రాజ్యం అని కూడా పిలిచేవారు ఆ పేరు మీదుగానే సీతమ్మకు వైదేహి అన్న పేరు వచ్చింది. అప్పట్లో జనకుడు రాజధాని ఇప్పటి నేపాల్ లో ఉన్న జనక్పురి అని ప్రజల నమ్మకం.ఈ జనక్పురి లోని భూమిని దున్నుతుండగా ని సీతమ్మతల్లి కనిపించిందని చెబుతారు. సీతమ్మ తల్లి పెరిగి పెద్దదయింది రాముని కళ్యాణం చేసుకున్నది ఈ నగరంలోనే అని భక్తులు విశ్వసిస్తారు.

జానకి మందిర్ :

సీతాదేవి జన్మించిన ప్రాంతం ఇదేనని విషయం కాలక్రమేణ ప్రజలు మరిచిపోయారు. సుర్కి శోర్దాస్అనే సన్యాసికి 1657ఇక్కడ సీతాదేవి విగ్రహాలు లభించడంతో ఇక్కడ ప్రజలు తమ చరిత్రను తిరిగి గుర్తు చేసుకోవడం మొదలుపెట్టారు. ఆ చరిత్రకు చిహ్నంగా 1910లో వృషభాలను అనే నేపాల్ రాణి "జానకి మందిర్" పేరుతో ఒక భారీ ఆలయాన్ని నిర్మించారు.వీర గజాల విస్తీర్ణంలో 150 అడుగుల ఎత్తున ప్రాకారంతో, పాలరాతి గోడలు, అద్దాలమేడతో నిర్మించిన ఈ ఆలయానికి" నౌలాక్ మందిర్ "అన్న పేరు కూడా ఉంది. జానకి మందిర్ నిర్మించిన ప్రాంతంలోని సీతా దేవి శివధనస్సును పూజించి ఉందని చెబుతుంటారు. సీతారాముల కళ్యాణం జరి గింది కూడా ఈ స్థలంలోనే అని భక్తుల నమ్మకం. అందుకని జానకి మందిర్ లోని నైరుతి దిక్కున పెద్ద వివాహ మండపాన్ని నిర్మించారు. ఏటా మార్గశిర మాసం శుక్ల పంచమి రోజున ఇక్కడ వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. నిర్వహించుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.

జనక్పురి ఆలయంలో జరిగే పండుగలు వివరాలు పరిశీలిస్తే ఆలయంలో కొలువైన సీతాసమేత రాముని అతని సోదరుడైన లక్ష్మణుని భరత శత్రుఘ్నులను చూసేందుకు రెండు కళ్లు చాలవు. ఇక్కడ కొలువైన సీతా రాములు దర్శించి వారి ఆశీస్సులను వేడుకునే ఎందుకు నిత్యం వేల మంది జనం వస్తుంటారు ఇక శ్రీరామనవమి, దసరా, సంక్రాంతి, వివాహ పంచమి పండుగలు అయితే జనం పోటెత్తారు. ఇక్కడ ఉత్సవాలు ఘనంగా జరుగు తాయి ఇది జనక్పురి ప్రత్యేకత. రామాయణంతో ఈ ప్రాంతానికి ఉన్న సంబంధం దృష్ట్యారామభక్తులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తే తప్ప తమ తీర్థయాత్రలు సంపూర్ణం కావాలని భావిస్తూ ఉంటారు. కొందరైతే ఈ నగరం చుట్టు ప్రదక్షిణం కూడా చేస్తుంటారు ఈ జనక్పురికి 18 కిలోమీటర్ల దూరంలో "ధనుష్ధామం" అనే ప్రాంతం ఉంది జనక్పురి కి వెళ్ళిన వారుబిధనుషదామ్కు" కూడా వెళుతూ ఉంటారు. రాముడి కళ్యాణం జరిగిన ప్రాంతమే జనక్పురి.

భద్రాచలంలో రాముని యొక్క గుడిని కట్టించిన కంచర్ల గోపన్న (రామదాసు) రామునిపై భక్తి తో అనేక కీర్తనలు రచించారు

శ్రీరామ నీ నామమెంతో రుచిరా
సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకం
నను బ్రోవమని చెప్పవే
రామ నామం మధురం మధురం
రామ నామం యొక్క ప్రత్యేకత
కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమార్దికం
ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ గరుడధ్వజ
ఉత్తిష్ఠ కమలా కాంత త్రైలోక్యం మంగళం కురు

రామనామ వైశిష్టం :

అష్టాక్షరి మంత్రంలోని 'రా' అనే అక్షరాన్ని పంచాక్షరి మంత్ర లోని 'మ' అనే అక్షరాన్ని కలుపగా రామ అనే నామము ఏర్పడినది అంటే శివకేశవులకు భేదము చెప్పేది రామనామ మంత్రము. అష్టాక్షరిలో 'రా' అనే అక్షరం లేకపోయినట్లయితే ఆ మంత్రం నిష్ప్రయోజనం అవుతుంది అదే విధముగా పంచాక్షరి మంత్రం లో 'మ' అనే అక్షరం ఉంటే అది వినాశనానికి దారి తీస్తుంది ఇంతటి మహత్తరమైన ఇటువంటి అక్షరాల కలయిక రామనామ మంత్రము.

జై శ్రీరామ్

సంక్షిప్త పరిచయం :

ముఖ్యాంశాలు :

సంక్రాంతి -తిహార్

వివాహ పంచమి-మార్గశిర శుక్ల పంచమి

కళ్యాణం - వివాహం

ముగింపు :

శ్రీరాముడు జన్మించిన రోజు వివాహం జరిగిన రోజే మనం జరుపుకునే శ్రీరామనవమి

ఆధార గ్రంధాలు :

1. వాల్మీకి రామాయణం
2. జానపద రామాయణం

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

భీష్ముడు – యుద్ధ వ్యూహాలు

- కుమ్మరి రాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

మహాభారతంలో కురక్షేత్ర సంగ్రామం ప్రముఖ ఘట్టం. ఈ సంగ్రామం దాయాదులైన పాండవులు కౌరవుల మధ్య జరిగింది. మహాభారత యుద్ధం 18 రోజులు జరిగింది. ఈ యుద్ధం గురించి భీష్మ ద్రోణ కర్ణ శల్య సౌప్తిక పర్వాలలో చర్చించడం జరిగింది. భీష్ముడు నాయకత్వంలో పదిరోజులు, ద్రోణుడు ఐదు రోజులు, కర్ణుడు రెండు రోజులు, శల్యుడు అర్ధరోజు సైన్యాధ్యక్షత వహించాడు. మిగిలిన నగంరోజు భీముడు దుర్యోధనుడితో యుద్ధం చేశాడు. కురుక్షేత్ర సంగ్రామం భీష్మ పర్వంతో మొదలవుతుంది. మహాభారత యుద్ధంలో భీష్ముడు పది రోజులు పది యుద్ధవ్యూహాలు పన్ని పాండవులతో యుద్ధం చేశాడు.

భీష్ముడు సమగ్ర యుద్ధవీరుడు. అతడిలో గోచరించే ప్రవృత్తులన్నీ యుద్ధవీరాన్నే పోషించి దానికి సమగ్ర స్ఫూర్తిని సాధించి పెట్టాయి. బ్రహ్మచేత వీరం మూడు రకాలుగా విభజించబడిందని భరతమహర్షి చెప్పాడు.

"దానవీరం దయావీరం యుద్ధవీరం తదైవ చ
రసం వీర మపిప్రాహ బ్రహ్మ త్రివిధ మేవచ.."

భీష్ముడు జన్మించినప్పటి నుంచి అంపశయ్య చేరేవరకు శత్రువుని సంహరించడంలో ఒక రకమైన ఉత్సాహాన్ని ప్రదర్శించి మహా యుద్ధవీరుడుగా ప్రసస్తి గాంచాడు. ఇతని కాలంలో ఇతన్నిమించిన యోధుడు లేడు. ఇతడు భీష్మంగా ప్రతిజ్ఞలు చేయగలడు. భీష్మంగా యుద్ధాలు చేయగలడు. భీష్మంగా శత్రువులను సంహరించగలడు. ప్రతాపాన్ని కూడా చూపగలడు. భీష్ముడు చేసిన వీర కార్యాలు ఇతనికి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి. ఇతడు రాజ్యాన్ని, వివాహాన్ని త్యాగం చేయటంలో కూడా భీష్మత్వం కనిపిస్తుంది. క్షత్రయ ధర్మాన్ని అనుసరించి మహాభారత యుద్ధంలో పదిరోజుల పాటు పోరాడి శత్రువులను సంహరించాడు. అంతే కాకుండా దానదయా గుణాల్లో ప్రాణత్యాగ రహస్యాన్ని ధర్మరాజుకు తెలియజేశాడు. ఈ విధంగా భీష్ముడు దానవీరంలోనూ యుద్ధవీరంలోనూ మేటిగా నిలిచాడు.

కురక్షేత్ర సంగ్రామంలో భీష్ముడు పదిరోజుల యుద్ధంలో పదిరకాల వ్యూహాలను పొందాడు. ఈ వ్యూహరచన విజయసోపానాలలో మొదటిది. ఇరుపక్షం వారు విజయావకాశాలను అన్వేషించే పద్ధతులకు వ్యూహాలు సూచికలు. ఒకరు తమకున్న శక్తియుక్తులను బట్టి వ్యూహం పన్నితే మరోపక్షంవారు దానిని చేధించగల మరొక వ్యూహాన్ని తమకున్న వనరులను బట్టి ప్రతి వ్యూహంతో ప్రతిగటిస్తారు. ఒక్కొక్క వ్యూహానికి ఒకరూప ప్రణాలిక ఉంటుంది. అందులో ముఖ్యస్థానాలుంటాయి. వాటిలో ముందుగా దాడిచేసేవీరులు, తరువాత రక్షణచేసే వీరులు, సహాయంచేసే వీరులు, అండగావుండే వీరులు, పోరును ఉధృతంచేసే వీరులు అనేక రకాలుగా వ్యూహంలో ఉంటారు. ఏవిధమైన వ్యూహాన్నైనా శత్రువులను చేదించే లక్ష్యంతోనే సంవిధానం చేబడుతుంది.

యుద్ధ నియమాలు :

యుద్ధారంబానికి ముందు భీష్ముడి మార్గదర్శకత్వంలో ఇరు సైన్యాధ్యక్షలకు ధర్మయుద్ధనీయమాల గురించి తెలియజేశాడు.

1. సూర్యోదయంలోయుద్ధం మొదలుబెట్టి సూర్యస్త మయం అవగానే యద్ధాన్ని నిలిపి వేయాలి.
2. ఒక వీరునితో ఒకే వీరుడు తలపడాలి. అనేకమంది కలిసి ఒక వీరుడుతో పోరాడరాదు.
3. రథికులు రథికులతో, అశ్వికులు అశ్వికులతో, గజబలం గజబలంతో, పదాతులు పదాతులతో మాత్రమే యద్ధం సాగించాలి.

4. యుద్ధ వాయిద్యాలు మ్రోగించేవారిని చంపరాదు.
5. వాగ్యుద్ధం కోరే వారిపై అస్త్రశస్త్రాలు సంధించరాదు.
6. అలసినవారిని, గాయపడినవారి, పారిపోతున్న వారిని, యుద్ధంలో పాల్గొనని మనిషి లేదా జంతువుని చంపరాదు.
7. శరణువేడిన వారని వధించరాదు. అయితే శరణార్థి యుద్ధఖైదీగా బానిసగా ఉంటాడు.

కురుక్షేత్రంలో భీష్ముడు మొదటిరోజు :

భీష్ముడు యుద్ధవ్యూహం - మానుషవ్యూహం
పాండవుల యుద్ధవ్యూహం - అచలవ్యూహం

యుద్ధం మొదలు అవగానే భీష్ముడు మానుష వ్యూహం పొందాడు. దానికి ప్రతిగా పాండవులు అచల వ్యూహం పొందారు. రణరంగంలో భీష్ముడు ప్రళయ కారుడిలాగ విజృంభించి పాండవ సేనలను ఏకావికలం చేశాడు. అర్జునుడు పుత్రుడైన అభిమన్యుడు భీష్ముడిని ఎదుర్కొని అతని అంగరక్షకులను ఓడించాడు. కౌరవ సర్వసైన్యాధ్యక్షునితో ద్వంద్వ యుద్ధంలో తలపడ్డాడు. అనాటి యుద్ధంలో పాండవులు భీష్ముడి దాటికి తట్ట కొనలేక విపరీతంగా ఆస్తిప్రాణ నష్టం జరిగింది. అంతే కాకుండా విరాట మహారాజు కుమారులైన ఉత్తరుడు, శ్వేతుడు భీష్ముడి చేతిలో మరణించారు. యుద్ధాన్నంతా కల్లారా చూస్తున్న ధర్మరాజు భీష్ముడి విజృంభనకు బయపడి నిశ్చేష్టుడయ్యాడు. అప్పుడు శ్రీకృష్ణుడు చొరువ తీసుకుని ధర్మరాజుతో అంతిమ విజయం మనదే ధైర్యంగా ఉండుమని తెలిపాడు.

కురుక్షేత్రంలో భీష్ముడు రెండవరోజు :

భీష్ముడు యుద్ధవ్యూహం - త్రిశాఖావ్యూహం
పాండవుల యుద్ధవ్యూహం - క్రౌంచవ్యూహం

రెండవరోజు యద్ధంలో పాండవులు క్రౌంచవ్యూహాన్ని పన్నారు. యుద్ధంలో పాండవుల పక్షాన ధృష్టద్యుమ్నుడు నాయకత్వం వహించాడు. కౌరువుల పక్షాన భీష్ముడు నాయకత్వ వహించాడు. క్రౌంచవ్యూహంలో ముక్కుచోట అర్జునుడు నిలిచాడు. కుంతీభోజుడు శైబ్యుడు కన్నుల స్థానంలో, ద్రుపదుడు శిఖర స్థానంలో, దశార్ణ శూరసేన కిరాతదేశాధిపతులు కంఠస్థానంలోనూ, భీముడు ధృష్టద్యుమ్నుడు కుడి ఎడుమ ప్రక్కలలోనూ మిగిలిన వీరులు ధృష్టద్యుమ్నుడు ప్రక్కన నిలిచారు. విరాటుడు జఘన భాగంలో ధర్మరాజు వెన్నుగా నిలిచారు.

పాండవుల క్రౌంచవ్యూహానికి ప్రతిగా భీష్ముని నాయకత్వంలో త్రిశాఖ వ్యూహాన్ని పన్నారు. తనసైన్యాన్ని మూడు భాగాలుగా విభజించి ఒక దిక్కున దుశ్శాసన వికర్ణ వింధాను విందులు, శూరసేన యవన త్రిగర్త కురు దేశాలవారు, నిలిచారు. మరొక దిక్కున ద్రోణుడు, కుంతల, దశార్ణ, విధర్భ, గాంధార, సింధు, సౌవీర పతులు నిలిచారు. భీష్ముడు మహాసైన్యంతో నడిమి భాగంలో నిలిచాడు. ఈ విధంగా కౌరవ - పాండవులు యుద్ధానికి తలబడ్డారు.

ఈ విధంగా రెండవ రోజు యుద్ధంలో కౌరవ - పాండవ సేనలు హోరాహోరిగా తలబడ్డాయి. పాండవ సైన్యంలో ఉత్సాహం నింపేందుకు ఏదో ఒకటి త్వరగా చేయాలని అర్జునుడు భీష్ముడిని చంపాలని భీష్ముడి రథంపైకి తన రథాన్ని పోనిచ్చాడు. ఇద్దరి మధ్య భయంకర మైన ద్వంద్వ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో భీష్ముడు రథసారథి మరణించాడు. ద్రోణుడు, దృష్టద్యుమ్నుడు మధ్య కూడ ద్వంద్వ యుద్ధం జరిగింది. ద్రోణుడు ద్యుష్ఠద్యుమ్నుడి బాణం చాలా సార్లు విరగగొట్టాడు. అప్పుడు భీముడు దృష్టద్యుమ్నుడును రక్షించాడు. అలా భీష్ముడి రథసారథి మరణించడం వలన భీష్ముని రథం యుద్ధభూమి నుండి గుర్రాలు దూరంగా రథాన్ని లాక్కెల్లాయి. ఈ విధంగా రెండవరోజు కౌరవసైన్యాలు చాలా నష్ఠంతో యుద్ధం ముగిసింది.

కురుక్షేత్రంలో భీష్ముడు మూడవరోజు :

భీష్ముడు యుద్ధవ్యూహం - గరుడవ్యూహం
పాండవుల యుద్ధవ్యూహం - అర్ధచంద్రాకారవ్యూహం

మూడవనాడు భీష్ముడు గరుడ వ్యూహం పన్నాడు.

అందులో తాను ముక్కుగా నిలిచాడు. ద్రోణ, కృపవర్మలు కన్నులుగానూ, కృపాశ్వత్థామలు శిరస్సుగానూ భూరిశ్రవసుడు, శల్యుడు, భగదత్త సావీర జయద్రథులు కంఠంగానూ. దుర్యోధనుడు అతడి తమ్ముడు వెన్ను గానూ, విందాను విందులు కాంభోజుడు శూర సేలు తోకగానూ, మగధ కలింగాదులు దక్షిణ పక్షంగానూ, కర్ణాటకోసల ప్రముఖులు వామపక్షంగా నిలిచారు.

భీష్ముడు గరుడవ్యూహంకు ప్రతీకగా పాండవ పక్షాన అర్జునుడు అర్ధచంద్రాకార వ్యూహం పన్నమని దృష్టద్యుమ్నుడికి సూచించాడు. పాండ్య మగధ బలాలతో కలిసి భీమసేనుడు దక్షిణశృంగంలో ఉన్నారు. తరువాత విరాట ప్రముఖులు నిలిచారు. శిఖండి సహితుడై దృష్టద్యుమ్నుడికి తోడుగా తీసుకొని ధర్మరాజు మధ్య భాగంలో నిలిచాడు. మిగిలిన వారు అందురు అర్జునుడు వెంట ఉన్నారు.

ఈ విధంగా యుద్ధంలో కౌరవులు - పాండవులు యుద్ధం ఆరంభం కాగానే కౌరవులు అర్జునిపై దాడిని కొనసాగించారు. అర్జునుడి రథం శత్రువుల బాణాలతో నిండిపోయింది. ఆ దాడిని ఎదుర్కొంటు అర్జునుడు తన రథం చుట్టూ బాణాలతో కోట నిర్మించాడు. అభి మన్యుడు శకుని ఓడించి యుద్ధం నుండి పారిపోయే విధంగా చేశాడు. అంతేకాకుండా భీముడు దాటకి తట్టుకోలేక దుర్యోధనుడు రథంలోనే మూర్చిల్లి పడి పోయాడు అప్పుడు భీష్ముడు అక్కడికి చేరుకొని పాండవులతో యుద్ధం చేయడం ఆరంభించాడు. అప్పుడు దుర్యోధనుడు తేరుకొని పాండుల పట్ల భీష్ముడు మృదువుగా ఉన్నావని భీష్ముడిని నిందించాడు. అసత్య ఆరోపణలతో బాధపడ్డ భీష్ముడు పాండవ సేనపై మరింత కోపంతో విరుచుకు పడ్డాడు. యుద్ధభూమిలో భీష్ముడు విరుచుకు పడటం చూచి అనేక మంది భీష్ములు యుద్ధం చేస్తున్నట్లు తోచింది అప్పుడు పాండవసేనలో కలవరం మొదలై వారు పారిపోయారు. పాండవులలో ధైర్యం నింపి అర్జునుడు భీష్ముడుపై బాణాలతో దాడి చేయడం జరిగింది. అప్పుడు అర్జునుడు తన తాతతో చేస్తున్న యుద్ధంలో అర్జునుడు మనస్సు నిలపలేకపోయాడు. అప్పుడు తానే రథం దిగి యుద్ధభూమిలోకి వెళ్ళి భీష్ముడిని సంహరించడానికి చక్రధారియై నిలిచాడు. అప్పుడు భీష్ముడు కృష్ణుడు పాదాలపై పడి ఆ పరమాత్ముని చేతుల్లో మరణించడం కంటే మరో భాగ్యం లేదు అని తనను సంహరించమని వేడుకొన్నాడు. కృష్ణుడు శాంతించి తిరిగి యుద్ధం మొదలై భీష్ముడు అర్జునుడి మధ్య భీకరంగా యుద్ధం జరిగింది.

కురుక్షేత్రంలో భీష్ముడు నాలగవరోజు :

భీష్ముడు యుద్ధవ్యూహం - తుములవ్యూహం
పాండవుల యుద్ధవ్యూహం - తుములవ్యూహం

నాల్గవరోజు యుద్ధం ప్రారంభంకాగానే భీష్ముడు పాండవుల సైన్యంపై విరుచుకు పడ్డాడు. పాండవుల సైన్యంను చెల్లాచెదురు చేశాడు. అంతేకాకుండా అర్జునుడు తన పుత్రుడు అభిమన్యుడుతో కలిసి యుద్ధం చేయడం ఆరంభించారు. యుద్ధభూమిలో తండ్రి - కొడుకులు ప్రళయాగ్ని వలె విజృంభించారు. మరొక వైపు భీముడు కౌరవ సైనపై దాడిచేస్తూ భయంకరంగా సాగుతున్న యుద్ధంలో భీముడు దుర్యోధనుడి తమ్ములును చంపాడు. తమ్ములు చనిపోవడం చూచి దుర్యోధనుడు కోపంతో ఊగిపోతూ భీముడిపై బాణాల వర్షం కురిపించాడు. బాణాలు దాడిని ఎదురొక్కనలేక మూర్చిల్లి పోయాడు. అప్పుడు అభిమన్యుడు, దృష్టద్యుమ్నుడు, ఉపపాండవులు అడ్డుగా వచ్చి భీముడిని రక్షించారు. అది చూచిన ఘటోత్కచుడు వీరావేశంతో కౌరవసేపై దాడిచేశాడు. ఘటోత్కచున్ని అస్థితిలో ఎవరూ ఎదుర్కొనలేక పోయారు. అప్పుడు భీష్ముడు కౌరవసేనలను వెనక్కి రప్పించాడు. సోదరు లను కోల్పోయిన దుర్యోధనుడు కుంగిపోయాడు. దుర్యోధనుడు భీష్ముడు వద్దకు వెళ్ళి మనవద్ద అంత పెద్ద సేనలు ఉన్నప్పటికి ఎందుకు పాండవులు చేతిలో ఓడిపోతున్నాము? ఎలా జయం పొందుతున్నారు?

అంటూ దుర్యోధనుడు ప్రశ్నించాడు. అప్పుడు భీష్ముడు నాయనా పాండవులు పక్షాన ధర్మం ఉందని చెబుతూ పాండవులతో సంధిచేసుకోమని భీష్ముడు దుర్యోధనుడికి సూచించాడు.

కురుక్షేత్రంలో భీష్ముడు ఐదవరోజు :

భీష్ముడు యుద్ధవ్యూహం - మకరవ్యూహం
పాండవుల యుద్ధవ్యూహం - శ్యేనవ్యూహం

ఐదవనాడు యుద్ధంలో భీష్ముడు మకరవ్యూహం, పాండవులు శ్యేనవ్యూహం పన్నారు. ముఖస్థానంలో భీముడు, కన్నుస్థానంలో దృష్టద్యుమ్నుడు, శిఖండి శిరస్సు స్థానంలో సాత్యకి, కంఠస్థానంలో అర్జునుడు, వామపక్షంలో విరాట ద్రుపదులు, దక్షిణపక్షంలో ధర్మరాజు నిలిచారు. భీముడు మకరవ్యూహంలోకి ప్రవేశించి భీష్ముడిని ఎదుర్కొన్నాడు. అప్పుడు భీష్ముడు భీముడిపై విరుచకు పడ్డాడు. అప్పుడు అర్జునుడు వచ్చి భీముడికి బాసటగా నిలిచాడు. ఒక వైపు యుద్ధం జరుగుతుంటే మరొకవైపు దుర్యోధనుడు ద్రోణుడితో ఇలా అన్నాడు "నీవు భీష్ముడు కోపిస్తే దేవతలు కూడ ఎదుర్కొనలేరు "మీరు తలచుకుంటే పాండవులను నామరూపాలు లేకుండ చేయగలరు" అర్జునుడు మన సేనలను అలా మట్టు పెడుతుంటే చూస్తూ ఊరుకోవడం న్యాయమా? ఆ మాటలకు ద్రోణుడు రోషంతో పాండవులపై విరుచుకు పడ్డాడు. అర్జుననుడు గురువైన ద్రోణుడిపై బాణాలను వేశాడు. అప్పుడు శల్య భీష్ములు ద్రోణుడికి అండగా నిలిచారు. యుద్ధం జరుగుతున్న సమయంలో శిఖండి భీష్ముడిపై దాడిచేయడం గమనించి ద్రోణుడు త్రిప్పికొట్టాడు. తరువాత అర్జునుడు చాలామంది కౌరవ సేనలను సంహరించాడు. ఈ ఉహకందని ఊచకోత కురుక్షేత్ర సంగ్రామం చివర వరకు కొనసాగింది.

కురుక్షేత్రంలో భీష్ముడు ఆరవరోజు :

భీష్ముడు యుద్ధవ్యూహం - క్రౌంచవ్యూహం
పాండవుల యుద్ధవ్యూహం - మకరవ్యూహం

ఆరవరోజు యుద్ధంలో భీష్ముడు క్రౌంచవ్యూహం పన్నాడు. ముక్కుగా భీష్మ ద్రోణులు, నేత్రాలుగా కృపాశ్వత్థామలు, తలభాగంలో కృతవర్మ కాంభోజ, బాహ్లకులు, గొంతుగా శూరసేన పరివృతుడైన దుర్యోధనుడు, ఉరోభాగంగా సౌవీర సమేతుడైన భాగవదత్తుడు, వీపున వింధానవిందులు, వామ పక్షంలో సుశర్మ, దక్షిణ పక్షంలో యవనపతి, ఆపరభాగంలో శ్రుతాయువుతో కలిసి భూరిశ్రవుడు నిలిచాడు.

క్రౌంచవ్యూహం ప్రతిగా పాండవులు మకరవ్యూహం పొందారు. పార్ధుడు సాంబులపతి శిరస్సుగానూ, నకులసహదేవులు కన్నులుగానూ, భీముడు తుండంగానూ, అభిమన్యుడు, ఉప పాండవులు, ఘటోత్కచుడు గండస్థలంగానూ, సాత్యకితోకూడిన ధర్మరాజు కంఠంగానూ, దృష్టద్యుమ్నుడు, ద్రుపదుడు కలిసి వెన్నుగానూ, కేకయులు వాము భాగంలో దృష్టకేతుడు దక్షిణ భాగంలోనూ, కుంతీభోజశతానికులు జఘనంగానూ, శిఖండి పరావంతుడు తోకగానూ వ్యూహంలో నిలిచారు.

ఆరవరోజు యుద్ధంలో భీష్మద్రోణులు యుద్ధం పాండవ వీరులకు చాలా గట్టి ఎదురుదెబ్బనిచ్చింది. ఈ రోజు యుద్ధంలో ద్రోణుడు అంచనాల కందని మారణకాండను సృష్టించాడు. అంతేకాకుండా భీముడు, పాండవులు ఐదుగురు కొడుకులును ముప్పుతిప్పలు పెట్టించారు. ఈ విధంగా ఇరు పక్షాలు చాలా కసితో యుద్ధపరాక్రమాలు ప్రదర్శిస్తుంటే అంతలో సూర్యాస్త మయం అవగానే యుద్ధం చాలించారు.

కురుక్షేత్రంలో భీష్ముడు ఏడవరోజు :

భీష్ముడు యుద్ధవ్యూహం - మండలవ్యూహం
పాండవుల యుద్ధవ్యూహం - వజ్రవ్యూహం

ఏడవరోజు యుద్ధంలో భీష్ముడు మండల వ్యూహం పన్నాడు. అది గమనించి ధర్మరాజు వజ్రవ్యూహాన్ని సన్నద్ధం చేశాడు. ఈ విధంగా యుద్ధం జరుగుతుండగా భీష్ముడు పాండవ వీరులపై క్రూర బాణాలతో విరుచుకు వడ్డాడు. ద్రోణుడు శంఖుడిని సంహరించాడు. భగదత్తుడికి ఘటోత్కచుడికి భయంకరమైన యుద్ధం

జరిగింది. అందులో ఘటోత్కచుడు ఓడి పరుగెత్తాడు.. నకులసహదేవులు శల్యుడు మీద దాడి చేశారు. ధర్మరాజు శ్రుతాయువును ఓడించాడు. అప్పుడు భీష్ముడు ధర్మరాజు రథశ్వాసాలను కూల్చాడు. ధర్మరాజు మిగిలిన రాజులను భీష్ముడిపై ఉసిగొల్పాడు భీష్ముడు చెలరేగి సింహంవలె చుట్టుముట్టిన రాజులందరిని మండలాకార సంచారంతో చీల్చి చెండాడాడు. అప్పుడు అర్జునుడు సమయానికి వచ్చి ధర్మరాజును రక్షించాడు. రణరంగంలో భీష్ముడు చేసిన యుద్ధ విన్యాసాలతో పీనుగులు కుప్పలు కుప్పలుగా బీభత్సమై పడి ఉన్నాయి, ఈ విధంగా ఏడవరోజు యుద్ధం ముగిసింది.

కురుక్షేత్రంలో భీష్ముడు ఎనిమిదవరోజు :

భీష్ముడు యుద్ధవ్యూహం - కూర్మవ్యూహం
పాండవుల యుద్ధవ్యూహం - శృంగాటవ్యూహం

ఎనిమిదవరోజు యుద్ధంలో భీష్ముడు కూర్మవ్యూహం, పాండవులు శృంగాట వ్యూహం పన్నారు. భీష్ముడు సింహనాదం చేస్తూ యుద్ధంకు వెళ్ళాడు. భీముడు ఒక్కడే భీష్ముడిని ఎదురిస్తూ యుద్ధము చేయసాగాడు. అంతలో సునాభుడు భీముడిని ఎదిరించాడు. ఒక్క గదా దెబ్బతో సునాభుడు తల వ్రెయ్యి ముక్కులయ్యింది. అతడి చావుని చూచి తన ఏడుగురు సోదరులు భీముడిపై దాడి చేశారు. సంకులసమరంలో భీముడు వారందరిని సంహరించాడు. అప్పుడు భీష్ముడు భయంకరంగా భీముడువైపు రథాన్ని నడిపి, భీముడితోపాటు ఉన్న సైన్యాలను చెదరగొట్టాడంతో యుద్ధం ముగిసింది.

యుద్ధం ముగిసిన తరువాత దుర్యోధనుడు కర్ణుడు, దుశ్శాసనుడి వద్దకు పోయి యుద్ధం జరుగుతున్న కొద్దీ మన సైన్యబలం తగ్గుతూ వస్తున్నది. భీష్మపితామహుడు పాండవులను సంహరించలేక పోతున్నాడు. యుద్ధం నుండి వైదొలగమని వేడుకుందామని నిశ్చయించుకొని భీష్ముడు వద్దకు పోయి దుర్యోధనుడు విషయం అంతా చెప్పి నీవు వైదొలిగితే కర్ణుడు యుద్ధ రంగంలోకి వస్తాడు. అని పలకగా అప్పుడు భీష్ముడు "నీకోసం నాప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్నాను. ఇన్ని రోజులు పోరాడింది బూడిదలో పోసిన పన్నిరేనా" అని కోప్పాడ్డాడు అంతే కాకుండా నేను అర్జునుడిని గెలవలేను. శిఖండిని చంపలేను మరి ఎవరినైనా యుద్ధంలో చీల్చి చెండాడుతాను. ఇవన్నీ ఎందుకు రేపు యుద్ధంలో నా బలమేంటో చూపిస్తాను చూడుము అని పలికాడు.

కురుక్షేత్రంలో భీష్ముడు తొమ్మిదవరోజు :

భీష్ముడు యుద్ధవ్యూహం - సర్వతోభద్రవ్యూహం
పాండవుల యుద్ధవ్యూహం - దృఢవ్యూహం

యుద్ధరంగంలో భీష్ముడు సర్వతోభద్ర వ్యూహం పొందాడు. భీష్ముడు వెంట కృపాచార్య, కృతవర్మ, శల్య, శకుని, సుదిక్షణ, సైందువులు, కురుకుమారులు కలిసి ముందు నిలిచారు. ద్రోణ, భూరిశ్రవ, భగదత్తులు వలపట (ఎడమపక్క) నిలబడ్డారు. సోమదత్త, అశ్వత్థామ విందానువిందులు దాపటగా (కుడిప్రక్కగా) నిలిచారు. హలాయుధ, ఆలంబన శ్రుతాయులు వెనుక నిలిచారు.

పాండవ పక్షం శిఖండిని అగ్రస్థానంలో ఉంచింది. అతడికి ఒక ప్రక్క భీమసేన ఘటోత్కచులు, మరొక ప్రక్క అర్జునుడు దృష్టద్యుమ్నులు నిలిచారు. సాత్యకి విరాటుడు వలపట (ఎడమప్రక్క) అభిమన్యు పాంచాల రాజులు దాపటన (కుడిప్రక్క) నిలిచారు. నకుల సహదేవులు ముందుగా, ధర్మరాజు నడుమున నిలిచాడు.

తొమ్మిదవ రోజు యుద్ధంలో అభిమన్యుడు కౌరవ సేనపై దాడిచేయడం ప్రారంభించాడు. దుర్యోధనుడు ఆలంబనుడనే రాక్షసరాజును అభిమన్యుడిపై దాడి చేయడానికి పురిగొల్పాడు. అతడు మయాయుద్ధంలో అభిమన్యుడిని ఇబ్బందులకు గురిచేశాడు. అతడు ఆలంబనుడిని ఓడించి సంహరించాడు. తరువాత భీష్ముడు అభిమన్యుడిపై దాడిచేసి కౌరవసేన్యాలను రక్షించాడు. అర్జునుడు ద్రోణాచార్యుడితో భీకర యుద్ధం చేశాడు. భీష్ముడిని పాండవ వీరులు చుట్టుముట్టగా అప్పుడు దుర్యోధనుడు, శకుని, దుశ్శాసనులు భీష్ముడికి సహాయంగా వచ్చారు.

మధ్యాహ్నం నుండి భీష్ముడు ప్రచండ భానుడిలాగ విజృంభించారు. వరుసగా భీముడు, ధర్మరాజును నకుల సహదేవులను, దృష్టద్యుమ్నుడిని చాలా బాదించి వదిలి పెట్టాడు. భీష్ముడు విజృంభణతో సైన్యం తునాతునకలై కుప్పలు కుప్పలుగా శవాలదిబ్బలు దర్శనమిచ్చాయి. భీష్ముడి విజృంభణ చూచి అర్జునుడు విచారంతో నిరుత్సాహంతో అలా ఉండిపోయాడు. అప్పుడు పారిపోతున్న పాండవ సైన్యాన్ని కూడగట్టుకొని అర్జునుడు భీష్ముడిపై యుద్ధం చేయడం ఆరంభించాడు. భీష్ముడి దాటికి అర్జునుడు కూడ నిలువలేక పోయాడు. అప్పుడు ప్రక్కనే ఉన్న కృష్ణుడికి విపరీతమైన కోపం వచ్చి రథం నుండి దిగి భీష్మునిపైకి ఆగమేఘాలపైన సంహరించడానికి వెళ్ళాడు. అప్పుడు భీష్ముడు చూచి "మహాత్మా వేగంగా రండి! నీ చేతిలో రణించడం వలన నాకు శాశ్వతమైన కీర్తి వస్తుంది." నీకు ఇష్టం వచ్చినట్లు చేయి అని పలికాడు అప్పుడు శ్రీకృష్ణుడిని అర్జునుడు అడ్డగించి దూరంగా తీసుకువెళ్ళాడు. "ఓ కృష్ణా! నీవు యుద్ధం చేయనని చెప్పి ఇప్పుడు మాట తప్పితే ఎలా" అని కృష్ణుడిని శాంతింపచేసి యుద్ధానికి పూనుకొన్నాడు. అలా ఆరోజు యుద్ధం సమాప్తం అయింది.

యుద్ధం ముగిసిన తరువాత ధర్మరాజు తన తమ్ములతో కలిసి యుద్ధంలో సైన్యం బలిహీన పడటం చూచి బాధపడుతూ తన తాత అయిన భీష్ముడి వద్దకు బయలుదేరారు. అప్పుడు భీష్ముడు పాండవుల సోదరులను పేరుపేరునా పలకరించి వారి యోగక్షేమాలను కనుగొన్నాడు. మీరు వచ్చిన విషయం ఏమిటి? మీకు ఏమి కావాలో అడగండి ఇస్తానని భీష్ముడు పలికాడు. అప్పుడు యుధిష్ఠరుడు "మాకు సన్మార్గంలో సామ్రాజ్యం లభించే మార్గాన్ని తెలియజేయండి" అని పలికాడు. భీష్ముడు "నా చేతిలో ఆయుధం ఉన్నప్పుడు నన్ను ఎవ్వరూ జయించలేరు. నేను ఆయుధాలు ప్రయోగించకపోయినపుడు నన్ను సంహరించవచ్చు. నేను ఆయుధం క్రింద పెట్టినవాడిని, జెండా దించినవారిని, స్త్రీని, మొదట స్త్రీగా ఉండినవారిని, ఆడవారిపేరు పెట్టుకున్నవారిని, తలగుడ్డ తీసివేసినవారిని అన్న దమ్ములులేని వారిని, పుత్రులు లేని వారిని చూస్తే వారితో యుద్ధం చేయను. నాకు మరోక నియమం కూడా ఉంది. పుట్టనప్పుడు లేకుండా నడమ దైవమిచ్చిన పురుషత్వంగల వారితో యుద్ధం చేయను. కాబట్టి ద్రుపద సంతానమైన 'శిఖండి' అలాంటివాడు. శిఖండి పూర్వ జన్మలో స్త్రీ కావడం వలన ఎదురుగా వుండి బాణాలను ప్రయోగించినా నేను తిరిగి బాణాలను ప్రయోగించను. ఆ సమయంలో అర్జునుడు శిఖండిని ముందుపెట్టుకొని నన్ను సంహరించవచ్చును. తరువాత కౌరవులను జయించడం మీకు సులభమవుతుంది.

కురుక్షేత్రంలో భీష్ముడు పదవరోజు :

భీష్ముడు యుద్ధవ్యూహం - శిఖండివ్యూహం
పాండవుల యుద్ధవ్యూహం - భీష్మవ్యూహం

పదవరోజు యుద్ధంలో పాండవులు శిఖండిని ముందు నిలిపారు. కౌరవులు భీష్ముడిని అగ్రభాగంలో నిలిపారు. ఉబయసేనలు యుద్ధంలో తలపడ్డాయి. భీష్ముడు ప్రళయకాల రుద్రుడు వలె పాండవసైన్యంపై విరుచుకుపడుతున్నాడు. అప్పుడు శిఖండి భీష్మునిపై అస్త్రాలను ప్రయోగించడం ఆరంభించాడు. అప్పుడు భీష్ముడు "శిఖండి నిన్ను బ్రహ్మ ఆడదానిగా సృష్టించాడు. నీవు మగాడువని నేను అనుకోలేదు. కావున స్త్రీవి అయిన నిన్ను నేను బాణాలతో కొట్టను. ఇక్కడి నుంచి వెళ్ళిపో" అని పలికాడు. అప్పుడు శిఖండి రాజులెందరినో గెలిచావు. పరుశురాముడికి ప్రతివీరుడువై పేరుపొందావు. నీ బలం నాకు చూపలేవా? నీకు దమ్ముంటే నాతో యుద్ధం చేయిమని శిఖండి పలికాడు. భీష్ముడు శిఖండి మాటలను పెడచెవిని పెట్టి పాండవుల సైనంపై దృష్టిపెట్టి యుద్ధం చేయడం ఆరంభించాడు. అప్పుడు దుర్యోధనుడు పితామహా నీవు ఉండగా సైన్యం ఎందుకు ఇంత దీనంగా తయ్యారయిందని పలకగా అప్పుడు భీష్ముడు "దుర్యోధనా! పదివేల మందిని చంపుతానని మాట

ఇచ్చాను. నా మాట నిలబెట్టుకున్నాను. నీ ఋణం తీర్చుకొన్నాను. ఇక పాండవులయినా చావాలి లేక నేనయినా చావాలి" అని కదనరంగంలోకి దూకాడు.

భీష్ముడు యుద్ధరంగంలో పాండవసైనికులను చాలా మందిని సంహరించాడు. విరాటుడు తమ్ముడయిన శతానీకుడిని మట్టుబెట్టాడు. ఈ విధంగా విజృంభిస్తున్న భీష్ముడిపైకి శిఖండిని అడ్డు పెట్టుకొని అర్జునుడు భీష్ముడిపైకి బాణాల వర్షం కురిపించాడు. అప్పుడు భీష్ముడి శరీరానికి గుచ్చుకున్న బాణాలవలన అతని శరీరం భూమిపైకి తాకకుండా ఆ బాణాలను అంపశయ్యగా చేసి భీష్ముడిని దానిపై పడేవిధంగా చేశాడు. తలగడ్డను అర్జునుడు బాణాలతో సిద్ధం చేశాడు. అంతేగాకుండా భీష్ముడి దాహాన్ని తీర్చడానికి దివ్యాస్త్రంతో భూమిలోకి బాణాన్ని వదిలి వచ్చిన జలంతో భీష్ముడి దాహాన్ని తీర్చాడు. అంపశయ్యపై భీష్ముడిని చూడటానికి కౌరవ, పాండవులు అక్కడికి చేరుకొన్నారు. అక్కడున్న వారు అయ్యో! దక్షిణాయణ కాలంలో మరణిస్తున్నాడేనని చింతించారు. కానీ భీష్ముడికి వున్న స్వచ్ఛంద మరణము అనే వరం వలన ఉత్తరాయణ పుణ్యకాలం వరకూ చావు నిలుపు కున్నాడు. హస్తినాపురం అన్ని దిక్కుల నుండి రక్షిస్తానని తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి భీష్ముడు యుద్ధం పూర్తి అయ్యే వరకూ జీవించాడు.

ముగింపు :

ఈ విధంగా మహాభారత కురక్షేత్ర సంగ్రామంలో భీష్ముడు పదిరోజల యుద్ధంలో పదిరకాల వ్యూహాలతో పాండవుల సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టాడు. తాను జన్మించినప్పటి నుండి మరణించేటంత వరకు రాజక్షేమం కొరకు వంశం కొరకు పాటుపడ్డాడు. యుద్ధం ఆరంబం నాటి నుండి చివరి వరకు శక్తి వంచనలేకండా యుద్ధంలో పోరాడాడు. చివరికి పాండవుల పక్షాన ఆ నారాయణుడు ఉన్నాడని తెలిసి కూడా పాండవులతో యుద్ధం చేశాడు. భీష్ముడి చావు రహస్యం పాండవులకు తెలియజేసి అర్జునుడి చేతిలో ప్రాణాలు వదిలాడు. తాను అంపశయ్యపై ఉన్నప్పుడు ధర్మరాజుకి రాజ్యం గురించి అనేక ధర్మసూత్రాలను కూలంకషంగా తెలియజేశాడు. ఈ విధంగా మహాభారతంలో మరణంలేని మహా వీరుడుగా, అన్ని కాలాల్లోనూ అందరికి ఆదర్శనీయుడుగా భీష్ముడు నిలుస్తాడు.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కవిత్రయ మహాభారతంలో కర్ణుడు

– శ్రీ పట్రు నరసింహులు, పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు తులనాత్మక సాహిత్యశాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

'మహాభారతం' ప్రపంచానికి భారతదేశం ప్రసాదించిన కానుక. సంస్కృతంలో వేదవ్యాసమహర్షి రచించిన 'జయ' మహాకావ్యాన్ని తెలుగులో కవిత్రయంగా పేరుగాంచిన నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు రచించారు. ఈ ముగ్గురు కవుల జీవితకాలాల మధ్య చాలా అంతరం ఉన్నప్పటికీ పాత్రపోషణలో మార్పులేకుండా కావ్యరచన పూర్తి చేశారు. సంస్కృత మహాభారతం ప్రాంతీయ భాషాలలో రాయడానికి మూల రచనగా భావించవచ్చు.

ధర్మరాజుకు నలుగురు తమ్ములతో పాటు, శ్రీకృష్ణుడు అత్యంత సన్నిహితుడు. వారి మధ్య బంధుత్వం ఉంది. దుర్యోధునుని వైపున అత్యంత సన్నిహితులు దుశ్శాసనుడు, మేనమామ శకుని, ఏ బంధుత్వమూలేని - మిత్రుడు కర్ణుడు ఈ ముగ్గురినీ దుర్యోధనుడితో కలిపి దుష్టచతుష్టయంగా వ్యవహరించడం కూడా మనం చూస్తాం. కేవలం కృతజ్ఞతతో స్నేహధర్మాన్ని తు.చ తప్పకుండ నెరపినవాడు కర్ణుడు. దుష్టచతుష్టయంలో భాగమైనా కర్ణునికి ఉన్న సహజమైన మంచి లక్షణాల వల్ల కర్ణుడు ఒక ప్రత్యేక పాత్రగా పాఠకులు, సమాజం గుర్తించాయి. కవిత్రయ మహాభారతంలో కర్ణుని పాత్రను పరిశీలిద్దాం.

యాదవ వంశరాజయిన 'శూరుని' కుమార్తె పృథ 'శూరుని' మేనత్త కుమారుడు 'కుంతిభోజుడు' అతనికి సంతానం లేదు. శూరుడు తన పెద్దకుమార్తె పృథను కుంతిభోజునికి కూతురుగా అప్పగించాడు. అప్పటి నుంచి ఆమెకు 'కుంతి' అని పేరు కలిగింది. ఆమె తన పెంపుడు తండ్రి కోరిక మేరకు బ్రాహ్మణులకు, అతిథులకు అన్నదానం చేస్తుండేది. అలా ఉండగా ఒక రోజు అతిథిగా వచ్చిన 'దుర్వాస మహర్షి'ని భక్తితో సేవించింది. అందుకు 'దుర్వాసుడు' సంతోషపడి ఆమెకు ఒక సంతాన ప్రదాయకమైన మంత్రాన్ని ఉపదేశించాడు. కుంతి తనకు వీలైన సమయంలో ఆమంత్రాన్ని పరీక్షించే సంకల్పంతో 'సూర్యుడిని' ఉద్దేశించి మంత్రాన్ని పఠించింది. సూర్య భగవానుడు ప్రత్యక్షమయ్యాడు. కుంతి ఎంత వేడుకున్నా వినకుండా మంత్రప్రభావం మీరరాదని చెప్పి ఒక కుమారుడిని ప్రసాదించాడు.

''నలలితమైన పుట్టు గవచంబు నినర్గజమైన కుండలం
బుల యుగళంబు నొప్పగ సుపుత్రుడు 'కర్ణుడు' పుట్టె సూర్యమండ
డలమొకొ భూతలంబున బెడంగయి దీప్తి సహస్రకంబుతో
వెలుగెడు వానిజద్యుతి సవిస్తర లీల వెలుంగ చుండగన్

(ఆదిపర్వము - పంచమ - 26)

సహజ కవచకుండలాలతో సద్యోగర్భంలో కర్ణుడు జన్మించాడు. తన కన్యత్వం పవిత్రతను కాపాడుకోవడం కోసం కుంతి పుట్టిన పసికందును ఒక పెట్టిలో వుంచి నదిలో వదిలివేసింది. ఆ పెట్టెను ఒక సూతుడు చూసి అందులోని బిడ్డను తీసుకొని వెళ్ళి తన భార్య అయిన రాధకు ఇచ్చాడు. 'కర్ణుడు' అని పేరు పెట్టారు. ఆమె కర్ణుడిని చాలా ప్రేమతో పెంచసాగింది. ఆమె పెంచడం వల్ల కర్ణుడు 'రాధేయుడు' అయ్యాడు. రత్నాలు, బంగారు ఆభరణాలతో ఉండడం వల్ల 'వసుషేణుడు' అని కూడా పేరు పొందాడు. పాండవులకు కౌరవులకు ద్రోణుడు విలువిద్య నేర్పే గురువుగా నియమితుడయ్యాడు. కర్ణుడు కూడా ద్రోణుని దగ్గర విద్యాభ్యాసం ప్రారంభించాడు.

అర్జునుడి పట్ల ద్వేషం పెంచుకున్నాడు. దుర్యోధనుని పక్షాన స్నేహంతో నిలిచాడు.

సూతపుత్రుండయిన రాధేయుడును ధనుర్విద్యా
కౌశలంబున నర్జునుని
తోడ మచ్చదించుచు దుర్యోధన పక్షపాతియై
యుండెనంత.....

(ఆది - పంచమ - 225)

కౌరవులు, పాండవులు విద్యాభ్యాసం చేసి శస్త్రాస్త్ర విద్యలలో నేర్పరులయ్యారు. విద్యాప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆ సమయంలో అర్జునుడు 'విలవిద్యా' ప్రదర్శన చేశాడు. అప్పుడు 'కర్ణుడు' తన విద్యానైపుణ్యాన్ని ప్రదర్శించాలని తలచి భుజం చరచి రంగంలో ప్రవేశించాలని నిలిచాడు.

సాలప్రాంశు నిజోజ్జ్వలత్కవచు శశ్యత్కుండలోద్భాసితున
బాలార్కప్రతిమున్, శదాసనధుదున, బద్ధోగ్రనిస్త్రింశు శౌ
ర్యాలంకారు సువర్ణ వర్ణ ఘను గర్ణాఖ్యున జగత్కర్ణపూ
ర్ణాలోలద్గుణు జూచి చూపరు ప్రభూతాశ్చర్యు లైరచ్చటనా!

(ఆదిపర్వము - షష్టా-36)

పెద్దలకు నమస్కరించి, అర్జునుడిని అధిక్షేపించాడు. అర్జునుడు కుపితుడైనాడు. దుర్యోధనుడు సంతోషించాడు. కర్ణుడు ద్రోణుని అనుమతితో అస్త్ర విద్యా ప్రదర్శన చేశాడు. దుర్యోధనుని కోరిక మేరకు అర్జునుడిని ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానించాడు. ద్రోణుని అనుమతి పొంది అర్జునుడు ద్వంద్వయుద్ధం చేయడానికి కర్ణుని ఎదురుగా నిలిచాడు. కర్ణుడు అర్జునుడిపై మేఘాస్త్రం ప్రయోగించాడు. ఆ మేఘాల మాటున అర్జునుడు కనిపించలేదు. అర్జునుడు వాయువ్యాస్త్రం ప్రయోగించి ఆ మేఘాలను చెదరగొట్టాడు.

కృపాచార్యుడు వారిని ఆపి కర్ణుడుని వంశము, తల్లిదడ్రుల గురించి ప్రశ్నించాడు. దుర్యోధనుడు కల్పించుకొని అర్జునుడితో ద్వంద్వ యుద్ధానికి కర్ణుడికి ఉన్న అర్హనర్హతను పోగొట్టడానికి కర్ణుడిని అంగరాజ్యానికి రాజును చేశాడు. దుర్యోధనుడి ఈ చర్య కర్ణుడిని దుర్యోధనుడు భీముడిని వారించి, కర్ణుడు సకల భూమండలాన్ని పాలించగల సమర్థుడని పొగడి, తోడ్కొని తీసుకువెళ్ళాడు. రాజు కుమార్తె అయిన 'కుంతికి' జన్మించిననప్పటికీ, విధివశాన 'కర్ణుడు' జన్మనిచ్చిన తల్లి దగ్గర పెరగలేదు. సూతుడికి దొరికి సూతపుత్రుడైనాడు. పెంచిన తల్లి రాధ బిడ్డగా రాధేయుడైనాడు. ద్రోణాచార్యుని దగ్గర విద్యాభ్యాసం చేస్తున్నప్పటి నుంచి అర్జునుడి పట్ల మత్సరం పెంచుకున్నాడు. రాజవంశీయులకు, తనకు ఉన్న అంతరాన్ని గుర్తించి అవమానపడ్డాడు. దుర్యోధనుడి పట్ల స్నేహాన్ని పాటించి అంగరాజు అయినాడు. దుర్యోధనుడు ప్రాణమిత్రుడయ్యాడు. మానవ సహజమైన 'మత్సరాన్ని' పెంచుకున్నాడు. ఆలంబనగా నిలిచిన దుర్యోధనుడితో మైత్రి పెంపొందించుకున్నాడు. కృతజ్ఞుడుగా నిలిచాడు. అయితే ద్రోణుడికి 'గురుదక్షిణ' చెల్లించే సమయంలో 'కర్ణుడు' ఏమయినాడో తెలియదు. ఆ సందర్భంలో 'కర్ణుడి' ప్రస్తావన కవిత్రయ మహాభారతంలో ఆ ఘట్టంలో కనిపించదు.

ద్రౌపది స్వయంవర ఘట్టంలో కర్ణుడు మత్స్యయంత్రాన్ని భేదించలేకపోయాడు.

"శిశుపాల, జరాసంధి, శల్య, కర్ణులు దర్పితులై తమ తమ
లావులు మెరసి క్రమంబున నలవురు మాష యవముద్గ రోమ
మాత్రంబులు దక్క గొనయంబెక్కించియు మోపెట్ట నశక్యంబయిన
నుక్కసెడి స్రుక్కిన..."

(ఆదిపర్వం - సప్తమ - 179)

ద్రుపదుడు తమను మోసం చేశాడని భావించి స్వయంవరానికి వచ్చిన రాజలందరూ ద్రుపదునిపై యుద్ధానికి పూనుకున్నారు. అర్జునుడు, భీముడు వారిని నిలువరించారు. కర్ణుడు అర్జునునితో యుద్ధం చేశాడు. అర్జునుడుది బాణ పరంపరను ఆపలేక బాణ ప్రయోగం మానుకున్నాడు. ఆశ్చర్యంతో బ్రాహ్మణ తేజస్సును జయించడం సాధ్యం కాదని వెనుదిరిగాడు. ద్రౌపదీ స్వయంవర విజేత అర్జునుడని, పాండవులు బ్రతికి ఉన్నారని తెలిసిన తరువాత ద్రుపదుడిని యుద్ధంలో ఓడించి, పాండవులను హస్తినాపురానికి తీసుకొని వద్దామని కర్ణుడు దుర్యోధనుడికి, ధృతరాష్ట్రుడికి చెప్పాడు. భీష్మ ద్రోణులు చెప్పిన హితోక్తులను ధర్మరాజాదులను స్నేహపూర్వకంగా దప్పించి వారి రాజ్యభాగాన్ని వారికి ఇవ్వమని వారు చేసిన సూచనను వ్యతిరేకించాడు. దుర్యోధనుని పక్షాన అతని మనసుకు సంతోషం కలిగే లాగా మాట్లాడాడు. కర్ణుడు మత్స్య యంత్రభేదనం చేయ లేకపోవడం అతరువాత జరిగిన యుద్ధంలో అర్జునుడిని ఓడించలేకపోవడం కర్ణుడి సమర్థతగు ప్రశ్నార్థకాలుగా నిలుస్తాయి. అయినా దుర్యోధనుడికి కర్ణుడి పట్ల నమ్మకం సడలలేదు. పాండవులు లక్క ఇంట్లో మరణించలేదని, తప్పించుకొని ఆ తరువాత ద్రౌపదిని వివాహమాడి ద్రుపదుని బంధువులైనారని తెలిసి వారిని ద్రుపదుడి నుండి దూరం చేయాలని ప్రయత్నించాడు. కర్ణుడు దుర్యోధనుని మనసులో ఆ ఆలోచనను ప్రవేశపెట్టి ధృత రాష్ట్రుని తమ దురాలోచనను ఆమోదించేలా చేసినవాడు కర్ణుడు.

దుర్యోధనుడి పట్ల స్నేహ ధర్మాన్ని నిర్వర్తించడం కోసం భీష్మ ద్రోణాదులను కూడా కించపరచి, మాట్లాడి మర్యాద లను మరచినవాడు కర్ణుడు. ధృతరాష్ట్రుడు పాండవులకు 'ఖాండవప్రస్థం' రాజధానిగా అర్ధరాజ్యం ఇచ్చాడు. విశ్వకర్మ 'ఇంద్రప్రస్థం' నిర్మించి ఇచ్చాడు. మయుడు 'సభ' నిర్మించి ఇచ్చాడు. పాండవులు రాజసూయ యాగం చేశారు. ఆయాగానికి కర్ణుడు కూడా వచ్చాడు. పాండవుల వైభవం చూసి దుర్యోధనుడికి కన్నుకుట్టింది. మాయా ద్యూతంలో ధర్మరాజు సకల సంపదలను తమ్ములను కోల్పోయాడు ద్రౌపదిని కూడ పణంగా ఒడ్డి ఓడి పోయాడు. ఆ సమయంలో దుర్యోధునుడు, శకుని, దుశ్శాసనుడు, కర్ణుడు, సైంధవుడు తప్ప మిగిలిన వారందరూ దు:ఖించారు. దుర్యోధనుడు ద్రౌపదిని 'దాసి'గా పేర్కొని సభకు పిలిపించే ప్రయత్నం చేశాడు.

ద్రౌపది తన అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పుడు దుర్యోధనుని తమ్ముడైన వికర్ణుడు ఆమెను సమర్థిం చాడు. అప్పుడు 'కర్ణుడు' వికర్ణుని మందలించి, ద్రౌపదిని విగతవస్త్రంగా తీసుకొని వచ్చినా అధర్మం కాదని దుర్యో ధనునికి తోడుగా నిలిచాడు.

మహాభారతంలో కథానాయకుడు ధర్మరాజు. అతడి పక్షలంలో ఉపనాయకుడు శ్రీకృష్ణుడు. కథలో ప్రతి నాయకుడు దుర్యోధనుడు. అతడి పక్షంలో ఉప నాయకుడు కర్ణుడు. ఇతడి వ్యక్తిగత చరిత్రం, విధికి ఎదురీత ఈదిన వాడు. అందుకే ఎవరికీ లేని సానుభూతి ఇతనిపై ఉంది. బ్రతుకులో అతడివలన లాభం పొందిన వారే కాని, అతడి మేలు కోరినవారు తక్కువ. అతడు ప్రజ్వలించిన మహాగ్నిజ్వాల! దాని చుట్టూ చేరిన మిత్రులు గాని, శత్రువులు గాని తలకొక ఇంధనాన్ని ఈవలకి తీసి మంట నార్పటానికి యత్నించినవారే కాని సాదరంగా ఒక్క సమిధను సవరించినవారు లేరు. కర్ణుడు తన అంతర్గతతాపాన్ని తనలోనే దాచుకొన్నాడు. కాని పరులకు పంచి ఇచ్చి తాను సుఖించలేదు. అతడు మహావీరుడు, మహాదాత, ఉజ్వలుడు.

ఇటువంటి మేటివీరుడు కురుక్షేత్రంలో అర్జునుడితో తలపడి ఘోరయుద్ధం చేశాడు. విక్రమం ప్రదర్శించినా విధిచాలక అతడు నేలకూలాడు. నాయకపక్షంవారి తీవ్రయత్నానికి ఏకైక హేతువు కావటం కంటే వీరుడికి కావలసిన గుర్తింపు మరేముంటుంది? అట్టివాడు ప్రతి నాయకోపనాయకుడైతే బ్రతకవలసిన దానికంటే ఘనంగా

బ్రతికినట్లే. అట్టి కర్ణుడికి - పరశురాముడి వద్ద భార్గవాస్త్రాంతం బాణవిద్య నభ్యసించిన జోదుకు - కృష్ణుడి మాయచేత ఇంద్రదత్తమైన శక్తి, సర్పముఖాస్త్రం, రౌద్రమంత్రపూరితమైన బాణం వమ్మైపోవటంతో కన్నీరు నిండింది. రథచక్రం నేలలో క్రుంగటంతో మనసులో ధైర్యం కుంటువడింది. భార్గవాస్త్రం స్ఫురించకపోవటంతో సర్వం ముగిసింది. కఠినమైన విధి కసితీర్చుకొన్నప్పుడే కరుణమాలిన శత్రువు కుత్తుక త్రెంచటంతో కర్ణుడి కన్నుమూత కరుణారసభరితమై పోయింది. కన్నీరు కార్చే కొడుకులు కూడా కదనరంగంలో కన్నులు మూశారు. మిత్రుడైన రారాజు 'హే కర్ణా!' అంటూ అందరిబదులు తానొక్కడే ఎలుగెత్తి శోకించాడు.

మహాభారతకథలో కర్ణుడు చివరకు మరణించటం కంటే మరొక ప్రత్యామ్నాయం లేదు. కర్ణుడుండగా దుర్యోధనుడికి చావులేదు. ధర్మరాజుకు విజయం లేదు. కథకు ప్రగతి లేదు. ఒకవేళ కర్ణుడికంటే ముందే దుర్యోధనుడు చనిపోతే కర్ణుడు బ్రతికి ఫలం లేదు. పైపెచ్చు ధర్మరాజుకు రాజ్యసిద్ధి లేదు. అంటే నాయకుడికి ఫలభుక్తి లేదు. ఇన్ని లేములకు కలిమి కలిగించింది కర్ణుడి విషాదాంతం. ఉపనాయకుడుగా ఇతిహాసంలో ఉపజీవించి, ప్రతినాయక ప్రతిష్ఠను పెంచి, శత్రుపక్షం నుండి ప్రశంసలు పొంది, ప్రతినాయక సహాయకుడిగా మాత్రమే కాక, స్వతంత్ర ప్రతిపత్తి గల వీరుడుగా రాణించిన కర్ణుడు భారత ప్రాతలలో విశిష్టుడు. ఉప ప్రతినాయకుడుగా ఉజ్జ్వలవృత్తాన్ని నిర్వహించి అపార ప్రతిష్ఠను గడించిన విషాదవీరుడు కర్ణుడు. అందుకే 'కర్ణుడు లేని భారతం' భారతమే కాదని విజ్ఞుల వివేచన! కర్ణుడి తల భారతమనే నానుడి ఏర్పడింది.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు దినపత్రికలు – సాహిత్యసేవ

– దొరిశెట్టి లక్ష్మీకరసింహం, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ జిల్లా.

"పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు పత్రికొక్కటున్న మిత్ర కోటి" అని నార్ల వారు ఏనాడో చెప్పిన మాటలు అక్షరాల సత్యం అని చెప్పక తప్పదు. నేడు దినపత్రికలు నిర్వర్తిస్తున్న పాత్ర గురించి చెప్పుకోవాలంటే ఎంతో చెప్పాల్సి వస్తుంది. సమాజంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలను దినపత్రికలు కళ్ళకు కట్టినట్లు మన ముందుకు తెస్తున్నాయి. నేటి ఆధునిక కాలంలో పత్రికా రంగం నూతన పుంతలు త్రొక్కుచున్నది. ఎలక్ట్రానిక్ యుగంలో సైతం దినపత్రికలు ప్రాచుర్యం పొందడానికి కారణం ఆయా పత్రికలలోని వైవిధ్యాంశాల సమాహారమే అని చెప్పక తప్పదు. భారతదేశంలో 1780లో 'బెంగాల్ గెజిట్' అనే పత్రికతో ఆరంభమైన పత్రికల ప్రస్థానం దిన దినం అభివృద్ధి పథంలో కొన సాగుతునే ఉన్నదని చెప్పవచ్చు.

పత్రికలనేవి ప్రజలను చైతన్యవంతం చేస్తాయి మంచి చెడులను అవి విశ్లేషిస్తాయి. సమాజంలో జరిగే సంఘ టనలకు పత్రికలు అక్షర రూపాన్నిస్తాయి. పత్రికల ఆవిర్భావం నుండి నేటివరకు తెలుగు దిన పత్రికలు పోషించిన పాత్ర గొప్పదనే చెప్పవచ్చు. ఇక తెలుగులో పత్రికల ఆవిర్భావ విషయానికి వస్తే ఎక్కువ మంది అభిప్రాయం ప్రకారం తెలుగులో పత్రికల ఆవిర్భావం 1830 - 1857 మధ్య కాలంలో జరిగి ఉంటుందని నిర్ధారించడం జరిగింది. తెలుగులో తొలి పత్రిక ఏది? అనే విషయంలో సైతం ఏకాభిప్రాయం లేదు. అయితే 1838లో మద్రాస్ నుండి వెలువడిన 'వృత్తాంతి' అనే వార పత్రికను తొలి తెలుగు పత్రికగా ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. 1875 తరువాత తెలుగు పత్రికా రంగంలో వికాసయుగం ప్రారంభమైనట్లుగా చెప్పవచ్చు.

1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం పత్రికా రంగానికి కావలసిన సైద్ధాంతిక భూమికను ఏర్పర్చిందని చెప్పవచ్చు. తెలుగులో తొలిదశలో మాస పత్రికలు ఆ తరువాత వార పత్రికలు ఆఖరున దిన పత్రికల ఆవి ర్భావం జరిగినట్లు మనకు తెలుస్తుంది.

20వ శతాబ్దంలో తెలుగు దినపత్రికల రంగంలో ఒక విప్లవం సంభవించిందనే చెప్పవచ్చు. ఎందుకంటే ఈ శతాబ్దంలో కొన్ని వందల సంఖ్యలో పత్రికలు వెలు వడ్డాయి. ముఖ్యంగా 1960లో ఆంధ్రజ్యోతి, 1974లో ఈనాడు, 1985లో ఉదయం, 1996లో వార్త పత్రికలు తెలుగు పాఠక లోకానికి వెలుగును చూపాయనే పేర్కొన వచ్చును.

తెలుగు దిన పత్రికలలో సాహిత్యాంశాలు :

సమాజహితాన్ని కోరేది సాహిత్యం తెలుగు సాహిత్యా నికి వేల సంవత్సరాల చరిత్ర కలదు. నన్నయ్య కాలం నుండి తెలుగు సాహిత్యం నూతన పుంతలు త్రొక్కుతూ ఆధునిక రూపాలను సంతరించుకొంది. సాహిత్యం అనేది వ్యక్తికి ఒక అనుభూతిని కలిగిస్తుంది. పాఠకుడిని క్రొత్త ఆలోచనా స్రవంతివైపు పయనింపజేస్తుంది.

అయితే ఆధునిక కాలంలో తెలుగు దినపత్రికలు సైతం పాఠకులలో సాహిత్యం పట్ల ఆసక్తిని, అభిరుచిని కలిగించేలా అనేక సాహితీ అంశాలను సమకాలీన వార్తా కథనాలతో పాటు ప్రచురిస్తున్నాయి. తెలుగు దిన పత్రికలలో సాహితీ అంశాల ప్రచురణ గురించి మాట్లాడే టప్పుడు తొలుత ఆంధ్రజ్యోతి దినపత్రికను పేర్కొనాలి. ఎందుకంటే విభిన్న సాహితీ ప్రక్రియలు, విమర్శా వ్యాసాలు, చేరాతలు మొదలగు అనేక సాహిత్య సంబం ధిత అంశాలను ప్రచురించడంతో పాటు ఇప్పటికి కూడా ప్రతి సోమవారం 'వివిధ' పేరుతో ప్రత్యేకంగా ఒక పేజిని కేటాయించి అనేక సాహితీ వ్యాసాలను అందిస్తుంది. ఇక్కడ కొన్ని దినపత్రికలు ప్రచురిస్తున్న సాహితీ అంశాల గురించి వివరించడం జరిగింది.

1) ఆంధ్రజ్యోతి దినపత్రిక :

సాహితీ అంశాలకు సంబంధించిన శీర్షిక. వివిధ (ప్రతీ సోమవారం) ఈ శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రతీ సోమవారం సాహిత్యాంశాలపై విశ్లేషణలు, వ్యాఖ్యలు, రచయితల అంతరంగాలు, పుస్తక సమీక్షలు, సాహితీ కార్యక్రమాల వివరాలు, వచన, గేయ కవితలు మొదలైన అంశాలను ఎప్పటికప్పుడు పాఠకలోకానికి అందిస్తు సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నదనే చెప్పవచ్చు.

2) ఈనాడు :

తెలుగు పత్రికా రంగంలో ఈనాడు ఒక పెను సంచలనం అనే చెప్పవచ్చు. వార్తా ప్రచురణలో ఈనాడు ఒక కొత్త ధోరణితో ఇప్పటికి అశేష పాఠకలోకాన్ని తనవైపుకి ఆకర్షించగలిగింది. అయితే మిగతా దిన పత్రికలతో పోలిస్తే ఈనాడులో సాహితీ అంశాలకు కొంత తక్కువ ప్రాధాన్యత ఉందనే చెప్పవచ్చు. అయితే ఆయా కవుల, రచయితల జయంతులు, వర్ధంతుల సందర్భాలలో ఎన్నో అమూల్యమైన సాహితీ వ్యాసాలను ఈనాడు ప్రచురిస్తున్నది. ఈనాడు ఆదివారం అనుబంధంలో ఒక కథను ప్రతి ఆదివారం ప్రచురిస్తున్నారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఈనాడు ఎంతో విలువైన సాహితీ అంశాలను ప్రతిరోజు ప్రచురించి పాఠకులను అలరించిందనే చెప్పవచ్చు.

3) ఆంధ్రభూమి :

ఆంధ్రభూమి దినపత్రిక ప్రతి శనివారం 'నుడి' శీర్షికన విలువైన సాహితీ వ్యాసాలను ప్రచురిస్తున్నది. ప్రతి సోమవారం 'సాహితీ' శీర్షికన సైతం అనేక సాహిత్య సంబంధిత అంశాలను ప్రచురిస్తున్నది. 'వాహిని' శీర్షికన పారాణిక గ్రంథాలనుండి కొన్ని ఇతివృత్తాలను అందిస్తున్నది.

4) ఆంధ్రప్రభ :

ఆంధ్రప్రభ దినపత్రిక సైతం ప్రతీ సోమవారం 'సాహితీ గవాక్షం' పేరుతో సాహిత్య సంబంధ అంశాలను పాఠకులకు అందిస్తున్నది. ఈ శీర్షికన ప్రచురితమయ్యే సాహితీ కదంబంలో భాగంగా సమకాలీనతను ప్రతిబింబించే సామాజిక, రాజకీయ అంశాలపై ఆయా కవులు సంధించే వచన కవితలను ప్రచురిస్తున్నది.

5) సాక్షి దినపత్రిక :

తెలుగు దినపత్రికలలో తొలిసారి పూర్తి పుటలను రంగులలో ముద్రించి పత్రికా రంగంలో సంచలనం సృష్టించిన సాక్షి దినపత్రిక ప్రతి సోమవారం 'సాహిత్యం' శీర్షికన ఎన్నో వైవిధ్యభరిత సాహితీ వ్యాసాలను తెలుగు పాఠకులకు అందిస్తున్నది.

'సింగిల్ కాలమ్' పేరిట రచయితలు కవుల గురించిన విశేషాలు, రీడింగ్ రూమ్ పేరిట నూతన గ్రంథాలను పరిచయం చేయడంతో పాటు ఎన్నో సాహితీ అంశాలను అందిస్తున్నది.

6) నమస్తే తెలంగాణ దినపత్రిక :

2011 జూన్ 6న తెలంగాణ ఉద్యమ సైద్ధాంతిక నేపథ్యంగా ఆవిర్భవించిన ఈ పత్రిక తెలంగాణలోని సాహిత్యాంశాలను ప్రచురించడంలో ఎంతో కృషి చేస్తున్నది. మరుగునపడ్డ అనేకమంది తెలంగాణ కవులు, రచయితలను పాఠకులకు పరిచయం చేస్తున్నది. ప్రతి సోమవారం 'చెలిమె' పేరుతో అమూల్య మైన సాహిత్య అంశాలను అందిస్తు సాహిత్యాభివృద్ధిలో తనవంతు పాత్రను పోషిస్తున్నది.

7) వార్తా దినపత్రిక :

1996లో ఆవిర్భవించిన 'వార్తా' దినపత్రిక సైతం సాహిత్యాంశాలను ప్రచురించడంలో ఎంతో కృషి చేస్తున్నది. 'కావ్య' పేరుతో ప్రతీ సోమవారం సాహితీ వ్యాసాలు, విమర్శా వ్యాసాలు, లేఖా సాహిత్యం మొదలగు అంశాలు ప్రచురిస్తున్నారు. ప్రతి శుక్రవారం 'గళం' పేరుతో మహిళా రచయిత్రులు రాసిన కవితలను ప్రచురిస్తున్నది.

8) ప్రజాశక్తి దినపత్రిక :

ప్రజాశక్తి దినపత్రిక ప్రతి సోమవారం 'సవ్వడి' శీర్షికన

వివిధ సాహిత్యాంశాలను ప్రచురిస్తున్నది. ముఖ్యంగా ఉద్యమ సాహిత్యానికి ఈ పత్రిక పెద్ద పీఠ వేస్తుందని చెప్పవచ్చు.

9) సూర్య దినపత్రిక :

నూకారపు సూర్యప్రకాశరావు నేతృత్వంలో 2007లో పురుడు పోసుకున్న ఈ దినపత్రికలో 'అక్షరం' శీర్షికన ప్రతి సోమవారం సాహితీ అంశాలు ప్రచురించబడుచున్నవి. ప్రతి ఆదివారం 'కొత్త పుస్తకం' శీర్షికన నూతనంగా వెలువడిన రచనలను విమర్శనాత్మకంగా సమీక్షిస్తు పరిచయం చేస్తున్నది. ఈ పత్రిక ఆదివారం అనుబంధంలో బాల సాహిత్యానికి పెద్ద పీఠ వేస్తున్నది.

10) మన తెలంగాణ దినపత్రిక :

2015లో ఆవిర్భవించిన ఈ పత్రిక సైతం రాజకీయ, సామాజిక వార్తా కథనాలతో పాటు ప్రతి సోమవారం 'కలం' పేరుతో విభిన్న సాహిత్యాంశాలను పాఠకులకు అందించడంలో తనవంతు పాత్రను పోషిస్తున్నది. ఆదివారం అనుబంధం 'దునియా' పేరుతో ప్రచురిస్తు అందులో ప్రతి ఆదివారం ఒక కథను అందిస్తున్నది.

ఈ విధంగా తెలుగు దినపత్రికలు ఇప్పటికి సాహితీ అంశాలను ప్రచురిస్తు సాహితీలోకానికి విశిష్ట సేవ చేస్తున్నాయనే చెప్పవచ్చు. ఆయా దినపత్రికలు ప్రచురిస్తున్న సాహిత్యాంశాలు సాధారణ పాఠకులతో పాటు, పరిశోధక విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్న వారికి, ఆధ్యాపక లోకానికి ఎంతో ఉపయోగపడుతున్నాయనడంలో ఇసుమంతైనా ఎలాంటి సందేహం లేదు.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునిక తెలుగు స్త్రీవాద కవిత్వం – నిషిద్ధాక్షరి ఒక పరిశీలన

– డా॥. పల్లె కృష్ణ, తెలుగు అధ్యాపకులు, CSSR & SRRM డిగ్రీ & పీ.జీ. కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

ఆధునిక తెలుగు కవిత్వం :

నేటి కాలంలో ఆధునిక సాహిత్య ప్రక్రియలు అనేకం పుట్టుకు వచ్చాయి, ఇంకా వస్తూనే ఉన్నాయి. వినూత్న భావజాలంతో కవులు, రచయితలు వివిధ కోణాల్లో సాహిత్యాన్ని ముందుకు నడిపిస్తున్నారు. ముఖ్యంగా ఆధునిక కవిత్వం వివిధ రకాల ఉద్యమాలను, వాదాలను శక్తివంతం చేసి ప్రజలను చైతన్య పర్చడంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుందనవచ్చు.

ఆధునిక కవిత్వం మనుషుల మస్తిష్కంలో మరువ కూడని మానవీయ విషయాలను ఎన్నింటినో తట్టి నిద్రలేపి, ఇది వరకటి మనిషి మూఢ సంప్రదాయాలతో తన చుట్టూ బిగించుకున్న వివిధ రకాల బంధనాలను చేదించుకుని వర్తమాన ఆలోచనాధారతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టేలాచేసింది. ఒక అంశాన్ని పలు కోణాల్లో భిన్నధోరణులతో ప్రకాశించేయడం నేర్పి, ఆధునిక కవిత్వానికి ఉన్న అనంత శక్తిని పరిచయం చేసిందనవచ్చు. ఈనాడు ఇంత విస్తృతంగా కవిత్వంలో మార్పులు రావడానికి మార్గం సుగమం చేసింది ఆధునిక కవిత్వమే.

నేడు శాఖోపశాఖలుగా విస్తరిస్తూ పలు ఉద్యమాలకు, వాదాలకు జీవంపోస్తున్న ఆధునిక కవిత్వం సమాజంలో మార్పుతీసుకురావడానికి, సమాజాన్ని ప్రగతివైపు పయనింపచేయడానికి దోహదపడుతోందనవచ్చు. ఆధునిక తెలుగు సాహిత్యంలో భావవాదం, అభ్యుదయవాదం, విప్లవవాదం, దిగంబర, పైగంబర వాదాలు, స్త్రీ, దళిత, మైనారిటీ, బహుజనవాదం వంటి ఎన్నో వాదాలకు ఆధునిక కవిత్వం ఒక నిర్దుష్టతను అందించింది.

స్త్రీవాద కవిత్వం :

ఆధునిక కవిత్వంలో స్త్రీవాద కవిత్వం 1980 ప్రాంతం నుంచి వస్తూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఎన్ని ఉద్యమాలు వచ్చినా ఆ ఉద్యమాల ప్రభావంతో స్త్రీల దైనందిన జీవనశైలిలో మార్పురానందున స్త్రీలకోసం, స్త్రీలచేత ఆవిర్భవించిందే స్త్రీవాద కవిత్వం. ఆది నుంచి సమాజంలో మగవారికి తోడుగా నడిచిన స్త్రీని - తక్కువగా చూడడం, చూపడం జరిగిందనవచ్చు. అన్నింటికీ ఆడది కావాలి కానీ ఆధిపత్యం మాత్రం మగవాడిదే అనే కోణంలో నుంచి జ్వలిస్తూ, జనించిందే స్త్రీవాద కవిత్వం.

స్త్రీలను తరతరాలుగా తమ సంకుచిత ఆలోచనా విధానాలతో బంధించడం వల్ల, స్పష్టంగా చెప్పాలంటే వారిని వంటింటికే పరిమితం చేయడం, అపాదమస్తకం సంప్రదాయ శృంఖలాలతో బంధించడం జగమెరిగిన సత్యం. సృష్టిలో స్త్రీ పురుషులు ఇరువురూ సమానమైన సమాజం మాత్రం స్త్రీలకు సర్వత్రా దు:ఖాన్నే అధికంగా అందించింది.

సమస్త మానవ జీవితాన్ని నిశితంగా పరిశీలిస్తే కొందరు పురుషులకు ఉన్న దుష్టగుణ స్వభావంచే స్త్రీలు ఎక్కువగా బాధింపబడ్డారనవచ్చు. పురుషులు చెడువైపు అడుగులు వేసే ప్రతిసారి అంతిమంగా స్త్రీలే నరకం అనుభవిస్తున్నారని తెలుస్తోంది. పురుషులలో ఉన్న అహంకారం, క్రోధం, ఈర్ష్యాదులచే స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, మానప్రాణాలు హరింపబడుతున్నాయనవచ్చు. ఈ కారణంగా చూస్తే ప్రపంచంలో స్త్రీలే పురుషుల కన్నా అధికంగా కష్టాలతో, బాధలతో జీవిస్తున్నారని చెప్పవచ్చు.

మానవ జాతిలోని ఒక సగభాగం రెండవ సగభాగాన్ని నిరంతరం అణచివేసే ప్రయత్నం చేస్తూ ఉందని చెప్పాలి. అణిచివేయబడ్డ స్త్రీలు, బాధపడ్డ స్త్రీలు, అవమానబడ్డ స్త్రీలు ఉత్తమ శిశువుకు, ఆరోగ్యవంతమైన

శిశువుకు ఎలా జన్మనివ్వగలరు? తమ తమ బాధలతో, కష్టాలతో సతమతమవుతూ చింతిస్తూ జీవిస్తున్న స్త్రీలు జీవితంలో ఏ విధంగా విజయం సాధించగలరు?

ఒక ఇంటి ఇల్లాలి దైనందిన జీవితాన్ని పరిశీలిస్తే తెల్లవారుజాము నుంచి రాత్రి పడుకునే ముందు వరకు ఒక యంత్రలా శ్రమిస్తూనే ఉంటుంది, జీవితంలో తన కంటు ఏ గమ్యంలేని మనిషిగా. తమ యావజ్జీవితం ఆ ఇంటికేధారపోస్తుంది. అయినా ఎపుడూ, ఏచోట, ఏ విధమైన గుర్తింపుకు నోచుకోదు. పురుషులు లేని సమాజం ఏవిధంగా ఊహించలేమో, స్త్రీలులేని సమాజాన్ని కూడా ఊహించలేము కదా? అలాంటపుడు స్త్రీలను పురుషుల కోసం సృష్టించబడ్డ బానిసలుగా చూడడం వంటింటికే పరిమితం చేయడం ఎంతవరకు సమంజసం.

స్త్రీవాద కవిత్వం ఆకలితో, అశాంతితో, దు:ఖంతో, అణిచివేతతో అతలాకుతలం అవుతున్న సంఘర్షణలోంచి స్త్రీల జీవితాలలో మార్పు తీసుకురావడానికి, పీడనలేని, లైంగిక వివక్షతలేని, అహంకారం, అసమానతలు చూపని ఆధునిక సమాజం కోసం దోహదపడుతోంది.

ఆధునిక స్త్రీవాద కవిత్వం 1980 నుంచి వచ్చినప్పటికీ, 1990లో త్రిపురనేని శ్రీనివాస్ ప్రచురించిన 'గురిచూసి పాడేపాట' ద్వారా బలం పుంజుకుని 1993లో అస్మిత వారి 'నీలిమేఘాలు' ద్వారా సూటిగా తన వాదాన్ని వినిపించింది. పురుషులకన్నా స్త్రీలే తమ వాదం గురించి మరింత లోతుగా, స్పష్టంగా చెప్పగలరని తెలియజేసింది.

'నీలిమేఘాలు' స్త్రీవాద కవితా సంకలనం ద్వారా వసంత కన్నాభిరాన్, ఓల్గా, విమల, జయప్రభ, సావిత్రి, శ్రీమతి, కొండేపూడి నిర్మల, మొక్కపాటి సుమతి, మందరపు హైమవతి వంటి రచయిత్రులు స్త్రీవాద కవిత్వాన్ని బలంగా వినిపించారు.

పెళ్ళిపేరుతో స్త్రీ ఏవిధంగా దోపిడీకి గురౌతుందో, ఒక ఆటబొమ్మగా మారుతుందో 'ఓల్గాగారి స్వేచ్ఛ' కవిత ప్రతిబింబించగా, 'సావిత్రిగారి బందిపోట్లు' కవిత పెళ్ళంటే పెద్దశిక్షగా-మొగుడంటే స్వేచ్ఛాభక్షకుడుగా చిత్రించగా, 'మొక్కపాటి సుమతి గారి మిత్రవైరుధ్యమా' అనే కవితలో వర్గ శత్రువు కన్నా లింగ శత్రువే ప్రమాదకారి అని చాటగా, 'విమలగారి వంటిల్లు' కవిత స్త్రీశక్తి దోపిడీని-పురుషాధిక్యతను స్పష్టం చేయగా, 'జయప్రభ గారి పైటను తగలెయ్యాలి' అనే కవిత స్త్రీలకు లేని ఎన్నో రకాల అలవాట్లను పైట నేర్పుతుందంటు సమాజంలో స్త్రీ స్వేచ్ఛ హరించే పైటను తగలెయ్యాలని సంచలనం సృష్టించింది. ఈవిధంగా ఎందరో కవయిత్రులు తమతమ పదునైన పరుష పదాల భావజాలంతో సమాజాన్ని ప్రశ్నించడం వారికి జరుగుతున్న అన్యాయాలను ప్రస్తావించడం జరిగింది, ఇంకా జరుగుతోంది. అయితే కొన్ని కవితలు వివాదాలు సృష్టించడం, విమర్శలకు గురికావడం కూడా జరుగుతోంది.

నిషిద్ధాక్షరి :

స్త్రీవాద భావజాలంతో బలమైన, మరింత పదునైన కవిత్వాన్ని 'నిషిద్ధాక్షరి' పేరుతో 2004లో సంపుటంగా వెలువరించారు కవయిత్రి 'మందరపు హైమవతి'గారు. ఈ కవితా సంపుటాన్ని పరిశీలిస్తే 43 కవితలున్న ఈ సంపుటం తరతరాలుగా స్త్రీలు అనుభవిస్తున్న వివక్ష, నరకయాతన, దోపిడీ, పురుషపీడన వంటి వివిధ అంశాలు కవితల రూపంలో ప్రతిధ్వనింపచేశారు.

మందరపు హైమవతిగారికి స్త్రీవాద కవయిత్రిగా గొప్ప గుర్తింపు తెచ్చిన రచన ఇది. "నిషిద్ధాక్షరి స్త్రీవాద తాత్వికత 'నేపధ్యంగా వచ్చిన కవితా సంపుటి', ఇందులో వారికి పేరు, బహుమతులు తెచ్చిన కవితలు అనేకం ఉన్నాయని, ఒకరకంగా హైమవతిగారిని స్త్రీవాద కవయిత్రిగా Establish చేసిన కవితా సంపుటి అది" అని కె.శివారెడ్డిగారు' 'నీలిగోరింట'కు రాసిన ముందుమాటలో అభిప్రాయపడ్డారు. "మందరపు హైమవతి కవితా ముద్ర తెలుగు స్త్రీవాద కవిత్వంలో చెరగనిది. తనదైన స్వరంలో స్త్రీ ఆర్తిని, ఆవేశాన్ని, ఆగ్రహాన్ని, ప్రేమనూ, ప్రేమ రాహిత్య జీవిత వేదనలను, ఆర్థిక సంబంధాల ప్రభావంతో ఛిద్రమవుతున్న స్త్రీ పురుష సంబంధాలనూ కవిత్వీకరించిన

అపురూప కవయిత్రి మందరపు హైమవతి" అని ఓల్గాగారు తమ అభిప్రాయాన్ని 'నీలిగోరింట'కు రాసిన ముందు మాటలో తెలిపారు.

నిషిద్ధాక్షరి కవితా సంపుటిని పరిశీలిస్తే కొన్ని ప్రధానాంశాలు ప్రస్ఫుటమవుతాయి అవి :

పితృస్వామ్యంలో బలియైన బాల్యం, ప్రేమ పేరుతో దగాపడ్డ స్త్రీ, పెళ్ళి పేరుతో బానిసైన స్త్రీ, నిషిద్ధజీవి-స్త్రీ, వ్యాపార వస్తువు - స్త్రీ, వృద్ధాప్యంలో స్త్రీ, సమాజం - పోరాటం - స్త్రీ, ఇలా అనేక కోణాల్లో స్త్రీల స్థితిగతులను గురించి చక్కగా కవిత్వీకరించారని తెలుస్తుంది.

పితృస్వామ్యంలో బలియైన బాల్యం- 'ఊపిరాడదు' అనే కవితలో

ఇంకా శరీరపుష్పం... వికసించనేలేదు సంపూర్ణంగా
అప్పుడే... చంకలో చంటిపిల్ల భారం...
ఏ ఇసుక తుఫానులోనో కూలిపోయిన
కలల ఖర్జూరవనం... ఏ దూరతీరాలకో
ఎగిరిపోయిన... బాల్యం తూనీగ...
పుత్తడిబొమ్మల... కౌమారాన్నపహరించడానికి...
ఏ శతాబ్దమైతేనేం.. పూర్ణమ్మల పున్నమి బతుకులకు...
పీడకలల మసి పూయడానికి...

పితృస్వామ్యం సదా సిద్ధం... అంటూ పసితనం వసివాడకముందే విద్యకు దూరం చేసి పెళ్ళి పేరుతో వారి కలల ప్రపంచాన్ని కూలదోసి వంచనతో బానిసగా వారిని మారుస్తున్న వైనం కనపడుతుంది. పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీలను కనీసం ఒక మనిషిగా కూడా చూడక పోవడం కనిపిస్తుంది. శతాబ్దాలు మారిన ఆడపిల్లల తలరాతలు మారడంలేదు. నేటికీ కొన్ని చోట్ల వారి పట్ల వ్యవహరిస్తున్న తీరు చాలా గర్హనీయం.

'జాగ్రత్త! జాగ్రత్త!!' అనే కవితలో

చిన్నప్పుడు... సింద్‌బాద్ సాహసయాత్రలు...
గలివర్ ప్రయాణగాథలు... చదివినపుడు...
ఎన్ని కలలు కన్నాను... నేనూ ఒక సాహసగీతాన్ని
కావాలని...
కానీ పెద్దయ్యాకగదా తెలిసింది... సింద్‌బాద్‌లు గలీవర్‌లు... బాలురకు ఆదర్శమూర్తులని

సిండ రెల్లాలు స్నోవైట్‌లు... బాలికలకు ఆరాధ్య దేవతలని.... అంటూ బాలురను మాత్రం సాహస వీరులుగా తీర్చిదిద్దే క్రమం, బాలికలకు బాల్యం నుండే సుకుమారిగా, అశక్తురాలుగా మార్చే ప్రయత్నం చేయడం, పదేపదే ఆడపిల్లవి, అబలవి అంటూ దండకాలు చదివి వారిని వీలైనంత బలహీన పరచడానికే ఈ సమాజం ప్రయత్నిస్తుందంటు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రేమ పేరుతో దగాపడ్డ స్త్రీ - 'మరో తాజ్ మహల్' అనే కవితలో

శరీర సహకారగానంతో... సజావుగా నడిచిన ప్రేమగాథ...
స్వీయనిర్ణయ ప్రకటన చేయగానే... భావోద్వేగ సన్నివేశాల్లో...
హఠాత్తుగా వాణిజ్య ప్రకటన...
ప్రత్యక్షమైనట్లు... దృశ్యం మారిపోతుంది...
ప్రణయ మండపంలాంటి... ప్రేయసిగుండెల్లో...
కరకు కత్తిపోట్లనే... కానుకగా యిచ్చి... బ్రతికుండగానే...

మరో తాజ్‌మహల్ నిర్మిస్తాడు... అంటూ కొందరు స్వార్థ పురుషులు తమ ఆనందం, శారీరక సుఖాల కోసం అమ్మాయిలను ఏవిధంగా ప్రేమపేరుతో బలితీసుకుంటారో అలాగే ఈ ప్రపంచంలో ప్రేమించడానికి అడ్డురాని సామాజిక, సాంఘిక, ఆర్థిక అంశాలెన్నో పెళ్ళి అనగానే పుట్టుకువచ్చి బ్రతికుండగానే మరో తాజ్‌మహల్ నిర్మిస్తాడని తెలియజేశారు.

ఒకవేళ పెళ్ళి చేసుకున్న తరువాత పరిణమించే స్థితి, పరిస్థితి గురించి కూడా కవయిత్రి

'కవిగారి భార్య!' అనే కవితలో ...

పెళ్ళికి ముందు ప్రేయసిగా ఉన్నప్పుడు కనిపించిన

ప్రతిదాన్ని కవిత్వీకరించాలని వెళ్ళి తపన పెళ్ళయ్యాక ఉండదెందుకనో... అంటారు.

పెళ్ళి పేరుతో బానిసైన స్త్రీ - 'సర్ప పరిష్వంగం' అనే కవిత మందరపు హైమవతిగారికి బాగా పేరు తెచ్చిన కవితలలో ఒకటి. ఇందులో పెళ్ళి తరువాత భార్య భర్తకు డబ్బు సంపాదించే ఒక మరమనిషిగా, ఒక బానిసగా, చిత్రించడం జరిగింది.

'అంతా బాగానే వుంటుంది... అప్పటివరకు...
కామంతోనైతేనేమి... మోహంతో నైతేనేమి...
ఇరువురి తనువులొకటైనాక... అద్వైత సిద్ధి పొందినాక...
ఒక ప్రశ్నల బాణం సంధిస్తావు... "జీతమెప్పుడిస్తారు"... అమాటతో
ఒక్కసారిగా వేయి రాక్షస బల్లులు మీద పాకినట్టు...
నా జీవితం నుంచి దూరంగా నుదూరంగా
విదిలించివేయాలనుకుంటాను నిన్ను...
కానీ భారత స్త్రీనైనందుకు సంప్రదాయాల సజీవ సమాధిలో
ఊపిరాడక గిలగిల కొట్టుకుంటూ...

మృత్యుపర్యంతం బ్రతికేస్తూనే వుంటాను నీ సర్ప పరిష్వంగంలో...అని ఎంతో హృద్యంగా కవిత్వీకరించారు హైమవతిగారు.

'కవిగారి భార్య!' అనే కవితలో ... పెళ్ళి తర్వాత భార్యగా డి-మోషన్ వచ్చాక

ఇంటి చాకిరి భూతపు కోరల్లో చిక్కుకొని... 'పిల్లలకు ఆయాగా, నర్సుగా, టీచరుగా...
వండడం, వడ్డించడం, కడగడం, తోమడం - చర్విత చర్వణాలై జీవిత సౌఖ్యాన్ని వంచించినపుడు'....
కవితా రంగంలో ఎలాగైనా నా పేరు నమోదు చేసుకోవాలని కలం పట్టగానే ... దారుణంగా విసుక్కొంటావు నువ్వు ....
ఇక నేనెప్పటికీ కమలాదాసును కాలేను... నేనిప్పుడు కవిగారి భార్యను మాత్రమే... అంటూ స్త్రీల దయనీయ బానిసతత్వాన్ని ప్రకటిస్తుంది కవయిత్రి.

సర్దుకుపో! అనే కవితలో పెళ్ళైన స్త్రీ అత్తారింటిలో అన్నింటికీ సర్దుకుపోవాలమ్మా! సర్దుకుపోవాలి! అంటూ భర్త చెడ్డవాడైనా, వ్యసనపరుడైనా పెళ్ళయిన దగ్గర్నుంచి ఆలోచనలకు అష్టదిగ్బంధనాలు, అభిరుచులకు స్వస్తివాక్యాలు చివరికి తన శరీరంపై తనకే హక్కులేదంటు విధించే ఆంక్షలతో నేను మనిషినేనా? అనే సందేహం కలుగుతుందంటు... ప్రపంచమంతటికీ స్వాతంత్ర్యం వచ్చినా నేనింకా బానిసత్వం అంధకారంలో మగ్గిపోవల సిందేనా? అని ప్రశ్నిస్తుంది.

నిషిద్ధజీవి-స్త్రీ- సిలబస్ మార్చలేమా! కవితలో

అబ్బ! ఇక చాలు ఆపండి
మీ నీతి శాస్త్ర వ్యాఖ్యానాలు
నిషిద్ధ సూత్ర ప్రవచనాలు...
సమయం దొరికిందే చాలని.... మనువు నుండి ఆధునికులవరకు...

నా మీదే ప్రయోగిస్తారు..... నిషేదాస్త్రాలను, సుభాషితాలను.... అంటూ తరతరాలుగా ప్రతిచోట, ప్రతి సందర్భంలోనూ ఆడవాళ్ళకు మాత్రమే అన్నట్లుగా చెప్పే నీతి సూత్రాలు వినివిని స్త్రీ జీవిత ప్రయాణంలో అడుగడుగునా నిషిద్ధమే కన్పిస్తుందని, మంచి భార్యగా ఉండమని చెప్పే సమాజం, మంచి భర్తగా తనను ఉండమని కనీసం ఒక్కసారైనా మాటవరుసకైనా చెప్పరే ...

జన్మించిన దగ్గర్నుంచి... కొంచెం కొంచెం విషం పెట్టి...
విషకన్యలుగా మార్చినట్లు... కన్ను తెరవకముందే ...
బానిసత్వభావాలు తనలో నిక్షిప్తం చేశారని...

మనసును గుర్తించలేని పాతకాలపు భావాలు గల ఈ జీవిత సిలబస్ మార్చలేమా? అని ప్రశ్నిస్తుంది.

'నిషిద్ధాక్షరి' అనే కవితలో లింగ నిర్ధారణ పరీక్షలో ... ఆడపిల్లనని తెలిసాక...

సామ్రాజ్యాలు కోల్పోయినట్లు... మూడో ప్రపంచ యుద్ధమేఘాలు ముసురు కొన్నట్లు...

అలా దిగులు ముఖం వేలాడదీస్తావెందుకు... నా ఊపిరి ప్రాణాన్ని గాలిలో కలిపేయాలనుకొంటావెందుకు... అంటుంది.

ఆధునిక సాంకేతికత పెరిగి లింగ నిర్ధారణ పరీక్షలు సాధారణమైపోయి చాలా ప్రాంతాల్లో ఆడపిల్ల అని తెలిసాక ఆదిలోనే వారి ఆయువు తీసిన సంఘటనలెన్నో మనం చూశాం, చట్టాలు ఎన్ని వచ్చినప్పటికీ ఇంకా అక్కడక్కడ ఈ కిరాతక చర్యలు జరుగుతూనే మనిషిలోని మానవత్వానికి మసిపూస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే అమ్మ, అక్కా, భార్య ఉండదని సమాజాన్ని జాగృతం చేస్తారు.

ఎవరి కలుగుల్లోకి... కవితలో

వెళ్ళక పోతేనేం... నిషేద దండంతో ... టక్కున దిగ్గొడతారు... నెత్తిన మేకు...అంటూ స్త్రీలు బయటికి పంపడానికి ఎన్నో నియమాలు, నిషేదాజ్ఞలతో కట్టుకున్న మొగుడైనా.... తోడబుట్టిన సోదరుడైనా....సంకెళ్ళను భద్రంగా బిగించి...

పంజరాల ఊచలమధ్య... ఖాళీలను మరింత పూడ్చాలనుకొంటారని... అయినా అతి కష్టంమీద నాలుగు గోడల మధ్య నుంచి బయటకు వచ్చి జీవితానికి సరిపడా ఆనందం హృదయంనిండా నింపుకొని సరికొత్త జన్మనెత్తి, ప్రాణవాయువు నింపుకొన్నాక మళ్ళి ఎవరి కలుగుల్లోకి వాళ్ళు వెళ్ళపోవడమే.

వ్యాపార వస్తువు-స్త్రీ - 'మనకేం మనం బాగానే వుంటాం'ఈ కవితలో

ఇప్పుడు ఇక్కడ... తల్లీ చెల్లీ అక్కా... భార్యా ప్రేయసీ ... అందరూ విపణి వస్తువులే ... అంటూ ఆధునిక సాంకేతిక యుగంలో స్త్రీలను ఒక వ్యాపార వస్తువును చేసి అంగడి బొమ్మగా మార్చేసిన వైనాన్ని ఆవిష్కరించారు.

అమ్మాయిలు కావలెను- కవితలో

సౌందర్య ప్రదర్శనల్లో ... వాణిజ్య ప్రకటనల్లో... శరీరాన్ని పెట్టుబడిగా మార్చి...

బుల్లితెరపై వెండితెరపై... సోయగాలను విరజిమ్ముతూ...అమ్మాయిలే కావాలి...

ఆకలి బకాసురునికో... కరువు రక్కసి కోరలకో ... చిక్కిన అమాయకులను ...

ఉపాధి కల్పిస్తామని... ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేసి ... వక్షోజాల జఘనాల...

అవయవ ప్రదర్శనశాలల... దేహాలకు వెలకట్టి వేలం పాట పాడి...

వ్యాపారం చేయడానికి అమ్మాయిలే కావాలి...

ఔను !... యత్రనార్యస్తు పూజ్యంతే... తత్ర దేవతా రమంతే...

అని స్త్రీలను సంభావించే దేశంగదా మనది ... అని వ్యంగ్య ధోరణిలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాన్ని తేటతెల్లం చేస్తారు.

వృద్ధాప్యంలో స్త్రీ - తల్లి పిల్లలను కంటికి రెప్పలా రక్షిస్తూ పెంచి పెద్దవారిని చేసే క్రమంలో ఎన్నో అవాంతరాలను దాటుతుంది, చివరికి నిద్రాహారాలు మాని తన ప్రాణాన్ని కూడా లెక్కచేయక తన ఆరోగ్యం పాడు చేసుకుంటుంది. ఇంతా చేస్తే పెద్దవారైన తన కన్నబిడ్డలే వృద్ధాప్యంలో తల్లిని పనికిరాని వస్తువుగా చూసే స్థితిని 'నేనొక పసిపాపనై' కవితలో

పాత గుడ్డల మూటలా... పనికిరాని చిత్తు పుస్తకంలా...
ఎవరికీ అక్కరలేని వ్యర్థ పదార్థాన్ని నేను...

వార్ధక్యం శరీరాన్ని శిథిలం చేసినట్లే... మనస్సును గూడ శిథిలం చేస్తే ఎంతబాగుండు... అంటూ ఆమె హృదయం ఆలపించే ఆర్తనాదాన్ని తెలిపారు.

సమాజం - పోరాటం - స్త్రీ - ఆనాటి నుండి ఈనాటి వరకు సమాజంలో స్త్రీలు ఎదర్కొంటున్న సవాళ్ళు అన్నీ ఇన్నీ కాదు. ఈ ఆధునిక సమాజంలో కూడా ఒకప్రక్క స్త్రీలు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగాలు చేస్తు ఎదుగుతున్న మరోప్రక్క అడుగడుగునా ఆడవారిని అబలలుగా చూస్తూ అవమానిస్తూ, అవహేళన చేస్తూ, ఆత్మాభి

మానానికి మారుగా అహంకారం అంటగడుతున్నారు. పుట్టి బుద్దెరిగిన తరువాత నుంచి ఇంటా బయటా, విద్యా, ఉద్యోగాల్లో, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక రాజ కీయాలలో సూటిపోటి మాటల్తో చిత్రవద చేస్తూనే ఉంది ఈ సమాజం.

ఈ దృక్కోణంతో రాసిన కవిత 'నువ్వు - నేను'.

సమాధానం చెప్పినందుకే... ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళను...
పొగరు బోతులంటావు... నిర్భయంగా నిజం పలికినందుకే...
నిష్మూరాల నిప్పుకణికెలు గుప్పిస్తావు...రాత్రిళ్ళు ఆలస్యాల రాకల గురించి ....
ప్రశ్నార్థకమైనందుకు... నన్నోక రాకాసిని చేస్తావు...

ఆడవాళ్ళు ఒక అడుగు అటేసినా, ఒక అడుగు ఇటేసినా తప్పుబట్టే సమాజంలో కొందరు పురుషుల ఆధిపత్యానికి, అహంకారానికి కన్నీరు కారుస్తున్న మహిళల ఆక్రందన నేటికీ వినిపిస్తూనే ఉందని కవయిత్రి మందరపు హైమవతి గారు విదిశపరిచారు ఈ నిషిద్ధాక్షరిలో.

నేటికీ సమాజంలో నిర్భయ, గృహహింస, దిశ, వంటి ఎన్ని చట్టాలు చేసినా, మరెన్నో ఆస్తి హక్కు వంటి హక్కులు కల్పించినా, ఆడవాళ్ళ పట్ల మగవాడి తీరులో మార్పు రానంత వరుకు, సమాజంలో మార్పురానంత వరకు ఇలాంటి పదునైన కవిత్వాలు వెలువడుతూనే ఉంటాయి మనిషిలోని మానవత్వాన్ని తట్టి లేపేందుకు.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అప్పల్నాయుని కథల్లో రైతు జీవితం

– ఆచార్య కె. శ్రీదేవి & చంద్రబాబు, పరిశోధక విద్యార్థి, తెలుగుభాష & అనువాద, అధ్యయనశాఖ,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

చంద్రమ్మ భర్త గుంపస్వామి నాయుడు. రైతులతో కబుర్లు తప్ప యింటి వ్యవహారాలు పట్టించుకునేవాడు కాదు. నీలకంఠేశ్వర స్వామి ఆలయ మాన్యం, తాత ముత్తాతల ఆస్తి, పుట్టింటి వారిచ్చిన పొలంతో పాటు పశుసంపద, యింటి వ్యవహారాలు చంద్రమ్మే చూసుకునేది. ముగ్గురు ఆడపడుచుల పెళ్లి తమ స్థాయికి తగ్గట్లుగా చేస్తుంది. ముగ్గురు ఆడపిల్లలను, ఒక్కడే అయిన కొడుకు సూర్యనారాయణ బాగోగులు చూసుకుంటుంది. గ్రామంలోని రాజకీయ కారణాల వలన దేవాలయ మాన్యం కౌలు సర్పంచి చేతికెళుతుంది. గుంప స్వామినాయుడు ఎలుగు దాడిలో గాయపడి యింటి పట్టునే ఉంటాడు. ఇద్దరు కూతుళ్ళకి పెళ్లి చేయటం, సంప్రదాయ పంటల స్థానంలో వేసిన వాణిజ్య పంటలు నష్టపోవటంతో చంద్రమ్మ ఆస్తులు ఒక్కొక్కటిగా తరిగిపోతాయి. పట్నంలో చదువుతున్న కొడుకు సూర్యనారాయణ సరోజను ప్రేమించి పెళ్లి చేసుకొని యింటికి తీసుకొస్తాడు. చంద్రమ్మ పరిస్థితి మరింత దిగజారుతుంది.

రెండో చెల్లెలు పెళ్లికని తనఖాలోని పొలం అమ్మించి, మిగిలిన డబ్బు పట్టుకొని సూర్యనారాయణ భార్యతో సహా పట్నం చేరతాడు. అత్తగారి మెప్పకనే బడ్డీకొట్టు పెట్టుకుంటాడు. గవర్నమెంటు నౌకరీకని కొంతడబ్బు ఒక ఆసామికిచ్చి మోసపోతాడు. బడ్డీకొట్టు వ్యాపారం దివాళా తీయటంతో భార్యను, కూతురు రోజాను వెంటబెట్టుకొని తిరిగి చంద్రమ్మ యింటికే చేరతాడు. యింట్లో సమస్యలతో సతమతమయ్యి వేరుకాపురం పెడతాడు. మూడో చెల్లిలి పెళ్లి చేయటానికి ఉన్న రెండెకరాల్లో ఎకరా పొలం అమ్మి పెళ్లిచేస్తాడు. దేవాలయ మాన్యం కౌలుకోసం ప్రయత్నించి విఫలమవుతాడు. తండ్రి చనిపోవటంతో, అప్పటికే యిద్దరు బిడ్డల తండ్రయిన సూర్యనారాయణ ఆర్థిక యిబ్బందులకు గురవుతాడు. ఉన్న ఎకరా పొలం మీద వచ్చే ఆదాయం రెండు కుటుంబాలకు సరిపోక తల్లీ కొడుకులు లోలోన ఘర్షణ పడుతుంటారు.

జ్వరంతో బాధ పడుతున్నా గుక్కెడు గంజినీళ్ళు పోయలేదని, కొడుకు పట్టించుకోవడం లేదని చంద్రమ్మ ఊరిపెద్దల ముందు చెబుతుంది. తన సమస్యకు పరిష్కారం చూపమంటుంది. చంద్రమ్మకు ఆప్తులైన అయ్యవారు, అయ్యవారమ్మ సూర్యనారాయణకు పరిస్థితి వివరిస్తారు. వచ్చిన ఆదాయం కుటుంబపోషణకు చాలక తల్లి బాధ్యత చూడలేకపోతున్నానని సూర్యనారాయణ పెద్దలముందు చెబుతాడు. పేగులమధ్య కలహాలు తెచ్చిన ఈ లేమి తట్టుకోవటం తనవల్ల కావటం లేదంటాడు. తల్లి ఇష్టప్రకారం మీరు చూపే ప్రత్యామ్నాయం తనకు సమ్మతమే నంటూ కన్నీటితో సమస్యను చెప్పి వెళ్ళిపోతాడు.

గ్రామ పెద్దలు యిద్దరి సమస్యపట్ల సానుభూతి తెలిపి వెళ్ళిపోతారు. అయ్యవారు చంద్రమ్మ సమస్యకు ప్రత్యామ్నాయం ఆలోచిస్తుంటారు. 'కొత్త ప్రభుత్వం ఏర్పడిందని, యికనుంచి బియ్యం చవకగా దొరుకుతాయనే' రేడియో వార్తలు అయ్యవారికి విన్పిస్తాయి. చంద్రమ్మ సమస్యకి ప్రత్యామ్నాయం 'చవకగా బియ్యం దొరకటమా' అని అయ్యవారు తర్కించుకుంటుండగానే చంద్రమ్మ మరణిస్తుంది.

గయిరమ్మ :

గౌరమ్మ ఆడకూలీలందరికీ నాయకురాలు. పొలం పనులు గుత్తకి తీసుకుని పని చేయిస్తుంది. మిగతా కూలీలకు పని చూపిస్తుంది. చైర్మన్ గారి పొలం గుత్తకి

తీసుకుని మిగతా కూలీలతో పాటు తనుకూడా నాట్లేస్తుంది. మడిగట్టు మీద వరిదుబ్బు పెట్టి పూజచేసి ఆ దారిలో పోయే వారందరినీ దక్షిణలు వేయమంటారు ఆడకూలీలు. అలా వచ్చిన డబ్బుతో గౌరమ్మ నాయకత్వంలో గయిరమ్మ సంబరం చేయడానికి నిర్ణయించుకుంటారు. పొలం పనులు చూడటానికి వచ్చిన చైర్మన్ సత్యం నాయుడ్ని, అతనితో వచ్చిన వారిని దక్షిణ వేయమని గౌరమ్మ అడుగుతుంది. సత్యంనాయుడు హాస్యమాడబోతే మాటలతో తిప్పికొట్టి దక్షిణలు రాబడుతుంది.

మమకారం :

ఆ యిల్లు వంశధార నది ఒడ్డున ఉంది. యింటి యజమాని తన చిన్నతనంలో బాల్యాన్ని పొలాల్లో ఆడుకుంటూ, వంశధారలో యీత కొడుతూ ఆనందంగా గడుపుతాడు. గ్రామంలో పంచాయితీ రాజకీయాలొచ్చాక గ్రామస్థుల్లో విభేదాలొస్తాయి. పంటల్లో వచ్చిన నష్టాలతో అతని తండ్రి సన్నకారు రైతుగా మారతాడు. వర్షాధార మెరకపొలం రెండెకరాలు జీవనాధారమవుతుంది. హైస్కూలు చదువు పూర్తయ్యాక, మూడో తోబుట్టువు పెళ్ళి జరగటం వలన అతని చదువు ఆగిపోతుంది.

తండ్రి మెరకపొలంలో నువ్వు దవ్వించి ఏతాం ఏర్పాటు చేస్తాడు. ఆ సంవత్సరం పంటలు బాగా పండుతాయి. తండ్రి అతడ్ని కాలేజ్‌లో చేర్పిస్తాడు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుండగా తండ్రి మరణిస్తాడు. తల్లయిన రాజులమ్మ చదువు పూర్తి చేయిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకి చేసిన ఖర్చులకి రాజులమ్మ బంగారం అమ్మేస్తుంది. రెండేళ్ళ తరువాత అతడు బ్యాంక్ క్లర్క్‌గా ఉద్యోగం సంపాదిస్తాడు. ఆరేళ్ళ పాటు అనేక చోట్ల ఉద్యోగం చేసి విశాఖపట్నం చేరుతాడు. తల్లికి పక్షవాతం వస్తే విశాఖలో వైద్యం చేయిస్తాడు. తల్లి కోరిక మేరకు సద్గుణను పెళ్లి చేసుకుంటాడు. అప్పుచేసి ఎన్.ఏ.డి. కొత్తరోడ్‌లో యిల్లు కట్టుకుంటాడు. తల్లిని తనదగ్గరే ఉంచాడు.

అతనికి కూతురు పుట్టి ఆర్నెల్లవుతుంది. పాప అజీర్ణంతో ఏడుస్తుంటే సద్గుణ ఉడ్‌వర్క్ పడుతుంది. పూర్వం అజీర్ణానికి వాము, జీలకర్ర పాలతో వేసి పట్టేవారమని, ఈ తరం వాళ్ళు టి.వి. ప్రకటనలకు మోసపోతున్నారంటుంది రాజులమ్మ. యింటి పెరట్లో వేప, తులసి మొక్కలు బదులు ముళ్ళచెట్లు పెంచుతున్నారని కొడుకు యింటిని ఈసడిస్తుంది. అతడు ఊర్లోని పొలం, ఇల్లు అమ్మేస్తానంటే తల్లి అడ్డుపడుతుంది. తన మరణానంతరం ఏమైనా చేసుకోమంటుంది. ఊర్లో పొలం కౌలుచేసే శిమ్మన్న వచ్చి అతడ్ని కలుసుకుంటాడు. రాజులమ్మ శిమ్మన్న తెచ్చిన నువ్వులు, వేరుశనగ అందుకొని వ్యవసాయ పరిస్థితులను ఆరా తీస్తుంది.

శిమ్మన్నను పిలిపించడానికి కారణమేంటని రాజులమ్మ కొడుకుని అడుగుతుంది. పడమర రెడ్లు చేపల పెంపకం కోసం పొలాలు కొంటుంటారు. ఎక్కువ రేటొస్తుందని అతడు శిమ్మన్నని పిలిచి పొలం అమ్మబోతున్నట్టు చెబుతాడు. 'నా పొలం అయితే అమ్మనని, మీ పొలం కనుక మీ ఇష్టం' అంటూ శిమ్మన్న వెళ్ళిపోతాడు. రాజులమ్మ కొడుకుతో మాట్లాడటం మానేస్తుంది. అతడు పొలం అమ్మకాన్ని వాయిదా వేసుకుంటాడు.

హైద్రాబాదు బదిలీ కావటంతో కూతుర్ని అత్తమామల దగ్గర ఉంచి కాన్వెంట్‌లో చేరుస్తారు. ఇరుకు గదులైన అపార్ట్‌మెంట్లలో రాజులమ్మ యిమడలేక పోతుంది. మనవరాలు లేకపోవటంతో మరింత మౌనం దాలుస్తుంది.

అత్తమామల యింటికి దగ్గర్లో పాతఇల్లు అమ్మకానికి వుంటే అతడు కొనుక్కుంటాడు. విశాఖలో కట్టిన యింటిని, ఊర్లో ఇంటిని, పొలాన్ని అమ్మేస్తాడు. కొత్తఇంట్లో చేరాక కూతుర్ని తనదగ్గరే ఉంచుకుంటాడు. పెరట్లో గల వేపచెట్టుతో, మనవరాలితో సరదాగా గడుపుతూ మునుపటిలా మారిన తల్లిని చూసి ఆనందిస్తాడు. సంక్రాంతి పండుగకు ఊరు పంపించమని రాజులమ్మ కొడుకుని అడుగుతుంది. ఊరెళ్తే నాణ్యమైన సరుకులు యింటికి తెచ్చుకోవచ్చని, శిమ్మన్న కూడా

యింతదూరం రాలేడని చెబుతుంది. తల్లి ఊరెళ్తే పాలం అమ్మేసిన విషయం తెలిసిపోతుందని అతడు కంగారు పడతాడు. ఆరోగ్య దృష్ట్యా అంతదూరం ప్రయాణించ కూడదని ఆపేశాడు. అందుకు రాజులమ్మ తను చనిపోతే అస్థికలను వంశధారలో కలపమని కోరుతుంది.

శివరాత్రి ముందు తల్లి చనిపోతుంది. తల్లికోరిక మేరకు అతడు అస్థికలు పట్టుకుని ఊరెళ్తాడు. గ్రామస్థులు అతడిని గుర్తుపట్టి సానుభూతి తెలుపుతారు. మేనత్త తల్లితో తనకుగల అనుబంధాన్ని గుర్తుచేసుకొని ఏడుస్తుంది. వ్యవసాయ పంటల పరిస్థితిని వివరిస్తుంది.

అతడు మేనమామ కొడుకుతో కలసి వంశధారలో తల్లి అస్థికలను కలుపుతాడు. తల్లి కోరిన భూమిని, యింటిని అమ్మేసానని, సంక్రాంతికి ఊరు పంపించలేక పోయానని ఏడుస్తుంటే మేనమామ కొడుకు అతడ్ని ఓదార్చుతాడు. యిద్దరూ కలిసి యింటికి చేరేదారిలో సంత జరుగుతుంది. అక్కడ ఒక చెట్టుక్రింద ఉన్న పిచ్చివాడ్ని శిమ్మన్నగా గుర్తుపడతాడు. ఇంటిమీద మమకారంలో తల్లి చనిపోతే, భూమిపై మమకారంలో శిమ్మన్న పిచ్చివాడయ్యాడని అతడు గ్రహిస్తాడు. మేనమామ కొడుకు లాంటివాళ్ళు తప్ప, గ్రామస్థులందరూ భూముల్ని చేపల చెరువులుగా మార్చటం, ఆ పొలుసు వాసనలకి బాధ పడ్డాడు. మేనత్తా, బావ బ్రతిమాలినా వినకుండా పట్నానికి బయలుదేరుతాడు. రైల్వే స్టేషనుకు చేరేదాకా గాలిలో పొలుసు వాసన అతడ్ని వెంటాడుతుంది.

బంధాలూ - అనుబంధాలూ :

బలరామయ్యకు పద్దెనిమిదేళ్ల వయసులో తల్లి దండ్రులు చనిపోతారు. రెండెకరాల పల్లపు భూమి, ఎకరా మెట్ట, చెల్లెలు, తమ్ముడి బాధ్యతలు బలరామయ్యే చూసుకుంటాడు. రాత్రీ పగలు వ్యవసాయంలో కష్టపడి చెల్లెలి పెళ్లి జరిపిస్తాడు. తమ్ముడైన శివకృష్ణను పట్నంలో చదివిస్తాడు. మేనమామ కూతురు అన్నపూర్ణమ్మను పెళ్లి చేసుకుంటాడు. తమ్ముడి చదువుకి, ఉద్యోగ ప్రయత్నాలకి అయ్యే ఖర్చులతో అప్పులు పెరుగుతుంటాయి. నెలిమర్ల జూట్‌మిల్లులో ఉద్యోగం వేయిస్తారని చెల్లెలి ద్వారా వచ్చిన సంబంధం ఖాయం చేసి శివకృష్ణ పెళ్లి జరిపిస్తాడు.

శివకృష్ణ మామగారు నెల్లిమర్ల జూట్‌మిల్లులో శివ కృష్ణకు టెంపరరీ ఉద్యోగం వేయిస్తాడు. యిటు బల రామయ్య వ్యవసాయంతో వచ్చిన నష్టాలతో, అప్పులతో యిబ్బంది పడుతుంటాడు. అటు టెంపరరీ ఉద్యోగంతో చాలీచాలని జీతంతో శివకృష్ణ యిబ్బంది పడుతుంటాడు. రెండు కుటుంబాల మధ్య రాకపోకలు తగ్గి ఆరేళ్ళవు తుంది. ఆ సమయంలో శివకృష్ణ అన్నని కలవడానికి వస్తాడు.

కొంత సొమ్ము లంచంగా కడితే ఉద్యోగం పర్మినెంటు అవుతుందని చెబుతాడు. అన్నపూర్ణమ్మ వ్యవసాయ పంటల వలన మిగిలిన అప్పులగురించి ఏకరువు పెడుతుంది. పెళ్ళికి ముందు ఉద్యోగం వేయిస్తామని మాట యిచ్చిన అత్తవారిని అడగమంటుంది. శివకృష్ణ తనవాటా పొలం యిస్తే అమ్ముకుంటానంటాడు. బల రామయ్య పొలం అమ్మడానికి ఒప్పుకోడు. పొలాన్ని తనఖాపెట్టి డబ్బు సర్దుబాటు చేస్తాడు. అలావచ్చిన డబ్బుతో శివకృష్ణ పర్మినెంటు ఉద్యోగిగా మారితే, బల రామయ్య పొలంలేని రైతుకూలీ అవుతాడు.

జూట్‌మిల్ లాకవుట్ ప్రకటించి ఆరునెలలవుతుంది. శివకృష్ణ భార్యా పిల్లలతో యిబ్బంది పడుతుంటాడు. బలరామయ్య కరువుబారిన పడతాడు. శివకృష్ణ భార్య 'ఉమ' భర్త యిబ్బంది చూడలేక బియ్యం కోసం బల రామయ్య యింటికి వస్తుంది. ఉమ వచ్చి మూడు రోజులైనా బియ్యం లేవనేసరికి తోడికోడలైన అన్న పూర్ణమ్మని నిష్కారమాడుతుంది. చుట్టుపక్కల వాళ్లతో ఉమ తన పరిస్థితిని చెప్పుకొని వెళ్లిపోవటానికి బయలు దేరుతుంది. కరువువల్ల అందరికీ పూట గడవటమే కష్టంగా ఉందని చుట్టుపక్కల వాళ్లు చెబుతుంటే ఖాళీ చేతులతో బయల్దేరుతున్న సమయానికి బలరామయ్య బియ్యం మూటతో వస్తాడు. ఉమ నంతోషంగా అందరికీ

వెళ్ళొస్తానని చెప్పి వెళ్ళిపోతుంది. ఉమను బస్సెక్కించి బలరామయ్య యింటికి చేరుతాడు.

బలరామయ్య అన్నపూర్ణమ్మ చేతికి పదిరూపాయల నోట్లకట్ట అందిస్తాడు. తనఖాపెట్టిన భూమి అమ్మేయ డానికి సిద్ధపడ్డానని చెబుతాడు. పొలంలేని ఊర్లో ఉండలేనని, నెల్లిమర్ల జూట్‌మిల్లులో కళాసీగా చేరుతానని అంటాడు. ఎన్నికష్టాలెదురైనా భూమి అమ్మకానికి ఒప్పుకోని బలరామయ్య భూమిని అమ్మేస్తాననటంతో అన్నపూర్ణమ్మ బాధపడుతుంది. యిద్దరూ బాధ పడుతున్న సమయంలో జూట్‌మిల్లు గొడవల్లో పోలీసు కాల్పుల్లో శివకృష్ణ మరణించిన సంగతి రేడియో వినిపిస్తుంది. బలరామయ్య నోట్లకట్టని వీధిలోకి విసిరేసి 'కోల్పోయిన భూమిని' తమ్ముడ్ని ఎవరస్తారా అంటూ యేడ్పుగొంతుతో పెద్దగా అరుస్తుంటాడు.

కొలతలు :

బెల్లాన చెరువు దగ్గర్లో కొలతలు వేయించిన పొలం పట్టాను దాలప్పడికి కన్నంనాయుడు యిప్పిస్తాడు. దాలప్పడు తుప్పలు, పొదలతో నిండిన పొలాన్ని నాలుగేళ్ళు బాగుచేసి వ్యవసాయసాగుకు అనువుగా మార్చుకుంటాడు. అతను ఆ పొలంలో సాగుచేయ కూడదని కోర్టు నోటీసులిస్తుంది. దాలప్పడు ఎమ్మార్వోను కలిసి దరఖాస్తు అందిస్తాడు. ఎమ్మార్వో ఏవిషయం తేల్చకపోవటం, ఆరుద్ర కార్తె రావటంతో దాలప్పడు పొలం దున్నటానికి సిద్ధమవుతాడు. దుక్కి దున్నుతున్న సమయంలో ఎస్సై, యిద్దరు కానిస్టేబుళ్లు వస్తారు. నోటీసులిచ్చిన పొలంలో యింకోసారి అడుగుపెడితే అరెస్ట్ చేస్తామని హెచ్చరించి వెళ్లిపోతారు.

పట్టా యిప్పించిన కన్ననాయుడ్ని కలవడానికి దాల ప్పడు వెళ్తాడు. రాజకీయ నాయకులతో ఏర్పడిన సత్సం బంధాలతో కన్నంనాయుడు సహకార బ్యాంకు అధ్య క్షుడవుతాడు. చిన్నపూరింట్లోనుండి బంగ్లాకి మారి కన్న బాబుగా పిలవబడతాడు. పట్టా యిప్పించిన కన్నం నాయుడికీ యిప్పటి కన్నబాబుకి గల తేడా చూసి ఆశ్చర్యపోయిన దాలప్పడు పట్టాసంగతి గుర్తుచేస్తాడు. కలక్టర్, ఎమ్మార్వోలతో మాట్లాడతానని చెప్పి కన్నబాబు దాలప్పడ్ని పంపించేస్తాడు.

దాలప్పడు రోజుకోసారి పొలంచూసి వస్తుంటాడు. ఎమ్మార్వో ఆఫీసుకి, కన్నబాబు ఆఫీసుకి తిరుగు తుంటాడు. పనికిరాని పట్టాకాగితం పటుకొని తిరగటం వల్ల యిల్లు గడవటం కష్టమవుతుందన్న భార్యపై చేయిచేసుకుంటాడు. చివరకు సిగ్గుపడి కన్నబాబుతోనే తేల్చుకుంటానని బయలు దేరుతాడు. పట్టాపొందిన పొలం జిరాయితీ చెరువుగర్భం కనుక సాగుచేయకూడదని జోగినాయుడు కోర్టుకెళతాడు. అతడు కన్నబాబుతో కలిసి ఉండటం దాలప్పడు చూస్తాడు. కన్నబాబు బయటకు వచ్చి జోగినాయుడు 'స్టే' తెచ్చుకున్నాడని, పొలం సంగతి మర్చిపోమని చెబుతాడు. లేదంటే కోర్టుకెళ్లమని సలహా యిస్తాడు.

దసరా పండగకి బట్టలుకొనమని అల్లరి చేస్తే బట్ట యివ్వకుండా టైలరు దగ్గర కొలతలు తీయించి మాయ చేసే తండ్రి గుర్తొస్తాడు దాలప్పకి. తన తండ్రిలాగే కన్న బాబు కొలతలు తీయించి పట్టాయిచ్చాడు, పొలంమాత్రం యివ్వలేదన్న సంగతి అర్థమవుతుంది. ఎందుకూ పనికిరాని పట్టాకాగితం మరొకర్ని మోసంచేయడానికి ఉపయోగ పడుతుంది కనుక ఉంచుకోమని కన్నబాబుకే యిచ్చేస్తాడు. దాలప్పడు పొలంమీద ఆశ వదులుకోక పోయినా కన్నబాబు లాంటి వారి మోసాల్ని మాత్రం గ్రహిస్తాడు.

భారత దేశం వ్యవసాయ ప్రధాన దేశం. అందులోనూ ఆంధ్రప్రదేశ్‌లో 70 శాతం ప్రజలు గ్రామీణులే. అతి ప్రాచీనకాలం నుంచి నేటివరకు రైతన్నదే ప్రధాన భూమిక. ఆరుగాలం శ్రమించే రైతన్న దేశానికి వెన్నెముక. పొద్దున నిద్రలేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకు గ్రామీణుల జీవనశైలి విలక్షణంగా ఉంటుంది. ఏరువాక మొదలు పంట యింటికి చేరేవరకు వాళ్లు అనుసరించే పద్ధతులు, ఆచారాలు, నమ్మకాలు సంప్రదాయ బద్ధంగా

ఉంటాయి. కుటుంబ వ్యవస్థ సమిష్టిగా ఉండటం వలన ఎంతటి కష్టాన్నైనా అవలీలగా జయించవచ్చనే నమ్మకం వాళ్ళది. 1960-70 దశకంలో వచ్చిన హరిత విప్లవంద్వారా దేశంలో ఆహార కొరతనుండి మిగులువైపు పయనించే టట్లు చేసిన ఘనత రైతులదే.

తొంభైయవ దశకంలో వచ్చిన సరళీకరణ ఆర్థిక విధానాలు మూలంగా రైతు కుటుంబాలు ఛిన్నాభిన్న మయ్యాయి. ఉత్తరాంధ్ర ప్రాంతపు రైతులు ఊరికి, భూమికి దూరంగా వలన పోవలసిన పరిస్థితి ఎదురయ్యింది. సంప్రదాయ పంటలు నష్టాలే మిగి ల్చాయి. వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరలు కూడా రాలేదు. ఈ అంశాలే తన కథలకు వస్తువులుగా తీసుకొని, గ్రామీణ జీవితంలో వచ్చిన మార్పులను అప్పల్నాయుడు 'ప్రత్యామ్నాయం' కథల సంపుటిలో కూర్చారు. "ఏ రచయిత అయినా తనకు తెలిసిన జీవితమే శక్తివంతంగా చిత్రించగలడు. ఒక నిర్దిష్ట ప్రాంతంలో జీవించిన రచయిత ఆ ప్రాంత చలనాలను ప్రత్యక్ష ప్రభావాల మూలంగానో పరోక్ష ప్రభావాల మూలంగానో తప్పక తన రచనల్లో పొందు పరుస్తాడు"

ఉత్తరాంధ్ర కథలకు చితికిపోతున్న ఉత్తరాంధ్ర పల్లెల్లోన్ని రైతు జీవితాలే నేపథ్యం. పల్లెప్రజల కపటం లేని మనస్తత్వం, ఆత్మీయత, ఒకరినొకరు సాయం చేసుకునే గుణం, భూమి, పశువులు, వాటిచుట్టూ తిరిగే వారి ఆలోచనలు కథల్లో కన్పిస్తాయి.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రవీంద్రనాథ్ టాగూర్ – ధర్మకర్త కథ – మానవీయ కోణంలో విశ్లేషణ

– కొనేటి శశికళ, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

"బృందావన కుందూ" కోపంతో తండ్రిదగ్గరకు వచ్చి "తక్షణమే నే వెళ్ళిపోతున్నాను" అన్నాడు. "కృతఘ్నుడా! ఇంతకాలంనుంచి నీ పోషణకోసం నే ఖర్చు పెట్టిందంతా చెల్లించిపోగల తాహతుంటే ఫో!" అన్నాడు తండ్రి జగన్నాథ కుందూ.

ఒక్క మాటలో చెప్పాలంటే "జగన్నాథకుందూ" ఉత్తి పిసినిగొట్టు. బృందావన్ ఒక్కడే ఉన్నంతకాలం తండ్రీకొడుకులకు సాఫీగానే సాగిపోయింది. కాని బృందావన్‌కు పెళ్లయిన దగ్గర్నుంచి వ్యవహారం ముదిరి పాకాన పడింది. ప్రాపంచిక సుఖాలకోసం ప్రాకులాడవద్దని తండ్రి చెప్పేవాడు. సరైన జీవితాన్ని గడపటానికి మంచి తిండి, బట్ట కావాలని కొడుకు అడిగేవాడు.

ఈ విధంగా తండ్రీ కొడుకులకు తరచుగా అభిప్రాయభేదాలు వస్తుండేవి. అవే క్రమంగా కొట్లాటలకు దారి తీసేవి. ఒకసారి బృందావన్ భార్యకు పెద్ద జబ్బు చేసింది. ఓ నాటువైద్యుణ్ణి పిలిపించాడు. అతడో ఖరీదైన మందును కొనాలని చెప్పేసరికి జగన్నాథ్‌కు ఒళ్లు మండుకొచ్చింది. వెంటనే తన్ని అక్కణ్నుంచి పంపేశాడు. కాని బృందావన్ వూరుకోలేదు. వైద్యుణ్ణి తిరిగి తీసుకొస్తా నన్నాడు. అక్కడ తండ్రీ కొడుకులమధ్య మళ్ళీ పెద్ద వివాదం చెలరేగింది. కాని తండ్రిమాటే నెగ్గింది. తత్ఫలితంగా చివరకు బృందావన్ భార్య చనిపోయింది.

"నా భార్యను చంపింది నువ్వే నువ్వు హంతకుడవు" అని దూషించాడు తండ్రిని కోపం పట్టలేక. "నోరుముయ్! మందులు వేసుకుని చచ్చినవాళ్ళు లేరూ? ఖరీదైన మందులన్నీ మనుషుల్ని రక్షిస్తే మరి రాజులు, నవాబులు ఎందుకు చస్తున్నారు? నీ భార్య నీ తల్లికంటే, బామ్మకంటె వైభవంగా చావాలని నీ కోరికా? అందుకు నేనొప్పుకోను" అన్నాడు తండ్రి.

బృందావన్ దుఃఖం కట్టలు తెగి ప్రవహిస్తోంది. మాన వత్వం కోల్పోయిన తండ్రి దగ్గర జీవచ్ఛవంలా పడి వుండటం అతనికెంతమాత్రం ఇష్టంలేక పోయింది. తన నిశ్చయాన్ని తండ్రికి చెప్పాడు. "నేనీ ఇంటి నుంచి వెళ్లి పోతున్నాను." తండ్రి వెంటనే అంగీకరించాడు. అయితే ఒక్క షరతుమాత్రం పెట్టాడు. తన ఆస్థిలో ఒక చిల్లి గవ్వకూడా కొడుక్కి దక్కదని చెప్పాడు. తండ్రి ఆస్థిలో చిల్లిగవ్వకాదు గదా యావత్తు ఆస్థినంతా ఇచ్చినా తన కక్కర లేదు పొమ్మన్నాడు బృందావన్.

తండ్రీ కొడుకుల మధ్య దీర్ఘకాల సంఘర్షణ తరువాత జరిగిన ఈ విప్లవాన్ని గురించి గ్రామస్థులు పలుపలు విధాల వ్యాఖ్యానించారు. అయితే ఒక్క విషయంలో మాత్రం వాళ్లంతా ఏకీభవించారు. "రోజులు మారి పోయాయి. భార్యను గురించి తండ్రీకొడుకుల మధ్య కొట్లాటలు వచ్చే రోజులొచ్చాయి" అన్నారు. అక్కడితో ఆగలేదు. "నీ భార్య చస్తే వెంటనే నువ్వు మరో పెళ్లి చేసుకోవచ్చు. కాని నీ తండ్రి మరణిస్తే అతని స్థానంలో మరి నువ్వెవరినీ పొందలేవు" అన్నారు బృందావన్‌తో. ఈ వాదన అద్భుతంగా ఉందనడంతో సందేహంలేదు. కాని కర్మసిద్ధాంతాన్ని పట్టుకొని వ్రేలాడే వాళ్ళకు సహ జత్వంతో సంబంధము ఉండదు.

బృందావన్ వెళ్లిపోవడం మొత్తంమీద తండ్రికి సంతోషాన్నే కలిగించింది. అతను పోవటంవల్ల ఇంటిఖర్చు చాలావరకు తగ్గింది. అంతేగాక తండ్రికి ఇప్పుడు మన శ్శాంతి చిక్కింది. అదివరకల్లా తనక్కెడ విషంపెట్టి చంపు తాడో నని భయపడేవాడు. మరి ఇప్పుడు భయపడ వలసిన అవసరం లేదు. అయితే తండ్రికున్న దిగులల్లా ఒక్కటే. బృందావన్ తనతోపాటు తన నాలుగేళ్ళ కుమా రుడు గోకుల్‌చంద్రను కూడా తీసుకెళ్లాడు. ఆ కుర్రాణ్ణి పెంచడానికి పెద్దగా ఏమంత డబ్బు ఖర్చు పెట్టనవసరం

లేదు. అంచేత మనవడిమీద మక్కువ పెంచుకున్నాడు. బృందావన్ అతన్ని తీసుకువెళ్ళిన తరువాత జగన్నాథ్‌కు కోపం, దుఃఖము కలిగాయి. అయితే దాన్ని ఒకవిధంగా ఉపశమింపజేసుకున్నాడు. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయిన తరువాత తనకు సంవత్సరానికెంత ఆదా అవుతుందో వడ్డీతో సహా లెక్కలు చూసుకొని సంతోషించాడు.

కాని గోకుల్‌చంద్ర లేకుండా ఆ ఇంట్లో ఉండ గలగడం అతనికి రాను రాను అసంభవమనిపించింది. తను పూజలో వున్నప్పుడు కొంటెచేష్టలు చెయ్యడానికి ఇప్పుడెవ్వరూ లేరు. ముద్దుగా మాటలు చెప్పడానికి ఇప్పుడా ఇంట్లో ఎవరూ లేరు. నిస్సారమైన ఒంటరిజీవితం అతనిలో నిరుత్సాహాన్ని నింపింది. కుర్రాడు తలగడకు పెట్టిన రంధ్రాలు చూస్తుంటే జగన్నాథ్ హృదయం ప్రయ్యలవుతున్నట్లుగా వుండేది. ఒకసారి తన పంచెను చించినందుకు కుర్రాణ్ని చితక్కొట్టాడు. ఆ పంచెను చూడగానే జగన్నాథ్ కళ్ళవెంట బొటబొటా అశ్రు బిందువులు రాలాయి. ఒకవేళ గోకుల్ తిరిగివస్తే ఈసారి సంవత్సారానికో మాటు పంచె చింపినా ఏమీ కొట్టనని ప్రతిజ్ఞ తీసుకున్నాడు. కాని గోకుల్ తిరిగిరాలేదు. జగన్నాథ్ వృద్ధుడైపోతున్నాడు. అతని యిల్లు బోసిగా వుంది.

అతడన్తమానం ఇంట్లో వుండలేకపోతున్నాడు. మధ్యాహ్నం వేళ గ్రామ ప్రజలంతా విశ్రమిస్తూ వుంటే, జగన్నాథ్ గ్రామమంతా కలయ తిరిగేవాడు. అతన్ని చూడగానే పిల్లలు దూరంగా పోయి "పిసినిగొట్టు" అని మారుపేరు పెట్టి పిలిచేవాడు.

ఒకనాటి మధ్యాహ్నం జగన్నాథ్ మామిడి తోపులోంచి వెళుతోంటే ఓ పిల్లలతండా కనిపించింది. జగన్నాథ్ వారి దగ్గరకు వెళ్ళేసరికి పిల్లలంతా పారిపోయారు. కాని ఓ కుర్రాడు మాత్రం పారిపోకుండా అక్కడే నిల్చున్నాడు. జగన్నాథ్ అతని దగ్గరకు వెళ్ళాడు. కుర్రాడు మంచి పసిమిరంగులో నిగ్గుదేరి వున్నాడు. బుగ్గలు పాలు గారుతున్నాయి. జగన్నాథ్ అతని తలనిమిరాడు. వెంటనే అతని మనసులో ఓ ఆలోచన మెదిలింది. ఆ కుర్రాడిని తనవెంట ఇంటికి రమ్మని అడిగాడు. వాళ్ళిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఇది.

"అబ్బాయీ, నీ పేరేమి?"
"నితాయ్‌పాల్"
"మీ ఇల్లెక్కడ?"
"చెప్పను"
"మీ నాన్నెవరు!"
"చెప్పను"
"ఎందుకు చెప్పవు?"
"నే ఇంటిదగ్గర్నుంచి పారిపోయొచ్చాను."
"అలా ఎందుకు చేశావ్"?
"మా నాన్న నన్ను బడికి పంపడానికి ప్రయత్నించి నందుకు"
జగన్నాథ్‌కు ఇప్పటికి విషయమంతా అర్థమైంది.
"సరే! అయితే నాతో వచ్చి మా ఇంట్లో వుంటావా?" అడిగాడు.
"ఓఁవుంటాను" అన్నాడు కుర్రాడు.

నితాయ్, జగన్నాథ్ ఇంట్లో ప్రవేశించాడు. అలిసి పోయిన బాటసారికి చెట్టునీడ కనిపించినట్టుగా వుంది అతనికి. తన మనుమడు లేనిలోటును ఈ కుర్రాడిద్వారా తీర్చుకుంటున్నాడు జగన్నాథ్.

అకస్మాత్తుగా నితాయ్‌పాల్ ఆ ఇంట్లో అంత ప్రముఖ మైన స్థానాన్ని పొంద గలగడం గ్రామస్థులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ముసలివాని మరణం త్వరలోనే సంభవమని అందరికీ తెలుసు. అతని ఆస్థి యావత్తూ ఓ దిక్కులేని అపరిచిత బాలునికి దక్కడం వారికి దుఃఖభాజకంగా వుంది. కోపం పట్టలేక చివరికా కుర్రాణ్ని కొట్టడానికి కూడా సమకట్టారు. కాని జగన్నాథ్ అతన్ని తన ప్రాణంకంటే అధికంగా చూడడంచేత వారికా అవకాశం దొరకలేదు.

ఒకోసారి కుర్రాడు ఇంటికెళ్లి పోతానని మొరాయించే వాడు. ముసలివాడు అతనికో ఎర చూపించేవాడు. "నీకు నా ఆస్తంతా ఇచ్చేస్తాను" అనేవాడు. వయస్సులో

కుర్రాడైనా నితాయ్ ఆస్థియొక్క విలువను వెంటనే గ్రహించేవాడు. ఆ కుర్రాడి తండ్రిని గురించి గ్రామస్థ లంతా ఆరా తియ్యడం మొదలెట్టారు. కుర్రాడి కోసం తల్లిదండ్రులెంత బెంగటిల్లిపోతున్నారో అని జాలిపడే వారు. వారినంత బాధపెడుతున్న కుర్రాడు నిజంగా మూర్ఖుడై వుండాలి. ఇలా అనుకొని నితాయ్‌ని శాపనార్థ లతో సత్కరించేవారు.

ఓ రోజు ముసలివాడు తోటనుంచి ఇంటికొస్తుంటే దారిలో ఓ బాటసారి కనిపించాడు. దామోదర్‌పాల్ అనే ఓ వ్యక్తి తన కుమారునికోసం అన్ని ఊళ్ళూ గాలిస్తున్నాడని ఆ ఊరుకూడా వస్తున్నాడని అతను చెప్పాడు. ఈ సంగతి తెలుసుకోగానే నితాయ్ తన రాబోయే ఆస్థిని వదిలిపెట్టి పారిపోవటానికి సిద్ధమయ్యాడు. జగన్నాథ్ అతనికి ధైర్యాన్ని పురికొల్పాడు. "ఎవ్వరికీ తెలియకుండా నిన్నో చోట దాస్తాను" అన్నాడు.

నితాయ్‌కి కొంత ఆందోళన తగ్గింది. వెంటనే అడి గాడు. "ఎక్కడ దాస్తావు. చెప్పు?" "ఇప్పుడే చూపిస్తే గ్రామస్థులు చూస్తారు. అంచేత రాత్రికి చూపిస్తా!" అన్నాడు. నితాయ్ సంతోషానికి ఏరలేదు. తండ్రి తనకోసం ఊరంతా గాలిస్తాడు. కాని తను ఎక్కడ కనుపించడు. తండ్రి వెళ్లిపోతాడు. ఇకప్పుడు తను బయటకొచ్చి ఎంచక్కా ఆడుకోవచ్చు. నితాయ్ ఈ విధంగా ఆలోచించ సాగాడు.

మధ్యాహ్నమయింది. జగన్నాథ్ నితాయ్‌ని ఇంట్లో పెట్టి తాళం వేశాడు. ఎక్కడికో వెళ్లి మళ్లీ తిరిగివచ్చాడు. వచ్చీ రాగానే నితాయ్ అతన్ని ప్రశ్నల వర్షంలో ముంచెత్తించాడు. ఇంకా చీకటి పడకుండానే నితాయ్. "తాతా, వెళదామా!" అన్నాడు. "ఇంకా చీకటి పడలేదు" చెప్పాడు జగన్నాథ్. మరి కాసేపు తరువాత "ఇప్పుడు చీకటి పడింది చూడు తాతా! మనం వెళ్దాం పద!" అన్నాడు నితాయ్. "ఊళ్ళో వాళ్ళు ఇంకా నిద్రపోలేదు" గొణిగాడు జగన్నాథ్. నితాయ్ మరోక్షణమాగి, "వాళ్ళు నిద్రపోయారు తాతా! ఇక మనం పాదాంపద" అన్నాడు.

రాత్రి గడుస్తోంది. నితాయ్ కనురెప్పలు బరువెక్కాయి. నిద్రకు తాళలేకపోయాడు. అర్థరాత్రి అయిన తరువాత జగన్నాథ్ కుర్రాడి చెయ్యి పట్టుకొని మెల్లగా బయట కొచ్చాడు. నిద్రిస్తున్న గ్రామవీధుల్లోంచి ఇద్దరూ నిశ్శబ్దంగా ఊరు బయటకొచ్చారు. అంతటా నిశ్శబ్దంగా వుంది. అప్పుడప్పుడు నక్కల కూతలు మాత్రం వినిపిస్తు న్నాయి. నితాయ్‌కి భయంవేసి జగన్నాథ్ చేతిని గట్టిగా పట్టుకున్నాడు. పొలాలు దాటి వాళ్ళు చివరికో అడవి చేరుకున్నారు. ఓ శిథిలమైన దేవాలయం దగ్గర ఆగి పోయారు. నితాయ్ ఆశ్చర్యంగా అడిగాడు. "ఇదేనా నే వుండేచోటు" అతడూహించుకున్న దానికి, దీనికి ఎక్కడా సంబంధం లేదు. ఇంటి దగ్గరనుంచి పారిపోయి వచ్చింది లగాయితూ ఇటువంటి పాడుబడ్డ దేవాలయంలో అతడనేక మార్లు తలదాచుకున్నాడు.

ఇద్దరూ గుడిలోపలకు వెళ్ళారు. అక్కడో మూల ఓ రాతిపలక వుంది. జగన్నాథ్ దాన్ని తొలగించాడు. దాని కింద ఓ భూగర్భగుహ వుంది. అందులోంచి ఓ దీపం వెలుగుతూ కనిపించింది. నిచ్చెన సాయంతో ఇద్దరూ కిందకి దిగారు. నితాయ్ చుట్టూ కలయజూచాడు. అతనికో మూల బిందెలు కనిపించాయి. గదిమధ్యలో ఓ తివాసీ వుంది. దానిముందు పువ్వులు, గంధం, తిలకం మొదలైన పూజాసామ్రాగి వున్నాయి. నితాయ్ బిందెల్లో ఏమున్నాయో ననీ చెయ్యిపెట్టి చూశాడు. ఆశ్చర్యం! వాటిల్లో రూపాయలున్నాయి. నితాయ్ తిరిగి అన్నాడు జగన్నాథ్. "నా దగ్గరున్న డబ్బంతా ఇదే. దీన్ని నీకివ్వాళ అప్పచెపుతాను". నితాయ్ సంతోషంతో ఎగిరి గంతేశాడు. "అంతా ఇచ్చేస్తావా? ఒక్క రూపాయికూడా తిరిగి తీసుకోవు కదూ!" అన్నాడు. "ఒక వేళ తీసకుంటే నా చెయ్యి పక్షవాతంతో పడిపోతుంది. అయితే ఒక్క షరతుంది. ఒకవేళ నా మనుమడు గాని, ముది మనుమడుగాని, మరింకెవరైనా అతని తాలూకువారుగాని నీకు కనిపిస్తే, ఇప్పుడు నీకిస్తున్న డబ్బంతా ఒక్కరూపాయి కూడా

బీరుపోకుండా ఇచ్చెయ్యాలి, తెలిసిందా?" "అలాగే!" అన్నాడు నితాయ్ ఉత్సాహంతో.

"అయితే ఈ ఆసనంమీద కూర్చో" అన్నాడు జగన్నాథ్. "ఎందుకు"? "నువ్విప్పుడు పూజ చెయ్యాలి". "పూజెం దుకు?' కుర్రాడు వెనక్కి తగ్గాడు. "ఇది ఆచారం". నితాయ్ అసనంమీద కూర్చున్నాడు. జగన్నాథ్ అతని నుదుటిమీద గంధపు పూతలు పూశాడు. నొసట తిలకం పెట్టాడు. మెడలో పూలదండ వేశాడు. ఇక మంత్రాలు చదవనారంభించాడు.

లక్క విగ్రహంలా కదలకుండా మంత్రాలు వింటూ కూచోవడం నితాయ్‌కేమీ నచ్చలేదు. "తాతా!" అని గొణి గాడు. జగన్నాథ్ ఏమీ మాట్లాడలేదు. మంత్రాలు చదువు కుపోతున్నాడు. చివరికి అక్కణ్ణుంచి లేచివెళ్లి అతికష్టం మీద ఓ బిందెను మోసుకొచ్చాడు. దాన్ని నితాయ్ ముందుంచి ప్రమాణం చేయించాడు. "ఈ ధనాన్ని బృందా వన్ కుందూ కొడుకు, జగన్నాథ్‌కుందూ మనుమడు అయిన గోకుల్‌చంద్రకుందూకు గాని, అతని వారసులకు గాని అందించగల వాడనని ప్రమాణం చేస్తున్నాను".

ఈ ప్రమాణాన్ని నితాయ్‌చేత అనేకమార్లు చేయిం చాడు జగన్నాథ్. పూజా కార్యక్రమం పూర్తి అయింది. గుహలోకి గాలివచ్చే మార్గంలేదు. దీపం పొగతో గుహంతా నిండిపోయింది. నితాయ్‌కి భయం వేసింది. దీపం వెలు తురు క్రమంగా సన్నగిల్లుతోంది. మరి కాసేపటికి దీపం ఆరిపోయింది. గుహంతా చీకటిమయమయింది. ఆ చీకట్లో ఎవరో నిచ్చెనెక్కుతున్న శబ్దం వినిపించింది. "తాతా! ఎక్కడి కెళుతున్నావ్?" అడిగాడు నితాయ్ భయంతో. "నే వెళుతున్నాను. నువ్విక్కడే వుండు, నిన్నెవరూ కనుక్కోలేరు. నా మనుమడు గోకుల్‌చంద్ర పేరు గుర్తుంచుకో" అన్నాడు జగన్నాథ్.

అతుడు నిచ్చెన తీసివేశాడు. నితాయ్ బిక్కు బిక్కుమంటూ "నేనిప్పుడు మా నాన్నదగ్గరకు వెళతా" అని రోదించాడు. జగన్నాథ్ రాతిపలకను తిరిగి మామూలు చోట వుంచేశాడు. కిందకు వంగి రాతిమీద చెవిపెట్టి విన్నాడు. నితాయ్ మాటలు వినిపించాయి. "నాన్నా..." తరువాత మళ్ళీ శబ్దం వినిపించలేదు. ఆ విధంగా కుర్రాడికి డబ్బు వప్పగించి జగన్నాథ్ ఆ రాతిపలకను మట్టితో కప్పేశాడు. దానిమీద ఇటుకరాళ్ళు పెట్టాడు. ఆ పైన గడ్డీ గాదం విరజిమ్మాడు. చాలా రాత్రి గడిచింది. అతడాస్థలం వదిలిపెట్టి వెళ్ళలేకపోతున్నాడు. మళ్లీ నేలకు వంగి, చెవిబెట్టి వినడానికి ప్రయత్నించాడు. ఎక్కడో అట్టడుగున పాతాళం నుంచి రోదనశబ్దం వినిపించింది. ఆ శబ్దానికి నిద్రపోతున్న వాళ్ళంతా లేచి అక్కడకు వస్తారేమోనని అతని భయం పట్టుకుంది. మరొకమారు చెవిపెట్టి విన్నాడు. "నాన్నా!" శబ్దం వినిపించింది.

జగన్నాథ్‌కు ఏంచెయ్యడానికీ తోచలేదు. గట్టిగా నేలనుకొట్టి "ఎవరైనా వింటారు మట్లాడకు" అని అరి చాడు. తూరుపు దిక్కున కెంపు కాంతుల్ని వెదజల్లుతూ సూర్యుడుదయించాడు. ఇకప్పుడు జగన్నాథ్ ఆ దేవాలయాన్ని వదిలిపెట్టి, పొలాల్లో వడి నడిచి పోతున్నాడు. అక్కడెవరో అతన్ని నాన్నా అని పిలిచారు. ఆశ్చర్యంతో వెనక్కి చూచాడు. అతనికి తన కుమారుడు కనిపించాడు. "నాన్నా, నా కొడుకు నీ ఇంట్లో దాక్కున్నా డని తెలిసింది. వాణ్ని నేను తీసుకెళ్ళాలి" అన్నాడు బృందావన్. జగన్నాథ్ ఈ మాటలు వినగానే స్థాణువై పోయాడు. కళ్లప్పగించి చూస్తూ "నీ కొడుకా!" అన్నాడు.

"అవును. నా కొడుకు గోకుల్, వాడిప్పుడు నితాయ్ పాల్. నా పేరు దామోదర్ పాల్. నీ పేరు దేశమంతా ఘనంగా పాకిపోతోంది. నీ పేరు చెబితే మాకు మంచి నీళ్ళుకూడా పుట్టలేదు. అంచేత విధిలేక పేర్లు మార్చు కున్నాం" అన్నాడు బృందావన్. జగన్నాథ్ నెమ్మదిగా తన రెండు చేతులను పైకెత్తి ధ్యానంలో పడ్డాడు. అతని చేతులు వణికాయి. మరి కాసేపటికి స్పృహ తప్పి బిళ్ళబీటుగా కిందపడ్డాడు. అతనికి స్పృహ రాగానే లేచి తన కొడుకును తీసుకొని దేవాలయం దగ్గరకు వెళ్లాడు.

వాళ్ల లోపలకు వెళ్లిన తరువాత "నీకేమైనా రోదిస్తున్న శబ్దం వినిపిస్తోందా?" అన్నాడు తండ్రి. "నాకేం వినిపించడం లేదు" అన్నాడు బృందావన్. 'జాగ్రత్తగా విను. 'నాన్నా' అని ఎవరైనా పిలుస్తున్న శబ్దం వినిపిస్తుందా?" "లేదు".

ఆ నాటినుండి జగన్నాథ్ కనిపించిన వాళ్ళనల్లా అడుగుతున్నాడు. "నీకేమైనా రోదనధ్వని వినిపిస్తోందా" అతన్ని చూడగానే అందరూ పిచ్చివాడని గేలి చేసేవారు. నాలుగు సంవత్సరాల తరువాత జగన్నాథ్ మరణశయ్య మీద వున్నాడు. క్రమంగా అతని కళ్ళకి ప్రపంచం కనబడకుండా పోయి, శ్వాస ఆగిపోబోతున్న సమయంలో మంచంమీద లేచి కూర్చున్నాడు. తన రెండు చేతులతోను భగవంతుణ్ని మొక్కుతూ సణిగాడు. "నితాయ్ నిచ్చెన ఎవరు తొలగించారు?"

గాలి, వెలుతురు లేని ఆ పాతాళకూపంలోంచి బయటపడ్డానికి ఆఖరికి నిచ్చెనకూడ లేకపోవడంచేత బెంబేలుపడి, బేజారెత్తి, రోదన చేస్తూ చివరకు ప్రాణాలు విడిచాడు నితాయ్. ఆ దృశ్యాన్ని తలచుకోగానే జగన్నాథ్ ఒళ్ళంతా కంపించింది. వెంటనే మంచంమీద పడి పోయాడు అంతే, మళ్ళీ లేవలేదు.

ధనంపై మోజు, రక్తసంబంధాల్ని కూడ దరిచేర నివ్వదు, ఈ కథ ఒక నిదర్శనం.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కంచికి చేరని కథ నవలలోని సామాజిక స్పృహ – పరిశీలన

- తమ్మన నాగవెంకట లోలిబాబు
ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, గుంటూరు.

- డా॥. కె. బలరామ్
ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, గుంటూరు.

సమాజం అంటే చక్కని కదలిక. సంస్కృతంలో అజ అనాధాతువుకి కదలిక అని అర్థం. సమాజం అంటే చక్కగా సాగేది కష్టాలు లేకుండా ఉండే కదలిక అని అర్థం. మనుష్యులు సంఘంగా కలిసి ఉన్నప్పుడు అందరి జీవితా రీతులు ఒక రకంగా, సుఖంగా సాగిపోవాలని ఏర్పడ్డ సముదాయమే సమాజం. ఆ సంఘం తమ సౌకర్యం కోసం ఏర్పరచుకున్న తీయమాలే సామాజిక వ్యవస్థ. ప్రాచీన కాలంలో ధర్మశాస్త్రాలు సామాజిక స్పృహతో వ్రాసినవి. ఆ తరువాత సమాజంలో కొన్ని మార్పులు వచ్చినా మౌలికమైన అంశాలు మాత్రం మారలేదు. స్త్రీ స్వాతంత్ర్యం, వివాహ సమస్యలు, ఆర్థిక సమస్యలు, పిల్లల అభివృద్ధి, దాంపత్య సమస్యలు, కులం, మతం అన్ని సమాజాలలో, అన్ని రోజులలో ఉండేవే. వ్యక్తులను బట్టి, సమాజాన్ని బట్టి, కాలాన్ని బట్టి, దేశకాలాల్లో సామాజిక స్పృహకొద్దీ గొప్పగా మారినా మౌలికాంశం మారదు. రామాయణ కాలంలో పరపురుష దర్శనం, స్పర్శకూడా పాతివ్రత్యానికి భంగమని భావించారు. ఈ రోజుల్లో ముద్దులు, కౌగిలింతలు, షికార్లు స్నేహానికి గుర్తులను వాటివల్ల శీలము, పాతివ్రత్యం దూరంకావని భావిస్తున్నారు. ఈ రచయితే తేజస్విని అనే నవలలో ఈ అంశాన్ని వివరంగా చర్చించారు. చదువుకున్న వాళ్ళకు కూడా సమాజంలో ఎలా మెలగాలో తెలీదు. ఎలా మోస గిస్తారో, ఎలా మోసపోతామో తెలీదు. అలాగే మద్యపానం వల్ల కలిగే అనర్థాలు, స్త్రీ స్వాతంత్ర్యం ఇలాంటి సమస్యలపై సరైన అవగాహన ఉండదు. ప్రాచీన సాహిత్యంలో మౌలిక ధర్మాలుంటాయి కాని, ఆధునిక సామాజిక విషయాలుండవు. అలాంటి ఆధునిక సమాజంలో ఉండే కష్ట సుఖాలను, పరిస్థితులను తెలియజేసి ప్రజలకు సమకాల సామాజిక స్పృహ కల్పించే బాధ్యతను నవలా రచయితలు తీసుకున్నారనటం అతిశయోక్తి కాదు. కావ్య ప్రయోజనాలలో లోక వ్యవహార జ్ఞానం కూడా ఒక ప్రయోజనంలాగా అలంకారికులు చెప్తారు. శాస్త్రాలు మంచిని, చెడును కూడా బోధిస్తాయి. చెడు ఎలాం ఉంటుందో స్వరూపం గ్రహించి అది ఎదురైనప్పుడు దాని నుంచి తప్పించుకోవటం తెలియా లంటే దాని గురించి కూడా తెలియలి. కంచికి చేరని కథలో రామారావు గారు స్త్రీ స్వాతంత్ర్యం, వివాహ సమస్యలు, స్త్రీలు ఎదుటివారిని వశపరచుకోవటానికి ప్రయోగించే సాధనాలు, మగవాళ్ళలో ఉండే చపల స్వభావం క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు సరైన నిర్ణయం తీసుకోగలగటం, ఆ విషయంలో స్వబుద్ధి, ఇతరుల సహకారం స్త్రీలకు తమ క్షేమం చూసుకునే పద్ధతులు మొదలైన ఎన్నో సామాజికాంశాల గురించి పాఠకులకు చక్కటి స్పృహ కలిగేలా 'కంచికి చేరని కథ' నవలలో చర్చించారు. కొన్ని విషయాలను పరిశీలిద్దాం.

స్త్రీలకు స్వయం నిర్ణయాధికారం :

వివాహ విషయంలో స్త్రీలకు సాధారణంగా స్వేచ్ఛ ఉండదు. తల్లిదండ్రులు చూసిన సంబంధం చేసు కోవటం, కష్టమో సుఖమో జన్మాంతం వారిలో ఉండి పోవటం ఎక్కువగా సమాజంలో జరుగుతుంది. తల్లి దండ్రులు ఆ బాధ్యత తీసుకోనప్పుడు లేదా తీసు కోలేనప్పుడు కూడా స్త్రీలు స్వతంత్రించి నిర్ణయం తీసు కోవచ్చని రచయిత సూచిస్తారు. ఈ విషయంలో కులాలు, మతాలు కూడా ప్రధానమనుకోకుండా మనకు తగిన వాళ్ళను తన పరిధిలో ఆలోచించి చేసుకోవటం తప్పు కాదంటారు. రజని తండ్రి వ్యాపారంలో నష్టపోయి రెండవ కూతుర్ని గురించి ఆలోచించే అవకాశం పోగొట్టుకున్నాడు.

కనుక తానే తన క్షేమాన్ని చూసుకున్నది. ఇక వెంకట్రావు చెల్లిలి పెళ్ళికానిదే తన పెళ్ళికాదని నిర్ణయించుకున్నాడు కనుక స్వతంత్రించాడు.

కులం :

ఎవరికైనా మనం నీతులు చెప్పవచ్చు. కాని తనదాకా వస్తే కాని దాని తీవ్రత తెలియదు. కుల మతాలవల్ల కొత్తగా వచ్చేదేమీలేదని దానివల్ల సామాజిక అర్హత ఉన్న (చదువు, ఉద్యోగం, అందం వంటి) సంబంధాలు వదులుకోవటం నష్టమని కూడా సూచిస్తారు. కట్న కానుకలు కూడా వర్ణాంతర వివాహం వల్ల తప్పిపోతా యంటారు.

"తనది అగ్రకులమైనంత మాత్రాన వాళ్ళకి ఒరిగేందేం ఉంది! ఎవరి కులం వాళ్ళకు - ఎంత తక్కువ కులమైనా గొప్ప!

బాగా లోచిస్తే రజని వ్రాసింది నిజమే. తను కట్న కానుకలే కాదు, కనీసం పెళ్ళి ఖర్చులుకూడా పెట్టుకోలేదు. ఈ పరిస్థితుల్లో ఆ పిల్లను ఏమనీ లాభం లేదు."

సత్యమూర్తి, సరోజిని దంపతులను కూడా వర్ణాంతర వివాహాలు చేసుకున్నట్టే రచయిత వర్ణిస్తారు. అయితే ఆ సంబంధం వల్ల బంధువులతో వైముఖ్యం వచ్చినట్లు వర్ణిస్తారు. దీనిలో వచ్చే నష్టాన్ని కూడా రచయిత సూచించారు. వాళ్ళతరం వరకు వెళ్ళిపోయినా పిల్లల వివాహం వచ్చేటప్పటికి సమస్య మొదలౌతుంది. ఈ తత్వాన్ని రచయిత నిశితంగా విమర్శిస్తారు.

"ఇది వరకే..... మన దేశ దౌర్భాగ్యం" (కంచికి చేరిన కథలు - పుట. 21, కొట్టి రామారావు) వరకు రజనిని రెండవ సంబంధం చేసుకున్న రాజశేఖర్ వాళ్ళది సనాతన సంప్రదాయాలున్న బ్రాహ్మణ కుటుంబం కులాన్నిబట్టి గుణం రాదు. సత్యమూర్తి వేరేకులం వాడైనా ఉదాత్తంగా ఆలోచించాడు. పద్మకోసం వెకంట్రావుని, రజనిని విడదీయటం అన్యాయమన్నాడు. రాజశేఖర్ బ్రాహ్మణుడై కూడా మద్యం వ్యసనానికి అలవాటుపడి మానుకోలేక జీవితం పాడుచేసుకున్నాడు. కులమతాలవల్ల వచ్చే కష్టనష్టాలన్నీ రచయిత సూచించారు.

పెళ్ళిళ్ళు :

ఆడపిల్లకు పెళ్ళి అయ్యాక భర్త అభిమానం ఎక్కువగా పొందాలని ఉంటుంది. భర్త ఇంటిని గురించి పట్టించుకోవటం, చిన్న చిన్న పనులు చేయటం, సమయానికి ఇంటికి రావటం ఇలా తోడు నీడగా ఉంటే దాంపత్యం అన్యోన్యంగా ఉంటుందని రచయిత సూచిస్తారు.

ప్రేమలు - పెళ్ళిళ్ళు :

ప్రేమించటం తప్పకాదు. కాని దాంట్లో స్వార్థం వెతుక్కోవటం అనుబంధానికి భంగం కలిగిస్తుంది. రజని వెంకట్రావుని ప్రేమించింది. కాని వెంక్రటావు ప్రేమించినా ఆమె జీతం గురించే ఆలోచించినట్లు చాలాచోట్ల రచయిత వర్ణిస్తారు. ఒకసారి ప్రేమించి బంధం ఏర్పరచుకున్నాక అది మానసిక మైపోవాలికాని, బాహ్యకారణాలకు ప్రాధాన్యమివ్వరాదని, ఆ పరిస్థితుల్లో సంసారం చట్టుబండలౌతుందని రచయిత బోధిస్తారు. సత్యమూర్తి సరోజినికి ఈ విషయం గురించి చాలా వివరంగా చెప్తాడు. స్వతంత్రించి పెళ్ళి విషయంలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రేమకు - పెళ్ళికి తగిన సాక్ష్యాలుంటే మానసికంగా బంధం దెబ్బతిన్నా సమాజంలో స్థానం ఉండటానికి సాక్ష్యులు కొంతవరకు ఉపయోగిస్తాయి. రజని - వెంకట్రావుల పెళ్ళికి తగిన సాక్ష్యం లేనందువల్ల సరోజిని వివాహ బంధాన్ని విచ్ఛిన్నం చేయాలని చూసింది సత్యమూర్తి న్యాయమార్గంలో నడవమన్నాడు.

స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం :

పెళ్ళిమీద నమ్మకంలేని రజని రెండవసారి రాజశేఖరం ఇంటికి పెళ్ళితో నిమిత్తం లేకుండా సహజీవనానికి వచ్చేసింది. తన జీతంలో కొంత తనకొరకు ఉంచుకోలేదు. అలాగే ఇంటికి డబ్బిచ్చినప్పుడు భాగం తీసుకోలేదు. ఈ విషయంలో కృష్ణమూర్తి ఆలోచన చాలా సరైనది.

"ఈమె.... ఈ రజని.... ఉద్యోగంచేసి డబ్బు

సంపాదిస్తుంది... కావాలి."[2] (కంచికి చేరిన కథలు - పుట 53, కొట్టి రామారావు).

కాలం ఒక తీరుగా జరగదు కదా! కృష్ణమూర్తి ఏం భయపడ్డాడో ఖచ్చితంగా రజనికి అదే జరిగి వెళితే ఏమౌతుందో ఆమె సామాజిక హోదా ఎలా ఉంటుందో రచయిత తెలియజెప్పారు.

ముగింపు :

చివరగా సమాజాన్ని పీడిస్తున్న మరో సమస్యను కూడా రచయిత చర్చించారు. మద్యపానం బాగున్న రాజశేఖర్ జీవితాన్ని, ఆరోగ్యాన్ని ధ్వంసం చేసింది. లక్షలు ఖర్చు పెట్టినా ప్రాణాలు దక్కలేదు. ప్రభుత్వోద్యోగి, పెన్షను ఉన్నాయి కనుక కుటుంబం తట్టుకోగలిగింది. రజని దక్కలేకపోయినా ఆర్థికంగా వీధిలో పడలేదు. దిక్కున్న వారి పరిస్థితి పర్వాలేదు. "ప్రేమా నీగమ్యమెటు" నవల లోని అనూరాధ లాగా వారే వారెవరైనా ఆదుకుంటే తప్ప ఇల్లాలికి, పిల్లలకు దిక్కుండదని మద్యం మానాలని రచయిత బోధించారు.

అన్నిటికంటే ముఖ్యమైన విషయం ప్రేమ మాత్రమే మిగిలిన సామాజికాంశాలన్నీ అనుషంగికంగా కనిపిస్తాయి. ఆ జాగ్రత్త లేకపోతే ప్రేమ శత్రుత్వమౌతుందని ముఖ్యంగా యువతులకు రచయిత బోధిస్తారు. ఈమాట వేల ఏళ్ళ క్రితమే కాళిదాసు చెప్పాడు. ప్రేమించేటప్పుడు ఆలోచించండి. మనసులు తెలియకపోతే ప్రేమ ఇలాగే శత్రుత్వం అవుతుంది.

ఆధార గ్రంథాలు :

1) కంచికి చేరిన కథలు - కొట్టి రామావు
2) కంచికి చేరని కథలు - కొట్టి రామారావు
3) కథానిక స్వరూప స్వభావాలు - పారంకి దక్షిణామూర్తి

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సినారె కవిత – తాత్వికత దృక్పథం

– సి.హెచ్.నాగలక్ష్మి, తెలుగు అధ్యాపకురాలు, బద్రూకా కళాశాల, కాచిగూడ, హైదరాబాద్.

మనం సాహిత్యంలో ఆధునికతను కాలానుగుణం గాను, ఒక తత్వంగాను అర్థం చేసుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన కొన్ని పరిణామాలు 'ఆధునికత' ను నిర్వచించు కునేలా చేశాయి. సాధారణంగా ఏ భాషలోనైనా, ప్రపంచంలో ఎక్కడ నుండి వచ్చిన సాహిత్య మైనా ప్రధానంగా రెండు రకాలుగా ఉంటుంది. దీన్ని సాహితీవేత్తలు భావవాద సాహిత్యం, భౌతికవాద సాహిత్యంగా పిలుస్తున్నారు. భావవాద దృక్పథంతో సాహిత్యాన్ని రాసేవారు సాహిత్యం భగవంతుని ప్రేరణవల్ల కలుగుతుందని భావిస్తారు. పూర్వజన్మసంస్కారాలు గురించి మాట్లాడతారు. పాలించేవాళ్ళు దైవాంశ సంభూతులుగా భావిస్తూ, వాళ్లకు అనుగుణంగా సాహిత్య సృజన చేస్తుంటారు. మానవుని చేతిలో ఏమీ లేదనీ, అంతా క్రమానుసారంగానే జరుగుతుందని భావిస్తుం టారు. సాధారణంగా ఇటువంటి భావాలతో కొన్నాళ్ళు మన తెలుగు సాహిత్యం కూడా కొనసాగింది. దీన్ని సంప్రదయాయ సాహిత్యం, ప్రాచీన సాహిత్యం మొదలైన పేర్లతో పిలుస్తున్నారు. సాహిత్యం సమాజానికి ప్రతిబింబం అంటారు. అయితే తాను జీవించే సమాజ చిత్రణ తన రచనల్లో ప్రతిఫలిస్తూ ఉంటుంది. తాను పుట్టి పెరిగిన వాతావరణం, తనకు ఉన్నటువంటి పరిచయాలు, తాను చదివిన నా రచనలు, తాను విన్న ప్రసంగాలు మొదలైన వన్నీ కూడా తన రచనలో ప్రతిబింబిస్తుంటాయి. వాటిని బట్టే ఆ రచయిత దృక్పథం. అతని సామాజిక జీవన విధానాన్ని తెలుసుకోగలుగుతాం. ఈ నేపథ్యం నుండే. భిన్నభిన్న దృక్పథాలతో కవిత్వాన్ని రాసినవారు జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత ఆచార్య సి.నారాయణ రెడ్డి.

కలంలో, గళంలో సౌందర్యం నింపుకున్న రసజ్ఞులు. వ్యష్టి చైతన్యమంటే వ్యక్తి చైతన్యమనీ, సమష్టి చైతన్యమంటే మానవ సమూహమైన సమాజ చైతన్య మనీ, తక్కిన చరాచర ప్రాణీతరమైన చైతన్యాన్ని సృష్టి చైతన్యమనీ, అఖండ చైతన్యమైన పరమేష్టి తత్వాన్ని తెలిపేది తాత్విక చైతన్యమనీ గ్రహించాలి. కవికి అనుభవం పెరిగే కొద్దీ అతను చూసే జీవితంపట్ల ఒక దృక్పథాన్ని పెంచుకొంటాడు. అప్పటికి తన ప్రాపంచిక అన్వేషణకు ఒక మార్గం దొరుకుతుంది.

'తాను ప్రపంచాన్ని ఏ దృష్టితో వీక్షిస్తున్నాడో,
ప్రపంచంపై తన దృష్టి ప్రభావం ఎలా ఉండాలని
తాను ఉద్దేశిస్తున్నాడో స్పష్టంగా గుర్తెరిగిన
'దర్శనం' అతనికి ఏర్పడుతుంది. ఇక్కడ రూప
చమత్కార ప్రదర్శనం కన్నా దర్శనం ముఖ్యం.
ప్రపంచపదులో అలాంటి దర్శనం ఉంది'.

'చేదుసత్యం మింగగలిగితే జీవితం వైద్యాలయం
మనను వుటలను చదవగలిగితే అనుభవం
విద్యాలయం
ఎవ్వరో నేర్పాలనే భ్రమ యెందుకంట వృధావృధా-
అడుగుతప్పక ఆడగలిగితే అవనియే నృత్యాలయం
కనులు విప్పక చూడగలిగితే అణువణువు తత్వా
లయం'.

అంటాడు సినారె. చేదును రుచి చూసిన తర్వాత తీపి తినడం చాలాతేలిక. జీవితంలోని కష్టసుఖాల పట్ల ఇదే భావం వర్తిస్తుంది. మనసు స్వభావాల్ని తెలుసు కోవడమే నిజమైన విద్య. అవనిని నృత్యాలయంగా భావించడం, అణువణువును తత్వాలయంగా చూడ గలగడం ఇవన్నీ కవి ప్రాపంచిక దృక్పథానికి సంబంధిం చిన అంశాలు. వీటి ద్వారా కవి మూలతత్వాన్ని చూడగలుగుతాడు. భౌతిక జీవన స్పృహతోనే కవి మౌలిక విలువలకోసం అన్వేషిస్తాడు. ఎక్కడయినా తానూహించిన తాత్విక చింతన ఎదురయినపుడు సృష్టికి దానికి గల సంబంధాన్ని విశ్లేషిస్తాడు.

ఇక్కడ తాత్వికత అంటే పరలోక భావనకాదు. లోకంలో వున్న ప్రతి వస్తువునూ పరిశీలించే కొద్దీ వాటి శాశ్వత విలువల్లోని పరిణామ ఉద్దేశ్యాన్ని కనుగొంటాడు. తన జీవితానికి ఆ వస్తు గుణానికి ఒక అంతఃసూత్రాన్ని ఏర్పరచుకొంటాడు. ఈ రెంటిపట్ల ఉన్న తన దర్శనా శక్తినే కవి ఇక్కడ కవిత్వంలో మేళవించాడు.

'ఊహల్లో గీసుకొన్న వ్యూహాలకు విలువే ముంది'.

అని అస్పష్ట పరిణామాన్ని తిరస్కరించాడు.

'నిలదీసి ప్రతి వస్తుతత్వాన్ని నిర్ణయించే దెవరులే'. అని వస్తుగుణంలోని సుస్థిర సత్యాన్ని అందరూ దర్శించ లేరని నారాయణరెడ్డి అన్నారు.

'రెండో పార్శ్వం చూడక నిండు నిజం చెబుతావా'.

అని జీవితాన్ని రెండు పార్శ్వాలుగా చూడమంటాడు కవి.

ఈ రెంటి పట్ల తూకం చెడకుండా ఉండాలంటూ- 'తూకంలోనే ఉన్నది జీవితసత్యం'. అని అన్నాడు.

'బురదలోన వుంటున్నా తరగదు పద్మం విలువ
తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ.
అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు-
అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ
మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ'.

పద్యంలో ప్రతిపాదాంతంలో ఉన్న 'విలువ' అన్న మాటకు నాలుగు అర్థాలు గోచరిస్తాయి. ఈ విలువ కవి దార్శనిక దృష్టిలో ఇలా క్రమంగా- నైర్మల్యం, స్వారస్యం, శ్రావ్యత, తాత్వికత అనేవి కనిపిస్తాయి. 'మనిషి మూలం చూడగోరితే మట్టిబెడ్డను కలుసుకో'. అంటే మనిషి పుట్టుకకు మూలం మట్టి అనీ, ఆ మట్టిని దర్శనా దృష్టితో చూడటం మనిషి మూలాన్ని, జీవిత సత్యాన్ని కనుగొన డమేననీ అర్థం.

విత్తనాన్ని మట్టిలోకి విసిరికొడితే
వృక్షమై పేలుతుంది
ఒక్క నోటిని నొక్కేయాలని చూస్తే
లక్ష కంఠాలై మోగుతుంది.

ఈ మాటలకు తాత్పర్యం ఉద్యమం ఏనాటికైనా జయిస్తుందని.

తాత్వికుడైన మనిషి మాత్రమే మృతికి పరిష్కృతి శూన్యమా? శూన్యానికి అవిష్కృతి జననమా? అనే చింతనలో పడుతాడు. కనిపించే దానితో పాటు కనిపించనిదాన్ని గూర్చి ఆలోచిస్తాడు.

ఆకృతిలోని వికారాలు
ఆత్మకెందుకంటవు?
అగుపించనిది నిత్యమా?
అగుపించేది మర్త్యమా?
ఎవరు చేసిన సృష్టి ఇది?
ఒకరికి మృత్యువే సత్యమా?.

మానవుడు ఎన్ని విజయాలు సాధించినా, చివరికి అతనిలో కలిగే అసంతృప్తి అతణ్ణి జీవిత పరమార్థం వైపు తీసుకొని వెళ్లుతుందంటానికి ఈ కవితోక్తులు చక్కని ఉదాహరణ. విశ్వంభరలోని నాల్గవ ఖండం నారాయణరెడ్డి గారి తాత్వికతకు గీటురాయి.

ఏ కత్తితో చీల్చలేనిది
ఏ నిప్పుతో కాల్చలేనిది.

ఏదో మనకు తెలుసు. అది ఆత్మ అని కూడా ఋషుల ద్వారా తెలుసుకున్నాం. అంతవరకు బాగానే ఉంది. కాని ఆ ఆత్మ-

ఊదితే ఎగిరే బూది కుప్పలో
ఒదిగి ఒదిగి ఉండడమెందుకు?
జననం లేనిదే స్థితి ఉంటుందా?
గమనం లేనిదే గతి ఉంటుందా?

అనే ప్రశ్న నేటికీ ప్రశ్నే. దీనికి సమాధానంగా ఆత్మను ఏదో మాయ గప్పిందనే సమాధానం ఆ మహాకవికి సంతృప్తినివ్వలేదు.

"దేహాన్ని తిప్పలేని ప్రాణి
సోహం అనడం దేనికని?
తెర అవతల చూడలేని మనిషి
పరతత్వం ప్రవచిస్తాడెందుకని?
అజ్ఞతను కప్పిపుచ్చే
ఆచ్ఛాదనలా ఇవి?"

ఈ భావాన్నే ఉపనిషత్తులూ ఘోషించాయి. అందుకే పరతత్వం ఏదంటే 'నేతి, నేతి' అని సమాధానమిచ్చాయి. కాని సరైన సమాధానాన్ని చూపలేకపోయాయి. చివరికి అనుభవంలోకి తెచ్చుకోవడమే పరమాత్మ సాక్షాత్కారం అని వివరించాయి.

అలలెత్తే ఎండమావులు
అవుతాయా సాగరాలు?
ఒంటబట్టిన దేహప్రీతికి
అంతుపట్టని ఆర్పణభీతికి
ఆశ్రయమిచ్చిన దివ్యకల్పన
అతిలోక శక్తుల ఆరాధన"

మనిషి భౌతిక సుఖాలకు అలవాటుపడి, మృత్యువు నుండి తప్పించుకోవడానికి అతిలోక శక్తులను ఆరాధించాడు. ఒకనాటి మనిషి తాను అజ్ఞానం చేత భూమి బల్లపరుపుగా ఉందని కూడా నమ్మాడు. తర్వాత కాని సత్యం తెలుసుకోలేదు.

అణువులోని అవ్యక్తమూర్తిని
అజాండంగా చూసిన తాను
గ్రహాలలో గుప్తంగా పడి ఉన్న
గాలి ఉనికిని చూచిన తాను
చూసుకున్నాడా తనలోని రూపం?

నారాయణరెడ్డి గారు కేవలం వ్యక్తరూప ప్రకృతి తత్వం తెలిసిన వ్యక్తే కాదు, అవ్యక్త చైతన్యాన్ని దర్శించిన కవి. అట్లాకాకపోతే అణువు లోని అవ్యక్తమూర్తిని గూర్చి ఎందుకు ప్రస్తావిస్తారు.

ఈ ప్రపంచంలో ఒక మనిషి మరొక మనిషిని అధిగమించాలని ఎప్పటికీ ప్రయత్నిస్తూనే ఉంటాడు. కాని తననావరించిన తమస్సు నుంచి, దానికి లోబడే మనస్సు నుంచి ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలి.

"తమస్సు వలపన్నినప్పుడు
మనస్సు పట్టుతప్పినప్పుడు
ఆలోచన ఆయుధంగా
అంతశ్చేతన ఆలంబనంగా
పురోగమిస్తున్నాడు మనిషి
పరిసరాల పైకెగిస"

అంతశ్చేతన అంటే ఆత్మజ్ఞానమే. దాన్ని ఆలంబనగా చేసుకొని మనిషి పురోగమిస్తున్నాడన్న కవి పలుకులు యథార్థమైనవి. ఈ మానవత్వ చరిత్రకు 1990లో భారతీయ జ్ఞానపీఠ పురస్కారం లభించింది. తెలుగు కవిత మరొక్కసారి తన మాహాత్మ్యాన్ని చాటుకొన్నది.

"మనసుకు తొడుగు మనిషి
మనిషికి ఉడుపు జగతి
ఇదే విశ్వంభరా తత్వం
ఇదే అనంత జీవిత సత్యం"

ఈ విధంగా విశ్వంభర కావ్యంలో ఆదిమ దశనుంచీ ఆధునిక దశవరకు మనిషి చేసిన ప్రస్థానాలు ఇందులో ప్రకరణాలు. వచనకవితలో ఒక సమగ్ర కావ్యం వ్రాయాలనే నా ఆకాంక్ష ఇలా రూపొందిందని సినారె స్వయంగా అన్నారు.

సినారె కవిత్వం ఎప్పుడూ నేలవిడిచి సాము చేయదు. కల్పనా ప్రపంచంలో మనుషుల్ని మరిపించదు. ఏది చెప్పదల్చినా 'సమకాలీనత' అనేది ప్రధాన నేపథ్యంగా కన్పిస్తుంది. తాత్విక నేపథ్యం గల కవితలు చదువుతుంటే సినారె అంతరికమైన 'జీవుని వేదన' మంద్రంగా విన్పిస్తుంది.

ఎన్నిసార్లు చెక్కితె ఓ శిల్పం
ఎన్నిసార్లు తీర్చితె ఓ చిత్రం
కబుర్లు చెప్పకే కాలమా
ఎన్నిసార్లు చస్తే ఓ జీవితం

గుండె లోతుల్ని స్పృశించే పంక్తులివి. మనిషి జీవన యాత్రలో ఎదురయ్యే ఆటంకాల్ని గమనిస్తూ సాగిపోవాలనీ తలొంచక ముందుకే నడవాలని ఉద్బోధించారు. జీవితం గురించి చెప్తూ-

ఎన్నెన్ని ఎగుడుదిగుడులో ఈ జీవయాత్రలో
ఎదలోని బొమ్మ చెబుతుందిక తెరిచి చూసుకో
అంటారు. మనిషికి అంతరాత్మను మించి సాక్షి ఎవరు!
మనిషి గతిస్తే శరీరమంతా మట్టిలో కలిసి పోతుంది
మృగం చచ్చినా చర్మం మాత్రం మృదంగమై
బతికుంటుంది.

మనిషి మరణిస్తే, అతని శరీరం ఎందుకూ పనికి రాదనీ, మృగం దేహం మాత్రం పనికొస్తుందనీ, కాబట్టి మనిషి కంటే మృగం గొప్పదనీ, ఈ విషయాన్ని గ్రహించి మానవుడు వివేకవంతుడై నలుగురికీ ఉపయోగపడేలా జీవించాలనీ, తన ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ తాను మరణించిన తర్వాత తన నేత్రాలను దానం చేయడం వంటి మంచిపనుల్ని చేయాలని.

కొండాలోయా జడ ప్రకృతిలో రెండు అంచులని అంటాను
వుటకా చావూ జీవిత కృతిలో వుటల్లాంటి వనుకుంటాను.

అన్నది తార్కాణం. జనన మరణాలనే ఉదాత్తాంశాలను ప్రకృతితో జోడించి వర్ణించడంలో అభివ్యక్తీకరణలో ఒక గాంభీర్యం ఏర్పడింది. జీవితాన్ని కృతిగా భావించి పుటకచావులను పుటలని రూపకాలంకార రూపంలో చెప్పడంలో తాత్వికతకు దోహదం సమకూర్చినట్లయింది. ఏమైనా సినారె ప్రకృతికి భాష్యప్రణేత అనడానికి ఇది ఒక అద్భుతోదాహరణం. అసలు-తాత్విక చింతన అనేది కవిత్వంలో ఉంటేనే ఆ కృతికి ఒక ఉదాత్తత ఏర్పడుతుంది.

ప్రతి కవితలోనూ ఆయన వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, మానవజాతి ప్రగతిపై నమ్మకం ప్రతిఫలిస్తాయి. వస్తు పరంగా చూస్తే, ఆయన కవిత్వంలో మానవజీవితంలోని పరిణామం, మానవజన్మ సార్థకత, మనిషిలోని చైతన్యం ప్రధానాంశాలు. 'దూరాలను దూసుకొచ్చి' అన్న వచన కావ్యం డా॥సి.నారాయణరెడ్డి గారి 70వ జన్మదినం సందర్భంగా వెలువడిన కవితా సంపుటి. జులై మాసం, 2000 సంవత్సరంలో ఇది ప్రచురించబడింది. ఇందులో 43 కవితాఖండికలు ఉన్నాయి. అన్నీ మానవజీవితంపై తాత్విక ప్రవచనాలే. మానవుడి చైతన్యాన్ని అవిష్కరించే కవితానుమాలే. అన్ని కవితలూ సందేశాత్మకాలే. మొత్తంగా ఈ కావ్యాన్ని గురించి చెప్పడానికి ఇందులో ఏకసూత్రత లేదు కనక (సందేశాత్మకత ఆనడం తప్ప'

మిథ్యామూర్తుల అద్భుత విక్రీడితాలకు
ఇది ఐంద్రజాలికుల వేదిక కాదు
ఇక్కడ మొలవాల్సింది
పసరు మొక్కలాంటి సాదా వాస్తవికత
ఎండైనా వానైనా
గుండెకు హత్తుకునే సమదార్శనికత
కాసే పళ్లనే కాదు
తగిలే రాళ్ళనూ లెక్కించుకున్నప్పుడే
మన పచ్చని అస్తిత్వానికి సార్థకత.

అనే వాక్యాలు జీవితంలో కష్టనుఖాలను ఎలా సమతూకంతో స్వీకరించాలో తాత్విక ధోరణిలో చెప్తాయి. ఆయన వాడే ఉపమానాల్లోనూ ఈ వాస్తవికత కని పిస్తుంది. అంటే స్వభావోక్తి. 'కట్టుకుని వదిలేసిన బట్టల మూటలాగా, అవయవాలను మోసుకుని ఈడుస్తూ ఈడుస్తూ నడవక తప్పదు' అన్న వాక్యంలో ఉపమానమే దీనికి ఉదాహరణ.

చిటికేస్తే ఆశయ ఫలాలు ఒళ్లో రాలవు
సాముదాయిక సంకల్పం ఉద్యమ కంఠంతో
ఉరిమితే తప్ప.
చప్పుడు చేయకుండా పడివుంటే
చచ్చురకం అనుకోవద్దు

శాసిస్తే విత్తనం మట్టి పొరల్లో చచ్చుగా పడి ఉంటుందా?

వీలు చూసుకుని మొక్కై తలెత్తి నిలుస్తుంది.

వంటి పంక్తులు సామాజిక చైతన్యంతో కూడిన ప్రజా ఉద్యమాలకు ఊపిరులందిస్తాయి. ప్రతి కవితా సంపుటిలోనూ సినారె తాత్విక దృక్పథం తళుక్కుమనక మానదు.

ఆ 'నేను' చేజిక్కితే
నువ్వు నువ్వెలా అవుతావోయ్ అని ప్రశ్న వేస్తూనే-
ఈ ప్రశ్నకు సమాధానం ఇంకా
ప్రయాణదశలోనే ఉంది.

అంటూ అన్వేషణను కొనసాగించుకుంటాడు. మన మెదళ్లను మేలుకొలిపే ఇందలి సూక్తిముక్తాలు దీన్ని బలపరుస్తాయి.

విశ్రమణం నిష్క్రమణం అనుకోరాదు
అది పునర్విజృంభణకు కావలసినంత
శ్వాస భాండాగార సమీకరణం'.
'తృప్తిని కొలిచే కొలమానమింకా పుట్టలేదు
అది ఎప్పుడూ అసంపూర్ణమే.

మున్నగు నిర్వచన రత్నాలు ఈ కవితా ప్రవాహినిలో మనం ఎన్నయినా ఏరుకోవచ్చు.

వచనకవితా ప్రక్రియలో తన కవితా 'ప్రవచన'శక్తి ప్రదర్శించారు. ఆధునిక కవితా వస్తువుకు అనుగుణమైన వచన కవితా శిల్పాన్ని ఎన్నుకున్నాడు. పద్యానికి, గేయానికి ఉన్న సొగసులన్నీటితో పాటు వచన కవితా సంప్రదాయాల్ని జీర్ణించుకొని తనదైన భావానుకూల శబ్ద, శయ్యా, శైలీయుత వచన పద్యాన్ని నడిపిస్తున్న సినారె సంప్రదాయాన్ని ప్రయోగాన్ని శాసించగల సవ్యసాచి, సనాతనులకు ఆధునాతనులకు దిక్సూచి.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఎల్లి నవల : సంస్కృతి – మానవ హక్కుల మధ్య సంఘర్షణ

– డా॥. వెంకటరామయ్య గంపా, సహ ఆచార్యులు, భారతీయ భాషల అధ్యయన కేంద్రం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ.

భారతదేశంలో కొన్ని వందల సంఖ్యలో గిరిజన తెగలు ఉన్నాయి. వారికి సంబంధించిన సమాచారం సాహిత్య రచనలో పూర్తిగా గ్రంధస్థమైనట్లు కనిపించదు. కొన్ని వర్గాల వారి జీవితంపై ఎన్నో రకాలైన సాహిత్య రచనలు వెలువడ్డాయి. కానీ కొన్ని గిరిజనుల జీవితాలు ఇప్పటికీ ప్రధాన స్రవంతిలోకి వచ్చినట్లు కనిపించదు. ఈ పరిస్థితి తెలుగు ప్రాంతంలో కూడా ఉంది. తెలుగు ప్రాంతాలలో ఉన్న గిరిజన తెగలలో ఉన్న ఒక వర్గానికి చెందిన వారి జీవన విధానాన్ని వివరిస్తూ అరుణాఎల్లా అనే పేరుతో నవల రచించారు. కొన్ని ముఖ్యమైన పాత్రలతో దాదాపు వారి జీవితాన్ని మన కళ్ల ముందుంచే ప్రయత్నం చేశారు. ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యంఎల్లి నవల ఆధారంగా గిరిజన తెగలలో ఉన్న ఒక వర్గానికి చెందిన వారి సంస్కృతి, సంప్రదాయాలు రాజ్యాంగం కల్పించిన హక్కులను దూరం చేస్తున్నాయో వివరించడం. ఎల్లి నవలలో కనిపించే ముఖ్యమైన పాత్రల్లో ఎల్లి పాత్ర కూడా ఒకటి. నవలలో వెంకన్న, బిచ్చాలు, జీవ, మాలచ్చిమి, నీలి మొదలైనవి ముఖ్యమైన పాత్రలు. ఈ పాత్రల ద్వారా గిరిజనులలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారి జీవితాన్ని పాఠకులకు పరిచయం చేసే ప్రయత్నం చేశారు రచయిత్రి.

ఆర్థిక పరిస్థితులు, సామాజిక హోదా-హక్కులు:

ఎల్లి నవలలో ఆర్థిక పరమైన విషయాలను చాలా లోతుగా చర్చించినట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా ఆర్థిక పరమైన విషయాలు ఆ గిరిజన తెగ సామాజిక హోదాను నిర్ణయించేవిగా ఉన్నాయి. దాదాపు అందరూ ఆర్థిక పరంగా చాలా వెనుకబడి ఉన్నట్లు తెలుస్తుంది. గిరిజన తెగకు చెందిన వారందరూ వృత్తి పరమైన పనులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఆ గిరిజన తెగ వారి జీవనాధారం పందులే. వారికి ఉన్న ఆస్తిని పందుల రూపంలో లెక్క కట్టినట్లు నవలలో తెలుస్తుంది. ముఖ్యంగా ఈత చాపలు అల్లడం, చింత చిగురు కోయడం, ధనవంతుల ఆస్తులకు కాపలా ఉండడం మొదలైన పనులను చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. చాలా వరకు వీరు అగ్రవర్ణాల దృష్టిలో అంటరానివారుగా మిగిలిపోయారు. సమాజంలో ప్రధాన స్రవంతికి మరియు వ్యవసాయానికి దూరంగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఎవరికి వ్యవసాయ భూమి ఉన్నట్లు కనిపించదు. వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నట్లు నవల ద్వారా అవగతమవుతుంది. చాలావరకు ఈ తెగ వారు నివసించడానికి ఒక చిన్నపాటి గుడిసె లాంటిది నిర్మించుకొని జీవనం కొనసాగిస్తుంటారు. జీవితంలో చిన్నపాటి ఇంటి నిర్మించుకోవడం కూడా చాలా గొప్ప విషయంగానే భావిస్తారు. కాలక్రమంలో వచ్చిన మార్పుల ఫలితంగా వారి జీవన విధానంలో కూడా మార్పులు కనిపించినప్పటికీ ఎల్లి నవలలో మాత్రం వారి పాత జీవిత చిత్రాన్ని రచయిత్రి వివరించారు. వివాహం చేసుకోవాలంటే కనీసం చిన్నపాటి పూరి గుడిసే ఉండాలని నవలలోని చాలా పాత్రలు భావిస్తుంటాయి. తాటి ఆకులతో పూరి గుడిసె నిర్మించుకోవడం వారి దృష్టిలో చాలా గొప్ప విషయం. ఆ గుడిసే వారికి గొప్ప భవనం లాగా కనిపిస్తున్నట్లు ఎల్లి నవలలో రచయిత్రి చిత్రించారు. చిన్నపాటి గుడిసెలోనే ఇంట్లో ఉన్న వారందరూ నివసిస్తుంటారు. వారికి సంబంధించినటువంటి జీవిత మంతా ఆ గుడిసెలోనే ఉంటుంది. వర్షం వచ్చిన సమయంలో ఇంట్లో సరైనా సౌకర్యం ఉండదు. ఇంట్లోకి నీరు ప్రవహిస్తుంటుంది. ఆర్థికపరమైన హక్కులకు సంబంధించిన విషయాలు ఏమి పెద్దగా తెలిసినట్లు ఈ తెగవారికి కనిపించదు. ప్రతి మనిషీ హక్కుగా భావించే పరిశుభ్రమైన తిండి, నీరు, బట్టలు కూడా వీరికి ఉన్నట్లు కనిపించదు. ''గుడిసె ముందుకొచ్చిన ఎల్లి పందులను

గుడిసెల్లోకి తోలి బిగించింది ఏరుకొచ్చిన పంది పెంటని దూరంగా పొగపెడుతున్న మీద బోర్లించింది. వన్నేరులో దిగి కాళ్లు కడుక్కుంది. నీళ్లు మకిలి గా ఉన్నాయ్." (పుట-11) తినడానికి తిండి కూడా నోచుకోని స్థితిలో ఉన్నారు. ఒరేయ్ సత్యం ఇటు రండి పులి నీళ్ళు తాగి పోండి నేను పోవాలి అని పిల్లల్ని కేకేసింది ఎల్లి. పిల్లలు గబగబా వాళ్ళ తెచ్చుకొని కూర్చున్నారు. తల కాసిని గిన్నెలో పోసి ముసలమ్మ కి కూడా పోసి ఇచ్చింది గిన్నెల్లో చెయ్యి పెట్టి కెలికిన పిల్లవాడు కూసిని మెతుకులు కూడా లేవు అన్నాడు అక్క వంక చూస్తూ. ఆ ఉన్నాయిలే తాగెల్లవోయ్ పెద్ద ఆసామి కబుర్లు చెబుతావు అంది ఎల్లి. గంజి అన్నా చిక్కగా లేదు. వుత్తి నీళ్ళే అంది సీత. నోరు మూసుకొని తాగెల్లు అని కసిరింది." (ఎల్లి .పుట-11)

"మనుషుల గుడిసెకీ పందుల గుడిసెకీ మధ్య ఒక నిద్రగన్నేరు చెట్టు ఉంది" (ఎల్లి. పుట- 11) "నూడు ఆ పిల్లల్ని. అ ఆడపిల్లకి సొక్కాముక్క లేదు. పీలికలేసుకు తిరుగుతావుంది." (ఎల్లి . పుట- 13)

పై వాక్యాల ద్వారా కనీసం వారు తినడానికి తిండి ఉండడానికి ఇల్లు కూడా లేకుండా జీవిస్తున్నారని అర్థమవుతుంది మనుషులు జీవించడానికి గుడిసెకు జంతువుల కోసం వేసిన గుడిసెలు పెద్ద తేడాలేదని తెలుస్తుంది. ఈ సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువగా అటవీ ప్రాంతంపై ఆధారపడి జీవిస్తుంటారు. వారి జీవనానికి అటవీ ప్రాంతంలో లభించే ఆకులు, కాయలు, వంట చెరుకు, వెదురు, పండ్లు మొదలైన గృహావసరాలకు అవసరమైనటువంటి పైన ఆధారపడి జీవిస్తుంటారు. అడవిలో లభించిన వాటిని గ్రామాల్లో, పట్టణాలలో అమ్ముకొని జీవనాన్ని కొనసాగిస్తుంటారు. ముఖ్యంగా వారు పందుల పెంపకంపై శ్రద్ధ వహిస్తారు. పందుల ఎక్కువ ఉన్నవారిని ఆ తెగలో కాస్త ధన వంతులుగా పరిగణించడం అనేది జరుగుతుంటుంది. ఈత ఆకులతో బుట్టలు అల్లడం, చేటలో అల్లడం మొదలైనవి చేస్తుంటారు. బుట్టలు, తట్టలు వ్యవసాయ పనులకు ఉపయోగకరంగా ఉంటాయి. వీటితోపాటు చేపలు పట్టి అమ్మడం అనేది వారి జీవనంలో ఒక భాగంగా ఉంటుంది. వారి జీవనవిధానానికి తగినట్లుగానే వారి ఖర్చు ఉంటుంది. పండుగలకు, తాగడానికి, తిండికి బాగా ఖర్చుపెడతారు. విద్యపై ఖర్చుపెట్టినట్లు ఎల్లి నవలలో ఎక్కడా కనిపించదు. విద్య అనేది ప్రాథమిక హక్కు అనే విషయం నవలలో ఎక్కడా కనిపించదు. ఆరోగ్య సమస్యలు వస్తే ప్రభుత్వాసుపత్రులపై ఆధార పడినట్లు తెలుస్తుంది. పెద్ద రోగాలు వచ్చినప్పుడు సరైన వైద్యం లేక ప్రాణాలు వదిలిన వారు చాలా మంది ఉన్నారు. చాలామంది నాటు ముందులపై ఆధారపడి జీవిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో నాటు మందులు వికటించి మరణించిన వ్యక్తులూ నవలలో కనిపిస్తారు. వైద్యం ప్రతి మనిషి హక్కు అనే విషయం వారిలో చాలా మందికి తెలియదు.

వలస జీవనం :

ఈ తెగ వారు ఒక ప్రాంతంనుంచి మరొక ప్రాంతానికి వెళ్లడం అనేది సామాన్యంగా కనిపించే విషయం. వారి జీవనోపాధికి అవకాశమున్న చోట నివసిస్తుంటారు. కొన్ని సందర్భాలలో ఉన్న ప్రాంతంలో ఇతరులతో సరియైనటు వంటి సంబంధాలు లేనప్పుడు లేదా ధనికుల ఒత్తిడి ఉన్నప్పుడు వారు ఉన్నచోట వదిలి మరొక చోటుకు వెళ్ళడం అనేది సాధారణంగా కనిపించే విషయం. ప్రతి ఒక్కరికి నివాసానికి ఇల్లు అనేది చాలా అవసరం. అది హక్కు కూడా. కానీ వీరు శాశ్వత నివాసం అనేది లేనట్లుగానే తెలుస్తుంది.

వివాహ సంప్రదాయం - వోలి :

భారతీయ సంప్రదాయంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క తెగవారు ఒక్కొక్క రకమైన వివాహ పద్ధతిని అనుసరిస్తుంటారు ఎవరు ఎన్ని రకాల పద్ధతులను అనుసరించినప్పటికీ వివాహ బంధానికి ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఇచ్చి గౌరవించారు. స్త్రీ పురుషులు కలిసి జీవించడానికి వివాహమనేది ఒక సంప్రదాయ విధానంగా

కొనసాగుతుంది కానీ కొన్ని గిరిజన తెగలలో వివాహ వ్యవస్థ భిన్నంగా ఉంది. ప్రాచీన కాలంనుంచి వివాహం చేయడానికి స్త్రీ పురుషులకి ఒక నిర్దిష్టమైన వయస్సు అంటూ ఏమీ లేదు స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ బద్ధంగా స్త్రీ పురుషులు వివాహ వయస్సు నిర్ణయించినప్పటికీ ఇప్పటికీ అనేక తెగలలో వివాహ వయస్సు కంటే ముందే వివాహం చేయడం అనేది జరుగుతుంది.

దీనితోపాటు వివాహ విధానాల విభిన్న సంప్రదాయాలు ఉన్నాయి. కొన్నిచోట్ల కన్యాశుల్కం పద్ధతి కొనసాగుతుండగా కొన్ని సందర్భాలలో వరకట్న సంప్రదాయం కొనసాగుతోంది. విధవా వివాహం, పునర్వివాహం, బహు భార్యత్వం, బహు పత్నీత్వం మొదలైన సంప్రదాయాలు ఉన్నట్లు ఇప్పటికీ మన ఇతిహాసాల్లో పురాణాలలో కనిపిస్తుంది. ఆధునిక కాలంలో వివాహానికి అమ్మాయి వయసు 18 సంవత్సరాలు, అబ్బాయి వయసు 21 సంవత్సరాలుగా నిర్ణయించినప్పటికీ గిరిజన తెగలలో ఈ విధానాన్ని పాటిస్తున్నట్లు కనిపించదు. వ్యవస్థలో వివాహాన్ని చట్టబద్ధం చేశారు. ఒకవేళ భార్యాభర్తల విడిపోవాలంటే చట్టబద్ధంగా విడాకులు తీసుకోవాలి. అందుకోసం చట్టంలో కొన్ని నియమాలను నిర్దిష్టంగా పేర్కొన్నారు. కానీ ఈ సామాజిక తెగకు సంబంధించిన వారి వివాహ జీవితానికి సంబంధించి అనేక విషయాలు ఎల్లి నవలలో కనిపిస్తాయి. చాలా సందర్భాలలో చట్టంలో పేర్కొన్నటువంటి నియమాలు ఈ గిరిజన తెగ వారు అనుసరించినట్లు కనిపించదు. వివాహానికి వారికి కొన్ని ప్రత్యేకమైనవంటి నియమ నిబంధనలు ఉన్నాయి. ముఖ్యంగా వివాహమనేటువంటిది వారి దృష్టిలో భార్యా భర్తల ఇష్టాయిష్టాలకు సంబంధించిన విషయం. భర్తకు భార్యపై లేదా భార్యకు భర్తపై ఇష్టమున్నంత మేరకే కలిసి ఉండొచ్చు. ముఖ్యంగా స్త్రీకి వివాహం విషయంలో స్వేచ్ఛ ఉన్నట్లు కనిపించదు. భర్తకు భార్య ఒక వస్తువులాగా కనిపిస్తుంది. భర్తకు భార్యపై ఇష్టం లేకపోతే తనకు నచ్చినప్పుడు భార్యను ఇతరులకు అమ్ముకోవచ్చు. అమ్మాయి తల్లిదండ్రులు కూడా డబ్బు కోసం ఆశపడి ఎటువంటి వ్యక్తికైనా అమ్మాయిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. చాలా సందర్భాలలో అమ్మాయి బాగోగులు కంటే డబ్బులు ఎంత ఎక్కువ ఇస్తున్నారు? అని ఆలోచిస్తున్నారు. అమ్మాయిని దాదాపు ఇంట్లో ఉండే ఒక పెంపుడు జంతువు లేదా వస్తువుగానో చూస్తున్నట్లు ఎల్లి నవలలో కనిపిస్తున్నది. ఎల్లి నవలలో అమ్మాయి అబ్బాయి ఇష్టపడి చేసుకున్న వివాహాల కంటే తల్లిదండ్రులు అమ్మాయిని బలవంతంగా ఒప్పించి డబ్బు ఎక్కువ ఇచ్చిన వ్యక్తితో వివాహం జరిపించినట్లుగా కనిపిస్తుంది. ఆ విధంగా చూచినప్పుడు వివాహమనే విషయం వారి సంప్రదాయంలో పెద్దల కుదిర్చిన పెళ్లిళ్లే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. ఒకవేళ అమ్మాయి అబ్బాయి ఇష్టపడి ప్రేమ వివాహం చేసుకోవాలనుకున్నప్పటికి అమ్మాయి తల్లిదండ్రులకు అబ్బాయి డబ్బులు ఇవ్వాల్సిందే. దానికి వారు పెట్టుకున్న పేరు వోలి. చాలా సందర్భాలలో తెలిసిన వ్యక్తులకే అమ్మాయిని ఇవ్వడం జరుగుతుంది. వివాహం విషయంలో కొంత మంది స్త్రీలకు ఎటివంటి హక్కులు లేనట్లు నవలలో కనిపిస్తుంది.

అమ్మాయి చూడడానికి బాగున్నా లేదా వయసులో చిన్నగా ఉన్నా ఎక్కువ వోలి ఇచ్చి వరుడు వివాహం చేసుకుంటాడు. కొన్ని సందర్భాలలో అమ్మాయి రజస్వల కాకమునుపే వివాహం చేస్తారు. రజస్వల అయిన తరువాత వరుడు ఇంటికి అమ్మాయిని పంపడం అనేది సంప్రదాయం. చాలావరకు అమ్మాయి తరపు వారు అబ్బాయి గుణగణాల కంటే అతని వెనుక ఉన్న ఆస్తిని, అతడు ఇచ్చే వోలిని పరిగణలోకి తీసుకుంటారు. వివాహం సమయంలో అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులు వారి శక్తి మేరకు వివాహానికి ఖర్చు పెట్టడం అనేది వారి సంప్రదాయంలో సాధారణ విషయం. ముఖ్యంగా ఇంటికి వచ్చే అమ్మాయి ఇంట్లో పనులతోపాటు ఇంటికి ఆదాయం వచ్చే పనులను చేయాల్సి ఉంటుంది.

అందుకోసం అబ్బాయి తల్లిదండ్రులు పనిచేసే అమ్మాయిని ముఖ్యంగా చిన్న వయసు ఉన్న అమ్మాయిని డబ్బు ఎక్కువ ఖర్చు పెట్టి అయినా కొనుక్కుంటారు. ఇది వారి సంప్రదాయంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ గిరిజన తెగ వారికి అమ్మాయి ఒక ఆదాయాన్ని ఇచ్చే వస్తువులాగా ఎల్లి నవలలో కని పిస్తుంది. అమ్మాయి ఇంట్లో నుంచి వెళ్లిపోవటం అంటే సంపాదించే ఒక మనిషి ఇంట్లో నుంచి వెళ్లిపోవటమే. అందుకు ప్రతిఫలంగా అమ్మాయి అబ్బాయి ఇంటికి వెళ్లే సమయంలో అమ్మాయి తల్లిదండ్రులు అబ్బాయి నుంచి ధనాన్ని ఆశిస్తారు. అమ్మాయికి మేనమామ ఉంటే అబ్బాయి ఇచ్చే డబ్బులో కొంత మేనమామ కూడా చెందుతుంది. వివాహం నిశ్చయం అయిన తర్వాత అమ్మాయికి చెల్లించాల్సిన మొత్తాన్ని అబ్బాయి తల్లి దండ్రులు చెల్లిస్తారు. ఒకవేళ అమ్మాయి తరపు వారికి డబ్బు అవసరమైతే కొంత మొత్తాన్ని ముందుగానే అబ్బాయి తరపువారు చెల్లిస్తారు. వివాహ సందర్భంలో చెల్లించిన వోలి డబ్బును అమ్మాయి తరపు వారు తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒకవేళ అమ్మాయి మొగుడుతో విడిపోవాలనుకున్న లేదా మరొక వ్యక్తితో వెళ్లి పోవా లనుకున్న భర్త చెల్లించిన వోలి డబ్బులు మొత్తాన్ని తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ భర్త చనిపోయిన అత్తగారి ఇంట్లోనే ఉండాలి. స్త్రీ మరొక వ్యక్తిని వివాహం చేసుకోవాలంటే వివాహం చేసుకోబోయే వ్యక్తి అమ్మాయి అత్త మామ తరపున వారికి డబ్బు చెల్లించాలి. భర్తకు భార్య పైన ఆసక్తి లేకపోతే మరొకరికి ఒక వస్తువులాగా అమ్ముకునే వెసులుబాటుంది. భార్యకు ఇష్టమున్నా లేకపోయినా భర్త ఇతరులకు అమ్మవచ్చు. స్త్రీ తనను కొనుగోలు చేసిన వ్యక్తి దగ్గరకు వెళ్లాలి. సంతానంపై భార్యకు ఎటువంటి హక్కులు ఉండవు. భర్త సంతానంపై సర్వాధికారాలు ఉన్నట్లు వారి సంప్రదాయాల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా ఈ గిరిజన తెగ వారి సంప్ర దాయంలో భార్యాభర్తలు విడిపోవడం, మరొక వ్యక్తిని పెళ్లి చేసుకోవడం అనేటువంటిది చాలా సాదాసీదా విషయంగా కనిపిస్తుంది. పురుషులకు స్త్రీల పట్ల ఎటువంటి దృక్పథం ఉంది? అని తెలుసుకోవడానికి ఈ విషయాలు ఒక ఉదాహరణగా తెలుస్తాయి. హక్కులు, రాజ్యాంగం అనే విషయాలు ఇక్కడ చాలా అప్రధానంగా కనిపిస్తాయి.

వివాహం తరువాత భార్యాభర్తలు ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి ప్రత్యేక కాపురం పెడతారు. కొన్ని సందర్భాలలో కొత్తగా పెళ్లైన జంట ఉమ్మడి కుటుంబంతో ఉండడానికి సమ్మతిస్తారు. కొత్త జంట విడిపోయినప్పటికీ కుటుంబంలో ఉన్నటువంటి వ్యక్తు లతో సంబంధాలు సాధారణంగానే ఉంటాయి అందులో ఎటువంటి మార్పులు ఉండవు. ఇంట్లో జరిగే ముఖ్యమైన కార్యక్రమాలకు పండగ సందర్భాలలో కుటుంబంలోని వ్యక్తులందరూ కూడా ఒకే చోట కలిసి వేడుకగా జరుపు కొంటారు. తల్లిదండ్రులకు సంబంధించిన ఆస్తి వార సత్వంగా కొడుకులకు చెందుతుంది. ఒకవేళ తల్లి దండ్రులకు పుత్రసంతానం లేకపోతే అమ్మాయిలకు ఆస్తికి చెందుతుంది. ఈ గిరిజన తెగవారి సంప్రదాయంలో పురుషాధిపత్యం ఉండడం వలన పురుషుడు స్త్రీకి ఆర్థిక పరమైన విషయాలను తెలియజేయడం అనేది చాలా అరుదుగా జరుగుతుంది.

భార్యాభర్తలు విడాకులు తీసుకోవడం చాలా సులభంగా కనిపిస్తుంది. విడాకుల కోసం కుల పంచా యితీ పేరుతో జరిగే పెద్దల సమక్షంలో భార్యాభర్తలు ఎందుకు విడిపోతున్నారో చెప్పి తమ సమ్మతిని తెలియ చేస్తే కుల పెద్దలు వారు విడిపోతున్నట్లు ప్రకటించేస్తారు. కొన్ని సందర్భాలలో కుల పెద్దలు అపరాధ రుసుము పేరుతో కొంత ధనాన్ని వసూలు చేస్తారు. భార్యాభర్తలు విడిపోతున్న సందర్భంలో భర్తకు భార్యను వదులుకోవడం ఇష్టం లేకపోయినా కేవలం భార్య మాత్రమే భర్తను వదిలి పెట్టాలనుకున్న సందర్భంలో అమ్మాయి తరపు వారు అబ్బాయి తరపువాడికి తిరిగి వోలి చెల్లించవలసి

ఉంటుంది. వోలి డబ్బులు మొత్తం ఇవ్వక పోయినప్పటికీ కొంత డబ్బులు మాత్రం తిరిగి ఇవ్వవలసి ఉంటుంది. కనీసం వివాహ సమయంలో ఇచ్చిన వోలి డబ్బుల్లో సగభాగమైనా అమ్మాయి తరపువారు తిరిగి ఇవ్వమని అబ్బాయి తరపువారు ఒత్తిడి చేస్తారు. భర్త భార్యతో విడిపోయిన తరువాత మరొక అమ్మాయిని వివాహం చేసుకొని సౌలభ్యం ఉంది. అందుకోసం అతను చేసుకో బోయే అమ్మాయి తల్లిదండ్రులకి వోలి చెల్లించాలి. చాలా సందర్భాలలో ఎల్లి నవలలో వృద్ధాప్యంలో ఉన్న పురుషుడు కూతురు వయస్సు ఉన్న చిన్న అమ్మాయిని వివాహం చేసుకున్నట్లు కనిపిస్తుంది. అంతేకాకుండా భర్త చనిపోయినటువంటి స్త్రీలకు తిరిగి వివాహం చేయడానికి వారి సంప్రదాయంలో ఎటువంటి ఆటంకాలు లేవు. కాకపోతే కొన్ని సందర్భాలలో వితంతువు అయినా అమ్మాయిని వివాహం చేసుకోవాలనుకుంటే అబ్బాయి అమ్మాయి అత్తామామలకు వోలి చెల్లించాలి.

సమాజంలో కుటుంబం అత్యంత ముఖ్యమైనది. కుటుంబం అనే అంశంపై ఇప్పటికే అనేకమంది విపులంగా చర్చించారు. కుటుంబంలో భర్తను భార్య పిల్లల బాగోగులు చూసే వ్యక్తిగా పరిగణిస్తారు. అంటే భార్యా పిల్లల సంరక్షణతో పాటు వారికి తిండి, బట్ట సమకూర్చడం ఇంటి యజమాని అయిన భర్త ముఖ్య ధర్మం. పిల్లలకు ఒక వయసు వచ్చిన తర్వాత వివాహం చేయడం అనేది తండ్రి యొక్క కనీస ధర్మం. ముఖ్యంగా భారతీయ సంప్రదాయం ప్రకారం పెళ్ళీడు కొచ్చిన అమ్మాయికి మంచి సంబంధం చూసి వివాహం చేయడం అనేది తల్లిదండ్రుల బాధ్యతగా భావిస్తారు. కానీ ఎల్లి నవలలో చాలావరకు తల్లిదండ్రులు తమ బాధ్యతలు నిర్వర్తించినట్లు కనిపించదు. అందుకు వలు ఉదాహరణలు ఉన్నాయి.

ఇంట్లో ముఖ్యమైన పనులన్నీ స్త్రీలే చేస్తున్నట్లు ఎల్లి నవలలో కనిపిస్తుంది. ఇంట్లో పనులు, బయటి పనులు పందులు మేపుకు రావడం, బుట్టలు అల్లడానికి కావలసిన వెదురు బొంగులను తీసుకు రావడం, వివిధ రకాల ఆకులను తీసుకొచ్చి అమ్మడం మొదలైనవన్నీ కూడా స్త్రీలే చేస్తున్నట్లు నవలలో కనిపిస్తుంది. స్త్రీలు ఎన్నో కష్టాల పడుతున్నప్పటికీ ముఖ్యమైన నిర్ణయాధికారం మాత్రం పురుషులకే ఉన్నట్లు తెలుస్తుంది. చాలా సందర్భాలలో స్త్రీలు కనీసం తమ అభిప్రాయాన్ని చెప్పడానికి కూడా అవకాశం లేకుండా పురుషులు ప్రవర్తిస్తుంటారు. స్త్రీలు సంపాదించిన డబ్బును కూడా పురుషులకే ఇచ్చి వారు చెప్పినట్లు స్త్రీలు వింటుంటారు. పిల్లల పెంపకం విషయంలో భార్య భర్తలకి సమానమైన బాధ్యత ఉన్నప్పటికీ తల్లి చూపించిన శ్రద్ధ తండ్రి చూపించినట్లు కనిపించదు. ముఖ్యంగా తండ్రి అమ్మాయి అబ్బాయిల విషయంలో వివక్షత చూపుతున్నట్లు నవలలో కనిపిస్తుంది. అబ్బాయిల పట్ల ఎక్కువ బాధ్యతను, అనురాగాన్ని చూపించడం, అమ్మాయిల వివాహ సమయంలో డబ్బు కోసం ఆశపడి అబ్బాయి గుణగణాలు పరిశీలించకుండా, వయస్సును పరిగణలోకి తీసుకోకుండా కేవలం డబ్బుకోసమే అమ్మాయిని ఇచ్చి వివాహం చేయడం అనేది చాలా సందర్భాలలో కనిపిస్తుంది. ఇంటికి సంబంధించిన విషయాలలో భార్యాభర్తలు సమానంగా బాధ్యతలు పంచుకోవడం అనేది కొన్ని కుటుంబాల్లో కనిపిస్తుంది. మరికొన్ని సందర్భాలలో స్త్రీల సంపాదన పైన ఆధారపడి పురుషులు తాగుడుకు బానిసై ఎటువంటి పనులు లేకుండా తిరిగేవారూ ఉన్నారు.

చాలా సందర్భాలలో భార్యకు హక్కుల కంటే బాధ్యతలే ఎక్కువగా వున్నట్లు ఎల్లి నవల అవగత మవుతుంది. ముఖ్యంగా పిల్లలపై సర్వాధికారాలు భర్తకు ఉన్నట్లు ఎల్లి నవల ద్వారా తెలుస్తోంది. భర్తకు ఇష్టం లేకపోతే భార్య ఇతరులకు అమ్మడం కూడా చేయవచ్చు. అందుకోసం భార్యతో చర్చించాల్సిన అవసరం లేదు. భార్యను అమ్ముకోవడం అనేది వారి తెగలో చాలా సాధారణ విషయంలాగా ఎల్లి నవలలో కనిపిస్తుంది. పని అధికంగా చేసే వ్యక్తికి ఈ గుర్తింపు రావడమనేది

సహజమైన విషయం. కానీ గిరిజన సామాజిక వర్గానికి చెందిన స్త్రీలు వ్యవసాయ సంబంధమైన పనులతోపాటు ఇంటికి సంబంధించిన పనుల్లో కూడా పురుషులకు సహాయం చేస్తూ ఉంటారు. కానీ స్త్రీలకు పనికి లభించే గుర్తింపు చాలా తక్కువ. కనీస గౌరవం కూడా లభించదు. చాలా సందర్భాలలో ఆర్థికపరమైన విషయాలలో స్త్రీకి ఎటువంటి హక్కు ఉన్నట్లు కనిపించదు. ప్రతి రూపాయి కూడా భర్త అనుమతితో ఖర్చుపెట్టే సంప్రదాయం ఉన్నట్లు తెలుస్తోంది.

కుల పంచాయితీ :

ఈ సమూహానికి చెందిన వారి తెగలో వ్యవస్థలో ఎన్ని రకాలైనా సమస్యలున్నప్పటికీ వారి పరిష్కారాలకు మాత్రం కుల పంచాయతీలను ఆశ్రయిస్తారు. వారి దృష్టిలో కుల పంచాయతీ తీర్పు అనేది అత్యంత గౌరవనీయమైనది. అందరూ అనుసరించదగినది. చాలావరకు తెగలోని ప్రతి వారు కుల పంచాయతీ తీర్పును అనుసరించి నడచుకుంటారు. వ్యక్తిగత అభిప్రాయాలు వేరయినా కుల పంచాయతీ తీర్పు అందరూ శిరసావహిస్తారు. వ్యక్తుల మధ్య తగాదాలు, చివరికి భార్యాభర్తల మధ్య విడాకులు, తప్పు చేసిన వారికి శిక్షలు వేయడం మొదలైనవన్నీ కుల పంచాయతీలోనే చర్చిస్తారు. పంచాయతీ తీర్పును కొన్ని సందర్భాలలో తిరుగుబాటు చేసి వెళ్లిపోయిన వారిని గ్రామం నుంచి బహిష్కరిస్తారు. గ్రామం నుంచి బహిష్కరించిన వారికి ఇతరులు ఎవరు సహాయం చేయకూడదు. గ్రామంలో పెద్దమనుషులుగా చలామణీ అయ్యేవారు పక్షపాత బుద్ధితో తీర్పు ఇచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. కొన్ని సందర్భాలలో తీర్పును పదేపదే వాయిదా వేయడం, కొందరిని ఇబ్బందులకు గురిచేయడం అనేది జరుగుతుంటుంది. ఎల్లి నవలలో పలు ఉదాహరణలు ఉన్నాయి.

ఇప్పటికీ కొన్ని గిరిజన సమూహాలలో మానవ హక్కులు ఉల్లంఘన ఉన్నట్లు చాలా చోట్ల కనిపిస్తుంది. స్త్రీ పురుషుల సమానత్వం, అడుగడుగున హక్కుల ఉల్లంఘన కనిపిస్తుంది. ఇప్పటికీ కొన్ని గిరిజన తెగలలో రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ఏ రకమైనటువంటి అవగాహన లేదు. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఇప్పటికీ కొన్ని గిరిజన సమూహాలలో ఏ రకమైన మార్పులు లేవు. సంస్కృతి సంప్రదాయాల పేరుతో ఇప్పటికీ గిరిజన సమూహాలు లోని ప్రజలు తమ హక్కులను పొందలేకపోతున్నారు.

ఉపయోగించుకున్న పుస్తకం :

1. అరుణ. 2001.ఎల్లి. విజయవాడ: న్యూ సిలబస్ లిటరేచర్.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు కథా ప్రక్రియకు పునాది – భండారు అచ్చమాంబ

– డా॥ పడాల జగన్నాథరావు, అసిస్టెంట్ ప్రొఫిసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, ఖైరతాబాద్, హైదరాబాద్.

సమాజానికి హితవును కూర్చేది సాహిత్యం. ఆ సాహిత్యానికి రూపాలు భిన్నం. అవి విభిన్న ప్రక్రియలు. కొన్ని విషయాలు నవల, నవలిక ద్వారా చెప్పటం బావుంటే మరికొన్ని విషయాలు నాటిక, నాటకం ద్వారా చెబితే బావుంటుంది. ఇంకొన్ని విషయాలకి కవిత్వ ధోరణి బావుంటుంది. మరికొన్ని కథానికలుగా చెబితేనే శక్తిమంతంగా వుంటాయి. మిగతా సాహిత్య ప్రక్రియ ల్లాగానే కథానికకి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. చాలా మంది ఈ ప్రక్రియనే కథ అని పిలుస్తుంటారూ వాస్తవానికి కథకీ, కథానికకీ ఎంతో తేడా వుంటి. కథ వస్తుపర మయిందైతే కథానిక సంపూర్ణ ప్రక్రియ. మనం సినిమా చూసి కథ చెప్పవచ్చు, నాటకం చూసి, నవల చదివి కథ చప్పవచ్చు. అంటే కథ అనేది వస్తుపరమ యినదన్నమాట. ముందేమి జరుగుతుందో తెలుసు కోవాలనే ఉత్సాహాన్ని రేకెత్తించేదిగా, చదవాలనిపించేదిగా వుండాలి.

ఓ క్రమబద్ధమయిన నడక, ముగింపు ఆలోచింప చేసేదిగా వుండాలి. శిల్ప ప్రధానమయింది కథానిక. ఏక విషయం మీద ఏకాకలంలో సాగాలి. విషయాన్ని స్పష్టంగా చెప్పగలగాలి. చదువరి ఏ రకమయిన ఆలోచనలతో ఉన్నవాడైనా రచయిత తన రచన ద్వారా పాఠకున్ని తను ఆలోచించే ధోరణివైపు తిప్పుకునేటట్లుగా కథనం సాగాలి. అనవసరంగా ఏ పాత్రనీ ప్రవేశపెట్టగూడదు. ఒక వాక్యము ఉపయోగము లేనిది రాయగూడదు. తీసుకున్న విషయాన్ని లోతుగా కచ్చితంగా చెప్పగలగాలి. మరికొన్ని విషయాలు ఆలోచింపచేసేవిగా వుండాలి. కథానిక ఆధునిక జీవితం గురించి చెబుతూ, ఆధునిక భాషలో చెప్పినప్పుడే అది ఆధునిక కథానిక అవుతుంది.

భండారు అచ్చమాంబ, గురజాడ అప్పారావు, సుర వరం ప్రతాపరెడ్డి, చింతా దీక్షితులు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, గుడిపాటి వేంకటాచలం, ఆడవి బాపిరాజు, శివశంకరశాస్త్రి, (నీలకంఠం కథలు) శ్రీనివాస శిరోమణి మొక్కపాటి నరసింహశాస్త్రి, ముద్దా విశ్వనాథం, మల్లాది రామకృష్ణ శాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ ప్రభృతులైన తొలితరం రచయిత లెందరో కథానికా ప్రక్రియకు ఆకర్షితులయ్యారు. ఆ మార్గాన్ని సంపన్నమయమూ చేశారు. దీనికి ప్రధాన కారణం భండారు అచ్చమాంబ తెలుగు కథా ప్రక్రియకు కలిగించిన ఆకర్షణలే! తదాదిగా తెలుగులో ఎందరో రచయితలు కథానికను పోషిస్తూ పుష్టి చేకూర్చారు. సమకాలీన ప్రపంచ సాహిత్యంలో సముచిత స్థానాన్ని సముపార్జింపచేశారు. చలం తన మహోత్తమ సంవిధాన చాతురితో, నిప్పులు కురిసే శైలితో, సాంఘిక సంస్కరణా కాంక్ష ప్రజ్వలించే హృదయా రాటంతో, ఉత్తమ కథానికలు అసంఖ్యాయకంగా సృష్టించాడు. తన అపూర్వ పథానికి -శివశంకర శాస్త్రి, ముద్దుకృష్ణ, బుచ్చిబాబు, ధనికొండ హనుమంతరావు రావూరి భరద్వాజ వంటి వారెందరినో మళ్ళించాడు.

ఏ భాషా సాహిత్యమైనా నవనవోన్మేష శాలినిగా అల రారినప్పుడే దానిని సజీవ సాహిత్యమని పిలవగలుగు తాము. నన్నయ్య మొదలు చిన్నయ్య వరకూ తెలుగు సాహిత్యంలో అత్యధిక బాగం అంధానుకరణలో గుడిసుళ్ళు పడిపోయింది. వెనుక చూపుతో కొడికట్టింది. వర్తమాన ప్రజా హృదయానికి ప్రాతినిధ్యం కలిగించ లేకపోయింది. గతించిన పితృదేవతలకో, స్వర్గలోకంలోని దేవతలకో మాత్రమే సాహిత్యం కొలువుకూటంగా రూపొందింది. ఏవం విధ గతానుగతికత్వంతో ప్రాచీన సాహిత్యంలో అత్యధిక భాగం సజీవ సాహిత్య మనిపించు కుందుకే అనర్హమైపోయింది. సజీవత్వం ఎన్నడూ ద్రవ్యాత్మకాభివృద్ధికై ఆధారపడేది కాదు. గుణాత్మక ప్రాణోత్సవ మొక్కటే- దాని సజీవత్వాన్ని గణుతింప

చేస్తుంది. ఆ సత్యమే ఇవరయ్యో శతాబ్ది సాహిత్యంలో ధ్రువపడింది.

అయితే ఏ భాషా సాహిత్యంలోనైనా సర్వోత్తమ ప్రతిభా సంపన్న కంఠాలు బహుకొద్దిగా మాత్రమే ఉంటాయి. ప్రతిధ్వనులు అసంఖ్యాకంగా అయత్నమవుతూనూ ఉంటాయి. ఇది సహజమే! విశిష్ట ప్రతిభా శక్తితో సమకాలీన రసజ్ఞలోకాన్ని ఉర్రూతలూగించే కంఠాలే నిరంతరాయంగా అనుశ్రుతం కాగలుగుతాయి. తక్కువగత అసంఖ్యాక ప్రతిధ్వని మాత్ర రచనలు, తాత్కాలికంగా ముచ్చట కొలిపినా, గాలిమారేసరికి కాలగర్భంలో కలిసిపోతుంటాయి. ఈ సత్యం మనకు దఫదఫాలుగా దర్శనమిస్తునదే ! ఉష్ణమూ కాంతీ సమపాళ్ళలో తూగే చలంగారి కథలు- కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్ గార్ల తొలి కథలపై ఎంతో ప్రభావం కలిగించాయి. నాటి వరకూ వచ్చిన కథానికా సాహిత్యంలోని ఇతివృత్తాలను కొద్దిగా మార్చి, ఎదురైన సంవిధానాదులకే స్వల్పమైన సంస్కరణలు చేకూర్చి, కొత్త కథలు సృజించడంలోగల నిర్వీర్యతను గుర్తించగలిగారు కనకనే- కుటుంబరావు గోపీచంద్‌లు - తదుపరి కాలంలో ఉత్తమ కథకులుగా నిలిచిపోగలిగారు..సామాజిక వాస్తవికత, కళాత్మకత సాహిత్యసృజనకు ప్రధానం. కేవలం వాస్తవాలు చెప్పడం ద్వారానే ఏ రచనా రాణించదు. అదే విధంగా శిల్పనైపుణ్యం ప్రదర్శించినంత మాత్రాననే ఏ రచనా గొప్పది కాదు. ఈ రెండింటికీ సమప్రాధాన్యం లభించినప్పుడే ఒక రచన నిండుదనాన్ని సంతరించుకుంటుంది. చదివే పాఠకుని లోపలి ప్రపంచంలో కొత్త ద్వారాలు తెరుస్తుంది. ఒక రచనలో ఈ సమప్రాధాన్యం కనిపించాలంటే కళానైపుణ్యాలు తెలియడంతో పాటు జీవితంలోని కల్లోలాలకీ గల సామాజిక, ఆర్థిక, రాజకీయ, మలాలు ఎక్కడున్నాయో గ్రహించే నేర్పు రచయితకు అవసరం.

తెలుగు కథానిక సాహిత్యానికి నూరేళ్ళు దాటింది. అచ్చమాంబ రాసిన కథ 1901లో వచ్చినందువల్ల ఆమెను తొలి తెలుగు కథానికా రచయిత్రిగా గుర్తించవచ్చు. అదే విధంగా 1910లో గురుజాడ దిద్దుబాటు కథ రావడం వల్ల ఆయన్ను తొలి తెలుగు కథానికా రచయితగా గుర్తించవచ్చు. ఇందులో కథానికా లక్షణాలు, శిల్పం ఇత్యాది విషయాల ఆధారంగా గురజాడ దిద్దుబాటు కథనే మొట్టమొదటి కథానికగా విమర్శకులు భావిస్తున్నారు. అదే సమయంలో అచ్చమాంబ కథలో శిల్పం బలహీనంగా ఉందని వాదించినా ఆమె ప్రయత్నాన్ని కాదనలేరు. అందువల్ల ఆమెను మొదటి కథానికా రచయిత్రి అన్న స్థానం నుంచి తొలగించలేం. మాడపాటి హనుమంతరావు 1912లో రాసిన 'హృదయశల్యం' కథానిక మొదటి కథానికగా గుర్తిస్తే తెలంగాణా కథకుల్లో ఆయనే మొదటివాడు అవుతాడు. ఆయన రాసిన 'హృదయ శల్యం' మొదటి కథానిక అవుతుంది. అచ్చమాంబకు తెలంగాణాతో ఉన్న అనుబంధాన్ని ఆసరా చేసుకొని ఆమెను తెలంగాణా రచయిత్రిగా భావిస్తే ఆమె తెలంగాణా కథానికకు కూడా ఆద్యురాలవుతుంది. ఈ చర్చతో నిమిత్తం లేకుండా తెలంగాణా కథను పరిశీలిస్తే తెలుగు కథానికా సాహిత్యంలో తెలంగాణా కథానికకు విశిష్టస్థానం ఉందనడంలో విప్రతిపత్తి లేదు.

భండారు అచ్చమాంబ మొట్టమొదటి కథ రాయడం వెంకటశివుడు సంపాదకత్వంలో వెలువడిన 'తెలుగు జనానా' పత్రికలో 1898 జూలైలో 'ప్రేమ పరీక్షణము', 1898 సెప్టెంబరులో 'ఎఱువు సొమ్ము పరువు చేటు' పేరిట అచ్చయ్యాయి. ఈ విషయాన్ని స్వయంగా వెంకటశివుడు 1945లో హైదరాబాద్ నుంచి వెలువడ్డ 'తెలుగు తల్లి' కొమర్రాజు లక్ష్మణరావు స్మారక సంచికలో రాసిండు. అయితే ఇప్పటికీ 'తెలుగు జనానా' పత్రిక సంచికలు పూర్తిగా అందుబాటులో లేనందున ఇదే పత్రికలో 'మే'లో అచ్చయిన గుణవతియగు స్త్రీ మొట్టమొదటి కథగా స్వీకరించాల్సి ఉంటుంది. భండారు అచ్చమాంబ రాశారని తెలుస్తున్న మొత్తం 12 కథల్లో పది కథలతో నా సంపాదకత్వంలో 'భండారు అచ్చమాంబ-

తొలి తెలుగు కథలు' పుస్తకంగా వెలవడుచున్నది. ఇందులో 1.గుణవతియగు స్త్రీ, 2.లలితా శారదలు, 3.జానకమ్మ, 4.దంపతుల ప్రథమ కలహం, 5.సత్పా త్రదానము, 6.స్త్రీ విద్య, 7.ధనత్రయోదశి, 8.భార్యభర్తల సంవాదం, 9.అద్దమును సత్యవతియును, 10.బీద కుటుంబం. ఇందులో స్త్రీ విద్య, ధనత్రయోదశి రెండు కథలు మాత్రమే ఇంతవరకు తెలుగు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి.

మొసలికంటి రామాబాయమ్మ సంపాదకత్వంలో వెలువడ్డ 'హిందూ సుందరి' పత్రికలోనూ, పులుగుర్త లక్ష్మీనరసమాంబ సంపాదకత్వంలోని 'సావిత్రి' పత్రికల్లో అచ్చమాంబ రచనలు చాలా అచ్చయ్యాయి. ఇందులో 'అబలా సచ్చరిత్ర రత్నమాల' దేశవిదేశాల్లోని వీర, ధీర, వనితల ఉదాత్త చరిత్రల వ్యాస సమాహారం. అనాటి మహిళల్లో స్ఫూర్తి. రచనా ప్రేరణను కలిగించిందంటే అతిశయోక్తి కాదు. క్రోషా అల్లికలు మొదలు, వంటల వరకు అనేక విషయాలపై ఆయా పత్రికల్లో ఆమె రాసిన వ్యాసాలు ఇప్పటికీ అచ్చుకు నోచుకోలేదంటే తెలుగునాట మమిళల రచనలపై వెలుగు ప్రసరిస్తున్న తీరు తెలుస్తుంది.

తెలుగునాట పదులు కొలదిగా గల విశ్వవిద్యా లయాలు, స్వచ్ఛంద పరిశోధన సంస్థలు, మహిళాభివృద్ధి సంస్థలు, స్త్రీల కోసం పనిచేస్తున్న ఎన్జీవోలు భండారు అచ్చమాంబ కథలపై దృష్టి కేంద్రీకరించకపోవడం దురదృష్టకరం. తెలుగునాట పునర్వికాసోద్యమానికి 20వ శతాబ్ది ఆరంభం నుండి విస్తృతంగా పనిచేసిన అచ్చ మాంబ ఆంధ్రదేశంలో మొట్టమొదటి సారిగా 1901 బృందావనీ ఱుస్త సమాజాన్ని మచిలీపట్నంలో నెలకొలి పారు. ఆ మరుసటి సంవత్సరం అక్కడే కృష్ణాపత్రిక స్థాపించబడింది. ఇదే సమయంలో తెలంగాణాలో పునర్వికాసోద్యమానికి పునాదులు పడ్డాయి. అచ్చమాంబ తమ్ముడు కొమర్రాజు లక్ష్మణరావు పూనిక మేరకు హైదరాబాద్‌లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపించబడింది. హైదరాబాద్ నుంచి నాగపూర్, మద్రాసు, బొంబాయిలకు రైలు సదుపాయాలు విస్తృతం కావడంతో ఈ ప్రాంతాలకు రాకపోకలు తరచుగా జరిగాయి. వీటివల్ల అచ్చమాంబతో పాటు, తెలంగాణ తెలుగు సాహిత్యం పునర్వికాసాన్ని పొందింది.

అచ్చమాంబ రాసిన కథలన్నీ ఆధునిక భావాలతో పాత్రల సంభాషణలతో, సమాజాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రాసినవే. స్త్రీల చదువే సర్వ సమస్యలకు పరిష్కార మార్గమని నేటి 'పాపులేషన్ సిద్ధాంత' కర్తలు చెపుతున్న విషయాన్ని వందేళ్ళ క్రితమే ఆచరణకు ప్రయత్నించిన సాహసి అచ్చమాంబ. అటు బొంబాయి. ఇటు బిలాస్‌పూర్, నాగపూర్, హైదరాబాద్, మచిలీపట్నం, రాజమండ్రి, కాశి ఇలా అనేక ప్రదేశాలు తిరిగి తమ భావాల్ని ఉపన్యాసాలు, రచనలు, ఉత్తరాలు, పుస్తకాలు, ప్రయివేట్ టాక్స్ ద్వారా బముళ ప్రచారంలోకి తెచ్చిన ఆమె చైతన్యం ఆచరణ నేటికీ స్ఫూర్తిదాయకం.

అచ్చమాంబ రాసిన కథలన్నీ ఆధునిక భావాలకు వేదికలు. ప్రతి కథలోనూ సమాజోద్ధరణ, మహిళాభ్యు న్నతి, మెరుగైన సమాజం కోసం తహతహ ప్రతి అక్షరంలో ప్రత్యక్షమయ్యేవి. గుణవతియగు స్త్రీ కథలో పురాణ కథను తీసుకొని ఆధునికతను ఆపాదించి పాదుపు ద్వారా సంసారాన్ని స్వర్గంగా ఎలా మార్చుకోవచ్చో చెప్పింది. మూడు పేజీల ఈ చిన్న కథలో అన్ని వృత్తుల్లో అభినివేశం ఉన్నట్లయితే లోకాన్ని ఎలా జయించగలమో చెప్పింది. స్త్రీ సహజ సహనం గురించి ఆమె చెప్పిన తీరు బాగుంది. లలితాశారదలు అనే పిల్లల కథలో క్షమాగుణం ఎంతటి ఉదాత్తమైందో వివరించింది. అపకారికి సైతం ఉపకారం చేయడం, నైతిక విలువలకు సంబంధించిన గుణ పాఠాలు ఇందులో ఉన్నాయి. ఈర్ష్య, గర్వం ఉన్న మిత్రురాలిలో మార్పు తీసుకొచ్చిన తీరు అదర్శనీయం. ఇక జానకమ్మ కథలో అమ్మాయిలకు చదువు ఎప్పించా లనే నినాదాన్నిచ్చింది. చదువుకోవడం వల్ల మంచి జీవితమే గాదు, మంచి వరుడు గూడా వస్తాడని అనాటి

తల్లిదండ్రుల్లో చైతన్యాన్ని ఈ కథ ద్వారా కలిగించింది. చదువుంటే కట్నకానుకలు అవసరం లేదని 'స్త్రీవిద్య' ప్రాధాన్యతని వివరించింది. చిన్న చిన్న పొరపొచ్చాలు నిండు జీవితాలను ఎలా ఛిద్రపరుస్తాయో తెలుపుతూ దాన్ని ఎలా అధిగమించాలో తెలిపే కథ 'దంపతుల ప్రథమ కలహం', హైద్రాబాదు జీవితాన్ని కూడా ప్రస్తావించి నిజంగా అవసరమున్న వానికే దానం చేయాలని తన 'సత్పాత్రదానం' కథ ద్వారా చెప్పింది.

సంవాద రూపంలో ఉన్న 'స్త్రీవిద్య' కథలో భిన్న కోణాల్లో స్త్రీల చదువు ప్రాధాన్యతను వివరించింది. స్త్రీలు అజ్ఞానాంధకారంలో ఉన్నట్లయితే కుటుంబం ఉన్నతికి రాదనే బతికి చెడ్డ బిడ్డ మానసిక సంఘర్షణ, నిజాయితీ, నైతికత ఎన్నటికైనా మేలు చేకూరుస్తుందని చెప్పింది. దారిద్ర్యంలో ఉన్నప్పటికీ ఉన్నత గుణాలను విడువ కూడదని కథ ద్వారా చెప్పింది. భార్యభర్తల సంవాదం కథలో స్త్రీలకు బంగారు ఆభరణాలకన్న సద్గుణాలే మిన్న అనే భావనను బలంగా చిత్రీకరించింది. నిజంగా జరిగిన వృత్తాంతాన్ని తీసుకొని బీదకుటుంబం కథ ద్వారా స్త్రీ ద్వారానే కుటుంబం యొక్క పరువు మర్యాదలు నిలబడతాయని చెప్పింది. గౌరవం కూడా ఆమె వల్లనే దక్కుతాయనే విషయాన్ని ఇందులో వివరించింది. 20వ శతాబ్ది ఆరంభంలో తన కథల ద్వారా తెలుగు సమాజంలో ముఖ్యంగా మహిళల్లో ఆమె చెరగని ముద్రవేశారు. ఆనాడు చదువుకున్న ప్రతి స్త్రీ ఏ ప్రాంతం వారైనా ఆమె ప్రభావానికి గురయ్యారంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఆమె కార్యాచరణ, వాక్చాతుర్యం వీటికి తోడు భిన్న ప్రదేశాల్లో వివిధ సభలు సమావేశాల్లో పాల్గొనడం ద్వారా ఒకరిగా కలిసిపోయారు.

వీటిన్నంటితో పాటు పట్టించుకోవాల్సిన మరో ప్రధాన విషయం అచ్చమాంబ ప్రాంతం. అచ్చమాంబను ఏ ఒక్క ప్రాంతానికి పరిమితం చేయలేము. ఎందుకంటే ఇప్పటి నల్లగొండ జిల్లాలోని, ఒకప్పటి కృష్ణాజిల్లాలోని మునగాల పరగణా మేనేజరు కొమర్రాజు వెంకటప్పయ్య-గంగమ్మల సంతానంగా ఆమె పుట్టింది. అయితే ఆమె ఎక్కువభాగం జీవితం గడిపింది తెలుంగాణాలో. రాజా నాయని వెంకటరంగారావు ప్రభావం ఆమెపై ఎక్కువగానే ఉండింది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకున్నట్లయితే ఆవిడపై మిగతా ఏ ప్రాంతంతో పోల్చుకున్నా తెలంగాణ వారికే ఎక్కువగా హక్కుంది. అచ్చమాంబ మూలాలు మాత్రం ఆంధ్ర ప్రాంతంలోనే ఉన్నాయి. 1874లో అచ్చమాంబ తాత (తల్లి-తండ్రి) వ్యాపారలావాదేవీల కారణంగా నందిగామలో ఉండిపోయారు. వీరితో పాటు గంగమ్మ కూడా అక్కడే ఉండడంతో అచ్చమాంబ నందిగామలో జన్మించింది. అయితే అచ్చమాంబ ఆరేండ్ల వయసులోనే తండ్రి చనిపోవడంతో వారి మకాం సవతి తల్లి కొడుకు కొమర్రాజు శంకరరావు దగ్గరికి మారింది. అప్పుడాయన. ఉద్యోగ రీత్యా నల్లగొండ జిల్లా దేవరకొండలో ఉండేవారు. దీంతో ఈసారి పూర్తిగా ఆమె నల్లగొండ వాసిగా మారారు. ఇక్కడున్న సమయంలోనే ఓనమాలు నేర్చుకున్నారు. మేనమామ భండారు మాధవరావుతో వివాహం కూడా ఇక్కడే 1884లో జరిగింది.

వివాహం తర్వాత ఆమె మకాం విదర్భకు మారింది. అక్కడ తమ్ముడితో పాటు నాగపూర్, బిలాస్‌పూర్‌లలో విద్యాభ్యాసం జరిగింది. ఇక్కడున్న కాలంలోనే గుజరాతీ, మరాఠీ, తెలుగు, హిందీ భాషలు నేర్చుకుంది. ఆయా భాషల్లోనే అపారమైన సాహిత్యాన్ని తమ్ముని తోడ్పాటుతో చదవడానికి వీలయింది. భర్తతో పాటుగా ప్రతి సంవత్సరం తెలుగు ప్రాంతమంతా పర్యటించి ఉపన్యాసాలు, సభలు, సమావేశాలు నిర్వహించేది. బొంబాయి లాంటి ప్రాంతాల్లో సోదరుడు మునగాల జమిందారీలో ఉద్యోగం చేస్తూ ఆంధ్ర-తెలంగాణ- మద్రాసు ప్రాంతాల్లో సమానంగా సాహిత్య ప్రచారాన్ని, సాంస్కృతిక పునర్వికాసానికి పునాదులు వేయగా, మరోవైపు అచ్చమాంబ మహిళ లోకంలో తిరుగులేని మార్పుల్ని తీసుకువచ్చింది.

తన కథల ద్వారా సమాజంలో మార్పులు తీసుకురావడానికి విశేషమైన కృషి చేసిన భండారు అచ్చమాంబ గురించి ఈనాడు ఏ పాఠ్యపుస్తకంలోనూ ఆమె గురించి

లేదు. కేవలం కథలే గాకుండా అబలా సచ్చరిత్ర రత్నమాల పేరిట తెలుగులో మొట్టమొదటిసారిగా మహిళల జీవిత చరిత్రల్ని రాసింది. క్రోషా అల్లిక, వంటలు, కుట్లు వంటి మహిళలకు సంబంధించిన విషయాల్ని పట్టించుకొని వాటి ప్రచారానికోసం తన జీవితాన్ని వెచ్చించారు. కేవలం రాతలకే పరిమితం గాకుండా ఆచరణలో అనాథ పిల్లల్ని ఆదుకున్నారు. తనకు పుట్టిన పిల్లలు దక్కలేదు. దాంతో ఆవిడ అనాథ పిల్లల్లోనే తన పిల్లల్ని చూసుకుంటూ వారి బాగోగుల్ని పట్టించుకునేవారు. 1904 చివర్లో బిలాస్‌పూర్ ప్లేగు వ్యాధి వచ్చిన సందర్భంలో అనాథ పిల్లల్ని చేరదీసి వారి ఆలన పాలన చూశారు. పిల్లల నుంచి ఆ వ్యాధి ఆమెకు సోకి వారి సేవలోనే 1905 జనవరిలో అచ్చమాంబ మరణించారు. కేవలం 30 ఏండ్ల జీవితంలోనే కొన్ని వందల సంవత్సరాలకు సరిపడా కృషిని, ఆచరణను మనందరికి అందించిన అచ్చమాంబ ఆశయాలను అమలు పరచడమే ఆవిడకు నిజమైన నివాళి.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చైనా దేశపు 'కాల విజేత'

– డా॥. వెల్దండి శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్, జి. రంగారెడ్డి.

గత రెండు సంవత్సరాలుగా చైనా దేశపు పేరెత్తితేనే ప్రపంచ మానవుని గుండెలో మందుపాతర పేలినంత అలజడి కలుగుతోంది. చైనాలో పుట్టి ప్రపంచ వ్యాప్తమైన కరోనా వైరస్ భూమి మీద మనిషి ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. భూమి మీద జనాభా విపరీతంగా పెరిగి, భూగోళం బరువు పెరిగిపోయిన సందర్భంలో ఇలాంటి ఉపద్రవాలు మానవవాళిని మృత్యుముఖంలోకి నెట్టి వేయడం సాధారణమే అయినా ఇవాళ ప్రతి మనిషి ముఖం మీద మరణ విషాదం అలుముకుంది. ఇలాంటి విషాద వాతావరణంలో కూడా మనిషిని గెలిపించేవి రెండే ఒకటి కాలం. రెండవది కవిత్వం.

ఆంగ్ల సాహిత్యం తరువాత తెలుగులోకి రష్యన్ సాహిత్యం అనువాదమైనంతగా ఇతర ఏ దేశ సాహిత్యమూ అనువాదం కాలేదంటే అతిశయోక్తి కాదు. చైనా సాహిత్యమైతే మరీ తక్కువ. ఒకప్పుడు 'సోవియట్ భూమి' పేరుతో ఒక రష్యన్ తెలుగు అనువాద మాసపత్రికనే వెలువడేదంటే ఇప్పటి తరం నమ్మక పోవచ్చు. ఈ పత్రిక రష్యా, భారతదేశం మధ్య ఒక గొప్ప సాంస్కృతిక వంతెనను నిర్మించి ఆగిపోయిందంటే ఇప్పుడు నమ్మలేం. నిజానికి అనువాదాలు గొప్ప సాంస్కృతిక వారధులు. ప్రపంచశాంతికి ఎగరేసిన శాంతి పావురాలు. 'హిందీ - చీనీ భాయి భాయి' అని ఎప్పటి నుండో అనుకుంటున్నా 1962 చైనా - భారత్ యుద్ధం నుండి రెండు దేశాల మధ్య ఏదో పల్చని అపనమ్మకపు తెర పర్చుకుని ఉంది. కాని జనాభా పరంగా ప్రపంచంలోనే రెండు అగ్రదేశాల నడుమ ఉండాల్సింది సుహృద్భావ వాతావరణం. ఈ పనిని కొంత క్రీడాకారులు, సినిమా తారలు, కవులు, రచయితలు చేస్తుంటారు. ఆ కోణంలో ఇటీవల డా॥ ఎన్. గోపి అనువాదం చేసిన 'కాల విజేత' ఒక మేలిమలుపు. ఇది చైనా కవితల సంపుటి. దీని మూల రచయిత సుప్రసిద్ధ చైనా కవి జీది మాజా.

ప్రపంచ వ్యాప్తంగా మత పరంగా, జాతి పరంగా, కుల పరంగా, భాష పరంగా, ప్రాంతం పరంగా, తెగ పరంగా ఇంకా అనేక అస్తిత్వాల పరంగా ఇప్పుడు ఒక మైనార్టీల కాలం నడుస్తోంది. ఆఫ్రికన్ రచయిత గుగీ వాథియాంగో నుంచి చైనా రచయిత జీది మాజా దాకా వారి రచనలను పరిశీలిస్తే ఈ విషయం మరింత స్పష్టమవుతుంది. జీది మాజా చైనాలోని 55 ఆదివాసీ తెగల్లో ఒకటైన 'యీ' అనే మైనార్టీ తెగకు చెందినవాడు. ఈ తెగ జనాభా 90 లక్షలు మాత్రమే. ఈయన చైనాలోని సిచువాన్ ప్రాంతంలో 1961లో జన్మించాడు. 1986లోనే జీది మాజా తాను రాసిన 'ది సాంగ్ ఆఫ్ మై ఫస్ట్ లవ్' అనే కవితా సంపుటికి మూడవ చైనా నేషనల్ పోయెట్రీ అవార్డును గెల్చుకున్నాడు. అంతేగాక రష్యా, బల్గేరియా లాంటి దేశాల నుండి అనేక అంతర్జాతీయ బహు మతులను పొందాడు. ప్రస్తుతం జీది మాజా 'చైనా మైనార్టీ లిటరరీ అసోసియేషన్'కు అధ్యక్షుడిగాను, 'చైనా పోయెట్స్ అసోసియేషన్'కు శాశ్వత ఉపాధ్యక్షుడిగాను ఉన్నాడు. 1980ల నుండి మొదలుకొని ఇప్పటి దాకా 'ది డ్రీం ఆఫ్ ఎ యీ నేటివ్', 'ది సన్ ఇన్ రోమ్', 'ది బురీడ్ వర్డ్', 'ఫ్లేమ్స్ అండ్ వర్డ్', 'టైం' లాంటి అనేక కవితా సంపుటాలు వెలువరించాడు. జీది మాజా కవిత్వం అనేక అంతర్జాతీయ భాషల్లోకి అనువాదం అయింది. ఎష్ట్రవ జుఅనబతీఱఅస్త్ర రాఅవ (చైనా కవితలు)ను డెనిస్ మేయర్ ఆంగ్లంలోకి అనువాదం చేయగా డా॥ ఎన్. గోపి 'కాల విజేత' పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు. చైనాది 'చిత్రలిపి'. సింధూ నాగరికత నాటి మన చిత్ర లిపిని గుర్తుకు తెస్తుంది. ఈ 'కాల విజేత' కవితా సంపుటిలో మొత్తం 103 పద్యాలున్నాయి. ఇవి శతక

పద్యాల్లాగా ముక్తకాలు. ఏదో మధురమైన భావనను మనకు అందించి వేటికవి విరిగిపోయేవి. ఒకే పేజీలో మూల చైనా చిత్రలిపిలో ఉన్న పద్యాన్ని, దాని ఇంగ్లీష్ అనువాదాన్ని, తెలుగు అనువాదాన్ని మూడు భాషల్లో ఇచ్చారు. తెలుగు అనువాద గ్రంథాల్లో ఇదొక సరికొత్త ప్రయోగం. చైనా చిత్రలిపి మనకు అర్థం కాకున్నా దూరంగా నిల్చున్న అపార్ట్‌మెంట్లలాగా కనిపిస్తూ తమ లోతును కనుక్కోమంటాయి.

"నా హృదయం చుట్టూ గాయాల మచ్చలే
అయినా ఈ లోకాన్ని
చిరునవ్వుతోనే ఎదుర్కొన్నాను
అప్పుడే కాలం ధ్వనులను విని వుంటే
బహుశా నా ఆనందానికి కీలకం లభించేదేమో!"

ఈ లోకపు తెర మీదికి వచ్చినప్పటి నుంచి నుదిటి మీదికి ముదిమి ముడతలు వచ్చేదాకా జీవితంలో ఎన్నో సార్లు కిందపడతాం. గాయపడతాం. ప్రతి గాయం ఏదో ఒక కొత్త అనుభవాన్ని మిగిల్చేదే అయినా దాని మచ్చలు మాత్రం తనువు మట్టిలో కలిసే దాకా ఉంటాయి. వెంటాడుతాయి. మనసు అద్దం మీద ఎవరో మాటల రాళ్లు విరిసినపుడు ఆ ధ్వనులను విని బహుశా ఎవరి ఇష్ట ప్రకారమో జీవించడం అలవాటు చేసుకుంటే ఇన్ని గాయాలు కాకపోవునేమో! అంతేగాక ఆనందపు అంచులు రుచి చూసి ఏవో సరికొత్త లోకాల్లో విహరించేవారమేమో! కాని వెన్నెముక ఉన్నవాడెవ్వడూ ఎవరి ముందో వంగి, లొంగి ఉండడు కదా! అందుకే ఇన్ని గాయాలు, ఇన్ని మచ్చలు.

"మొదటి నుంచీ
నేను నా కోసం జీవించిన వాణ్నికాదు
అందుకే దూరదృష్టితో
నైతిక ఖడ్గాన్ని చేతబట్టాను
దానిని నా హృదయంలోనే ఉంచుకున్నాను"

ఈ జీవితం నాదేనని సంబరపడుతాం కాని నిజానికి 'పరోపకారార్థం ఇదం శరీరం'. నైతిక ఖడ్గాన్ని హృదయంలో దాచుకున్నవాడు కచ్చితంగా విలువల రేఖ మీదనే జీవిస్తాడు. ఒక్కసారి గీత దాటితే ఇక అంతా అనైతికమే. అన్ని హద్దులకు తిలోదకాలిచ్చి ఇష్టం వచ్చినట్లు జీవించడం మొదలుపెడుతాం. ఇంతగా దిగజారి భోగాలసి వెంట, సుఖాలనుకునే వాటి వెంట జీవితాంతం పరిగెత్తిన తర్వాత చివరకి మిగిలేది శూన్యంలాంటి బూడిద. అందుకే విలువల మీద బతకడం కత్తి మీద సాములాంటిదే. ఎవరి జీవితంలోకైనా అన్యాక్రాంతంగా ప్రవేశించే ముందు ఒక్కసారి ఇది నైతికంగా సరైనదేనా అని ఒక్కసారి ఆలోచిస్తే ఎన్నో సమస్యలు ఉత్పన్నమే కావు. ఎవరి జీవితాన్ని వారు వెలిగించుకునే అవకాశం ఇవ్వాలి. అప్పుడే ప్రపంచ శాంతి వర్ధిల్లుతుంది. దీని కోసం వేదికలెక్కి ఉపన్యాసాలివ్వడమో, ఆధ్యాత్మిక ప్రసంగాలిస్తూ, వ్యాసాలు రాయడమో, యజ్ఞాలు, యాగాలు, యోగాలు, ధ్యానం చేయనక్కరలేదేమో. ఒక్కసారి వెనక్కి వెళ్లి శాంతంగా ఆలోచించాలి.

"నేను పుట్టినప్పుడు మా అమ్మ
నాకు మంచి నీళ్లతో స్నానం చేయించింది
నేను మరణించినప్పుడు కూడా
ఎవరో ఒకరు నా శవం మురికిని శుభ్రంగా కడిగేస్తారు
సుందరమూ మలిన బంధురమైన ఈ లోకం
క్షణభంగురమైన జలబిందు సదృశ్యం"

మనిషి పుట్టుక వెనుక, మరణం వెనుక ఉన్న తాత్త్వికతను మనం ఇంకా మనసుకు పట్టించుకోలేదు. (కరోనా వల్ల కొంత బోధపడిందేమో!) నీటిబుడగ వంటి జీవితం చుట్టూ ఎన్నో అల్లుకుంటాం. బంధాలు, బరువులు, బాధ్యతలు, ప్రేమలు, ద్వేషాలు, కోపాలు, తాపాలు, గర్వం, అహంకారం.. అన్నీ ఒకనాటికి మట్టిలో కలిసిపోవాల్సిందే కదా! ఈ విషయాన్ని మరిచిపోయి ఎంతో విర్రవీగుతాం. ఎన్నో పేకమేడలు కట్టుకుంటూ పోతాం. అంతిమయాత్రలో ఈ నేల నుండి ఒక్కటంటే ఒక్క రేణువును కూడా తీసుకుపోలేం కదా! ఈ మాత్రం స్పృహ లేకుండా మరి ఎందుకింత మిడిసిపాటు. జీవితం,

చావుల వెనకగల ఈ అంతర్యం తెలిసిన వాడే నిజమైన మనిషి. ఈ ఎరుకను కలిగించేదే అసలైన కవిత్వం.

"అసంఖ్యాక వస్తువులు పుడుతాయి, గిట్టుతాయి
జీవితానికీ మృత్యువుకూ
తలుపులెప్పుడు తెరిచే వుంటాయి
అందరిలాగే నేనూ ఈ లోకంలో
ఆత్మత్రయాన్ని వదిలిపెట్టి వెళ్లి పోలేను
కాని వాటిలో ఒకటి మాత్రం
కవిత్వాన్ని వల్లిస్తూనే ఉంటుంది
తరతరాలుగా!"

ఈ నేల మీదికి యుగాలుగా కోటానుకోట్ల మంది వచ్చారు, వెళ్లారు. కాని ఏ కొంత మందినో మాత్రమే గుర్తు పెట్టుకున్నాం. చావడానికైనా, జీవించడానికైనా తలుపులెప్పుడూ తెరిచే ఉంటాయి. జీవాత్మ, పరమాత్మలో కలిసిపోయాక, దేహం మట్టిలో ఇమిడిపోయాక ఒక శకం ముగిసిందనుకుంటాం. కాని కవిత్వపు ఆత్మ మాత్రం కవిత్వాన్ని వల్లిస్తూ ఇక్కడే ఉండిపోతుంది. కవి మరణించవచ్చుగాక అతడు రాసిన గేయమో, మెదడుకు విద్యుత్‌ను ప్రసరింపజేసే ఒక వాక్యమో ఎప్పటికీ ఈ నేల మీద సజీవంగానే ఉంటుంది. అందుకు ప్రబల నిదర్శనం ఇప్పటికీ మన నోళ్లలో నానుతున్న పద్యాలు, గేయాలు, కవితా వాక్యాలే. వస్తువులు పుడతాయి, గిడతాయి కాని కదిలించే కవిత్వం మాత్రం ఈ నేల మీద మనిషితోపాటు ఎప్పటికీ బతికే ఉంటుంది.

"ఈ లోకంలో ఏ మంత్రోచ్ఛాటనలూ మిగలవు
ఎందుకంటే మనిషిని మనిషి చంపడం
ఇంకా సాగుతూనే ఉంది
ఈ మట్టి ముందు నేను తలవంచుతాను
నీ చెవిలో నేను నీకు చెప్పేది ఒక్కటే
"ద్వేషాన్ని వదిలెయ్యి"

మనిషి సుఖజీవనానికి, ప్రశాంత జీవితానికి భరత భూమి ఎన్నో శాంతి మంత్రాలు ప్రబోధించింది. కాని అవేవీ ఇప్పుడు మిగలలేదు. మనిషిని మనిషి దారుణంగా చంపేసే కాలమొకటి వచ్చింది. మానవత్వం ఎక్కడో జారిపోయి ఇప్పుడు కేవలం రాక్షసత్వమే రాజ్యమేలుతోంది. స్వార్థం వల్లనో, రూపాయి మీద యావ వల్లనో మనిషి ఎటువంటి దుండగానికైనా వెనుదీయడం లేదు. ద్వేషాన్ని వదిలెయ్యిమని సనాతన ఆధ్యాత్మిక గ్రంథాలు ఎన్ని విధాల చెప్పినా మనిషి మరింత రెచ్చిపోయి హింసకు పాల్పడుతున్నాడే కాని శాంతిని నెలకొల్పడం లేదు. మనం జీవిస్తూ పక్కవాడికి కూడా జీవించే అవకాశం ఇవ్వాలనే కనీస సహనం ఏ మనిషికీ ఉండడం లేదు.

అందుకే ఆధునిక జీవనం చెప్పలేనంత సంక్లిష్టమై క్రమంగా మనిషి ఉనికికే ప్రమాదం వాటిల్లుతుంది. మానవ జాతి తాను తోడుకున్న గోతిలో తానే పడి అంతమవుతోన్న దుర్భర సందర్భం.

ఏ భాషా సాహిత్యమైనా మరో భాషలోకి అనువాదం చేయడానికి లొంగదు. కాని అనువాదం చేసేవారి ప్రతిభా, వ్యుత్పత్తి, అభ్యాసాలను బట్టి కొన్నిసార్లు అది సులభమవుతుంది. డా॥ ఎన్. గోపి చేసిన ఈ 'కాల విజేత' అనువాదం నూటికి నూరు పాళ్లు అలాంటి ఒక విశిష్టమైన అనువాదం. మూల భాషా కవి చేసిన అనేక సాహిత్య, సాంస్కృతిక, భాషా పరమైన నేటివిటీని, ప్రయోగశీలతను, ఆ మర్యాదలను అనువాద భాషలోని

నేటివిటీకి తగ్గట్టుగా మూల భావనలకు ఎలాంటి అన్వయ దోషం లేకుండా చేయడం నిజానికి అనువాదకుడికి సవాలు. ఇందులో డా॥ ఎన్. గోపి ముప్పాతిక ముప్వీసం కృతకృత్యులయ్యారు. మూల భాషలోని ఆ వాతావరణాన్ని, ఆ భావవీచికల్ని లక్ష్య భాషలోకి ఉన్నది ఉన్నట్లుగా తీసుకురావడంలోనే అనువాదకుడి శక్తి, సామర్థ్యాలు బయట పడుతాయి.

"If the day ever comes when this world
Finally recognizes my value
Darkness will pass out of my wounds
And at last I can be part of the light"

"ఈ లోకం
నా విలువను గుర్తించే రోజొస్తుంది
నా గాయాల మీంచి చీకటి తొలగిపోతుంది
ఆఖరికి నేను వెలుగులో భాగమైపోతాను"

అనువాదం ఎంత సహజంగా అమరిందో పై రెండు ఉదాహరణలను చూస్తే అర్థమవుతుంది. ఇందులోని అన్ని పద్యాలు ఇలాగే మాతృకకు దూరం జరగని విధంగా అనువాదం చేసినవే. జీది మాజా మన రవీంద్రనాథ్ ఠాగూరులాగే ప్రకృతి ప్రేమికుడు. 'గీతాంజలి'లాగే ఈయన కవితలు కూడా చోమోలుంగ్మా పర్వతమంతటి సమున్నతమైనవి. అనువాదం కూడా దానికి తగ్గట్టుగా సాగిపోయింది. జీది మాజా ఉపమానాలన్నీ ప్రకృతి సంబంధమైనవి లేదా ప్రకృతిలోంచి తీసుకున్నవి. కవితా వస్తువు విశ్వమానవాళికి చెందినది. 'యీ' గిరిజన తెగకు చెందిన మైథాలజీ చుట్టూ, వాళ్ల సాంస్కృతిక వారసత్వం చుట్టూ జీది మాజా కవిత్వం విస్తరించి ఉంటుంది. ప్రతి పాదంలో అంతర్లీనంగా ఒకానొక జీవిత తాత్వికత తొంగి చూస్తుంటుంది. ఈ కవిత్వాన్ని చదివిన ప్రతిసారి ఏదో కొత్త కోణం కనిపిస్తుంటుంది. గొప్ప కవిత్వానికి ఉండే లక్షణాల్లో ఇదొకటి. చూడ్డానికి చాలా సాధారణ కవిత్వం లాగే తోస్తుంది. కాని ఒక్కో అక్షరాన్ని పట్టుకొని లోలోపలికి దిగుతుంటే కవిత్వ మూలాలు, మానవ మనస్తత్వ మూలాలు గోచరమవుతాయి. జీది మాజా కవిత్వం 'డిపోయ్యమో' నది అంతటి అందమైనది. అక్కడి పర్వతసానువుల్లాగే ఆయన కవిత్వం ఎంతో ఉదాత్తంగా కనిపిస్తుంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సీతా సంసేవితం 'త్రిజట' స్వప్నం

– డా॥. ఖి. త్రివేణి, అసోషియేట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

"పేరుకు రాక్షసి గాని త్రిజట పరమ సాత్వికురాలు; సాధ్వి, వృద్ధ, ప్రబుద్ధ, జ్ఞాన స్వరూపిణి. అశోకవనంలో శోకతప్త సీతను కంటికి రెప్పలా కాపాడ్డానికి నియుక్తు రాలైన త్రిజటలో గాయత్ర్యంశ ఉంది. "త్రిజటా తిత్తిరీ తృష్ణా త్రివిధా తరుణాకృతి" అని దేవీ భాగవతంలో పేర్కొన్నట్లు త్రిజటా శబ్దం గాయత్రీ దేవికున్న సహస్ర నామాల్లో ఒకటి. గాయత్రీ మంత్రాధిష్ఠానమైన పర బ్రహ్మమే శ్రీరాముడు." (పుట.14)

ఇవి తెలంగాణ రాష్ట్ర ముఖ్య సలహాదారులు మరియు విశ్రాంత సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారి డా॥ కె.వి. రమణాచారి గారు త్రిజట పద్య కావ్యానికి నుడివిన హృద్య వాక్యాలు. ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారి ఆత్మజ్ఞాన యోగిత్వం, మనోనిశ్చలత్వం, నిగూఢార్థ అవలోకనం, భక్తి ప్రతిపాదితా భావనం వంటి ఉత్తమ గుణాలు త్రిజటలో ప్రదర్శితమైనాయి.

త్రిజట స్వప్నం రామాయణ పరమోన్నత్యాన్ని తెలుపు తుంది. రామతత్త్వ వైశిష్ట్యాన్ని వెల్లడిచేస్తుంది. అద్భుతమైన స్వాప్నిక వృత్తాంతం ఇది. దైవిక చింతనలో శాశ్వత కీర్తి దాయకంగా నిలుస్తుంది. సుగుణ శోభిత మృదు మనోహర శ్రీ రాముడిని ఈ స్వప్నం ధీరోదాత్తుడిగా వర్ణి స్తుంది. స్వప్నంలో కనిపించిన శ్రీరాముడి విజయ సంకేత సూచిక శిష్ట జనోద్ధరణకు నాంది పలుకుతుంది. త్రిగుణా తీతమైన ఆత్మ నందేశాన్ని వ్యాపితం చేస్తుంది. భవిష్యద్దర్శన క్రాంతి రేఖా స్రవంతిగా ప్రకాశిస్తుంది. శ్రీరామ స్మరణ మనోభిరామంగా త్రిజట స్వప్న భావన రూపుదిద్దుకుంది. రఘురాముడి ప్రసన్న వదనం ద్వారా స్వప్న నిర్దేశం నిర్వేద రహితమైంది. త్రిజట మనోస్థితి, చిత్తవృత్తి స్వప్న సిద్ధాంతాన్ని పరిపుల్లం చేసింది. నిష్కల్మష హృదయం అంతరిక భావ పరంపరలను సమైక్యపరిచింది.

త్రిజట ఆదిదైవిక ఆత్మచింతన కలది. శ్రీ సీతారామ లక్ష్మణులను శ్వేత మాల్యాంబర ధారులుగా సంచరించే దృశ్యం ఆలంకారిక కృత్యంగా వర్ణింపబడింది. ఈ ఉపమానం గాయత్రీదేవీ శ్వేత వర్ణ పూజితంగా వెలు గొందింది. స్వప్నంలో దర్శితమయ్యే వేయి హంసలు, చతుర్దశ మహాగజం, వృషభం వంటివి గాయత్రీ మంత్రాధి దేవత అనుష్ఠాన వాహనాలు. ఇవి త్రిసంధ్యలందు సంచరిస్తూ సృష్టి, స్వయం సంతృప్తికి గమకాలుగా నిర్దేశింపబడుతున్నాయని ఉత్తమోత్తమ పండితుల ఉద్బోధ.

త్రిజట పద్యకృతిలో మూలాంశాల విశ్లేషణ :

1. త్రిజట స్వప్న వృత్తాంతం - సీతాదేవి సంరక్షణం
2. త్రిజట రామతత్త్వ నివేదనం - సమరస మనోజ్ఞం
3. త్రిజట మానవీయ ప్రదర్శనం - త్రిగుణాతీతం
4. త్రిజట స్త్రీత్వ భావనాత్మకం - అస్తిత్వ ప్రాధాన్యం
5. త్రిజట భక్తి ప్రబోధనం - రాక్షసజాతి ముక్తిదాయకం

జన్మకారక సిద్ధాంతం :

ఆచార్య అనుమాండ్ల భూమయ్య త్రిజట పద్యకృతి ఆరంభంలోనే జన్మ సిద్ధాంతాన్ని ప్రవచించారు. త్రిజట తాను పొందిన రాక్షస జన్మకు చింతా మనస్కురాలై వ్యధ చెందిన సన్నివేశం ఈ కావ్యంలో ప్రతిఫలిస్తుంది.

ఎరుగ రాక్షస జన్మ ఇదెట్లు కలిగె?
జన్మ ఏదైన నేమి? ఈ జన్మ నిట్లె
స్వీకరించెద దైవమిచ్చిన ప్రసాద
మట్లె; ఇంత రాక్షస జన్మకంతమెపుడొ! (పుట.43)

దేవతలు, రాక్షసులు, మానవులు సమస్త లోకంలో సృష్టింపబడడం సహజం. రాక్షస జన్మను పొందిన త్రిజట అత్యంత దైన్యాన్ని ప్రదర్శిస్తుంది. కృతయుగంలో తాను ఒక రాక్షసిగా జన్మపొంది, జన్మకారక నైరాశ్యాన్ని అనుభ

విస్తుంది. సేవా తత్పరతతో పాటు, పరోపకారక ప్రయోజనం కోసం త్రిజటను అనుమాండ్ల భూమయ్య సృష్టించాడని భావించవచ్చు. ఈ ప్రకారంగానైనా త్రిజట జన్మ సార్థకం కాగలదని ఆయన నిర్దేశం. అటువంటి సందర్భంలోనే సీత జాడ కోసం వెదుకుతూ వచ్చిన హనుమంతుడిని ప్రవేశపెట్టారు. శ్రీరామ చంద్రుడు ఇచ్చిన రాజముద్రికను తీసుకొని సుగ్రీవుడు ఆజ్ఞానుసారం లంకాపురంలోకి అడుగుపెట్టిన హనుమంతుడి శ్రీరాముడిపై గల దాసభక్తిని వెల్లడించారు.

రావణుడి కామభావం :

అంతలోనే రావణాసురుడు తాను అపహరించి తీసుకొచ్చిన సీతను వశపరుచుకోవడం కోసం అశోక వనానికి చేరుకున్నాడు. కామభావం కలిగి సీత హృదయం చూరగొనాలనే తలంపుతో మాయ ప్రేమను నటించి వగల మాటలు పలుకుతాడు. కాని సీత ఆ మాటలను గడ్డిపరకలాగా భావించి అతనిపై క్రోధం ప్రకటిస్తుంది. ఈ పరిణామంతో రావణుడు సీతపై నిప్పులు చెరిగి రెండు మాసాల గడువును నిర్ణయిస్తాడు. రాక్షస కామ ప్రవృత్తిని ప్రదర్శించే సందర్భంలో ''నన్ను చేరు మీలోన, కాకున్న నిన్ను చంపి తిందు'' అని హెచ్చరిస్తాడు. రక్షణగా ఉన్న రాక్షస స్త్రీలను బెదిరించి సీతను భయపెట్ట వలసిందిగా పురమాయించి ఆగ్రహంతో నిష్క్రమిస్తాడు. అక్కడే ఉన్న త్రిజట రావణుడి కాముక ప్రదర్శనను అసహ్యించుకుంటుంది. చిరాకు పడుతుంది. రావణుడే స్వయంగా సీతకు కాపలాగా త్రిజటను నియోగించాడు. కాని మనస్తత్వం, మంచితనం, సత్ప్రవర్తన, గుణశీలత, హృదయ వైశాల్యంలో త్రిజట దైవిక తత్వం ఉన్నతంగా భావిస్తుంది. కవి భూమయ్య త్రిజటలో మానవీయ కారుణ్యతను ప్రదర్శించారు. సీతా సంరక్షణ దిశగా త్రిజట కార్య నిర్వహణ భావ సందోహం ఏర్పడడం ఈ కావ్యంలో అద్భుతంగా దృశ్యమానమవుతుంది.

ఇక రావణాసురుడి ఆజ్ఞానుసారం సీతను పదే పదే బెదిరిస్తూ, రావణుడి పరాక్రమాన్ని పొగుడుతూ, భీకర ధ్వనులు చేస్తున్న రాక్షస స్త్రీలను తిరస్కరిస్తుంది. ఏమాత్రం అధైర్యపడదు. మనోస్థైర్యం, హృదయ నిబ్బరం ఉన్నా సుకుమారత్వం ఆమెలో ఎక్కువ. సీత సుగుణవంతురాలు.

త్రిజట స్వప్న సందేశం :

అందుకే అప్పటి వరకు నిద్రిస్తున్న త్రిజట మేల్కొని, సీతపై పరుష దూషణాలతో చెలరేగిపోతున్న రాక్షస స్త్రీలను నిలువరించి హితవు పలుకుతుంది. రాక్షక జాతికి ఎటువంటి చేటు జరుగబోతుందో తెలుపుతుంది. సీత పూర్వ వైభవాన్ని రాక్షకసాంగనలకు వర్ణిస్తుంది. సీతజనక మహారాజు కూతురు అని, దశరథ మహారాజు కోడలు అని వివరిస్తుంది. సీతను భయపెట్టి భక్షిస్తామని బెదిరిస్తే ఎటువంటి దుష్పరిణామాలు ఉంటాయో హెచ్చరిస్తుంది. సీతను భక్షించాలనుకుంటే మిమ్మల్ని మీరే భక్షించుకోవడం జరుగుతుందని భవిష్యత్‌కాల ప్రభావాన్ని పేర్కొంటుంది.

అనుమాండ్ల భూమయ్య త్రిజట స్వప్నావస్థను ప్రత్యక్షంగా వర్ణించారు. రాక్షస కాంతలో దైవాంశ ఏ మూలనో ఉండి స్వప్నం రావడానికి కారణమవుతుందని ఆయన అభిప్రాయం. సీత రక్షణ పరంగానే త్రిజట స్వప్న నిర్దేశం జరిగింది. అభయప్రధానమైన స్వప్న సందేశం సీతకు ప్రాణరక్షణ గావించింది. స్వప్న సంకేత రూపం ఎలాంటిదో అనుమాండ్ల భూమయ్య క్రింది పద్యంలో తెలియజేశారు.

నేను నిద్రించుచుండ నాలోన ఎవరు
నిదురబోకుండ చూచిరో నే నెరుగ
అతడు దొవ మగునొ! దానినంత చూపె
నాకు; ఆ స్వప్న మెరిగింతు మీకు వినుడు (పుట.46)

అయితే త్రిజట ఎటువంటి దృశ్య సదృశ్య లీలా ప్రవంతిని కలగన్నదో కవి వర్ణించారు. శ్రీరాముడిని కలలో దర్శించింది త్రిజట. కాని ఆ రాముడి ఔన్నత్యానికి విశేషార్థాలను అనువర్తింపజేస్తూ అనుమాండ్ల భూమయ్య

రామాభ్యుదయం, మైథిలి అభ్యుదయం, సింహ విక్రాంత గామి విశిష్ట పురుషుడిగా అభివర్ణించారు. రాముడిని కనుగొనగానే త్రిజటకు కనులపండుగైందట. రాముడి అందాన్ని వర్ణింపడానికి అలవికానిదని రాక్షస స్త్రీలకు త్రిజట చెప్పిన తీరును కవి హృద్యంగా వ్యక్తపరిచారు. ఇది ఇలా ఉండగా త్రిజట కలలో రాక్షసుల వినాశనం కన్నది. ఇది ఇంకా ఆశ్చర్యకరమైన దృశ్యం. పటాటోపం, అధికారం, క్రూరత్వం కంచుకోటగాగల లంకాపురంలో రాక్షసజాతి అంతమొందే సూచన త్రిజట దివ్యజ్ఞానానికి సంకేతం. "సీత రక్షణ రాక్షస శిక్షణ" నినాదంగా త్రిజట భవిష్యత్తు స్వప్న దృశ్యం ప్రమాణంగా నిలిచింది. శ్రీరాముడితో సహా తాను కలగన్న విషయాన్ని త్రిజట స్వగతంగా కవి వర్ణించారు.

కంటి కలగంటి శ్రీరాము కనుల గంటి
కంటి కలలోన సీత నీ కనుల గంటి
కంటి కలగంటి లక్ష్మణ కనుల గంటి
ఎంత నోచితినో భాగ్యమింత గంటి (పుట.47)

సీత అనుగ్రహించి శ్రీరాముడికి ఎరింగించినదేమో! ఆ రామచంద్రుడే స్వప్న వశంగా తనను సాక్షాత్కరించి ఉంటాడని రాక్షస స్త్రీలతో త్రిజట నివేదిస్తుంది. ఈ అవకాశాన్ని రావణుడే మొదట తనకు అందించడం, "సీత నరసికొని యుండు నిత్యమ్మ" అని ఆజ్ఞాపించడం వల్ల శ్రీరాముడిని కలలో చూచే భాగ్యం కలిగిందని సంతోషిస్తుంది. రావణుడి మంచితనం ఇదొక్కటే అని కవి త్రిజట చేత ప్రస్తుతింపజేశారు.

శ్రీ సీతారాముల దివ్య తత్త్వం :

అనుమాండ్ల భూమయ్య త్రిజటకు స్వప్నంలో కనిపించిన రామచంద్రుని అందచందాలు, గుణగణాలను అద్భుతంగా వర్ణించారు. శ్రీరాముడి ప్రభాకాంతులు, సోయగం త్రిజటను మరింత మంత్ర ముగ్ధురాలిగా చేసిందని తెలిపారు. సీతమ్మకు ఆ రాఘవుడిపై అంత ఎందుకు ప్రేమ కలిగిందో త్రిజట మనోఫలకంపై ప్రత్యక్ష పరిచారు. స్వప్న మిష చేత త్రిజట సీతారాముల పరమౌన్నత్య భక్తి భావను గ్రహించే విధంగా కవి అనువర్తింపజేశారు.

శ్రీరాముడి పుట్టు పూర్వోత్తరాల విశేషాలను, శవధనుర్భంగ దృశ్యాలను కవి పేర్కొన్నారు. దశరథ మహారాజుకు పుత్ర కామేష్టి యజ్ఞ ఫలితంగా రాముడు జన్మించడం, 'హరుని విలునెక్కుపెట్టిన యట్టి రాజవరుడె నా కూతు సీతకు వరుడు' అని వాగ్దానం చేసిన జనకుడి సభకు వెళ్ళి విల్లువిరిచి తన పరాక్రమం చూపడం, అద్భుతమైన గుణశాలిగా ప్రతిభ కనబరచడం వంటివి భూమయ్య వివరించారు.

త్రిజట స్వప్నంలో రాముడి జీవనగాథనంతా అవలోకించింది. రామ తత్త్వంలోని అద్భుతమైన సంఘటనలను చూసింది. పుట్టుక, వివాహమే గాక; సాహస కృత్యాలను స్వప్నంలో దర్శించింది. విశ్వామిత్రుడితో వెళ్ళి అస్త్ర శస్త్ర విద్యలను అభ్యసించి, తాటకిని చంపి, ముని నిర్వహించే యాగాలకు రక్షణ ఉండి ఆశీస్సులందుకున్న సన్నివేశాలను కలగన్నది. కైకేయి కోరిన విధంగా అరణ్య వాసం చేసి, ఋషులు, యోగుల క్షేమాన్ని కాంక్షించి రాక్షసులను సంహరించిన విషయాలను ప్రత్యక్షంగా చూసింది. శూర్పణఖ యొక్క మోహపు భ్రాంతిని తొలగింపజేసిన ఘట్టాన్ని కూడా తిలకించింది. సీత అపహరణ తర్వాత శ్రీరామచంద్రుడు చెట్టులనక, పుట్టలనక తిరుగుతూ పరితపిస్తూ శబరి ఆశ్రమంలో విశ్రాంతి తీసుకొన్న దృశ్యాన్ని త్రిజట తన స్వప్నంలో అనుభూతి చెందింది. వాలిని వధించి, సుగ్రీవుడితో చెలిమిచేసి కిష్కింధకు ప్రభువును చేసిన వైనాన్ని; ఆంజనేయుడిని శ్రీరామచంద్రుడు ఆది నుండి అంతం వరకు అగ్ని సాక్షిగా దాసుడిని చేసుకొన్న పరమ పవిత్ర స్వప్న నన్నివేశాలను త్రిజట తన రాక్షసాంగనలకు సాక్షాత్కరింపజేసింది.

త్రిజట తన స్వప్నంలో కనిపించిన శ్రీరాముడి ప్రతి రూపాన్ని, శౌర్యాన్ని, వీర పరాక్రమ పాటవాన్ని, గుణశీల

ప్రాధాన్యాన్ని వివిధ పాదాంతాలలో అనుమాండ్ల భూమయ్య కొనియాడారు.

కంటి రోమాంచము కలుగ కంటికలను (ప.11)
కలగంటి శ్రీరాము కలనుగంటి (ప.12)
కంటి కనుగొంటి శ్రీరాము కలనుగంటి (ప.17)
మహా పరాక్రమ గుణశాలి అగు శ్రీరాముగంటి (ప.18)
కమలదళ నేత్ర శ్రీరాము కలనుగంటి (ప.19)
శ్రీరామచంద్రు మహస్సుగంటి (ప.20)
రాముపద సరోరుహములగంటి (ప.21)
బలశాలి శ్రీరాము స్వప్నమునగంటి (ప.22)

స్వప్నంలో శ్రీరామచంద్రుడి తాత్త్విక భావనను పరిపూర్ణంగా గ్రహించిన త్రిజట మనస్సు అనేక విశేషాంశాల భావనతో గుంభనమైంది. స్వప్నం ఆంతర్యంలో త్రిజటకు "రామదర్శనమయ్యె, నేత్రములు ధన్యమయ్యె, జన్మజన్మల పాపమంత పోయె, ఈమె దర్శనమున పుణ్యమేదొ చేరినట్లు, పుట్టువు ధన్యమమైనట్లు తోచె" అని కవి సంప్రాప్తింపజేశారు.

వేయి హంసల శిబిక :

వెలుగులీను శ్వేతాంబరములు ధరించి
వేయి హంసలు శిబికను మోయుచుండ
తమ్ముడు జతగా గగన పథమ్ము నుండి
వచ్చె శ్రీరాముడిటకు నా స్వప్నమందు (పుట.50)

శ్రీరాముడి ఆగమనాన్ని సూచించే పద్యమిది. లంకా నగరానికి రాముడు ఏ ప్రకారంగా విచ్చేస్తున్నాడో త్రిజట రాక్షస స్త్రీలకు నివేదిస్తుంది. లక్ష్మణుడి సమేతంగా వేయి హంసల శిబిక (రథం) పై ఆకాశమార్గంలో అరుదెంచు చున్న త్రిజట స్వప్న వృత్తాంతం కనులకు కట్టినట్టుగా కవి వర్ణించారు.

సీత భాగ్యవంతురాలు. ఆమెను ఆశ్రయించిన చాలు అనుగ్రహిస్తుంది. జన్మకు సార్థకతను కలిగిస్తుందని త్రిజట భావిస్తుంది. సీత ఎల్లప్పుడు శ్రీరాముడినే స్మరించడం వల్ల ఆ స్మరణే త్రిజటకు మంత్రమైనట్టుగా, ఆ మంత్ర స్మరణ చేతనే రామచంద్రుడు అనుగ్రహించి తన స్వప్నంలో కనిపించినట్లుగా వినమ్రంగా త్రిజట రాక్షస స్త్రీలతో విన్నవిస్తుంది. కవి ఈ కల ప్రస్తావన చేస్తూ త్రిజట కల నిజమవుతున్న సంకేతాన్ని తెలియజేస్తారు. కల భయోత్పాతాన్ని, గగుర్పాటు కలిగించే విధానాన్ని త్రిజట మనస్సును కరిగించారు.

త్రిజట మరొక మాట చెబుతుంది. అదేమిటంటే సీతకు ఎడమ కన్ను అదురుతున్నట్టుగా గమనిస్తుంది. దీని సంకేతాన్ని కూడా పేర్కొంటూ రాముడికి విజయం, రావణుడికి నాశనం, లంకాపురికి దహనం సంభవిస్తుందని నివేదిస్తుంది. సీత పడిన కష్టాలకు పరాకాష్టగా లంకా దహనం జరుగుతుందని చెబుతుంది. కొమ్మల మీద పక్షులు కూడా ఆనంద పరవశంతో 'శ్రీరాముడరు దెంచునటకు' అని స్వాగతం పలుకుతున్నాయని భవిష్యత్ దృశ్యాన్ని ప్రత్యక్షంగా వర్ణిస్తుంది. ఆ స్వాగత పలుకులు సీతకు అభయాన్ని తెలిపి స్వాంతన పరుస్తున్నట్టుగా రాక్షక స్త్రీలకు వివరిస్తుంది.

త్రిజటకు వచ్చిన కలను గూర్చి చెబుతుండగా సీతకు మనస్సులో త్రిజటపై స్నేహభావం కలుగుతుంది. హృదయ సదృశంగా త్రిజటవైపు సీత చూస్తుండగా స్వప్న వృత్తాంతాన్ని కొనసాగించిందని కవి చమత్కరించారు. రాక్షస స్త్రీలను ఏవిధంగా కట్టడి చేసిందో త్రిజట క్రింది పద్యంలో కవి పేర్కొన్నారు.

ఇపుడు మీకొక మాట విన్పింతు, మనసు
పెట్టి వినుడు, సీతను భయపెట్టవలదు
చంపి తిందు మన వలదు; చంపు కొందు
రటవె మిము మీరలే? తిందురటవె మిమ్ము? (పుట.53)

రాక్షస స్త్రీలను హెచ్చరిస్తూ సీత పాదాలకు సాగిలబడి మ్రొక్కుమని ఆదేశిస్తుంది. సీత పట్ల మనం చేసిన పాపకార్యాలకు అంతం కలుగుతుంది. "పెద్దదిక్కు నీవే మాకు, రక్షింపుము నీవె" అని సీతను ప్రార్థించాలని సూచిస్తుంది. సమస్తం గెలిచిన రావణుడు సీతను

గెలువకపోవడం, శివుని విల్లువిరిచి సీత హృదయాన్ని శ్రీరామ చంద్రుడు గెలువడం వంటివి రాక్షస స్త్రీలతో చెబుతూ శ్రీ సీతారాముల ప్రేమానురాగాలను, అంద చందాలను కలలో చూచిన విశేషాలను పంచుకుంది. రావణుడికి ఎంత శక్తి ఉన్నా పనికి రాదని నిర్దేశిస్తుంది. త్రిజట మాటలతో భయాందోళనలకు గురి అయిన రాక్షస స్త్రీలు త్రిజటకు వచ్చిన పూర్తి స్వప్న వృత్తాంతాన్ని చెప్పమని ప్రాధేయపడతారు.

విన్న మీకింత భయమయ్యె, కన్న నాకు
భయమదెంత కల్గినదొ చెప్ప తరమగునె! (పుట.56)

అంటూ భయం భయంగానే కలను చెప్పసాగింది. కవి అనుమాండ్ల భూమయ్య త్రిజట చిత్తవృత్తిని స్వప్న వృత్తాంతంలో ప్రదర్శించారు. ఈ సందర్భంలోనే ఆంజ నేయుడి ప్రస్తావన వస్తుంది. అంతవరకు చెట్టు మీద ఉన్న హనుమంతుడికి రామనామం ఒక మంత్రంగా వినిపించి త్రిజట స్వప్నంలో రామతత్వాన్ని చూసి మ్రొక్కినాడని కవి వర్ణించారు.

త్రిజట కలను ఎక్కడ చెప్పడం ఆపిందో; అక్కడి నుండి మళ్ళీ ప్రారంభించింది. శ్రీరాముడు శిబికను ఎక్కి లక్ష్మణ సమేతంగా వస్తున్న చిత్రాన్ని చూపింది. తెల్లని వస్త్రము, తెల్లని పుష్పమాలలు, తెల్లని వేయి హంసలను వర్ణిస్తూ ఆకాశమంతా తెల్లదనంగా తోచి త్రిజట మనస్సులో పెను చీకట్లను పెకిలించి వేసినట్లుగా కవి అభివ్యక్తీకరించారు. సీత కూడా త్రిజట స్వప్నంలో కనిపించినట్లు, తెల్లని వస్త్రాలు ధరించి చుట్టూ పొంగు తున్న తరంగ కడలి కలిగిన పర్వత శిఖరంపై నిలిచి నట్లుగా వర్ణించారు. త్రిజట అప్రతిమాన దృశ్యాన్ని క్రింది పద్యంలో...

హంసల శిబిక నెక్కి ఆ ఆకసమ్ము
నందు రామచంద్రుడు వెలుగొందుచుండ
ఇచట పర్వతాగ్రమున శోభించె సీత
ఏమి ఈ దృశ్య! మీ జన్మకిదియె చాలు (పుట.58)

అంతలోనే సీత ఒక కాంతి రూపంగా వెలుగొందుతూ శ్రీరాముడి దివ్యమైన మహోజ్వల నీలదేహంతో చేరి పోయినట్లు త్రిజట స్వప్నంలో తిలకించింది. ఒక కాంతి కిరణం సూర్యుడిని కలిసినట్లు సీత ఇనకులేశ్వరుడిని చేరినట్లుగా వివరించింది. ఈ కల తనకు ఒక పాఠం చెప్పడానికే వచ్చి ఉండవచ్చని భావించింది. ఇది తనకు బ్రతుకు పరమార్థ మూర్తిని దాల్చిందని సంతోషించింది.

మహా చతుర్దంతి దంతి :

సీత రాముని ఆ రీతి చేరుకొనిన
యంత పర్వతాకారమౌ దంతి ఒకటి
కాననయ్యె, ఆ రామ లక్ష్మణులు దాని
నెక్కి గగన వీధిని సంచరింప గంటి (పుట.60)

ఆ దంతి పర్వతాకారాన్ని కలిగి ఉందట. నల్లని ఛాయాస్ఫుటం. అది మహా చతుర్దంత దంతి. రామ లక్ష్మణులిద్దరూ ఆ దంతిని ఎక్కి ఆకాశమార్గంలో సంచరిస్తున్నట్టు కవి అనుమాండ్ల భూమయ్య వర్ణించారు. ఆ దంతి లంకను పెకిలించి, సముద్రంలో ముంచి వేస్తుందేమోనని త్రిజట అనుమానం. శ్రీరాముడి దర హాసాన్ని, శ్వేత వస్త్రముల కాంతిని కవి వర్ణించారు.

చేరవచ్చె శ్రీరాముడు సీత వైపు
శ్వేత వస్త్ర మాల్యమ్ముల చేత వెలుగు
జిమ్ము రాముడు సీతను చేరవచ్చె
చేరవచ్చు రాముని జూచి సీత మురిసె (పుట. 61)

సీత తన ప్రాణనాథుడిని చూసిన తర్వాత వియోగం తొలగిపోయి తపం పండినట్లుగా సీత మురిసిందని త్రిజట పొంగిపోయింది. శ్రీరాముడి రాకను, సీతమ్మ మురిపాన్ని త్రిజట అద్భుతంగా వర్ణించింది. మదహస్తి తన పెద్ద కరమునెత్తి ఆనంద ఘీంకారం చేసినట్లుగా, సీత పాలసముద్రం లాగా మురిసిపోయినట్లుగా త్రిజట మనో స్వప్నాన్ని కవి చమత్కరించారు.

మరొక అద్భుత సన్నివేశాన్ని గూర్చి త్రిజట రాక్ష సాంగనలకు చెబుతూ - కలలో రాముడెక్కిన ఏనుగు

రామాజ్ఞను హృదయంలో నిలుపుకొని సీతముందు నిలువగా; సీత ఏనుగు మూపుపై ఎక్కి సిగ్గుపడిన దృశ్యాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించింది. దంతిని ఎక్కిన సీతను తన ఒడిలో కూర్చుండబెట్టుకొన్నాడట శ్రీరాముడు ఆ జంట రూపం త్రిజట గుండెలో అచ్చు గుదినట్లుగా రూపుదిద్దుకున్నదని కవి పేర్కొన్నారు. వారు ఆది దంపతుల లాగా ప్రత్యక్షమయ్యారట. ఆ దర్శన భాగ్యముతోనే జన్మజన్మల తపములన్ని సార్థకమవుతాయని త్రిజట ఆశావాహ దృక్పథంతో రాక్షక చెలియలతో నివేదిస్తుంది.

త్రిజట చెబుతున్న స్వప్న ధోరణిని చూసి రాక్షస భామలకు స్వప్నంలో కనిపించిన శ్రీరాముని చూడాలనే ఉత్సాహం పెరిగింది. త్రిజటలో వచ్చిన మార్పునకు స్వప్నమే కారణమని భావించి కలలోని కథను చెప్పమని ప్రాధేయపడ్డారు.

అష్ట వృషభముల రథం :

అంతవరకు సీత ఏనుగునెక్కి ఆకాశంలో సాగి వచ్చిన దృశ్యం త్రిజట మనసులో ఉండగా; కవి భూమయ్య మరొక సన్నివేశాన్ని కల్పించారు.

రాముడష్ట వృషభముల రథమునెక్కి
ఇచ్చటికె రాముడు తనంత వచ్చినాడు
ఇంతలో పుష్పక విమానమెక్కి ఉత్త
ర దిశ కేగగంటి, కనుల ప్రభల చిమ్మ (పుట.65)

అంటూ సీతాసమేతంగా లక్ష్మణుడి తోడ ఉత్తర దశకు వెళుతున్న శ్రీరాముడి ఘనకీర్తిని పలు పలు రకాలుగా రాక్షసాంగనలకు వివరించింది. రాముడి దయతో అమృతత్వం పొంది మృత్యువును తరించినట్లుగా త్రిజట పేర్కొన్నది. ఒక మంచి సందర్భాన్ని దీనికి ఆపాదిస్తూ కవి 'పూర్వ జన్మ సుకృతమిది కాని ఈ జన్మ సుకృతమేది!' అని త్రిజట పొందిన అనుభూతిని వర్ణించారు. ఈ పునర్జన్మను ప్రసాదించింది. శ్రీరఘురాముడే అని త్రిజట గాఢంగా విశ్వసించింది.

త్రిజట స్వప్న వృత్తాంతం వింటున్న ఆంజనేయుడికి ఒకింత ముచ్చట కలిగిందట. ఈ సందర్భంలో రామ పాదం సోకి రాతి నాతిగా మారిన సన్నివేశం ఆయనకు గుర్తొచ్చింది. ప్రస్తుతం త్రిజట స్వప్నంలో రాముని దర్శనం ద్వారా త్రిజట పావని అయ్యిందని మనస్సులో భావించాడు.

లంకానగర విధ్వంసం :

శ్రీరాముడి దివ్యత్వ రూపాన్ని స్వప్నంలో దర్శించిన త్రిజట రావణుడిని ఏవిధంగా చూసిందో తోడి రాక్ష సాంగనలతో వివరిస్తుంది. అత్యంత భయంకరంగా మారి పోయిన రావణుడి స్థితిని ఆచార్య అనుమాండ్ల భూమయ్య వర్ణించారు.

తనువు నందు తైలము పూసుకొని గంటి
తనివి తీర తైలమ్మునే త్రాగ గంటి
రక్త మాల్యమ్ములను దాల్చి రక్త వర్ణ
వస్త్రములు దాల్చిన మన రావణుడి గంటి (పుట.70)

అటువంటి ఆకారంలో ఉన్న రావణుడు అతని పుష్పకవాహనం నుండి కిందికి పడత్రోసి నలుపు వస్త్రాలు ధరించిన స్త్రీ ఈడ్చుకొని వస్తున్నట్టుగా త్రిజట పేర్కొన్నది. కలలో రావణుడి శిరస్సు ఛేదించబడిందని, భ్రాంతి చిత్తుడై నర్తిస్తూ నవ్వుతున్నాడని అభివర్ణించింది.

గాడిదల రథమెక్కి శీఘ్రముగ దక్షి
నానకేగు రావణుగంటి; అంతలోనె
గార్దభము నుండి తలక్రిందుగా పడంగ
గంటి; మల పంకమున కూలగంటి కలను (పుట.71)

రావణుడి గతి ఏవిధంగా మారిందో త్రిజట స్వప్నంలో ప్రత్యక్షపరిచారు కవి. భవిష్యత్ వినాశనం, ప్రళయం వంటివి కలలో ప్రాధాన్యం వహించాయి. ఇంద్రజిత్తు మొసలిపై కుంభకర్ణుడు ఒంటెపై దశకంఠుడు పందిపై దక్షిణ దిక్కుగా పరుగులు పెడుతున్న దృశ్యం స్వప్నంలో కనిపించింది. లోకంలో అత్యంత సుందరమైన లంకా నగరం, గజములు, తురగములు, రథములు కూలి సముద్రంలో మునిగిపోయినట్లు త్రిజట భ్రాంతి చెందింది.

లంకను ఒక వానరం తన తోకతో తగులబెట్టినట్లు కూడా రాక్షస స్త్రీలతో చెబుతుంది. ఇక లంకానగరంలో రాక్షసులందరూ తైలం త్రాగి, రక్త వర్ణ వస్త్రాలను ధరించి, వాయిద్యాల మ్రోతతో ఆడిపాడుతున్న తీరును కవి వర్ణించారు. రాక్షసాంగనలు కూడా నూనె త్రాగుతూ భస్మ రాసులలో పడిపోతున్నట్లు త్రిజట వివరించింది. ఇక లంకకు విభీషణుడే రాజుగా అతడు కూడా శ్వేతాంబరాలు ధరించి ఆకాశంలో వైభవోపేతంగా వెలుగొందుతున్నాడని వర్ణించింది.

కవి ధర్మ సూత్రాన్ని ఈ సందర్భంలో ప్రస్తావిస్తూ "పాపమేనాటికైనను పట్టి కుడుపునంచు; చేయుద మిపుడైన మంచి ఒకటి" అని పేర్కొన్నారు. అందువల్ల సీతను భక్తితో ప్రార్థిద్దామని త్రిజట రాక్షసాంగనలతో నివేదిస్తుంది. పరిపూర్ణ స్థితిని వర్ణిస్తూ సీత అపుడు ఓంకార జపం చేసేదని, ఇపుడు ఓంకారమైనట్లుగా త్రిజట ఉన్నతీకరించింది.

త్రిజట స్త్రీత్వ భావన :

స్త్రీలమైన మనము సాటి స్త్రీని ఇట్టు
లింత భయపెట్టనేరాదు, ఇంత కాల
మడవులందు తపమొనర్చి అరుగుదంచె
ఈమె తపమె ఈమెకగు శ్రీరామరక్ష (పుట.75)

సాటి స్త్రీగా త్రిజట సీతపై మమకారం చూపే తత్వాన్ని ఏర్పరచుకుంది. తోటి స్త్రీలలో పరస్పర సహకారం, సహాయం, మనోధైర్యం పెంపొందింపజేయాలని సంకల్పించుకుంది. కవి భూమయ్య స్త్రీ మనస్థితిని ప్రదర్శించారు. స్త్రీలందరూ తమ సానుకూల హక్కుల కోసం కలిసికట్టుతనాన్ని ప్రదర్శిస్తారని ఈ పద్య పాదాలు నిరూపిస్తున్నాయి. సామాజిక అవరోధాలు ఏర్పడినప్పుడు సమిష్టి వ్యవస్థ తోడ్పాటు ఎంత అవసరమో ఈ మాటలు తెలియజేస్తాయి. 'ఈమె సీతా మహాలక్ష్మి; ఈమెనింక పరుష వాక్కుల బోధింపవలదు మనము' (పుట.76) అని రాక్షస స్త్రీలకు త్రిజట సర్దిచెబుతుంది. మానవులైన, రాక్షసులైన, దేవతలైన స్త్రీల కోణం నుండి చూస్తే ఒక స్త్రీ పడే కష్ట నష్టాలు, దు:ఖం, బాధ వంటివి అనుభూతిలోకి తెచ్చుకుంటారనేది వాస్తవం. సహజమైన దయ, కరుణ, అనురాగం, ఆప్యాయత, ప్రేమ, స్నేహం, భక్తి, వాత్సల్యం వంటివి ఏ వర్గంలోని స్త్రీకైనా ఒకే రకంగా ఉత్ప్రేరకం అవుతాయనేది సత్యం. సీతకు ఆత్మ నిబ్బరాన్ని కలిగించడం కోసం త్రిజట తోడ పలికించిన వాక్కులు - 'రాముడరుదెంచు నికముందు క్షేమమగును / నీకటంచు ధైర్యము చెప్పి సాకవలయు' (పుట.76)

ఆధ్యాత్మిక చింతన :

త్రిజటలో కవి అనుమాండ్ల భూమయ్య ఆధ్యాత్మిక భావతత్వాన్ని కలిగింపజేశారు. స్వప్నవశంతో త్రిజట రామతత్వం నిగూఢపరుచుకొని కార్యస్థితిని నెరవేర్చింది. అచంచల స్థితి సంస్కారాన్ని పొందింది.

ఈ శరీరమే రథమని ఎరుక పరచి
బుద్ధి ఒక సారథియను ప్రబోధమెదను
కురిసి, మనసు కళ్ళెమటంచు ఎరుగజేసి
రాముడే నన్ను నడిపించు రథికుడయ్యె (పుట.77)

అని త్రిజట ఇంద్రియ సుఖముల పరిత్యాగిగా కవి భూమయ్య చిత్రించారు. సీతారామతత్వ సాదృశ్య భక్తి తప:ఫలాన్ని త్రిజట స్వప్నంలో ఆస్వాదించింది. ధన్యతను సాధించింది. సీతా సంసేవితంలో తరించింది.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

స్త్రీ ఆత్మగౌరవ ప్రదర్శిక 'కన్నతల్లి'

- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

కరోనా ఇచ్చిన విరామ సమయంలో ఆచార్య కొలకలూరి ఇనాక్ కలం నుంచి వెలువడిన రచనలలో ఇది ఒకటి. ఒక వాస్తవ తపన, బీజమై ఈ నవల ఆవిష్కృతమయింది. ఈ నవల కాల్పనికతకు నిదర్శనం. ఇనాక్ గారిలో ఉన్న జానపదుడు చాలా పర్యాయాలు బయట పడ్డాడు. మనస్తత్వ విశ్లేషణకు తగిన ముడిసరుకు ఉంది. ఇది ఒక సస్పెన్స్ థ్రిల్లర్‌లాగా ఉండి ఇనాక్ గారి తొలి నవలలను అనాథ గుర్తుకు తెస్తూ ఉంది. ఈ నవలలో ఇనాక్‌గారిలోని లౌకికవాది కనిపిస్తాడు, సమతావాది కనిపిస్తాడు, పురుషాహంకార ధిక్కారధోరణి కనిపిస్తుంది. మనిషి తన హద్దులు తాను ఎరిగి ఉండటం ఎంతటి మహోన్నత వ్యక్తిత్వ లక్షణమో చెప్పటం ఉంది. ఇతివృత్త కల్పనలో సామాజిక ఆవశ్యకాంశాల ప్రకటన ఉంది. మానవాను బంధాల ప్రాధాన్యం ఉంది.

కథేతివృత్తం :

సదాశివం, ముప్పై ఏళ్ళ యువకుడు, కని వదిలేసిన తల్లి కోసం అన్వేషిస్తున్నాడు. చిత్తరంజన్ దొర, సదాశివాన్ని తన కుమారుడిగా, వారసుడిగా అంగీకరించిన వ్యక్తి. మాన్యం వంశ పారంపర్య పాలనలో ఉంది దానికి జమిందారులు చిత్తరంజన్ దొరవారి వంశీయులు. హైదరాబాదు సంస్థానం భారతదేశంలో విలీనమయినప్పుడు, దొరల పాలన ఎంతోకాలం చెల్లదన్న తెలివితో దొర హైదరాబాదులోని విలాస భవనంలోకి మారాడు. తెలంగాణా సాయుధ పోరాటం నక్సలైటు ఉద్యమ నేపథ్యంలో ధన కనక వస్తు వాహనాదులు హైదరాబాదుకు మార్చాడు చిత్తరంజన్ దొర. తన తెలివితో ఎన్నో ఆస్తులను స్వాధీనం చేసుకొన్నాడు. విపరీతంగా ధనాన్ని ఆర్జించి దానధర్మాలు చేసినా, ఆస్తులను కాపాడాడు, దాని సంరక్షణకు ముగ్గురు వకీళ్ళను ఒక విశ్రాంత న్యాయమూర్తిని సంఘంగా ఏర్పరచి, దానధర్మాల నియమాలనూ నిర్ణయించాడు. కొడుకుకు పాతికేళ్ళ తరువాత స్వతంత్రించి ఆర్థిక వ్యవహారాలు నడిపే స్వేచ్ఛను విల్లు ద్వారా ఇచ్చాడు. తండ్రి ఆస్తి పాస్తులను తండ్రి కోరిక మేరకు అనాథ శరణాలయం మాతృమందిరం వంటివి నిర్వహిస్తూ, తాను చదివిన కంప్యూటర్ కోర్సు ద్వారా కన్సల్టెన్సీ పనితో తన రాబడిని పొందుతున్నాడు. ఐదేళ్ళ వరకు అనాథ శరణాలయంలో ఉండి, ఆపై తండ్రితో కలిసి దొరవారి బంగళాలో జీవించిన సదాశివానికి తన తల్లి ఎవరు తాను చిత్తరంజన్ దొరకు వారసుడనే అయితే, అనాథ శరణాలయంలో ఎందుకు ఉండవలసి వచ్చింది అనే ప్రశ్నలు తనను తాను వారసుడిగా భావించుకోవటానికి ఆటంకం అయ్యాయి. తల్లి తెలియాలి. తన అస్తిత్వ నిరూపణ జరగాలి. అది అతని కోరిక. మంచి మనసు, సంస్కారవంతమైన ప్రవర్తన, దోషం లేని వ్యక్తిత్వం గల సదాశివం కోమలితో ప్రేమలో ఉన్నా, తల్లి కనిపించాకే వివాహ ప్రస్తావన అనే దృఢ సంకల్పంలో ఉన్నాడు. ముప్పైవ జన్మదినాన రాజమాత మందిరం తండ్రి రహస్య మందిరాన్ని తెరచాడు. రహస్య మందిరం ద్వారా తల్లి పేరు సునందిని అని ఆమె తనపై అలిగింది అని ఆమె ప్రేమ సంపాదించుకోమని తండ్రి రాసిన లేఖ, చూసి ఆనందించాడు. అతని ఆరాటం ఆవేదన అతని పట్టుదల కన్నతల్లి హృదయాన్ని కరిగించాయి. అంతకాలం అనాథ శరణాలయంలో ఆయాగానూ, బంగళాలో ఇంట వంట మనిషిగానూ ఉంటున్న సుల్తానాయే సునందిని అని, తన తల్లి అని తెలుసుకొని పరమానంద భరితుడయ్యాడు. తన తల్లి సలహాతో డి.ఎన్.ఎ పరీక్షల చేయించారు అనుకూల ఫలితాల తర్వాత అందరి అంగీకారంతో రాజమాతగా సునందిని ప్రకటితమయింది. తల్లీ కొడుకులు కలిసి ఆనందంగా జీవించారు. ఇది సూక్ష్మంగా ఇతివృత్తం.

సునందిని :

తొమ్మిదేళ్ళ వయసులో పేదయింటి సునందిని దొరవారి బంగళా చేరింది. దొరవారి పనులు చేసేది. అతని గదిలోనే ఉండేది. అక్కడే ఈడేరింది గర్భాన్ని ధరించింది. పసిపిల్ల పట్ల చిత్తరంజన్ చర్య అకృత్యం. వారి మధ్య వయోభేదం ఉంది. అరవై ఏళ్ళ వ్యక్తి పదిహేనేళ్ళ పసిది. 'సునందిని అబల, స్త్రీత్వపు బలహీనత వల్ల, పసితనపు అమాయకత్వం వల్ల, బంగళా బంధీ కావటం వల్ల, కనపడని బంగారు సంకెళ్ళ వల్ల, పేదతనం భ్రమించే సంపన్నత మోసం వల్ల గర్భవతి అయింది' (పు.119). ఆమె పట్ల దొరకు ప్రేమ ఉంది. గర్భం దాల్చటం ఆమెకు దు:ఖం అతనికి ఆనందం. పెళ్ళి చేసుకోననే శపథం ఉండటం వల్ల ఆమెను వివాహం చేసుకోవటానికి అతడు సిద్ధం కాదు. ఆమెకు వివాహం కాకుండా తల్లి కావటం బాధ. నెలలు నిండేకొద్దీ ఆమెలో అశాంతి పెరిగింది. రహస్యంగానైనా చేసుకొమ్మని అడిగింది. అది తన వ్యక్తిత్వం కాదన్నాడు. తాళి కాకపోతే పసుపుతాడైనా అని వేడుకొంది. అంగీకరించలేదు. పైగా ఆ బిడ్డ తనది, కనాల్సిందేనన్నాడు. ఈ సంభాషణంతా పురుషాధిక్య ప్రదర్శనే. స్త్రీని శరీరంగానో, పిల్లల్నికనే యంత్రంగానో భావించే ప్రవర్తనే. 'దొరవారు సంపన్నతా దౌష్ట్య తాడితుడు'(పు.119).

తనకు తాళి కడితే బంగళాలో, లేకపోతే తల్లిదండ్రుల దగ్గర ప్రసవిస్తాను, ఎక్కడ ప్రసవించినా మీ సొత్తు మీకిస్తానంది.

మాట దొరవారు తప్పరాదు కనుక మెడలో పసుపు తాడు లేకుండా కాన్పు కావటం తనకు ఒప్పదు కనుక పసుపుతాడు మెళ్ళో కట్టుకొంది. పుట్టిన బిడ్డకు తప్ప ఎవరికీ చెప్పనంది. దాన్ని అంగీకరించిన దొర, 'నీ బిడ్డను నా బిడ్డగా ప్రకటిస్తాను, వారసత్వం దత్తం చేస్తాను' అన్నాడు. పుట్టిన సంతానాన్ని ఆమోదిస్తూ తల్లిని కాదనటం ఎంత అన్యాయం అన్న సునందినితో సంస్థాన మర్యాద నీకు తెలియదు. 'తల్లి ముఖ్యం కాదు, తండ్రే ముఖ్యం' (పు.120) అన్నాడు. చిత్తరంజన్ తల్లి రాజమాత, అలాంటి గౌరవం ఆ మర్యాద నాకు కావాలి అంటే కన్న కొడుకు ద్వారా పొందమన్నాడు. ఎంతో వాదన జరిగింది. సామ, దాన భేదాలను ప్రదర్శించింది, నిష్ఫలం అయ్యాయి. వాదులాటల రాత్రి నిండు గర్భంతో తనకు రావలసిన ఆరు నెలల జీతం తీసుకొని ఇంటి నుంచి వెళ్ళిపోయింది. అక్కడ ఉన్న పదిహేనేళ్ళ పిల్ల నిజాయితీకి నిదర్శనం ఈ చర్య. ధనమోహం లేదు. అవసరం తీర్చే డబ్బు తప్పదు. తనకెంత జీతం రావాలో అంతే తీసుకొని బయటపడింది. వ్యక్తిత్వపు గట్టితనం స్పష్టం. 'మాట పట్టింపు మాట నెగ్గించుకోవటం' కోసం ఆ పని చేసినా ఆమె తీసుకొన్న నిర్ణయంతో దృఢంగా నిల్చింది.

సంక్షుభిత కాలం :

ఇల్ల వదలి వచ్చిన నిండు నెలల గర్భవతి సునందిని ఉస్మానియా ఆసుపత్రికి వెళ్ళింది. ఈనటానికి సిద్ధంగా ఉన్న కుక్క ఆమె వెంట వెళితే జాగ్రత్తగా ఇంట దింపమని ఆటోలో వెనక్కి పంపింది. రెండో రోజుకు సుఖ ప్రసవం అయింది. ఈనిన కుక్క మూడు రోజులూ వచ్చి వీళ్ళను చూసి వెళ్ళింది. సునందిని బిడ్డ బర్త్ సర్టిఫికెటులో తల్లిదండ్రులుగా చిత్తరంజన్, సునందిని అని తామిద్దరి పేర్లూ రాయించింది. నాలుగో రోజు ఉదయం బంగళాకు వెళ్ళింది. తోక ఊపుతున్న కుక్క సంరక్షణలో బిడ్డను డస్ట్‌బిన్‌లో ఉంచింది. పిల్లాడి ఏడుపు కుక్క అరుపులతో బంగళా మేల్కొంది. బిడ్డను తండ్రి చూశాడని సునందిని గహించింది. మరుసటి రోజు కొడుకును అనాథ శరణాలయంలో చేర్చారని తెలిసి గిలగిల లాడింది. కొడుకును పెంచే మార్గం స్పష్టమయ్యాక తల్లిదండ్రుల దగ్గరకు చేరింది. శారీరకంగా, మానసికంగా నలిగిపోయిన సునందిని బిడ్డకు దూరమై, మానసిక దౌర్బల్యానికి గురయింది. తల్లిదండ్రులతో యాత్రకు వెళ్ళింది. సంవత్సరం తర్వాత బిడ్డ పుట్టినరోజు బంగళాలో ఘనంగా జరగటం తెలుసుకొని ఊరట పొందింది.

సంవత్సరం పాటు తల్లిదండ్రులతో తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలు తిరిగి వచ్చిన సునందిని మనసు కుదుట పడింది. తన ఉనికి తెలియకుండా ఉండటానికి ముస్లిం స్త్రీలాగా, క్రైస్తవ మహిళగా మారింది. పెళ్ళి కాని తాను పసుపు కొమ్ము కట్టుకొంది. యువకుల నుంచి రక్షణ కోసం అని ఉద్యోగం ఇచ్చిన వాళ్ళకు హిందూ స్త్రీగా చెప్పింది. హిందువు కాని దానవు బొట్టు ఎందుకంటే అందం కోసం అంది. ఇవి తగదంటే సుల్తానాకు అన్నీ తొలగించింది. విధవ రూపం ధరించింది, ఉద్యోగం స్థిరపడింది. మరసటి రోజు చిత్తరంజన్ మరణవార్త ఇతివృత్త కల్పనకు జత అయింది.

ఆమె చిత్తరంజన్ అనాథ శరణాలయంలో అనాథ అని చెప్పి చేరింది. పిల్లలంటే పిచ్చి ప్రేమ. అక్కడ పదేళ్ళు చేసింది. ఆమె వల్ల ఏ సమస్యా రాలేదు. పెళ్ళి ధ్యాస లేసి సన్యాసిని భావనే. దానికి పూర్వం ఇరవై ఏళ్ళు స్త్రీ శిశు సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఆయాగా చేరి ఉంది. అక్కడా పిల్లల్ని ప్రేమగా చూసు కొనేది. ఆ అనుభవంతోనే చిత్తరంజన్ అనాథ శరణాలయంలో చేరింది. ఇక్కడ చేరినా, వారానికి ఒకసారి స్త్రీ శిశు సంక్షేమ వసతి గృహానికి వెళ్ళి ఆనందంగా గడిపి వచ్చేది. జీవిత సంఘర్షణలో నలిగిన ఆమె సుల్తానాగా చిత్తరంజన్ ప్రాంగణంలోకి తిరిగి ప్రవేశించింది.

సుల్తానా :

చిన్న దొరవారి ఇంట వంటమనిషి వయోభారంతో తొలగినప్పుడు నమ్మకస్తులు దొరవారి యోగక్షేమాలు చూడగలిగే మనిషి కోసం వెతికి అనాథ శరణాలయంలో పనిచేస్తున్న సుల్తానాను నిర్ణయించారు. మొదటిసారి సుల్తానాను చూసినప్పుడు రకరకాల ఉద్వేగాలతో ఊగి పోయాడు సదాశివం. ఆమె 'శరీరం రంగు లేత తమల పాకుకు పండిన తమలపాకుకు మధ్యస్థంగా ఉంది. చర్మం నున్నగా ఉంది. పల్చటి మనిషి. మరీ సన్నం కాదు. మరీ లావు కావు. బిగవైన అవయవాలు. ఎక్కువ ఎత్తు లేదు. ముఖంలో సౌకుమార్యం ఉంది. ప్రవర్తన సున్నితంగా ఉంది. కదలిక ఆకర్షణీయంగా ఉంది' (పు.48). ఇది ఆమె వర్ణన. రూప, స్వభావాల చిత్రణ. ఆమె ముఖం ప్రసన్నంగా అభిమానంగా ఉండటం సదాశివానికి ఇష్టం.

దొరగారు భోంచేయటానికి ముందు రుచి చూసే పని కోమలి చేసేది. అది రుచి చూడటమే కాదు భద్రత కూడా. ఆ బాధ్యత సుల్తానాకిస్తూ ముగ్గురూ ఒకేసారి భోజనం చేసే ఏర్పాటు చేశాడు సదాశివం. కొడుకుకు సేవ చేసే సుల్తానా, సదాశివం కోమలిల వివాహం కాకుండా ఉండటాన్ని చూసి బాధ పడేది. డస్ట్‌బిన్ కుక్క చిన్నాడు సదాశివంతో ముడిపడిన విషయాలతో ఓ గుడి కట్టి ఉంది, సదాశివం జన్మదినాన అక్కడ పూజ జరుగుతుంది. ముప్పైయవ పుట్టిన రోజునాడు ఇదంతా దగ్గరగా చూస్తున్న సుల్తానాలో ఉద్రేకం.

రాజమాత మందిరం పెద్ద దొరవారి రహస్య మందిరం తెరిచే అధికారం వచ్చిన సదాశివంతో కోమలి సుల్తానా ప్రవేశించారు. సుల్తానా రాజమాత మందిరం శుభ్రం చేసింది. రహస్య మందిరం కేవలం సదాశివం వెళ్ళి వచ్చాడు. సదాశివం తల్లికోసం తల్లడిల్లిపోవటం చూసి సుల్తానా అల్లల్లాడింది. సుల్తానా ఎవరనే ప్రశ్న సదాశివాన్ని అస్థిమితం చేసింది. రహస్య మందిరంలోకి కోమలి సుల్తానాలతో వెళ్ళిన సదాశివానికి ఏడుపు వరదైంది. స్త్రీలిద్దరూ కన్నీరు మున్నీరయ్యారు. అందంగా ఠీవిగా రాజసం ఉట్టిపడేట్టున్న సుల్తానా ఎందుకు ఎప్పుడూ దిగులుగా ఉంటుందో సదాశివానికి అర్థం కాదు. తనను వివరాలు అడిగితే దు:ఖించింది. కోమలి సదాశివం పెళ్ళి త్వరగా కావాలని ఆమె ఆశీర్వదించింది. మేనేజర్లు న్యాయమూర్తి మాటలతో పెద్దదొరైన చిత్తరంజన్ తన తండ్రి ఇద్దరు భార్యలు కలిగి వుండి చేటు తెచ్చుకొన్నాడని తెలిసి చిత్తరంజన్ వివాహానికి ఎందుకు విము ఖుడయ్యాడో సుల్తానా తెలుసుకొంది. తండ్రికి ఉన్న ఏ దుర్లక్షణాలు లేని సదాశివం తల్లికోసం పరితపించడం చూసింది. చిన్న దొరతో కోమలిని వివాహం చేసుకొమ్మని

కోరింది. తల్లి రావాలి అప్పుడే పెళ్ళి. ఆమె రాజమాత కావాలి ఆపైనే పెళ్ళి అంటున్న సదాశివంతో గతాన్ని నెమ్మదిగా తెలియజేసింది. తన తల్లి ఆమెనే అని తెలిసి కన్నీటితో పాదాలను అభిషేకించాడు. తన తండ్రి కోసం మళ్ళీ పెళ్ళి చేసుకొని తల్లిని 'ఎంత జీవితం అడవి కాచిన వెన్నెల అయిందమ్మా ఇంత ఘోరం జరగరాదు' అన్నప్పుడు సుల్తానా 'కోమలి జీవితం ఎందుకు మిమ్మల్ని నమ్ముకొని వ్యర్థం కావాలి'(పు.126) అని ప్రశ్నించింది. ఆమె దూరంగా ఉంటూ, దగ్గరగా ఉంటూ సదాశివాన్ని తెలుసుకొంది. అతను గొప్ప వ్యక్తిత్వ సంపన్నుడిగా గుర్తించింది. కోమలి పట్ల అనన్యమైన ప్రేమ ఉన్నా, వివాహ బంధానికి సిద్ధపడక తల్లి కోసం పరితపిస్తున్నాడు. తొమ్మిదేళ్ళుగా అతడే సర్వస్వంగా ఉన్న కోమలికి సదాశివం తనకు తెలియకుండానే వేస్తున్న శిక్ష సుల్తానాకు ఆమోదం కాలేదు. ఇద్దరు మంచివాళ్ళు ప్రేమమూర్తులు కలవటానికే ఆమె తానెవరో బయటపెట్టింది. ఆమె అంతట ఆమె బయటపడి సత్యాన్ని పేర్కొనిన దాకా న్యాయమూర్తి కాని, మేనేజర్లు కాని బయటపడలేదు. వారికీ వాస్తవం తెలుసనే సూక్ష్మాలనీ రచయిత అందించారు. అది ఆమె పట్ల గౌరవం కావచ్చు. బిడ్డను సమీపం నుంచి చూసుకోవచ్చనే కోరికతో శరణాలయం, భవనం చేరినా, ఆమెలో తనను తాను ప్రకటించుకోవాలనే కోరిక లేదు. కొడుకు అమ్మ కోసం అలమటించటం, కోమలి జీవితం నిస్సారంగా ఉండటం ఆమెకు అంగీకారం కాలేకపోయింది.

రాజమాత :

సుల్తానా తన గతాన్ని చెప్పింది. సదాశివానికి తల్లిని చూసిన ఆనందం. కోమలి సదాశివాలతో కలిసి కేర్ బంజారాకు వెళ్ళి తామిద్దరి డి.ఎన్.ఏ రిపోర్టు కోరింది. రెండు రోజులలో రిపోర్టు వస్తాయని యం.డి చెప్పడం వినింది. అనాథ పిల్లల సంరక్షకురాలిగా, వంట మనిషిగా ఉన్న సుల్తానాలో హుందాతనం రాచరికపు దొరతనం చూసి సదాశివం ఆశ్చర్యపోయాడు. ఆమెలో దర్జా, ఠీవి, అధికార దర్పం చూసి కోమలికీ ఆశ్చర్యం. బంగళాలో సునందినిగా ఉన్న ఏళ్ళలో రాజమాతను ఎంత దగ్గరగా గమనించిందో ఇష్టపడిందో అర్థం చేసుకోవచ్చు. చిత్తరంజన్ దొరతో వాదనలో రాజమాత కావటాన్ని గురించి ప్రస్తావించింది. కొడుకు ద్వారా రాజమాత కావచ్చని దొర అన్నాడు. అప్పటికే ఆమె మీద రాజమాత హుందాతనం ఇష్టాన్ని, ఎంతో ప్రభావాన్ని చూపి ఉండాలి. అది ఆమెలో భాగమయిపోయి ఇలా ప్రస్తుతం ప్రకటితం అవుతూ ఉంది. పసి సునందిని పెద్దది కావటంతో తీసుకోవలసిన జాగ్రత్తలు సీత అనే పనిమనిషి చూసింది. నేర్పింది. తల్లిలా అన్నీ చూసింది. తానెవరో ప్రకటించాక ఆమెను కలిసింది. ఇద్దరూ గతాన్ని కలబోసుకొన్నారు.

సదాశివం ఇవ్వగా రాజమాత మందిరం, దొరవారి రహస్య మందిరం తాళం చెవులు తీసుకొంది. వాటిని శుభ్రం చేస్తూ దు:ఖించింది. అన్నింటిని సర్దింది. ఆ గదిలో ఉన్న పాత ఫోటోలు, డి.ఎన్.ఎ రిపోర్టులు స్థిరపరచాయి వీరి బంధాన్ని. 'మీ సలహా సంఘానికి మేనేజర్లకు సంస్థాన ప్రముఖులకు మన తల్లీకొడుకుల బంధం ప్రకటించండి. సంస్థానం అంగీకరిస్తేనే నేను మీ తల్లిని గుర్తించుకోండి' అనటంలో ఆమె నియమబద్ధత స్పష్టమవుతుంది. ఆ విషయం ప్రకటిస్తూ సదాశివం, మీరు కూడబలుక్కుని శరణాలయంలోనూ వంట మనిషిగానూ నియమించారని అన్నాడు. వారంతా అన్వేషించి ఆమెను తనకు బహూకరించినందుకు ధన్యవాదాలు తెల్పాడు సదాశివం. సుల్తానాకు అలా వారి అంగీకారం లభించింది. రాజమాత పదవీ ప్రతిష్ట మహోత్సవం వేదపండితులు హోమ గుండం యజ్ఞవిధుల నడుమ ఘనంగా జరిగింది న్యాయమూర్తి సమక్షంలో. ఆయన చేయించగా పదవీ ప్రమాణం చేసింది. రాజమాత సునందినీ దేవికి కన్నీరాగలేదు. ఎంత అదృష్ట దురదృష్టాల ఫలితం ఆమెకు ఈ పదవి. ఎంత ఆరాటం ఎంత సర్దుబాటు. ఎంతగా నలిగింది. భార్యగా కాలేనీ పొందలేనీ గౌరవం తల్లిగా లభించటం ఎంత నష్టానికి ఫలితం. ఏ మాత్రపు ప్రయోజనం చేకూరుస్తుంది.

సదాశివం ఎంత పలవరించినా, బయటపడేది కాదు కోమలి ప్రస్తావన లేకపోతే. వివాహమై సుఖంగా ఉండి ఉన్నా సదాశివానికి తల్లి లభించేది కాదు. రాజమాతగా మాట్లాడుతూ '....అప్పటి రాజమాతను చూచి, నేనూ కొడుకును కనాలి రాజమాతను కావాలి అని కోరుకొన్నాను... నేను నా ఉనికిని తెలుపుకోవలసిన రోజు వచ్చేది కాదు. సదాశివం దొరవారు పూనిక, వారితో ముడిపడిన జీవితం, పరిష్కరింపబడవలసిన అవసరం ఉండకపోతే' అనటంతో అది స్పష్టం.

తాను బిడ్డను కని బంగళాలో ఉంటే దాసిగా, దాసి పుత్రుడిగా తాము మిగిలేవాళ్ళమే కాని రాజమాతగా చిన్న దొరగా అయ్యేవారం కాదని, తన త్యాగం ఒక మంచి ఫలితాన్నే ఇచ్చిందని సదాశివాన్ని ఓదార్చింది. ఎంతో దూరాలోచన దూరదృష్టి కలిగిన స్త్రీగా సునందినీ దేవి నిల్చింది. సందర్భం వచ్చిన ప్రతిసారీ తొమ్మిది పదేళ్ళుగా దగ్గరగా ఉండి కూడా వివాహం చేసుకోతలపెట్టని సదాశివపు పట్టుదలని ఆక్షేపించింది. సదాశివం కోమలుల వివాహాన్ని వైభవంగా జరిపించింది. అన్నీ గాడిలో పడ్డాక మళ్ళీ సుల్తానాగా వంట పని అజమాయిషి చేయసాగింది.

రాజమాతగా బంగళా, వంట పర్యవేక్షించే వ్యక్తిగా క్వార్టర్సును తన ఆవాసంగా నిర్ణయించుకొంది. వంట పర్యవేక్షణకు జీతం క్వార్టర్సు ఆమెకు లభిస్తాయి. ఆ ప్రకారం తనను తాను ఒక పరిధికి పరిమితికి కట్టుబడేలా నిర్ణయించుకొంది. నూతన జంటను ఒప్పించింది. 'మీరు బ్రహ్మచారిగా ఉండిపోతారన్న భయంతో కంటి ఎదుట ఉన్న కోమలిని, కాంతిజ్వాలను, తేజస్సంపన్నను దూరం చేసుకొంటారేమోనన్న భయంతో కన్నతల్లి గుండె ఆర్తితో నా ఉనికిని తెలుపుకొన్నాను(పు.155) అనే సునందినీ దేవికి రాచరికపు ఆడంబరాలు అక్కరలేదు.

ముగింపు :

పై కోరుకొన్న రాజమాత గుర్తింపు లభించింది. అది విలాసాలకు ఆమె కోరుకోలేదు. ఒక అస్తిత్వకాంక్ష. పసితనంలో కోరిక పెద్దరికంలో అవసరమయింది. తీరింది. అంతే. అంతకు మించిన లాలనత లేదు. ఈ స్త్రీ త్యాగానికి ప్రతీక. ప్రేమకు ప్రతీక. పట్టుదలకు ప్రతీక. నిరీక్షణకు ప్రతీక. సహనానికి ప్రతీక. అనుకొన్నది సాధించటానికి ప్రతీక. తానేర్పర్చుకొన్న నియమాలకు కట్టుబడి ఉండటానికి ప్రతీక. దృఢ వ్యక్తిత్వానికి ప్రతీక. సమున్నత ఆత్మగౌరవ ప్రదర్శిక 'కన్నతల్లి'.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఎలక్ట్రానిక్ మాధ్యమాలు – తెలుగు భాషా వైవిధ్యం

– డా॥. బాశెట్టి లత, ప్రిన్సిపాల్ (F.A.C.), ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల, ఆత్మకూరు, కర్నూలు జిల్లా.

భాషలో కాలానుగుణంగా మార్పులొస్తుంటేనే ఆ భాషలో జీవమున్నట్లు లెక్క. అందుకే నన్నయ కాలం నుండి నేటి వరకు ఉన్న భాషను చారిత్రకంగా పరిశీలించినప్పుడు ఈ విషయం స్పష్టమౌతుంది. శాస్త్ర సాంకేతికరంగాల అభివృద్ధి వల్ల 21వ శతాబ్దంలో ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో భాష తనదైన వైవిధ్యాన్ని కలిగి ఉంది. రాసే భాషకు, మాట్లాడే భాషకు మార్పు ఉండడం సహజం మాట్లాడే భాషలో పదాల పొందిక (Coherence) సహజంగా ఉంటుంది. వక్త చెప్తున్న మాటల్ని శ్రోత విన్నప్పుడు ఆ భావాన్ని స్పష్టంగా అర్థం చేసుకుంటాడు. కానీ ఆ మాటల్నే రాసేటప్పుడు పాఠకుడికి అస్పష్టత కన్పిస్తుంది.

ఉదా :- ఎందుకంట అంత కోపం ? దానికేం తక్కువ లేదు !

ఈ మాటల్ని రాతలో ఇలాగే ఉంచలేం. ఇక్కడ ఎవరు ఎవరితో ఎవర్ని ఉద్దేశించి చెప్తున్నారో స్పష్టపరచాల్సిన అవసరం ఉంది. టి.వి. (టెలివిజన్) ఈనాడు సమాజంలో విజ్ఞాన వినోదాలతో విలాసవంతమైన జీవనాన్ని అందిస్తూ టి.వి. లేనిదే ప్రజల దైనందిన జీవితం సాగని పరిస్థితిలో ఉన్నాం.

ఉదా - టి.వి లోని వార్తల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఉద్యోగాలు, పవర్ కనెక్షన్స్, వంటగ్యాస్ సరఫరా, బంగారం ధరలు, నిత్యావసరాలైన కూరగాయాల, పప్పుల ధరలు తగ్గుతున్నాయా ? పెరుగుతున్నాయా? అన్న విషయాలు అతి త్వరగా తెలుసుకునే అవకాశం ఉంది. మానవనైజాన్ని, బట్టి చదవడం, వినడం కన్నా చూసేదానికే (visual) ఎక్కువ శక్తి గల టి.వి. ఎలక్ట్రానిక్ మీడియాలో తన సమాచారంతో ప్రజలపై చాలా ప్రభావం చూపిస్తూ ప్రసారమాధ్యమాల్లో ప్రథమ స్థానంలో ఉంది. అందుకే ప్రచార-ప్రసార సాధనాలు లేని ఆధునిక ప్రపంచాన్ని మనం ఊహించలేం.

ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో భాష అన్ని కార్యక్రమాల్లో ఒకే రకంగా ఉండదు కార్యక్రమాన్ని బట్టి, ప్రయోజనాన్ని బట్టి మారుతూ ఉంటుంది.

ఉదా- స్నేహితులతో ఒక విధంగా, ఉపన్యాసంలో ఒక విధంగా మాట్లాడుతాం స్నేహితులతో మాట్లాడేటప్పుడు పునరుక్తి (Reinforcement) కన్పిస్తుంది. ఎలక్రానిక్ మాధ్యమాల్లో టి.వి. చాన్నళ్ళలోని రాసేభాషకు మాట్లాడే భాషకు గల వైవిధ్యాలను గుర్తించడం ఈ వ్యాసం ఉద్దేశం.

తెలుగులో రాసే భాషకు, ఉచ్చారణకు చాలా దగ్గరి సంబంధం ఉన్నప్పటికీ, ఉచ్చారణంలో వచ్చిన మార్పులు రాతలో వెంటనే చేరనందువల్ల చిన్న మార్పులు కనిస్తాయి. కానీ ఉచ్చారణలో ఉన్న చిన్న మార్పులు అర్థాన్ని మార్చలేవు.

ఉదా - అయితే-ఐతే, అవును-ఔను.

నిర్వచనాలు :

సోపూర్ తన కోర్సులో "Lanhue et ecriture soul deux systems de signe district. Unique raison d'etre de second est de representere le premier" అన్నారు. భాష లిపి రెండు పద్ధతులు మాట్లాడిందాన్ని రాయటంలో లిపికి ఉనికి ఉంది.

Leonard Bloomfield "Language"లో(1933) "Writing is not language. but merely, a way of recording language by means అన్నారు. రాత భాష కాదు. భాషను రికార్డు చెయ్యడానికి ఉపయోగించే దృశ్య చిహ్నాలు మాత్రమే.

Charles Hockett తన కోర్సు (1958)లో "Speech and Writing are merely two different manifestations of Something of fundamentally same things" అన్నారు. మాట, రాత అనేవి ఒకే మూల పదార్థానికి రెండు వ్యక్త రూపాలు. లోకో భిన్న రుచి. అన్నట్లుగా నిర్వచనాలు ఆ యా వ్యక్తుల బుద్ధి అవ గాహనకు సంబంధించినవే తప్ప ఏవీ సమగ్రమూ అని చెప్పలేం. పరిశోధనా పరిణామంలో చాలా అభిప్రాయాలు వెల్లడౌతాయి.

భాషావైవిధ్యం :

మానవుడు సంఘజీవి. అతడు తన అభిప్రాయాల్ని, అనుభూతుల్ని, ఆలోచనల్ని అభివ్యక్తం చేయడానికి సృష్టించుకున్న సాధనమే భాష-భాష అన్ని సందర్భాలలో ఒకేలా ఉండదు. ప్రస్తుతం నా అంశం టి.వి. ఛానళ్ళలోని భాషావైవిధ్యాన్ని పరిశీలించడం కాబట్టి ముందుగా దూరదర్శన్ MAA, GEMINI, ZEE, ETV, TV9ల ఛానళ్ళను తీసుకున్నాను. ఈ ఛానళ్ళ కార్యక్రమాలను ప్రధానంగా రెండు రకానలుగా విభజించుకొని భాషా వైవిధ్యాన్ని నిరూపించదలచుకున్నాను. అవి -

అ) పూర్వ సిద్ధత ఉన్న కార్యక్రమాలు

ఆ) ప్రత్యక్ష కార్యక్రమాలు (live Programmes)

అ) పూర్వసిద్ధత ఉన్న కార్యక్రమాలు :

1. న్యూస్ 2. భక్తి - అధ్యాత్మికత, 3. సీరియళ్ళు 4. పిల్లల కార్యక్రమాలు 5. వ్యవసాయం

1. న్యూస్ - టి.వి.9, 21-09-2010 - 9:30 గం.లకి ప్రసారమైన గీతారెడ్డి గారి గురించిన ప్రత్యేక కథనంలో ముందుగా - గీతమ్మకు సీమగాలి అని హెడ్ లైన్ ప్రసారం చేసి తర్వాత ఆ వాక్యాన్ని విశదపరచే అంశాల్ని అందించారు. హెడ్ లైన్ లో తర్వాతి అంశాల్ని విశదీకరించే సంక్షిప్తత అన్న లక్షణం ఉంటుంది. స్క్రిప్టు ముందే తయారు చేసుకోవడం వల్ల ఇందులో మాట్లాడే బాష కన్నా రాసే భాష ఎక్కువగా ప్రతిఫలించే అవకాశం ఉంది. గత కొన్నాళ్ళ నుండి 24 గం.ల వార్తా ఛానాళ్ళు బాగా పెరిగి 30 కి పైగా రావడం విశేషం. ఈ 24 గం.ల ఛానళ్ళలో ఎక్కువగా రిపిటేషన్ కన్పిస్తుంది.

2. భక్తి - అధ్యాత్మికత - భక్తి అనే పదం భజ్ సేవా లయం అన్న సంస్కృతం ధాతువు నుండి నిష్పన్నమైంది. భారతీయుల ఆధ్యాత్మిక వారసత్వం చాలా సుసంపన్న మైంది. జీ తెలుగు, మా టి.వి. ఛానళ్ళలో భక్తి సమాచారం, గోపురం, పుణ్యక్షేత్రాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ముందే స్క్రిప్టు సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. ఉదా - 22-09-2010 ఉదయం 8 గం.లకు గోపురం జీ తెలుగు కార్యక్రమంలో 'అనంత చతుర్దశ వ్రత విశేషాలు' అన్ని అంశంపై కార్యక్రమం ప్రసారం అయింది. ఇందులో ఆ వ్రత మహిమను, విశేషాంశాలను చెప్పటం జరిగింది. దీనిలో రాసే భాష ప్రధానంగా ప్రతిఫలించింది.

3. సీరియళ్ళు : ఇవి రెండు విభజించాను. భక్తి సీరి యళ్ళు, లౌకిక సీరియళ్ళు. శ్రీ కృష్ణ, షిర్డీసాయి కథ, శనిదేవుని మహిమలు వంటి భక్తి సీరియళ్ళు సాహిత్య విలువలతో కూడుకున్నవి కాబట్టి పూర్వ సిద్ధత తప్పనిసరి. లౌకిక సీరియళ్ళలో ఎక్కువ శాతం టైటిల్స్ స్త్రీలపరంగా ఉన్నాయి. కారణం స్త్రీ కే అన్ని సీరియళ్ళలో ఒక కొత్త వ్యక్తిత్వం (లేడీ విలన్) ఆపాదించి కేంద్ర బిందువుగా మార్చేశారు. లేడీ విలన్ లేని సీరియల్ లేదంటే ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి కన్పిస్తుంది.

ఉదా :- జగదీశ్వరి, అరుంధతీ, పుత్తడిబొమ్మ, చిట్టెమ్మ.

4. పిల్లల కార్యక్రమాలు -

పాపం పుణ్యం ప్రపంచ మార్గం
కష్టం సౌఖ్యం శ్లేషార్థాలు
--- --- ---
మీరే లోకపు భాగ్య విధాతలు
(శ్రీశ్రీ శైశవగీతం - మహాప్రస్థానం)

మధురమైన శైశవదశలో ఉన్న నేటి బాలలే రేపటి పౌరులు పిల్లల కోసం, పిల్లలనుద్దేశించి చేసే కార్య

క్రమాలలో చెప్పుకోదగ్గవి ఈ టివిలో పంచతంత్రం, చిట్టి కథల చింటూ వంటి కార్యక్రమాలు పిల్లల్ని బాగా అల రిస్తున్నాయి. పిల్లల కోసం ప్రత్యేక ఛానల్ కార్టూన్ ఉంది. పిల్లల Impressible age కాబట్టి సులువుగా అర్థం చేసుకొనేందుకు ముందుగానే స్క్రిప్టు రాయడం జరుగు తుంది. చిన్నప్పటి నుండే పిల్లలకు వినోదంతో పాటు మంచి సందేశాన్నందించే కార్యక్రమాలను అందించే బాధ్యత మనందరిపైన ఉన్నది. 'మొక్కై వంగనిదే మానై వంగదు.' కదా!

5. వ్యవసాయం - అన్నదాత, జై కిసాన్, కృషిదర్శిని వంటి వ్యవసాయ కార్యక్రమాలలో పంటపొలాలకు వచ్చే చీడలు, పురుగుల మందులు, ఎరువుల గురించి మాట్లాడటం జరుగుంది. ఈ భాష రైతుకి అర్థమయ్యే స్థాయిలో ఉన్న దాన్ని రాసినప్పుడు భాషలో మార్పు కన్పిస్తుంది.

ఉదా- 1. ఈ పైర్లను ఆశించిన చీడపీడలను లీటరు నీటికి పది మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్ కలిపిన మిశ్రమాన్ని పిచికారి చేసి సమర్థంగా నివారించుకోవచ్చు.

2. లీటర్ నీళ్ళలో 10 మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్ కలిపి కొడితే అన్ని (పురుగుల) పోతాయి. ఈ రెండు వాక్యాల్లో ని భావం ఒక్కటే కానీ రాతలో పెట్టినప్పుడు వాక్య నిర్మాణంలో పదగత మార్పులు కన్పిస్తాయి.

ఆ) ప్రత్యక్ష కార్యక్రమాలు :

1. రీయాల్టీ షో లు - దీనిలోని టాలెంట్, కాంటెస్ట్, గేమ్ షోలు వస్తాయి ఉదా:- మా టివిలో సూపర్ సింగర్స్, మొగుడ్స్-పెళ్ళామ్స్, రేలారె రేలా, ఛాలెంజ్ ఆటోజానీ, లేడీబాస్ లాంటివి. జెమినిలో చర్చావేదికగా ప్రజావేదిక. ఈ టివి లో ప్రతిధ్వని, జెమిని, మ్యూజిక్, జీ తెలుగులో ఆట జూనియర్స్ వంటి కార్యక్రమాలు ఇందులోకి వస్తాయి. ఇవి ప్రత్యక్ష కార్యక్రమాలు అవటం వల్ల ఇందులో ఎక్కువగా మాట్లాడే భాషకే ప్రాధాన్యం కన్పి స్తుంది.

ఉదా :- జెమిని మ్యూజిక్‌లో 21-09-2010 రోజున ఉదయం 10 గం.లకు "హాయ్ ఏం తింక్ చేస్తున్నావ్" అన్నాడు. యాంకర్. 'ఏం ఆలోచిస్తున్నావ్' అనే మాట వ్యవహారంలో ఆ యాంకర్ కి గుర్తుకురాలేదు కారణం ఆ పదం వ్యవహారంలో విస్తృతంగా లేక పోవడమే.

2. సాహిత్యం : సాహిత్యం సమకాలీన సమాజాన్ని ప్రతిబింబింపచేయడమే కాదు. ఆ సమాజంలోని వ్యక్తి ప్రతిస్పందనలకి, ప్రతి రూపంగా నిలుస్తుంది సాహిత్య కార్యక్రమాల విషయంలో ఏ ఛానల్ చేయలేని కృషి దూరదర్శన్ లో నేటికీ కన్పిస్తుంది. తెలుగులో గొప్ప సాహిత్యం ఉందనీ, దాన్ని చర్చల ద్వారా, నాటకాల రూపంలో చూపించొచ్చనీ ప్రఖ్యాత కథకులు, నవలా కారుల రచనలకు నాటకాలుగా రూపొందించడం, కళా రంగంలో సాహిత్య, క్రీడారంగంలో మొదలైన అన్ని రంగాల్లో ప్రముఖులైన వారిని ఇంటర్వ్యూలు చేయడం వంటి మంచి పనులు 'The good old Doordarshan' ఇప్పటికీ చేస్తూనే ఉంది.

3. విద్య - డిస్కవరీ, జ్ఞానదర్శన్, ఈ టి.వి.లో ప్రగతి, వావ్ షో, నేను రేడీ-మీరు రెడీయా బ్రెయిన్ ఆఫ్ ఆంధ్రా వంటి కార్యక్రమాలు జ్ఞానాన్ని అందిస్తున్నాయి. ఉదా:- ఈ టివి వావ్ షోలో సాయికుమార్ ఆధ్వర్యంలో సమ కాలీన అంశాలపై ప్రశ్న - సమాధానాల కార్యక్రమం (క్విజ్) సాగుతుంది. జ్ఞానాన్ని పెంపొందించే కార్యక్రమాలు చాలా తక్కువని చెప్పొచ్చు ఇంకా జ్ఞానాన్నందించే కార్యక్రమాలు రావల్సి ఉందని భావిస్తున్నాను.

4. ఆరోగ్య : జీవనజ్యోతి (మాటివి), ఆయుర్వేద జీవన విజ్ఞాన (జీతెలగు), ఆరోగ్యానికి 60 సూత్రాలు (మా టివి) వంటి కార్యక్రమాలు మంచి సలహాలతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని ప్రజలకు అందిస్తున్నాయి. ఇందులో స్క్రిప్టు ఏమీ కనబడదు. ముందుగా ఏ విషయంపైన మాట్లా డాలో నిర్ణయించుకొని ఆ విషయంపైన మాట్లాడటం జరుగుతుంది.

ఉదా :- జీవనజ్యోతి 22-09-2010 రోజున ఉదయం 8 గం.లకు తల తిరుగుత నివారణకు యోగలో శీర్షాషణం వేయాలి. ఆసనాల తర్వాత ధ్యానం, శశాసనం తప్పనిసరి అని ప్రసారం అయింది. ఇందులో యోగ, ఆసనం వంటి పారిభాషిక పదాల ప్రయోగం కన్పిస్తుంది. అయిన్పటీకీ ఆ భావం అందరికీ అర్థమయ్యే అవకాశం ఉంది.

ఈ విధంగా పూర్వ సిద్ధత గల కార్యక్రమాలు, ప్రత్యక్ష ప్రసారాలలో భాష కన్పిస్తుంది. ఇవే కాకుండా ఇందులో అన్యదేశ్యపదాల వాడకం, మాండలిక ప్రభావం కూడా కన్పిస్తుంది.

అన్యదేశ్య పదాల వాడకం : ఆధునిక కాలంలో అన్యదేశ్యాల ప్రభావం లేని భాష అంటూ ఏదీ లేదు. ఈ అన్యదేశ్య పదాల వాడకం టివిల్లో ఎక్కువగా ప్రకటనలల్లో (advertisements) కన్పిస్తుంది. ఏ ప్రకటనల్ని తీసుకొన్నా దాని టైటిల్ ఇంగ్లీష్‌లోనే ఉంటుది.

ఉదా :- Fair & Lovely, Fair Ever, Santoor Soap, Ponds, Nirmala Blue, XXX Soap అన్యదేశ్యపదాల్ని అవగాహన కోసం మాట్లాడటం సబబే కానీ, ఒక భావాన్ని స్పష్టంగా అందించే తెలుగు పదాలున్నప్పటికీ అన్య దేశ్యాల వాడుక కొన్ని చోట్ల కన్పిస్తుంది. దాని వల్ల తెలుగు భాషా పదజాలం వ్యవహారంలో పూర్తిగా సన్నగిల్లే ప్రమాదం ఉంది. మరికొద్ది రోజుల తర్వాత ఆ పదాలు ఎవరైనా ప్రయోగిస్తే వింతగా చూసినా ఆశ్చర్యపోనవసరం లేదు.

ఉదా :- కళాశాలకు వెళ్ళావా ? అనకుండా Collegeకి వెళ్ళావా ? అనడం.

విశ్వవిద్యాలయంకు వెళ్ళావా? అనకుండా Universityకి వెళ్ళావా? అనడం

అందుబాటులో లేదు అనకుండా Available గా లేదు.

ఎలక్ట్రానిక్ మాధ్యమాల ప్రభావం ప్రజలపై చాలా వేగంగా పడుతుంది. “Justice Delayed is Justice Denied” అనేది సూక్తి కాబట్టి వీలైనంత వేగంగా ఆంగ్ల పదాలకు తెలుగు పదాల్ని తయారు చేసి వాటిన ప్రసార మాధ్యమాల ద్వారా వాడుతూ ఉంటే తెలుగు పదాలను, భాషను కాపాడుకోవడానికి అవకాశం ఉంది.

మాండలికం : ఒక ప్రదేశానికి లేక ప్రాంతానికి సంబంధించిన ప్రజలు వ్యవహరించే భాషావిశేషమే - మాండలికం. ప్రాంతాన్ని బట్టి, ప్రయోజనాన్ని బట్టి యాస కన్పిస్తుంది.

ఉదా :- రేలారే రేలా దుమ్ములేపు కార్యక్రమంలో అయా ప్రాంతాల జానపద గేయ సంస్కృతిని నిల బెట్టాలన్ని కార్యక్రమాల్లో యాస మాట్లాడకపోయినా ఈ కార్యక్రమంలో యాంకర్ ఉదయభాను మాట్లాడటం కన్పిస్తుంది.

ఉదా :- ఏం పిల్ల మస్తే రెడీయై వచ్చినవ్ మాకిప్పుడేం పాటిన్పిస్తున్నవ్.

ఒక భాష ఇతర భాషల నుండి పదాల్ని స్వీకరించడాన్ని ఆదానం అంటారు. ఒకే భాష మాట్లాడే ప్రజల్లో కూడా మాండలిక భేదాలుంటాయి. పదాలనే కాక, ఒక మాండలిక ఉచ్చారణని, అన్య మండలాల్లోని వాళ్ళు ప్రయోగిస్తే దాన్ని మాండలిక ఆదానత్వం అంటారు.

ముగింపు :

ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో పూర్వ సిద్ధత వల్ల మాట్లాడే భాష రాసే భాషా లక్షణాలతో ప్రతిఫలిస్తుంది. పూర్వ సిద్ధత లేని ప్రత్యక్ష కార్యక్రమాలల్లో మాట్లాడే భాష మాత్రమే ప్రతిఫలిస్తుంది. మాట్లాడే భాష - రాసే భాష రెంటినీ విన్నప్పుడు విషయ అవగాహన కల్గినప్పటికీ ఆ రెంటినీ రాసినప్పుడు భాషావైవిధ్యం స్పష్టంగా కన్పిస్తుంది. Public Interest అంటే ప్రజలకు ఏది Interest ఆ అనే అభిప్రాయం స్థిరపడిపోయింది. కానీ ప్రజలకు ఉపయోగపడేది ప్రయోజనం కల్గించేది అన్న భావంతో సమాజం, రాజకీయం, క్రీడలు, కళలు ఏ రంగానికి చెందినవైనా సరే ఆ వివరాల్ని, విశేషాల్ని విశ్లేషించి ప్రజలకు సూటిగా అందించి వారిని చైతన్యవంతుల్ని చేసే బాధ్యత టివి ఛానళ్ళపై ఉందని భావిస్తూ ముగిస్తున్నాను.

ఉపయోగిత గ్రంథాలు :

1. పవన్ కుమార్ పమ్మి-భాషాభూషణ, 2009 తెలుగు శాఖ , హై.వి.వి., హైద్రాబాద్.
2. రామారావు చేకూరి - భాషాతరంగం, 2000, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైద్రాబాద్.
3. విశ్వేశ్వరరావు నామాల- తెలుగు జర్నలిజం చరిత్ర, 2003, నవోదయం బుక్ హౌస్, హైద్రాబాద్.
4. వేణుగోపాల్ నాగ సూరి - ఛానళ్ళ విస్రృతి - సీరియళ్ళ వికృతి, 2006, ఆకాష్ పబ్లికేషన్స్, సామర్లకోట.
5. వార్తా మాధ్యమాల విశ్వనీయత - CPM, నార్ పుస్తకం, 2006, హైద్రాబాద్.
4. శ్రీశ్రీ - మహాప్రస్థానం - 2012- విశాలాంధ్ర పబ్లికేషన్స్, విశాఖపట్నం.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పాకుడురాళ్ళు నవలా ప్రాశస్త్యం

- నక్కా శ్రీనివాసరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

తెలుగువాడి కోసం తెలుగువాడు రాసిన నవల పాకుడురాళ్ళు. ఏ రచయిత చూపులకు తగలని సామాజిక కోణాలే ఈ రచయిత రచనలకు వస్తువు. మొదట్లో 1961-63 సం॥ల్లో కృష్ణా పత్రికలో ధారావాహికంగా ప్రచురింపబడింది. మొదట దీన్ని ''పాలపుంత'' అనే కథానికగా రాశాడు. 1978లో మొదట కమలాపబ్లిషింగ్ వారు పుస్తకంగా ప్రచురించారు. తరువాత ఈ కథను పెంచి నవలగా రచించాడు. భరద్వాజ ఈ నవలకు మొదట ''మాయజలతారు'' అను పేరు పెట్టాడు. కానీ శీలా వీర్రాజు దీనికి ''పాకుడురాళ్ళు'' అని పేరు మార్చాడు. పాకుడురాళ్ళు అనగా - నిలవ నీళ్ళలో ఒడ్డుకు దగ్గరగా కనబడీ కనబడకుండా ఉన్న బండరాళ్ళ మీద పాచిపేరుకునుంటుంది. సూర్యకిరణాల వెలుగు పడ్డప్పుడు ఆ పాచి తళతళా మెరుస్తూంటూంది. ఆకర్షణీయంగా ఉంటుంది. ఆ రాళ్ళమీద కాలెట్టి నిలబడదామనుకున్నా అలా నిలబడి గాలమేసి చిన్న చిన్న చేపల్ని పడదామనుకుని ఎక్కినవాడు రాళ్ళమీద పాచివల్ల జారి నీళ్ళలో పడడం సహజం. సినిమా ప్రపంచంలో జీవితాన్ని అన్ని కోణాల్లోంచి దర్శించి వెలువడిన ఒక మహత్తర వాస్తవిక నవల ఇది. భరద్వాజ 3 1/2 సం॥లు మద్రాసులో ఉండి సేకరించిన సమాచార సమాహారమే ఈ నవల.

నవలా ప్రాశస్త్యం :

భరద్వాజ రచనలన్నింటిలోకి ఉత్తమశ్రేణికి చెందిన బృహద్గ్రంథం పాకుడురాళ్ళు. సినిమా రంగంలోని సమస్త కశ్మలాన్ని రచయిత తూర్పార బట్టాడు. ఇందులోకి చాలా పాత్రలు వస్తాయి, నిశ్శబ్దంగా నిష్క్రమిస్తాయి. ఈ నవలలో అవలంబించిన శిల్పం ప్రముఖ రచయితల ప్రశంసలను అందుకుంది. మాధవరావు అన్న పాత్ర ఆత్మకథనంతో నవల ప్రారంభమై, చివరికి అతడే ఈ నవలను ముగించేస్తాడు. ఈ నవలను సమీక్షిస్తూ సుప్రసిద్ధ సాహిత్య విమర్శకుడు శ్రీవాత్సవ ''సినిమా పరిశ్రమను గూర్చి మద్రాసు, బొంబాయి నగరాల్లో అదిపోయిన పోకడలను గూర్చి ఇంత వాస్తవికంగా, ఇంత మనోహరంగా చిత్రించిన నవల తెలుగులోనే కాదు ఏ భాషలో కూడా ఇంతవరకు రాలేదు'' అన్నారు. డా॥ సి.నారాయణ రెడ్డి, డా॥ అడపా రామకృష్ణారావు, డా॥ నాయని కృష్ణకుమారి, డా॥ అమరేంద్ర, డా॥ గిడుగు సీతాపతి ప్రభృతులు ఈ నవలా వైశిష్ట్యాన్ని ఎంతగానో కొనియాడారు.

> నిజానికి పాకుడురాళ్ళు నవలకు తరువాయి భాగం పేర్కొనవచ్చు....
>
> - డా॥ మొదలినాగ భూషణ శర్మ.

> ''వస్తువుకూ - శిల్పానికీ సమపాళ్ళలో న్యాయం చేకూర్చగల బహుకొద్దిమంది రచయితలలో భరద్వాజ ఒకడు...
>
> - ఎ.బి.కె. ప్రసాద్.

> భరద్వాజ రచనల్లో ప్రతిభ ఉంది. స్పార్క్ ఉంది. శిల్పం ఉంది. ఒక విశిష్టత ఉంది...
>
> - పన్యాల రంగనాథరావు.

తెలుగులో వెలువడిన ''ప్రప్రథమ నేచురలిస్ట్ నవలగా'' పాకుడురాళ్ళు పేరు ప్రతిష్టలు గడిచింది. సినీ ప్రపంచాన్ని ఇంతలోతుగా, ఇంత నిశితంగా, ఇంత స్పష్టంగా చిత్రించిన పెద్ద నవలగా రావడం భారతదేశంలోనే ప్రప్రథమం. తెలుగుకు వచ్చిన మొదటి రెండు జ్ఞానపీఠ్ అవార్డులు తెలుగు పండితులకైతే మొదటిసారి తెలుగు పాండిత్యం లేని, తెలుగు బోధించని ఒక నిఖార్సయిన సాహిత్య కారుడికిది వచ్చింది. మొదటి రెండూ కవిత్వానికి వస్తే, ఇప్పుడు మొదటిసారి తెలుగు వచనానికి ఆ గౌరవం దక్కింది. ఈ రెండు ఘనతలు

సాధించింది రావూరి భరద్వాజగారే కావడం గమనించాల్సిన విషయం.

నవలలో వస్తువు (సంక్షిప్తంగా) :

గుంటూరు గుడిసెల్లో జన్మించి, నాగమణి నడిపే పడుపు వృత్తి కంపెనీలో ఉండే మంగమ్మ అనే అమ్మాయి మాధవరావు, రామచంద్రం పుణ్యమా అంటూ నాటక కంపెనీలో ప్రవేశిస్తుంది. తరువాత చలపతితో కలసి మద్రాసు సినీరంగంలో ప్రవేశించిన మంగమ్మ మంజరిగా మారిపోతుంది. మంజరి సినిమా రంగంలో ప్రముఖ తారగా వెలుగొందాలనే నిర్ణయంతో నీతి, నియమాలకు తిలోదకాలిస్తుంది. చలపతి మొదలుకొని రాజన్, లాలారం, సేఠ్‌కిషన్‌దాస్ తోనే గాక ఇంకా ఎందరికో తన శరీరాన్నప్పగిస్తుంది. ఫలితంగా సినీరంగంలో శిఖరాగ్రం చేరుకొంటుంది. విదేశాలకు వెళ్తుంది. అతిసామాన్య స్థితి నుండి ఒక మెట్టు తరువాత మరోమెట్టును అధిరోహిస్థుంది. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. మంజరి విలువన్నింటిని గాలికి వదిలేసింది. కళ్యాణిని ఎవరో హత్య చేశారు. హంతకుల ఆచూకీ తెలుసుకోవడానికి పోలీసులు మంజరిని ప్రశ్నలతో వేధించారు. చనిపోకముందు కళ్యాణి తన ఆస్తిలో సగభాగం మంజరికి, మిగిలిన సగం మంజరికి ఇష్టమైన ధర్మకార్యాలకు వినియోగించమని వీలునామా రాసింది. ఈ సంగతి మంజరికి తెలియదు. దు:ఖంలో మంజరి చిత్తుగా తాగాలనుకొన్నది. కళ్యాణి జీవిత కథను చలపతి మంజరికి చెప్పాడు. ఇద్దరు హీరోల మధ్య పోటీలో మంజరి చాలా చిక్కులు పడింది. మంజరి విదేశాలు సందర్శించి మార్లిన్ మన్రోను, ఎలిజబెత్ టేలర్‌ను చూచి వచ్చింది. మంజరి ప్రియుడు కిషన్‌దాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల బారినుండి తప్పించుకోవడానికి డిల్లీలో ఒక ప్రముఖ వ్యక్తి సక్సేనా సహాయం కోరింది. సక్సేనా ప్రతిఫలం కోరాడు. అది ఆమె బ్లూ ఫిలింలో నటించడం. మరోమార్గంలేక అతను కోరినట్లు బ్లూ ఫిలింలో నిటించింది. సక్సేనా బ్లాక్ మెయిలింగ్ చేశాడు. ఆందోళనను, భయాన్ని తట్టుకోలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకొన్నది మార్లిన్ మాన్రోలాగే. మంజరిని చూడటానికి వచ్చిన మాధవరావు ఆమె మరణవృత్తాంతం తెల్పటంతో పాకుడురాళ్ళు నవల పూర్తైంది.

చలనచిత్ర రంగ పరిశ్రమ తీరు తెన్నులు :

సినిమా వృత్తిని ఆధారంగా తీసుకొని నవల రాయడంలో భరద్వాజగారే మొదటి వారు. నాటకరంగం ప్రజాదరణ కోల్పోతున్న తరుణంలో సినిమా కళ వచ్చింది. సినిమాను ఒక కళగా కాక వ్యాపారంగానే భారతీయులు చూశారు. సినిమా తారలం కావాలని వచ్చే స్త్రీల శరీరాలే పురుషులకు కనిపించాయి. స్త్రీ శరీరాలు అర్పించుకున్నప్పుడే నటించే అవకాశాలివ్వటం జరిగింది. పురుషులకు స్త్రీలు అనుభవించే వస్తువుగానే కనిపించింది. ఆమె ఆత్మ, హృదయం, మనస్సు, ఆలోచనలు, ఇష్టాయిష్టాలు కనిపించవు. ఈ మధ్య సిల్క్‌స్మిత జీవితాన్ని ఆధారంగా తీసుకుని హిందీలో 'డర్టీ పిక్చర్' అనే సినిమా తీశారు.

ఈ నవలలో మంజరి సినిమా రంగంలో అడుగు పెట్టడానికి చేసిన ప్రయత్నాల దగ్గర నుంచి అంతం వరకు పాకుడురాళ్ళు నవల అంతా సినిమా ప్రపంచమే.

సినిమా రంగంలో సత్యజిత్‌రే, మృణాళ్‌సేన్, బెనెగల్ నరసింహారావు వంటి సినిమా కళను తెలిసినవాళ్ళు దానికి అంకితమైనవాళ్ళు తక్కువ. సేఠ్‌లు, లాలాలు, పాగాకు వ్యాపారులు కళాతృష్ణతో కాక డబ్బు సంపాదించాలనే ఆశతో సినిమాలు చిత్రించటం జరిగింది. మొత్తం మీద సినిమారంగం ఎట్లావుంటుందో అన్ని కోణాలనుంచి చిత్రించి చూపుతున్న నవల పాకుడురాళ్ళు. భారతీయ సినిమా వందేళ్ళపండుగ జరుపుకుంటున్న తరుణంలో పాకుడురాళ్ళు నవలకు జ్ఞాన పీఠ అవార్డురావడం చాలా సముచితంగా వుంది. సినిమా రంగం పట్ల ఆకర్షణతో స్టార్ నవుతానన్న ఆశతో మద్రాస్‌పోయి తిండిలేక మలమల మాడుతూ, వేశ్యలుగా, కాల్ గరల్స్‌గా

యువతులు మారిపోతున్నారు. సినిమా జగత్తులో అన్నీ పాకుడురాళ్ళే. అడుగడుగునా జారిపడుతూ లేస్తూ జీవితం గడపడమే. సినిమా తారల ఆంతరంగికమైన విషాదాన్ని, సినిమా రంగంలోని జీవితాలను, రాజకీయాలను, కుళ్ళును, విషాదాలను, ప్రేమరాహిత్యాన్ని, అభద్రతను వాస్తవికంగా చిత్రించాడు భరద్వాజ. సినిమాజగత్తును, ఒక హీరోయిన్ చరిత్ర చెప్పే నవలలో ఎంతో అశ్లీలతను తెచ్చే అవకాశం ఉంది. కానీ రావూరి గారు ఎక్కడా అశ్లీలతకు పోకుండా ఎన్నో యథార్థ సంఘటలను చెప్తూ రచించారు. మంజరి పాత్రని యథార్థంగా రక్తమాంసాలున్న వ్యక్తిగా సజీవపాత్రగా చిత్రించాడు భరద్వాజ.

BHAVAVEENA
Vol. 18, Issue. 4, April 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

విశ్వనాథ సత్యనారాయణ – రచన వైశిష్ట్యం

– డా॥ బూసి వెంకటస్వామి, శాఖాధిపతి, తెలుగు విభాగము, పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు.

కవి సామ్రాట్ బిరుదాంకితుడు విశ్వనాథ సత్య నారాయణ. తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత. 20వ శతాబ్దపు సంప్రదాయ సాహిత్యంలో విశ్వనాథ చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు కావ్యాలు, కవితలు, నవలలు, నాటకాలు, పద్య కావ్యాలు, ప్రయోగాలు, విమర్శలు, వ్యాసాలు, కథలు, చరిత్రలు పాండిత్య ప్రతిభా పాటవాలకు నిదర్శనాలు.

విశ్వనాథ 1895 సంవత్సరం సెప్టెంబర్ 10న కృష్ణా జిల్లా నందమూరులో శోభనాద్రి, పార్వతి దంపతులకు జన్మించారు. విశ్వనాథ దాతృత్వం భక్తి గుణాలు తండ్రి నుంచే సంక్రమించాయని అనేక సందర్భాల్లో స్వయంగా చెప్పుకున్నారు. బాల్యంలో పుట్టి పెరిగిన గ్రామం, దానిలో దేశ కవితా రీతులలో గానం చేసే భిక్షుక బృందాలు, పురాణ గాథలు నేర్చుకుని ప్రవచించడంతో నిత్యం గడిపే స్వజనం అతని కవిత్వానికి పునాదులు వేశాయి.

పాఠశాల స్థాయి నుండి కళాశాల విద్యార్థి దశకు చేరుకున్నాడు. ఎన్నో ఒడిదుడుకులను చవి చూశారు. కళాశాల విద్యార్థి దశలోనే సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. ఆ తరుణంలో తండ్రి మరణంతో కుటుంబ బాధ్యత తనపైబడింది.

ఆర్థిక పరిస్థితుల కారణంగా బి.ఏ. చదువకు స్వస్తి పలికారు. కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తూ బి.ఏ పూర్తి చేశారు. విశ్వనాథ గురువు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి. బందర్ నేషనల్ కాలేజీలోను, గుంటూరు క్రిస్టియన్ కాలేజిల్లో అధ్యాపకుడిగా పనిచేస్తూ రచనలు, రేడియో ప్రసంగాలతో సాహిత్యానికి పదును పెట్టారు.

విశ్వనాథ తన జీవితంలో 1932 సంవత్సరం నుండి 1938 సంవత్సరం మధ్య కాలాన్ని కష్టకాలంగా పేర్కొన్నారు. ఈ సమయంలో స్థిరమైన ఉద్యోగం లేక జీవనం దుర్భరమైనది. ఆర్థికపరమైన ఇబ్బందులు, అనారోగ్య కారణంగా ప్రాణంగా భావించే భార్య చనిపోవడంతో మానసికమైన దుఃఖాన్ని అనుభవించారు. విశ్వనాథ రచనల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన రచనలు ఈ కాలంలోనే వెలువడ్డాయి. 1976 వ సంవత్సరం అక్టోబర్ 8న విశ్వనాథ భువి నుండి దివికి చేరారు.

విశ్వనాథ వారి సాహిత్య ప్రస్థానం 1916 సంవత్సరం 'విశ్వేశ్వర శతకం' రచనతో ప్రారంభమైంది. స్వతంత్ర పోరాట సమయంలో జాతీయోద్యమ ప్రభావంతో 'ఆంధ్రపౌరుషం' రచించారు. 1920 సంవత్సరం నాటికే తెలుగు సాహిత్యంలో సుప్రసిద్ధ రచయితగా గుర్తింపు పొందారు. దీనితో తెలుగు నాట విశ్వనాథ సాహిత్య జోరు ఊపందుకుంది.

విశ్వనాథ రచనలు :

కావ్యాలు :

ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి, గిరి కుమారుని ప్రేమ గీతాలు, శృంగారవీధి, శశిదుంతం, ఋతుసంహారం, కిన్నెరసాని, కోకిలమ్మపెళ్ళి, మాస్వామి, వరలక్ష్మీ, త్రిశతి, ఝాన్సీరాణి, శవార్పణం, భ్రమర గీతాలు మొదలగునవి.

కావ్యేతిహాసం :

శ్రీ మద్రామాయణ కల్పవృక్షం.

నవలలు :

వేయి పడగలు, ఏకవీర, మాబాబు, చెలియని కట్ట, తెరచిరాజు, హాహా హూహూ, స్వర్గానికి నిచ్చెనలు, విష్ణుశర్మ, ఇంగ్లీషు చదువు, బద్దన్న సేనాని, సముద్రపు దిబ్బ, వీరవల్లడు, కడిమిచెట్టు, పులిమ్రుగ్గు, నందోరాజు భవిష్యతి, దిండుక్రింద పోకచెక్క, వీరపూజ, ధర్మచక్రం మొదలగు 60కి పైగా రచించారు. 'పురాణ గ్రంథ వైరమాల'గా కొన్ని రచనలు రచించారు.

శతకాలు :

మాస్వామి.

నాటకాలు :

అవతార పరివర్తనం (కొడాలి వారితో కలిసి), సాప్తిక ప్రళయం, నర్తనశాల, అనార్కలి, వేనరాజు, తల్లికాని పిల్ల, త్రిశూలం.

సంస్కృత నాటకాలు :

గుప్తపాశుపతం, అమృత శర్మిష్ఠ.

విమర్శ గ్రంథాలు :

'నన్నయ గారి ప్రసన్న కథా కవితార్థయుక్తి', 'అల్లసాని వాని అల్లిక జిగిబిగి', 'కాళిదాసుని యొక్క అభిజ్ఞత', 'ఒకడు నాచన సోమన్న, నా రాముడు' మొదలగునవి.

చిన్న కథలు :

'య్యోహీషిభెయ్', 'మాక్లీదుర్గంలో కుక్క', 'పరిపూర్తి', 'కపర్ది' మొదలగు 22 కథలు.

ఇంగ్లీషు పుస్తకం :

What is Ramayana to me.

లక్షణ గ్రంథం :

కావ్యానందం.

వీటితోపాటు సాహిత్యవ్యాసాలు, రేడియో రూపకాలు, పీఠికలు ప్రచురించబడ్డాయి.

విశ్వనాథ రచనలు ఇతర భాషల్లోకి అనువదించ బడ్డాయి. 1961 సంవత్సరంలో కరీంనగర్ ప్రభుత్వ కళా శాలలో ప్రాచార్యులుగా పదవీ విరమణ చేసిన తరువాత పూర్తిస్థాయిలో సాహితీ వ్యాసాంగానికి సమయం కేటా యించారు.

విశ్వనాథ వారి ఆంధ్రపౌరుషం, ఆంధ్ర ప్రశస్తి అనే రెండు పద్యకావ్యాలు వారి ఆంధ్రదేశాభిమానానికి ప్రతీకలు. విశ్వనాథ ఆవేదనలో గొంతుముడులు విడివడి బయటకొచ్చిన గొప్పకావ్యం 'ఆంధ్ర ప్రశస్తి'. గతాన్ని మరచిపోయి, సంస్కృతీ సంప్రదాయాలకు దూరమౌతున్న నిర్వేదన చెందుతున్న ప్రజలకు పన్నీటిజల్లు, ఆశాకిరణం 'ఆంధ్ర ప్రశస్తి'.

విశ్వనాథ ఆంధ్ర దేశాభిమానం ఆయన జీవ చైతన్యమే. ఒకనాటి మహారాజుల దీక్షాదక్షతలు, ధర్మ నిరతి మొదలగు లక్షణాలను వర్ణిస్తూ ఆంధ్రరాష్ట్రం కోరే అశేష ఆంధ్ర జనావళిని విశ్వనాథుడు ప్రబోధించాడు. ఆంధ్ర ప్రశస్తిలో పన్నెండు ఖండికలున్నాయి.

"మా పూర్వాంధ్ర దరాధి నాయక కథా మంజూషికా ఆంధ్ర ప్రశస్తి పూర్వాంధ్ర ధరాధి నాయక కథా మంజూషిక ఆంధ్ర సామ్రాజ్యం" అన్నారు.

ఆంధ్ర దేశాభిమానమే ఆవేశించినట్లుగా ప్రతి ఖండిక లోనూ విశ్వనాథ రచన కనిపిస్తుంది.

విశ్వనాథ భావచిత్రీకరణలో సిద్ధహస్తులు. గతవైభవ పునరుద్ధరణకి ప్రబోధ గీతం 'వేంగీక్షేత్రం' వేంగీక్షేత్రంలో బాల్య క్రీడల్లోనే యుద్ధవిద్యలు గ్రామీణ బాలురు అలవర్చుకున్నారు. చెడుగుళ్ళాట, బిళ్ళంగోళ్ళాలు అనేవి ఆటలుగానే కాక శత్రువులను ఎదుర్కొనే వివిధ పద్ధతులను నేర్చుకుంటున్నారని కవి అద్భుతంగా వర్ణిం చారు.

"వేగీ రాజ్యపు పల్లె వీధుల చెడుగుళ్ళ
రిపుల కవ్వించు నేరుపులు తెలిసి
ఎగురు గోళిబిళ్ళ సాగసులో రిపుశిర
స్సుల బంతులాడు శిక్షకులకు డాసి"

అంటూ బాల్యక్రీడల్లోని అంతరార్థాన్ని వివరించారు. బాల్యం నుండే ఆ వేగీక్షేత్ర బాలురకు శత్రువును ఎదుర్కొనే పౌరుషం అబ్బింది. విశ్వనాథ భావనాలోకంలో వేంగీక్షేత్రంపై అడుగుపట్టి దివ్యానుభూతి పొందాడు. భవనాలోకంలో విహరించిన విశ్వనాథ అనాటి పురాతన వైభవంతో గానీ, నేల కూడా పరవశింపజేస్తున్నాయని భావించడంతో చారిత్రక వాతావరణాన్ని ప్రత్యక్షీకరింప చేశారు. వేంగీ క్షేత్రాన్ని మల్లంపల్లి సోమశేఖర శర్మ గారికి అంకితం చేశారు.

ఆంధ్ర వాఙ్మయంలో విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్న కిన్నెరసాని పాటలు విశ్వనాథ గేయకావ్యం, జడ ప్రకృతిగా ఉన్న కొండల్లో మానవత్వాన్ని పూయించాడు. విశ్వనాథ వాగులో స్త్రీత్వాన్ని పోషించాడు.

విశ్వనాథ భద్రాచలం దర్శించినపుడు అక్కడి ప్రకృతి సౌందర్యానికి పరవశించిపోయాడు. కొండలు, సెలయేర్లు కొండకు ఆనుకుని ప్రవహిస్తున్న కిన్నెరసాని వాగు మహాకవి దృష్టిని ఆకర్షించాయి. ఆ ఆకర్షణ భావుకుని మనసులో ఇతివృత్తమైంది. కిన్నెరసాని పాటల రూపం దాల్చింది. కాల్పనిక భావంతో మనోహరంగా కథకు ప్రాణం పోశారు. విశ్వనాథ భావకవితావేశం కిన్నెరసాని పాటలు అన్ని ఖండికలలోనూ కట్టలు తెంచుకు ప్రవహించింది.

'ఋతు సంహారం' తెలుగు వారి ఆచార వ్యవహారాలు తెలియజేస్తూ, తెలుగుతనం ఉట్టిపడేలా విశ్వనాథ రచించారు.

ప్రకృతి తన్మయత్వాన్ని అన్ని ఋతువుల్లోను వర్ణించారు. పండ్ల బరువుతో వంగిన మామిడి నిండు చూలాలి గాను, తుమ్మెద ప్రతి పువ్వు వద్ద తేనే తీసుకోవడం పిసినారితనంగాను, ఆడకోయిల, మగ కోయిల కోసం వసంతవనంలో తిరుగుతూ మామిడి చిగుళ్లను ముక్కుతో చిదమటాన్ని, మల్లెపూల సొంపు మొదలగునవి విశ్వనాథ వర్ణించిన తీరు ప్రత్యేకమైనది.

విశ్వనాథ అపరకృష్ణ భక్తుడు. వారి భక్తితత్వానికి తార్కాణం వారి రచనలైన కృష్ణ కావ్యాలే. కృష్ణతత్వం, జ్ఞానమయం, రస సౌందర్యమయం. జ్ఞానానికి, భక్తికి స్థానమైన కృష్ణతత్వాన్ని విశ్వనాథ తన కావ్యాలలో మధురభక్తి పరంగా విశ్లేషించారు. శృంగార వీధి, భ్రమర గీతాలు, గోపికా గీతాలు, ప్రద్యుమ్నోదయం, శ్రీకృష్ణ సంగీతం మొదలగునవి కృష్ణకావ్యాలన్ని కృష్ణతత్వాన్ని ప్రబోధించే రసమయ కావ్యాలే. రాధాకృష్ణుల ప్రేమను మధురాతి మధురంగా చూపించారు. రాధాకృష్ణుల ప్రణయంలో ఉన్న శృంగారానికి పరమావధి భక్తితత్వమే.

విశ్వనాథ మధ్యాక్కరలు భారతి, నవభారతి పత్రికల్లో ప్రచురించబడ్డాయి. వీరు చేపట్టిని సాహిత్య ప్రక్రియలేదు. విశ్వనాథ నాటకాలు సుప్రసిద్ధమైనవి. అందులో రెండు విషాద నాటకాలైతే మిగిలిన రెండు నాటకాలు పౌరాణికాలు. నాటక రచనలో ఇతివృత్తంలోనూ, పాత్ర పోషణలోను, సన్నివేశ కల్పనలోను విషాదాంత నాటాకాన్ని ఒప్పించిన నాటకశిల్పి విశ్వనాథ.

